# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక అక్టోబరు, 2013 ₹ 20



ఏడనున్నాడో...!

# మిసిమి
మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada.*

**సంపుటి 24** | **అక్టోబరు 2013** | **సంచిక 10**

*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాంగ్రేగుల నాగేశ్వరరావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు
నందిగం కృష్ణారావు

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

(Library of Congress Control Number)
LCCN 91-903060


# ఈ నెల...


వ్యక్తిత్వ నిర్మాణం, సంస్కృతి విద్య-
మాతృభాషాబోధన పాత్ర .................................. 5
- *ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ*

విజయ విలాసము: తాపీ ధర్మారావు .................. 12
- *ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ*

చైనా ప్రయాణం ........................................ 21
- *డాక్టరు ఎమ్. ఆదినారాయణ*

వంశధారా సంస్కృతి .................................... 30
- *డాక్టరు దామెర వేంకటసూర్యారావు*

పుడమి ఫలాలు ........................................ 35
- *ఫ్రెంచి మూలం : ఆంద్రీ గైడ్,*
*తెలుగు అనుసరణ : మూలే వీరేశ్వరరావు*

మీరా కృష్ణులు.......................................... 40
- కోడూరు పుల్లారెడ్డి

అనేకుల్లో ఒకడు - మహాత్మా గాంధి .................. 48
- *తెలుగు అనువాదం : డాక్టరు జె. లక్ష్మిరెడ్డి*

మనో వికాస ప్రక్రియ-మధ్య ఆసియా కవిత్వం ...... 52
- *ముకుంద రామారావు*

నూరేళ్ళు నిండిన వెండితెర ............................ 61
- **మిసిమి**

పద్మ విభూషణ్, ప్రజాకవి-కాళోజి .................... 67
- *కుర్రా జితేంద్ర బాబు*

చదవండి (పుస్తక పరిచయం).......................... 78


*ముఖచిత్రం* : దుర్గాపూజ ... *చిత్రకారుడు :* గౌతమ్
*రెండవ అట్ట* : ఏడనున్నాడో?
*మూడవ అట్ట* : ఎప్పటికయ్యేనో?
*నాల్గవ అట్ట* : ఏమాయెనే?
ఆగాచార్య

(*వివరాలు :* 80వ పుటలో...)

మన జనాభాలో దాదాపు 20 శాతం విద్యార్థులు. వీరు వీపుకు మించిన బరువును మోస్తూ ప్రభుత్వ, కార్పోరేటు పాఠశాలలకు, కాలేజీలకు ప్రతిరోజూ పరుగులు పెడుతూనే ఉన్నారు.

ఎప్పుడో చేయబోయే ఉద్యోగాలకు, ఎదురయ్యే పోటీలకు సాము చేస్తూనే వున్నారు. ఇంతటి యువశక్తి  జాతి నిర్మాణానికి, సంపద సృష్టికి ఉపయోగపడుతుందని  తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. అదే విషయం, ప్రజానాయకుల ప్రసంగాలలో తెలియజేస్తుంటారు. సంతోషించదగిన విషయమేకదా? కాని, మనం భావి పౌరులకు ఏమి నేర్పుతున్నాము? తల్లిదండ్రులుగా, ఉపాధ్యాయులుగా మన బాధ్యత సరైన రీతిలో నెరవేరుస్తున్నామా? ఈ విషయాలన్నీ చర్చించిన వ్యాసం 'వ్యక్తి నిర్మాణం... సంస్కృతి విద్య...' ఎంతో లోతుగా సాంస్కృతిక నిరక్షరాస్యత తీరు తెన్నులు తెలియజేస్తుంది.

భారతజాతిని పరాయిపాలన నుండి విముక్త పరచటానికి ఎందరో – ఎన్నో విధాలుగా త్యాగాలు చేశారు. ఉరికంబాలు ఎక్కారు – అందరి లక్ష్యం ఒక్కటే. ఆలోచనాధోరణులు – ఆచరణ రీతులు ప్రధానంగా, శత్రువుతో సంఘర్షణతో పాటు పరస్పర విరుద్ధ భావాలకు లోనయినవి. అలాంటిదే 'అనేకుల్లో ఒకడు' రాసిన లేఖ. దానికి మహాత్మా గాంధీ ప్రత్యుత్తరం.

ఎంతో సారవంతమైన పుడమి ఎన్నో ప్రకృతి ఫలాలను మనకు అందిస్తుంది. అవన్నీ అందుకోగలుగుతున్నామా? ప్రకృతి పచ్చదనం నుంచి దూరంగా ఇనుము–సున్నపు గూళ్ళలో మగ్గిపోతున్నామే– ఇక పుడమి ఫలాలను ఆస్వాదించే అవకాశమెక్కడ? ఆంద్రీ గైడ్ రచన 'పుడమి ఫలాలు', ఈనాటి యువతకు ఒక గైడ్‌లా ఉపయోగపడవచ్చు.

ఇప్పటి యువత పరుగులన్నీ సినిమా వైపుకే.

అంతటి శక్తివంతమైన మాధ్యమం ఏ రీతిలో – ఏ గోతిలో పడిపోయింది? దాని విశ్లేషణ– 'నూరేళ్ళు నిండిన వెండితెర'.



చైనా గురించి ఎంతో వింటున్నాము. ఎన్నో చిత్రాలు టి.వి.ల్లో చూస్తున్నాం. అవన్ని నగరాలకే పరిమితం. ప్రత్యక్షంగా పర్యటించి, గ్రామాల్లో జన జీవితాలను స్పృశించి తెలియచెప్తున్నారు ఆదినారాయణ.

**మిసిమి** పాఠకులకు 'విజయదశమి' శుభాకాంక్షలు

**– సంపాదకులు**

**స**ర్వేపల్లి రాధాకృష్ణ, కాన్‌సిస్ట్యూఎంట్ ఎసెంబ్లీ డిబేట్లలో ఎన్నో ప్రసంగాలు చేశారు. ముఖ్యంగా, భారతీయ సనాతన ధర్మ జీవన విధానాన్ని – మన సంస్కృతి, నాగరకతలకు మూలాధారంగా పేర్కొంటూ – తరతరాలుగా గంగా ప్రవాహంలా పరంపరగా కొనసాగుతున్నదని తెలియచెప్పారు. అలాగే ప్రజాస్వామ్యం ఈ నేలకు కొత్తకాదనీ, బుద్ధుని కాలం నుంచీ ఆ పరిపాలనా విధానం అమలులో ఉందని చెప్పారు –

డాక్టర్ సర్వేపల్లి భావసాంద్రతను, భాషాసౌందర్యాన్ని ***'మిసిమి'*** పాఠకులకు యధాతథంగా అందజేస్తున్నాం –



## CONSTITUENT ASSEMBLY DEBATES Vol-I (9-12-1946 to 23-12-1946)

☆ "... A nation does not depend on identity of race, or sentiment, or on ancestral memories, but it depends on a persistent and continuous way of life that has come down to us. Such a way of life, belongs to the very soil of this land. It is there indigenous to this country as much as the waters of the Ganges or the snows of the Himalayas. From the very roots of our civilization down in the Indus Valley to the present day, the same great culture is represented among Hindus and Muslims; we have stood for the ideal of comprehension and charity all these centuries…

… I remember how Anatole France went up to the Musse Guimet on the first of May 1890 in Paris and there in the silence and simplicity of the gods of Asia reflected on the aim of existence, on the meaning of life, on the values which peoples and Governments are in search of. Then his eyes fell on the statue of the Buddha. France felt like kneeling down and praying to him as to a God, the Buddha, eternally young, clad in ascetic robes, seated on the lotus of purity with his two fingers upraised admonishing all humanity to develop comprehension, and charity, wisdom and love, *prana* and *karuna.* If you have understanding, if you have compassion, you will be able to overcome the problems of this world. Asoka, his great disciple, when he found his Empire inhabited by men of all races and religions said — "*Samavya eva sadhuh.*" "Concord alone is the supreme good…" *(Page. No. 37)*



***Musse Guimet***

☆ "….We cannot say that the republican tradition is foreign to the genius of this country. We have had it from the beginning of our history. When a few merchants from the north went down to the south, one of the Princes of the Deccan asked the question, "Who is your King?" The answer was, "Some of us are governed by assemblies, ( *Kecid deso ganadhina)* some of us by kings (*kecid rajadhina)…*

…Panini, Megasthenes and Kautilya refer to the Republics of Ancient India. The Great Buddha belonged to the Republic of Kapilavastu…

…Much has been said about the sovereignty of the people. We have held that the ultimate sovereignty rests with the moral law, with the conscience of humanity. People as well as kings are subordinate to that, Dharma, righteousness, is the king of kings…

*Dharmam Kshatrasya Kshatram…*" *(Page: 272)*

*Courtesy: K. Jitendra Babu*



విల్ & ఏరియల్ డురాంట్

"అదేవిధంగా, 'The Story of Civilisation' గ్రంథంలో విలియమ్ జేమ్స్ డురాంట్;

"….The Case for India (1931)

India was the motherland of our race, and Sanskrit the mother of Europe's languages: she was the mother of our philosophy; mother, through the Arabs, much of our mathematics; mother through the Buddha, of the ideals embodied in Christianity; mother, through the village community, of self-government and democracy. Mother India is in many ways the mother of us all.

It is true that even across the Himalayan barrier India has sent to the west, such gifts as grammar and logic, philosophy and fables, hypnotism and chess, and above all numerals and the decimal system.

India will teach us the tolerance and gentleness of mature mind, understanding spirit and a unifying, pacifying love for all human beings.

*Will Durant (1885-1981)*

'సారే జహాఁసే అచ్ఛా' గీతంలో మహ్మద్ ఇక్బాల్ ఏమన్నారో చూడండి!"

In a world in which ancient Greece, Egypt, and Rome have all vanished without trace
Our own attributes (name and sign) live on today.

Such is our existence that it cannot be erased
Even through, for centuries, the cycle of time has been our enemy.

(సారేజహాఁసే అచ్ఛా!) - Md. Iqbal

కె. జితేంద్ర బాబు సౌజన్యంతో…

---

రెండు ఉత్తరాలు…

☆ "…**మిసిమి** వంటి పత్రిక ముట్టెడివారు సాహిత్య సంస్కృతుల పట్ల కొంత లోతైన అవగాహన, గాఢ అభిరుచి కలిగిన వారనుటలో సందేహముండదు…

…నవ్యాంశమున్న ఒక కొత్త వ్యాసమున్నను చాలు. వారికి పరమ తృప్తి. అట్టిది ప్రతివ్యాసము నవ్యాలోచన ప్రేరకముగా వెలువడిన సెప్టెంబరు సంచికను చూసి బహు కాలమునకు పరమానందము కలిగినది…

…ఆచంటవారి ఆణిముత్యము పత్రికకే అలంకారము. రెండు నెలల వెనుకటి సంపాదకీయమునకు స్పందనగా వచ్చిన అశ్విని, పన్నాల గారల వ్యాసరాజములు తెలుగున తొలిపరి ఆ విషయముల ప్రస్తావించినవి…

…అంతటి నవ్యవిషయాత్మకములు బహుసంగ్రహముగానున్న సులభగ్రాహ్యములు కాకుండును…

ఇక పై ఇట్టివి తగినంత విపులముగనున్న సార్ధకమగును. *చంద్రగిరి*పైని వ్యాసము బహుకాలమునకు వచ్చిన చరిత్ర వ్యాసము…

ముకుంద రామారావుగారి ప్రపంచ సాహిత్య పరిచయాలు, *కోడూరు పుల్లారెడ్డి విమర్శనాత్మక సమీక్ష – సూరదాసుని గోలోకము, ఈ రెండూ* ప్రశంసనీయము. అట్లే క్రమము తప్పక వచ్చుచునున్న రావినూతల వారి సవిమర్శక సమీక్షలు…

…ఇక పై సంచికకు ఒకటి రెండయినను ఇట్టి మంచి వ్యాసములు ఉదారపు పుటల బుద్ధితో ప్రచురింప ప్రార్థన…"

**– ఒక పాఠకుడు,** ఆన్‌లైన్.

☆ "…సెప్టెంబరు సంచికలో రష్యా కవిత్వం చదివినాను. అంతకు ముందు విన్నట్లుగా ఎక్కడా రష్యా రంకెలు వినబడలేదు. ఇనాళ్ళు అమాయకుల్లా గాండ్రింపులు, గర్జనలే నిజమని నమ్మాము. అసలు నిజము వినటానికి నిష్ఠూరంగా ఉందని తెలుసుకొన్నాను. ఈ నెల అట్టమీద బొమ్మలు సింప్లి స్టన్నింగ్ …" **– జి. రవీంద్రనాథ్,** తణుకు.



# వ్యక్తిత్వ నిర్మాణం సంస్కృతి విద్య మాతృభాషాబోధన పాత్ర

*- గంగిశెట్టి లక్ష్మీనారాయణ*

**శా**స్త్రవిజ్ఞానం పెట్టుబడిదారీవర్గం చేతుల్లో పెద్ద పనిముట్టుగా మారడం గొప్ప విషాదం. శాస్త్రవిజ్ఞానం, సాంకేతికత కవలపిల్లలు. ఇవ్వాళ ఆ రెండూ పెట్టుబడిదారీ వాణిజ్య సంస్కృతికి పట్టుగొమ్మలు. దరిమిలా మనిషి ఆర్థిక పనిముట్టుగా మారిపోతున్నాడు. మానవ సంస్కృతిలో ఆర్ద్రత అస్తమిస్తూ యాంత్రికత బలపడి పోతోంది.

ఈ స్థితిలో మనిషికి 'మనిషితనం' గూర్చి గుర్తుచేసే సాధనమేది? మానవ అనుబంధాలు, సంబంధాలు, వాటిపట్ల సరైన స్పందనలు, వాటి విలువలు తెలియజేసే రూపవేది? అనేవి అన్నిరంగాలలోని నిపుణులను, ముఖ్యంగా విద్యారంగంలోని వాళ్ళను, తీవ్రంగా ఆలోచనకు గురిచేస్తున్న ప్రశ్నలు. అమెరికా అయితే సెకండరీ స్థాయివరకు మానవీయ అధ్యయనాలకు మంచి స్థానమిస్తోంది. అందులో సాహిత్యం (గ్రీకులనుంచి మొదలు), లలితకళలూ, సమగ్రవ్యక్తిత్వానికి కావలసిన ఇతర అంశాలదే పైచేయి. అక్కడి ఇంటర్ స్థాయి పాఠ్యపుస్తకాలు రెఫరెన్సుపుస్తకాలుగా ఉపయోగపడతాయని తెచ్చుకొనేలా ఉన్నాయి. ఉన్నదాన్ని విశ్లేషించి చెప్పేది శాస్త్రం, ఎలా ఉండాలో పూరించి అందంగా చెప్పేది కళ, సాహిత్యం. వ్యక్తి అంతరంగం అంటే, వ్యక్తిత్వ వికాసంలో వీటి పాత్ర అమోఘం. 'వ్యక్తిత్వ వికాసం' ఇవ్వాళ అంతర్జాతీయమార్కెట్లో ఏమోకానీ, తెలుగుమార్కెట్లో బాగా గిరాకీ ఉన్న విషయమై పోయింది. పెద్దరచయితలు రాసిన పుస్తకాలే అయినా, అందులో సక్సెస్- అందులోనూ, డబ్బు సంపాదించడంలోని సక్సెస్ మీద ఉన్నంత దృష్టి, ఇతర వ్యక్తిత్వ నిర్మాణ అంశాలమీద లేదు. వాటికి భూమిక అయిన సంస్కృతిమీద, సంస్కారాల మీద అస్సల్లేదు. ఇవ్వాళ డబ్బుచుట్టూనే అన్నీ తిరుగుతున్నాయనే మాట భయంకరమైన వాస్తవం మరి.

వ్యక్తిత్వం ఒక కుటుంబం నుంచి, సమాజం నుంచి, సంప్రదాయ విలువల నుంచి రూపొందే అంతరంగ స్వభావం. ఆ కుటుంబ, సమాజ, సంప్రదాయాలనే మనం సంస్కృతి అంటాం. వ్యక్తిత్వ నిర్మాణంలో రెండు పొరలుంటాయి. లోపొరలో కేంద్రబిందువులాగా ఉండేది సంస్కృతి. అది యూంగ్ చెప్పిన కలెక్టివ్ సబ్ కాన్షస్ దశలో జాతి (race) మొత్తం విలువల్ని, భావనల (concepts) ను సంగ్రహించుకొని రూపొందేది. ఆపొరలో దాన్ని సాంస్కృతిక వ్యక్తిత్వమంటాం. దాని ఆధారంగా పైపొర ఏర్పడుతుంది. ఆ పైపొరను సామాజిక వ్యక్తిత్వమంటాం. అందులోని ఒక పార్శ్వమే ఆర్థిక వ్యక్తిత్వం. ఆ పైపొర మనిషిలోని చేతన, అచేతన (కాన్షస్, అన్ కాన్షస్) భాగాలతో ముడిపడి ఉంటుంది. సుప్తచేతన(సబ్ కాన్షస్)తో కాదు. సామాజిక వ్యక్తిత్వానికే మరోపేరు వ్యవహారసామర్థ్యం. అంతేకానీ సామాజిక వ్యక్తిత్వమంటే సోషల్ స్టేటస్ కాదు. ఆ వ్యక్తిత్వాంశ ఆధారంగా బయటి సమాజంలో సాధించుకొనేది సోషల్ స్టేటస్. కనుక మనిషి అన్ని సాధనలకు తొలి ఆధారం సాంస్కృతికవ్యక్తిత్వం.

ఇవ్వాళ ఈ ఆర్థిక- సాంకేతిక- వాణిజ్య ప్రగతి వెల్లువలో ఆ సాంస్కృతిక వ్యక్తిత్వమే మరుగున పడిపోతోంది. తన మౌలిక విలువను కోల్పోతోంది. ఇవ్వాల్టి యువతకి దాని స్పృహే అంతరించిపోతోంది. ముఖ్యంగా అమెరికాలాటి వాణిజ్య సంస్కృతి ప్రధాన దేశాల్లో.

అంచేత అక్కడ సాంస్కృతిక స్పృహను పెంచే ఆలోచనలు, ముఖ్యంగా విద్యా విధానంలో దానికి బలమైన స్థానం కలిగించే కొత్త ఆలోచనలు, ప్రణాళికలు మొదలయ్యాయి. ఇందులో ముఖ్యమైంది, దేశవ్యాప్తం గానేకాక, బయటకూడా పెద్ద సంచలనం సృష్టించిందీ ఇ.డి. హెర్ష్ (E.D. Hirsch Jr.) ప్రారంభించిన "సాంస్కృతిక అక్షరాస్యత (Cultural Literacy) పథకం". ఇటీవలి కాలంలో ఇంగ్లాండులో సంచలనం రేపిన విద్యాప్రణాళిక మార్పుకు ప్రేరణ, హెర్ష్‌నని అక్కడి విద్యాకార్యదర్శి (మంత్రి) బాహాటంగానే పేర్కొన్నారు...

హెర్ష్, యేల్స్ విశ్వవిద్యాలయంలో తులనాత్మక పరిధిలో రొమాంటిక్ సాహిత్యంపై పరిశోధనలు చేసి, వర్జీనియాలో విద్యా, మానవీయ శాస్త్రాల ఆచార్యునిగా స్థిరపడ్డాడు. సాహిత్య సిద్ధాంతాల్లో చేసిన మౌలిక ఆలోచనలతో 'అరిస్టాటిల్ మళ్ళీ అవతరించాడు' అనే ప్రశంసను పొందాడు. "బహుళ సంస్కృతి సంకీర్ణ" మైన అమెరికాలో తమ సంస్కృతి మూలాల స్పృహను పోగొట్టుకొంటున్న వర్తమానయువతపట్ల స్పందిస్తూ, ఆయన స్వచ్ఛందంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించాడు. దీనికి అనుబంధంగా ప్రతి అమెరికన్ కుర్రాడు, పౌరుడూ తప్పనిసరిగా తెలుసుకోవలసిన అంశాలకోసం "కోర్ నాలెడ్జ్" పథకమొకటి ప్రారంభించాడు. విడిగా 'కల్చరల్ లిటెరసీ డిక్షనరీ'ని వెలువరించాడు. ఇది మహత్తరమైన సేవ అనే ప్రశంస ఒకవైపురాగా, యూరోపియన్ ఆధిక్యతాభావాల రుద్దుడు అనే విమర్శకూడా మరోవైపు పెల్లుబికింది. ప్రశంస, విమర్శలు ఏపనికైనా నాణేనికి రెండుముఖాల్లాటివి.

*ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యం ఒకటే... తన మూలాలను గుర్తుంచుకొని, ఇతర సంస్కృతులను సహృదయతతో అర్థం చేసుకొని, నాగరక వ్యవహార/అభివ్యక్తి సామర్థ్యాన్ని పెంచుకోవటం. ఆ పరిజ్ఞానాన్ని సాధారణవిద్యలో కనీసపాటిగానైనా ఇవ్వడంలేదు కనుక, దీనికి అక్షరాస్యత అనేమాటను తగిలించాడు. సాధారణ అక్షరాస్యత/ విద్య తరువాత అందాల్సిన కనీసపాటి జ్ఞానానికే ఆయన సాంస్కృతిక అక్షరాస్యత అనే పేరు పెట్టాడు.*

ఇక హెర్ష్ విషయం వదిలేద్దాం. వ్యక్తిత్వనిర్మాణంలో సంస్కృతివిద్య పాత్రను, మన విద్యావిధానంలో దాన్నెలా అనుసంధానపరచుకోవాలి అనేదాన్ని స్థూలంగా చూద్దాం.

* * *

సాంకేతికప్రగతి హోరులో, ఆర్థికాభివృద్ధినే అభివృద్ధిగా జపిస్తూ, సాంస్కృతికస్పృహను పోగొట్టుకొంటున్న అన్నిదేశాల యువతకు సంస్కృతివిద్య అవసరమేనని విజ్ఞులు అంగీకరిస్తున్నారు, ఎలా అందించాలన్నదానిలో స్పష్టత లేకపోయినా!

మనదేశంకూడా 'బహుళ సంస్కృతిసంకీర్ణ' మైనదే. కనుక ఇక్కడా ఇలాటిది అత్యావశ్యకమని అందరూ అంగీకరిస్తారు. ఈ బహుళ-సంకీర్ణత ఈనాటిది కాదు. వేలసంవత్సరాల క్రితమే ఒక స్థిరరూపంలోకి వచ్చినట్టిది. అలా ఒక స్థిరరూపం రావడానికి, అందులోనూ ఏకత్వరూపం పొందడానికి అప్పట్లో మహర్షులు ఒక సామాజిక విద్యారూపం ప్రారంభించారు. దానిపేరే పురాణం. పురాణంపట్ల ఒక విమర్శ ఉంది: కనిపించినదాన్నంతా చెప్పే చపలత దానికి మెండని. కాదు, దాని వాస్తవలక్ష్యం-అనేకాన్ని ఏకంచేసి చెప్పటం. అప్పటి ఆధిపత్య భావజాలానిక్కూడా అదే వాహిక కావడంవల్ల, ఆ రూపం తర్వాత పరాస్తం పాలయి ఉండొచ్చుకానీ, దాని ముఖ్యసూత్రం ఎప్పటికీ గొప్పదే. వాటి సారంగా భారత, రామాయణాలు, వాటిచుట్టూ అనేక కథలూ, కథాగానాలు, కావ్యాలు వచ్చి, ఆ సామాజిక విద్యావిధానాన్ని అక్షరాస్యతలేని ఆ రోజుల్లో అఖండంగా కొనసాగించాయి. మన సాంస్కృతికవారసత్వానికి పునాదుల్లా నిలిచాయి. ఇవ్వాళ వాటిని ఎలా వినియోగించుకోవాలన్నది విజ్ఞతతో కూడుకొన్న ప్రశ్న. ఆధునిక విజ్ఞానమందించే హేతు శీలత సంస్కరణకు సూత్రం కావాలికానీ, మొదటికే మోసం తేరాదు. కూర్చున్న చెట్టుకొమ్మను నరుక్కొనేలా కారాదు.

సంస్కృతి పునాదులులేని ప్రగతి వినాశ కారకం కాకపోయినా, వికృతి కారకమే.

స్వాభావిక సమగ్రత 'ప్రకృతి'. దాన్ని అనువుగా మలుచుకొని, జీవనాన్ని మెరుగు పరచేది 'సంస్కృతి'. విపరీతాలకు వెళితే కలిగేది 'వికృతి'. గమ్యం లోక కళ్యాణ అభిగమ్యం



కానప్పుడు 'ప్రగతి' అనుకొన్నది, ప్రమాద వికృతికారి అవుతుంది. ఇవ్వాళ సాంకేతికవిజ్ఞానం సృష్టించిన అనేకరూపాలు, సృష్టించేవారికి లాభాలివ్వచ్చేమో కానీ, సృష్టికి, సమాజానికి ఎంత అపకారం కలిగిస్తున్నాయో అందరికీ తెలుసు. అంతెందుకు? సినిమాలాటి వినోద రూపమే చూద్దాం. టెక్నాలజీ సాయంతో హాలీవుడ్ వేసిన వెర్రి వేషాలనుంచి ప్రేరణ పొంది, సరిగ్గా అలాగే న్యూయార్క్‌లో టవర్స్‌ను పేల్చేశారని విశ్లేషకులన్నారు. ఇవ్వాళ అత్యంత జనాదరణగల ఏకైక కళారూపం సినిమానే. సంస్కృతికి అత్యంత ప్రమాదం కలిగిస్తున్న, సకల వికృతి కారకమూ సినిమానే. యువతరానికి, ముఖ్యంగా ఎన్నారై తరానికి, అదే "సంస్కృతి పాఠ్యగ్రంథం–Cultural Text". దాన్ని చూసే పాట నేర్చుకోవాలి, ఆట నేర్చుకోవాలి, చివరికి మాట నేర్చుకోవాలి.



*అది అన్ని సాంప్రదాయక కళారూపాలను దిగమింగిన కేవల వ్యాపార రూపం. మనలోని సహజాతాలను సంస్కరించడానికి బదులు, రెచ్చగొట్టి సొమ్ముచేసుకొనే రూపం. లైసెన్స్ లేని లైంగిక, హింసా వ్యాపారరూపం.* దాన్ని అదుపుచేసే ప్రభుత్వానికి, దానిపై ఆదాయం కావాలి. త్రాగుడు ప్రమాదకారి అని తెలుసు. నిషేధ శాసనాలూ ఉన్నాయి. అవి సరిగ్గా అమలయితే ప్రభుత్వం స్తంభించి పోతుంది. వాణిజ్య సంస్కృతికి ప్రభుత్వమే పెద్ద దళారి అయ్యాక, నిజమైన సంస్కృతిరూపాలు బ్రతికి బట్టగట్టేది ఎక్కడ? ప్రజల్లో సాంస్కృతిక అవగాహన మనగలిగేది ఎక్కడ?

సంస్కృతిని బడుల్లో పాఠాలుగా చెప్పరు. ప్రభుత్వ శాసనాలతో అమలు పరచరు. సాహిత్యం, లలితకళలు వంటి సృజనాత్మక రూపాలతో, పారంపరిక ఆచారాలతో తరం తరువాత తరానికి అందిస్తారు. ఆ సృజనాత్మక రూపాలే క్షుద్ర పెట్టుబడిదారీ వాణిజ్యాలకు, దళారీవ్యవస్థలకు ఊడిగం చేస్తుంటే గత్యంతరం ఏమిటి?

ఇదీ ఇవ్వాళ అందర్నీ వేధిస్తున్న ప్రశ్న. ముఖ్యంగా విద్యారంగంలో బాధ్యులైనవారిని.

దానికి సమాధానంగానే సాంస్కృతిక విద్యకేసి చూస్తున్నారు. నిజమైన వ్యక్తిత్వాన్ని నిర్మించేది అదే కనుక. సరైన వ్యక్తిత్వం సమకూరితే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లభించదు.

* * *

**సాంస్కృతిక విద్యాలక్ష్యం–వ్యక్తిత్వనిర్మాణం:**

సాధారణ అక్షరాస్యత చదువు పూర్తయ్యాక, సాంస్కృతిక అక్షరాస్యత చదువుపై దృష్టి పెట్టాలి– ఆ తర్వాత సాంకేతిక, వృత్తివిద్యల్లో పురోగమించి అటు దేశసంపత్తుకూ, ఇటు వ్యక్తిసంపత్తికీ దోహదపడాలి–ఈ సూత్రంపట్ల ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, ఆ మధ్యదానిమీదనే ఎవరి దృష్టీ పడదు. *ఇరవై లేదా పాతికేళ్ళదాకా మనిషి జీవితంలో ఒకదశ అనుకొంటే, అందులోని "మోస్ట్ ఫార్మేటివ్ పిరియడ్"–టీన్స్ మీద దృష్టి పెట్టి దానిక్కావలసిన విద్యాంశాలమీద ఫోకస్ ఇవ్వకపోవటం ఈనాటి విద్యా విధానంలోని పెద్దలోపం.* అక్కడ తీవ్రమైన వత్తిడిపెట్టి, ఎదుగుతున్న 'వ్యక్తి'ని యాంత్రికంగా దిగజార్చడం మహాపాపం. వ్యక్తిత్వ మన్నది మెల్లమెల్లగా ఒక రూపం తీసుకోవడం మొదలయ్యే దశ అదే! అక్కడే దానికి కావలసిన సరైన ఇంధన మందివ్వాలి.

ఇక్కడ ముందుగా మన ప్రస్తుత విద్యావిధానంలోని కొన్ని పరిమితులను చూడాలి. అందులో మరీముఖ్యమైంది: ప్రతిభకు, విశ్లేషణకు, విస్తృతికి, ఆత్మాన్వయానికి అవకాశమివ్వని డ్రిల్లింగ్. ఆ కంఠభట్టీయాన్ని బట్టి పెర్ఫార్మెన్స్‌ను గణించడం. కాంపిటెన్స్‌తో సంబంధంలేని పెర్ఫార్మెన్స్!

అయిదేళ్ళక్రితం ఓ ఎడ్యుకేషనల్ డెలిగేషన్‌తో చైనా సందర్శిస్తూ, షాంగాయ్‌లో, చైనా–యూరోప్ సంయుక్త ఆధ్వర్యంలోని ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూలును చూశాము. అవ్వాళ జర్మనీ విద్వాంసురాలొకరు ఇంఛార్జిగా ఉన్నారు. సంస్థను మొత్తం చూశాక, కుతూహలం ఆపుకోలేక అడిగా– మా దేశీయుల పెర్ఫార్మెన్స్ ఎలాగుంటుంది అని. సమాధానం చెప్పడానికి మొదట్లో ఆమె ఇష్టపడలేదు. కానీ మా ఉద్దేశమర్థమయ్యాక చెప్పారు. "దే ఆర్ గుడ్ ఇన్ ఎ వే"... అంటే? "ఎందులోనైనా బాగా లోతుకివెళ్ళి చదువుతారు"... అంటే? "ఓ రకంగా బాగా డ్రిల్ చేయడం. మిగిలినవాళ్ళు ఫోకల్‌గా, కావలసినమేరకే చదవొచ్చు. కానీ వైడ్‌గా

వెళ్తుంటారు". అందులో పాశ్చాత్య పక్షపాతముందని కొందరాక్షేపించ వచ్చేమోకానీ, ఆ డ్రిల్లింగ్ మన భారతీయ విద్యా విధానమిచ్చిన వారసత్వమన్నది అంగీకరించక తప్పదు. లోతూ-విస్తృతి ప్రాచ్య, పాశ్చాత్య భేదాలని కొందరు వ్యాఖ్యానించడమూ కద్దు.

అంతకంటే సులువుగా మా వంశీ చెప్పాడు: అమెరికాచదువులకి, ఇక్కడి చదువులకి తేడా ఏమిటని ఓ మిత్రుడడిగితే, " ఇక్కడ ఒక పుస్తకాన్నే పదిసార్లు చదివిస్తాము, అక్కడ అదే టైం లో పదిపుస్తకాలు చదివిస్తారు". ఈ మాట పిల్లల చదువులకు సంబంధించి, ఆ మాట, పెద్దల చాలా పెద్ద చదువులకు సంబంధించి. ఏదైనా సూత్రమొక్కటే... అమెరికాలోకూడా పిల్లలచేత డ్రిల్లింగ్ చేయించడంలో చైనావాళ్ళు, మనవాళ్ళు పోటాపోటీనట. అంచేతే వాళ్ళ స్కూల్ పరిసరాల్లో ఇళ్ళ ఖరీదులెక్కువట. డ్రిల్లింగ్ గొడవల్లో వ్యక్తిత్వం బిల్డింగులకు చోటెక్కడ?

సాంస్కృతికవిద్య ముఖ్యలక్ష్యం ఒక్కటే మరింత మెరుగైన ''వ్యక్తులను'' తయారుచేయటం. ఆమాట బాగా లేదనుకొంటే-తీర్చిదిద్దటం. నిజానికి విద్య లక్ష్యమే అది. బయటున్నదాన్ని అర్థమయ్యేలాచేసి, లోనున్నదాన్ని సమర్థవంతంగా చేయడం. సరైన వ్యక్తిత్వాన్ని ఇవ్వడమంటే అదే. దాన్ని మరచి ఇవ్వాళ్టి విద్యావిధానం శాస్త్రీయతకు వల్లమాలిన పెద్దపీట వేయడంతో, వ్యక్తి కూడా శాస్త్రపరిశీలన వస్తువైపోయాడు.

మనలోని 'వ్యక్తి'ని బయటికి చూపగలిగేదే వ్యక్తీకరణ. అంచేతే దాన్ని అభివ్యక్తి అంటాము. వ్యక్తికి గుర్తు అభివ్యక్తి. 'వ్యక్తి' అనేది, లోన అదృశ్యంగా జరిగే పరిణామ ఫలం. దాన్ని బయటికి తెలియజేసే విధానం అభివ్యక్తి. అది చూపు కావచ్చు, మాట కావచ్చు, చేష్ట కావచ్చు, మొత్తం నడత,



శైలి కావచ్చు. ఆ అభివ్యక్తిని బట్టే అతని వ్యక్తిత్వం, సంస్కారం, స్థాయి అన్నీ అర్థమైపోతాయి. వెనకటికి నెపోలియన్ వద్దకు ఒక ఉద్యోగ అభ్యర్థి వచ్చాడు. 'అతను రాసిందేదైనా ఉంటే పట్రండి, పనికొస్తాడో రాడో చెబుతా' నన్నాడట నెపోలియన్. అభివ్యక్తినిబట్టి వ్యక్తి అర్థమౌతాడు. అది తెలియక చాలామంది విజయావకాశాలు పోగొట్టుకొంటున్నారు. సాంస్కృతిక విద్యలక్ష్యం- లోనున్న చేతనాపొరల్ని పటిష్టంగా నిబంధపరచి 'వ్యక్తుల్ని' ఎదిగించటం. సమగ్ర వ్యక్తిత్వ నిర్మాణానికి కావలసిన శిక్షణనివ్వటం. ఇంగ్లీషులోనైతే "Cultural Competence" అంటారు- దాన్ని పెంపొందించటం.

"కల్చరల్ కాంపిటెన్స్" లో నాలుగు భాగాలుంటాయని ఆ రంగంలోని నిపుణులంటారు. అవి :

అ. ఎరుక (Awareness): ఆయా జాతిగతంగా,అంటే పారంపర్యంగా, సంస్కృతిపరంగా, వచ్చిన ప్రాపంచిక-సామాజిక దృక్పథాల స్పృహ;

ఆ. మనోవైఖరి (Attitude) : సాంస్కృతిక అంతరాల పట్ల, తేడాల పట్ల సద్భావం కలిగిఉండడం; వైవిధ్యాలను సుమనస్కతతో గ్రహించడం.

ఇ. పరిజ్ఞానం (Knowledge): మన ఆచార సంప్రదాయాల పట్ల, వాటి అర్థాలపట్ల, అలాగే ప్రపంచం లోని వివిధ దృక్పథాలపట్ల అవగాహన.

ఈ. నైపుణ్యం (Skills): విభిన్న సాంస్కృతిక పరిసరాలలో, సందర్భాలలో, వ్యక్తులతో, సంస్థలతో, వ్యవస్థల (సిస్టమ్స్)తో సమర్థవంతంగా వ్యవహరించగలిగే కౌశలం.

ఈ నాలుగు అంగాలలోనూ సమర్థత పెంచుకోవటమే కల్చరల్ కాంపిటెన్స్ అన్నది దిజ్ఞుల అభిప్రాయం. వీటివల్ల తన సంస్కృతిసంప్రదాయాల్లోని విలువలు అర్థమౌతాయి. ఎదుటివారి సంప్రదాయాలను గౌరవించే మనఃస్థితి పెరుగుతుంది. కులాలు, కులాచారాలు, ప్రాంతాలు, ప్రాంతాచారాలుగా చీలికలమీద చీలికలున్న మనదేశంలాంటి దేశంలో అలాంటి 'యాటిట్యూడ్' అవసరం అపరిమితం. వైవిధ్యాలను, వాటి మూలతత్త్వాలను అర్థంచేసుకొని వాటిమధ్య 'పొందిక (బ్యాలెన్స్) ' పాటించడమే నిజమైన జ్ఞానం. దాని బలంతో ఏ వ్యవహారాన్నయినా చక్కబెట్టగలిగే నైపుణ్యం, ఉత్తమ మానవ సంబంధాలను నెరపే సామర్థ్యం పెంచుకొన్నప్పుడు ఈ ప్రపంచమెంత అందమైన ఉద్యానవనం!

కానీ ఎన్ని ఉత్తమ అంశాలను, ఆశయాలను సిలబస్ లో చేర్చినా, బోధనలో ఎన్నిమంచిమార్పులు సూచించినా అవి అమలయ్యేదెలా? అందేదెవరికి? పైపెచ్చు పదహారేళ్ళ ప్రాయం వచ్చి కాస్త ముదుర్లు కావడం మొదలెట్టాక, ఇవి పెట్టి ప్రయోజనమేమిటి? చిన్నప్పటి నుంచే, మనసు వికసించడం ప్రారంభించినప్పటినుంచే, అందాల్సిన పౌష్టికాంశాలు ఇవి. ఆ రంగమంతా వాణిజ్యసంస్థల గుప్పిట్లో ఉంది. చిన్నతనంలోనే 'చదువు' వాణిజ్యమయమైపోయింది. ఆ వాణిజ్యసంస్థలకు వత్తిడిపెంచే కొత్తదనం కావాలి కానీ, వ్యక్తిత్వం పెంచే కొత్తదనం అక్కరలేదు. తళుకుబెళుకుల కొత్తదనం కావాలి కానీ, సంప్రదాయపు వెలుగు నింపే కొత్తదనం అవసరం లేదు.

వాళ్ళపుణ్యమాఅని, ఇవ్వాళ విద్యార్థులతోపాటు, తల్లిదండ్రులు, మాష్టార్లు కూడా 'మార్పు', 'కొత్త', 'అదనం' అంటేనే అలజడి పాలవుతున్నారు.

కొత్తతో నిమిత్తం లేకుండా, అదనపు మోత అవసరం రాకుండా, ఆ లక్ష్యాలను సాధించే పాఠ్యాంశం, మన ప్రస్తుత విధానంలో లేదా?

ఎందుకు లేదు? లక్షణంగా ఉంది. దాన్ని అల్పబుద్ధితో తిరస్కారంగా చూడకపోతే చాలు. దాని లక్ష్యాన్ని సరిగా అర్థం చేసుకొని రీఓరియెంట్ చేసుకోగలిగితే చాలు. అందుక్కాస్త భక్తి ఉంటే చాలు.

అదే మాతృభాషాబోధన!

* * *

**వ్యక్తిత్వనిర్మాణం- మాతృభాషాబోధనం:**

ఆశ్చర్యంగా ఉంది కదూ!...అసలు భాషంటే ఏమిటి?....భావాలను వ్యక్తపరిచే శబ్దసముదాయం.. భావాలంటే?...కావాలనిపించినవాటి పేర్లో, కనిపించినవాటి పేర్లో చెప్పడమా?...మనసులో కలిగే ఊహలు, స్పందనలు, ఆలోచనలు, ఆవేశాలు...ఇంగ్లీషులో చెబితే సులువుగా అర్థం కావచ్చు...ఐడియాస్, ఎమోషన్స్, మూడ్స్ వగైరాలని పంచుకోవటం..భవం అంటే పుట్టుక, దాన్నుంచి జెనరేట్ అయ్యేది భావం...అంటే మనస్సు. మనస్సుకు మరోపేరే భావం. మనస్సున్నప్పుడే పుట్టుకకు సార్థక్యం. దాన్ని బయటకుచెప్పే శబ్దసాధనం భాష. మనసులను బయటకు చెబుతూ, మనుష్యులను దగ్గరకుచేర్చే శబ్దానుసంధానం భాష. నాగరకత నిర్మాణానికి పునాది, గోడలు, పైకప్పు అంతా భాషే. లోన స్పేస్‌ను నింపడానికే మనం శాస్త్రీయంగా అనేకం ఇతరమైన వాటిని కనిపెడుతున్నాం. *కట్టుబాట్లు ఏర్పరచుకొంటున్నాం. నాగరకత నిర్మాణానికి రెండే పనిముట్లు: ఒకటి-భాష, రెండు-బొటనవేలు. భావ సంస్కృతికి భాష, శాస్త్రసంస్కృతికి-అంటే-వైజ్ఞానిక,సాంకేతిక సంస్కృతికి-బొటనవేలు.*

నాగరకత వేరు, సంస్కృతి వేరు కాదు-రెండూ ఒకటే! అలాగే సంస్కృతి వేరు, వ్యక్తిత్వం వేరు కాదు-రెండూ ఒకటే! వ్యక్తికి పరిమితం చేసినప్పుడు వ్యక్తిత్వమంటున్నాం, జాతిమొత్తం వ్యక్తిత్వాన్ని చెప్పేటప్పుడు సంస్కృతి అంటున్నాం.

సంస్కృతిలో భాగస్వామ్యం కలిగించే భాష ఇంటిగుమ్మం లోపల మొదలవుతుంది. తల్లి గోరుముద్దలతో మొదలవుతుంది.

మాట్లాడటం, రాయటం, చదవటం సరిగా వచ్చేటంత వరకే అది భాష, ఆ తరువాత అది సంస్కృతి సంభాష (కల్చరల్ డిస్కోర్స్- "Cultural Discourse") . భాష అంటే వ్యాకరణం, ఛందస్సులు కాదు. వాటికి వన్నెతెచ్చేలా, సృజనశీలుర నోట జాలువారిన భావమాధుర్యాలు, వారిచేతుల్లో ఆకృతిదాల్చిన అక్షర సమూహాలు, ఒక సమగ్ర సంస్కృతి సజీవచిత్రణలు.

భాషాబోధన అంటే భావప్రకటన సామర్థ్యం నేర్పడం. ఆ భావాల్లో ఇమిడి ఉన్న వ్యక్తిత్వ, సంస్కారాలను నేర్పడం. లోక వ్యవహార సామర్థ్యం నేర్పడం. ఒక దశ దాటాక, భాషా బోధన అంటే సాహిత్యబోధనే..... భాషా సాహిత్యాలు తల్లీబిడ్డల్లా విడదీయరాని ద్వంద్వాలు. వీటి బోధనలోని ప్రధాన లక్ష్యాలు ఇవి:

* ఉత్తమ అభివ్యక్తి సామర్థ్యాన్ని, లోక వ్యవహార సామర్థ్యాన్ని.కలిగించటం; పెంపొందించటం;



* పాత్రానుశీలన నెపంతో ఎదుటివారిని అర్థం చేసుకొనే సహృదయతని, మనల్ని మనం చూసుకొని సంస్కరించుకొనే సుహృదయతనీ పెంచటం;
* ఉత్తమ అభిరుచుల్ని, కళాత్మక దృష్టిని, జీవితం పట్ల అవగాహన, స్ఫూర్తి, ప్రేరణల్ని చేకూర్చటం.
* సంస్కృతి వారసత్వ స్పృహను పెంచి, అందులో శక్తివంతమైన భాగస్వామిగా చేయటం.

ఇవన్నీ కలిగినదే సున్నితమైన వ్యక్తిత్వం. ఆ వ్యక్తిత్వ నిర్మాణమే మాతృభాషాబోధన లక్ష్యం. అందుకనుగుణంగా పాఠ్యాంశాలు, పరీక్షాంశాలు, పరీక్షణ విధానాలు లేకపోతే వాటిని సవరించుకోవాలి, మెరుగు పరచుకోవాలి కానీ, మొదటికే మోసం తెచ్చుకోకూడదు.

కొందరు బుద్ధిమంతులున్నారు: ఉత్తరాలు,పత్రాలు రాసుకోడానికి కావలసినంత భాష ఎలాగూ ప్రాథమిక స్థాయిలోనే వచ్చేసేయాలి, వచ్చేస్తుంది, ఆ తర్వాత కూడా ఆ ఇంటి భాషను కొనసాగించడమెందుకు? అని అమాయకంగా అడిగేవారు.

అంతకంటే ప్రబుద్ధులు కొందరున్నారు. కొన్ని ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళలోనివారు, కార్పొరేట్ సార్వభౌమ ప్రతినిధులు.. పిల్లలు ఎనిమిదో తరగతిలోకి రాగానే ఏకంగా పదోతరగతి తెలుగు పుస్తకం మొదలెట్టించేసేవారు! తర్వాతి రెండేళ్ళు తెలుగుక్లాసుల సమయం, 'సబ్జెక్ట్' చదువులకు ఆదా అవుతుందంటున్నారు. అలాంటప్పుడు కళాశాలల్లో తెలుగెందుకనే గోల ఉండటంలో ఆశ్చర్యమేమిటి?

అసలు ఈ ఇంగ్లీషుబానిస ప్రబుద్ధులకి అర్థంకాని విషయమేమిటంటే, ఆ రోజుల్లోనే, అంటే హైస్కూలుస్థాయికే, ఇంగ్లీషు భాషాపాటవం బాగా వంటబట్టే రోజులకే, ఆ ఇంగ్లీషువాడే, వాళ్ళభాషతోపాటు మన భాషల్ని కూడా కళాశాల స్థాయిదాకా, అంత బరువైన పాఠ్యభాగాలతో, ఎందుకు పెట్టాడు? అనే ప్రశ్న.

ఆధునిక విద్యావిధానం ఆక్స్ ఫర్డ్-కేంబ్రిడ్జలలో మొదలయ్యింది భాషాబోధనలతోనే! అంతదాకా అవి మత ధర్మ విద్యకు మాత్రమే పరిమిత మైన సంస్థలు. బైబిల్ చెప్పిన నైతిక-ధార్మిక విషయాలు, విలువలు అవగాహనలోకి రావడానికి , సగటు జీవితంలోని భావోద్వేగాలను చిత్రించే భాషారచనలు బాగా ఉపకరిస్తాయని భావిస్తూ వాటిని 'ప్రిస్క్రైబ్' చేసి, బోధించడం ప్రారంభించాయి. అలా 18వ శతాబ్దిలో మొట్టమొదటిసారిగా విశ్వవిద్యాలయస్థాయిలో భాషా బోధన మొదలైంది. అందులోనూ, షేక్స్పియర్ నాటకాలు అత్యంత ప్రభావశీలమైనవని గుర్తించి, వాటిని నిర్ణయించడం మొదలెట్టారు. అంతదాకా పైస్థాయి సమాజంలో అంత ఆదరణకు నోచుకోని షేక్స్పియర్ రచనలకు కొత్త సామాజిక గౌరవంతో పాటు, క్రమేపీ ఉన్నత సాహిత్య గౌరవం సిద్ధించింది. మానవ మనస్తత్వంలోని వైరుధ్యాలను అర్థంచేసుకోవడానికి వాటితర్వాతే ఏవైనా అనే భావం కలిగి, క్రమంగా అదే మనస్తత్వశాస్త్రవికాసానికి, మానవ నాగరకత అధ్యయనాలపై ఆసక్తికి కారణమైంది, ప్రేరణయింది. అలా ఆధునిక విద్యా బోధనలు విశ్వ విద్యాలయస్థాయిలో వికసించాయి. తమాషా ఏమిటంటే, ఆ స్థాయిలో మొదలైన మొదటి శాస్త్రీయ విద్యారూపం చరిత్ర! నికరమైన సాక్ష్యాధారాలను చూపేది కనుక దానికి ఆ తొలిశాస్త్ర గౌరవం దక్కింది. చరిత్ర అంటే మొత్తం నాగరకతా వికాసమనే అప్పటి భావం. 19వశతాబ్ది మూడోభాగం దాకా సైన్సుచదువు కూడా, 'హిస్టరీ ఆఫ్ న్యాచురల్/ఫిజికల్ సైన్సెస్'



అని చరిత్రలో భాగంగా ఉండేది. బ్రిటానికా విజ్ఞానసర్వస్వం చూస్తే ఈ వివరాలు తెలుస్తాయి. అలా అన్ని మానవీయ, శాస్త్రీయ అధ్యయనాలకు తొలి కుదురయ్యే గౌరవం భాషాధ్యయనానికే దక్కింది. విద్యావ్యవస్థలో భాషా బోధన తత్త్వం గ్రహించిన పాశ్చాత్యులు మనదేశంలో విశ్వ విద్యాలయాలు ప్రారంభించినప్పుడు, ఆ తాత్త్వికదృష్టితోనే మాతృభాషాబోధనను ఆ స్థాయిలోనూ అంత పటిష్టంగా ప్రవేశపెట్టారు. ఏ 'సబ్జెక్టు' వారు అనే ప్రశ్న లేకుండా, దాదాపు ప్రతివిద్యార్థి అందులో ఆభినివేశం, లేదా, కనీస అభిరుచి సముపార్జించాడు. ఫలితంగా ఉత్తమ సంస్కార సంపన్నవంతమైన యువత తరం వెంట తరంగా వచ్చింది. ఉత్తమ యువతకు తల్లిదండ్రులై నిలిచింది.

మాతృభాషాధ్యయనం కనుక చదువుల్లో ఓ అనివార్య భాగమయ్యే స్థితి తొలగిపోతే, ఇక మనిషికి మనిషితనం గురించి చెప్పే అక్షరమ్ముక్క మిగలదు. సామాజిక–మానవీయ శాస్త్రాలు కూడా, మనిషిని తమ విశ్లేషణకుపకరించే ఓ వస్తురూపంగా భావిస్తాయే తప్ప, మనిషి వ్యక్తిత్వం గూర్చి, దాని స్పందనల గూర్చి, వాటి మెరుగుదల గూర్చి ఆలోచించవు. జీవశాస్త్రం మనిషిని ల్యాబొరేటరీ బల్ల మీద పడుకోబెడితే, మానవశాస్త్రం ఆరుబయలు అరుగుమీద పడుకోబెడుతుంది.

కనుక, ఈ సాంకేతిక–వాణిజ్య యుగ పరివర్తన స్థితిలో– ఈ సంధి స్థితిలో – 'సాంస్కృతిక విద్య' పట్ల స్పృహ లేకపోవడమంటే, మనిషి మరింత యాంత్రికంగా దిగజారడమే, ఆత్మవినాశనాన్ని కొని తెచ్చుకోవడమే.

''సాంస్కృతిక అక్షరాస్యత'' అనే కొత్త పథకం మనకక్కరలేదు. ఉన్న మాతృభాషాబోధనను సరిగ్గా నిలుపుకొంటే చాలు.

కొత్త పేరుంటే తప్ప గిట్టుబాటు కాదనుకొంటే, "వ్యక్తిత్వ వికాస బోధన" అనే పేరు పెట్టుకోవచ్చు. పేరున్న రచయితల పుణ్యమా అని, తెలుగు మార్కెట్లో దానికి మంచి గిరాకీ కూడా ఉంది. 'విద్య'ను 'మానవ వనరులు' అన్నప్పుడు, భాషాసాహిత్యాలను ''వ్యక్తిత్వవికాస వనరులు''అనడం బాగాను ఉంటుంది. భాషావిద్య అంటేనే సంస్కారాల విద్య . బెర్నార్డ్ షా *'పిగ్మాలియన్'* నాటకం గుర్తుకు రావచ్చు. ఒక భాషావేత్త కూరగాయల మార్కెట్లోని ఓ మొరటమ్మాయిని తీసుకొచ్చి, తనతోపాటుంచుకొని భాషాసంస్కారాన్ని నేర్పుతాడు. ఆ అమ్మాయి వెనక్కు వెళ్ళినా, అక్కడ ఇమడలేక తిరిగొచ్చి ఇప్పుడు తన స్థితేమిటని నిలదీస్తుంది. భాష అంటేనే ఓ సంస్కారాల సంపుటికి ప్రతీక అనిచెప్పే నాటకం. ఆ సంపుటికి మరోపేరే వ్యక్తిత్వం; సాంస్కృతిక వ్యక్తిత్వం.

తెలుగులో ''చదువూసంస్కారాలు'' ఆలుమగల్లా విడిపోకూడని జంటపదాలు.

రెండోది లేకుంటే మొదటిదానికి అర్థమే లేదు!!!

* * *

ఆచార్య గంగిసెట్టి లక్ష్మీనారాయణ
పూర్వ ఉప కులపతి, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
ఫోన్ : 9441806566





తాపీ

## తాపీ ధర్మారావు

# విజయ విలాసము

*- రావినూతల సత్యనారాయణ.*

*ప్రస్తావన:*

కృష్ణదేవరాయల పరిపాలన తెలుగు సాహిత్య చరిత్రలో సువర్ణాక్షర లిఖిత మైనది. ఆ కాలంలో తెలుగు సాహిత్య సరస్వతి సర్వతోముఖంగా అభివృద్ధి చెందినది. రాయల వారు భాషా సాహిత్య పోషకులేకాక, బహు భాషా కోవిదులై స్వయంగా *ఆముక్తమాల్యద* వంటి ప్రబంధాన్ని రచించి పేరుగాంచిన సాహిత్య సమరాంగణ చక్రవర్తి. ఒక చక్కని సాహిత్య సంప్రదాయ చైతన్యమును చరిత్రలో సృష్టించిన మహా మనీషి రాయలవారు! తెలుగు సాహిత్యం అనువాద పద్ధతిని అధిగమించి, స్వతంత్ర కావ్య రచన పద్ధతి మొదలెట్టినది రాయలవారి యుగం లోనే! తర్వాత కాలంలో తంజావూరి నేలిన రఘునాథ నాయక రాజు, ఆంధ్ర భోజునివలె, తెలుగు సంస్కృత భాషల లోను, సంగీత భరత నాట్య శాస్త్రాల యందును అఖండ పాండితి నార్జించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వయంగా (పుష్టిగల) బహు కావ్య నిర్మాత. ఉద్దండ సంస్కృత పండితుడైన యజ్ఞనారాయణ దీక్షితునికి గురువు కాగలిగిన మహావిద్వాంసుడు.

కృష్ణదేవరాయల వారి "భువన విజయము" వలె రఘునాథ నాయకునికి, "విజయభవన" మను ప్రసిద్ధ సభామందిర మున్నట్లు చరిత్రలో పేర్కొన బడినది. అందు బహు శాస్త్రవేత్తలు, కవులు, గాయకులు, నట్టువరాండ్రు మొదలైన పలువురు ప్రసిద్ధులు రఘునాథ నాయకుని కొలువు నలంకరించి ఉండెడివారని చరిత్ర చాటుచున్నది. అంతేకాక, రఘునాథనాయకుని సభాంగణానికి, దేశము నలువైపుల నుండి విద్వాంసులు వచ్చి పాల్గొంటూ ఉండేవారని, ఆవిద్వత్సభలో మాట్లాడుటకు యెంతటి ప్రజ్ఞావంతులైనా వెనుకాడే వారని ప్రతీతి. "విద్వద్ కవీనాం విదధాసి హర్షం" అని రఘునాథనాయకుని గురువు, మంత్రి అయిన గోవింద దీక్షితుడు "సంగీతసుధ"లో ప్రశంసించి యున్నాడు. అంతటి సర్వతోముఖ ప్రజ్ఞాశాలి అయిన రఘునాథ నాయకరాజు ఆస్థానానికి చెందిన వాడు చేమకూర వేంకటకవి!

తన జీవితాన్ని గూర్చి వేంకట కవి చెప్పినది చాలా తక్కువ. ఇతరులు అతనిని గురించి చెప్పిన మాటలను బట్టి, విజయవిలాస కావ్య ఆశ్వాసాంత గద్యాలను బట్టి మనం ఆయన జీవితాన్ని పునర్నిర్మించు కోవాలి. అది అత్యంత అవసరం. ఎందుకంటే కవిని గూర్చి బాగా తెలియక పోతే ఆయన రచనను సరిగా అవగాహన చేసుకొనలేము. అందుచేత కవిని గూర్చిన వివరాలు తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

మనకు తెలియ వచ్చిన వివరాల ననుసరించి వేంకట కవికి చిన్న వయసులోనే కవిత్వమబ్బినట్లు పేర్కొనబడినది. దీనిని సూర్యనారాయణ వరప్రసాదంగా చెప్పుకొంటారు. వేంకటకవి తెలుగు సాహిత్యం సుప్రసిద్ధ గురువుల పాదాల చెంత నేర్చుకొనినట్లుగాని, సంస్కృత భాషలో పాండిత్యము సంపాదించినట్లుగాని దాఖలాలు పరిశోధకులకు లభ్యం కాలేదు. అయినప్పటికీ, రాజుగారు నిర్వహించే పండిత గోష్టులలో పాల్గొంటూ అచ్చట జరుగు సాహిత్య చర్చలను శ్రద్ధగా వింటూ, తనకు తెలియని విషయాలు అచ్చటి పెద్దల నడిగి తెలుసుకుంటూ ఉండేవాడని, అలా తెలియజెప్పిన పెద్దలనే చేమకూర వేంకట కవికి గురువులుగా భావించ వలసి ఉంటుందని అభిప్రాయాన్ని చాలామంది వ్యక్త పరిచారు. విజయవిలాస కావ్య రచనకు ముందుగానే చేమకూర కవికి కావ్య రచన చేయాలన్న కుతూహలం కలిగిందట. సారంగధర అనే కావ్య రచన ఆరంభించాడు. తీరిక కల్గినప్పుడల్లా ఆ రచనలోని కొంత భాగం పండితులైన వారికి వినిపించి వారి విమర్శన తెలుసుకొనడమూ మొదలెట్టాడు. ఆవిషయం పండితులు మెల్లగా విద్వద్గోష్టిలో రఘునాథ నాయక రాజు దృష్టికి తెచ్చారు. ఆవిధంగా చేమకూర వేంకట కవి కవనములోని మంచిని రఘునాథ నాయకరాజు గుర్తించ గలిగారు. గోష్టివారి మెప్పులవల్ల మరింత ఉత్సాహంతో సారంగధర రచన సాగించాడు. సాహిత్య విమర్శతోపాటు, ఆత్మ విమర్శ కలవాటుపడ్డ

చేమకూరకవి తన సారంగధర కావ్యంలో అక్కడక్కడా రచన అపరిపక్వ స్థితిలో ఉన్నదనీ, కొన్ని కల్పనలు కుంటుతూ ఉన్నాయన్న సంగతి గుర్తించ గలిగాడు. అందుకే ఆ కావ్యంలో ఎన్ని అమోఘమైన విషయాలున్నా, ఎంతటి కవితా విశేషమున్నా, అది గౌరన కృతికి అనుకరణ కాబట్టి, స్వతంత్ర రచన అనిపించుకోదు. అందుకని "విజయవిలాస" రూపంలో మరో స్వతంత్ర కావ్య రచనకు సంకల్పించాడు. మరోవిషయం, తంజావూరు రాజ్యం రఘునాథనాయక రాజు పాలనలో విజయ పరంపరలతో విజృంభించి, పాడి పంటలతో సంవృద్ధి చెంది, సిరి సంపదలతో నిత్య కల్యాణం పచ్చ తోరణంగా ఉండేదట! అటువంటి స్థితిలో ప్రజలను ఆకర్షించేది, ఆహ్లాద పరిచేది శృంగార రసమేకాని, మరొకటి కాదని వేంకటకవి నిశ్చయించు కొన్నాడు. తానుచేసిన సారస్వత కృషికీ, తనకున్న భావసంపదకూ శృంగార రసము చక్కగా అమరుతుందని ఊహించాడు. శృంగారమే ఏకైక రసంగావుండే కథ కావ్య రూపంలో వ్రాయాలనుకొని *విజయవిలాసము* ఎత్తుకున్నాడు. ఫలితంగా *విజయవిలాస* కావ్యం రూపొందింది. పలువురు పండితుల మన్ననల నందుకొన్న ఈప్రబంధము రఘునాథ నాయక రాజుపై తనకు (చేమకూరకవికి) ఉన్న గౌరవాతిశయానికి తగినట్టు తన కావ్యాన్ని తనకు తానై అంకిత మివ్వడానికి సిద్ధమయ్యాడు. ఉత్తమ కావ్య గుణాలతో విరాజిల్లు గ్రంథాలను ఎన్నో వ్రాసిన రఘునాథ నాయక రాజుకు కృతిని ఇవ్వడానికి యోగ్యమైన కావ్య రచన కోసం చేమకూర వేంకటకవి బహుధా తపస్సు చేశాడని చెప్పడం సమంజసంగా వుంటుంది. ఆ తపః ఫల ఫలితంగానే *విజయవిలాసం* అనే కావ్యాన్ని సర్వాలంకార శోభితంగా తీర్చిదిద్ద గలిగాడు.

**విజయవిలాసము - కథావస్తువు :**

రసవత్తరమైన ఈ కావ్యం మూడు అశ్వాసాలలో రచింప బడినది. ఈ కథకు మూలం మహాభారతం - ఆదిపర్వంలోని సుభద్రా వివాహం. భారత కథలో అవసరమైన కొన్ని చక్కని మార్పులు చేసి, ప్రత్యేక చమత్కారముతో పరిపక్వమైన తన నైపుణ్యానంతా చొప్పించి స్వతంత్ర కావ్యంగా *విజయ విలాసాన్ని* రూపొందించారు రచయిత చేమకూర వేంకటకవి.

ఈ కావ్యంలో నాయికలు ముగ్గురు! ముగ్గురూ మూడు రకముల వారు. ఉలూచి పాతాళ కన్య, చిత్రాంగద మర్త్య కన్య, సుభద్ర అవతార పురుషులైన బలరామ కృష్ణుల ముద్దుల చెల్లెలు కావున దేవకన్య. మరో విషయమేమిటంటే నన్నయ భారతంలో వర్ణితమైన ఉలూచి తనను గూర్చి "ఏ నులూచి యను నాగకన్యక నైరావత కుల సంభవుండయిన కౌరవ్యుని కూతుర"... అని చెప్పింది. కాని సంస్కృత భారతం భీష్మ పర్వంలో -

**"ఐరావతేన సాదత్తాహ్యా నవత్యా మహాత్మ నా**
**పత్యాహతే సువర్ణేన కృపాణ దీన చేతసా**
**భార్యార్థం తాంచ జగ్రాహః కామవశానుగాం"**

అని, ఉలూచి వితంతువనీ, ఆమెను నాగరాజే అర్జునుడికి వివాహం చేసినట్లు వుందని కీ॥శే॥ కందుకూరి వీరేశలింగం పంతులు ప్రకటించారు. దీనిని గూర్చి తెలుసుకొన కోరే పాఠక మహాశయులు సంస్కృత మహాభారతములోని భీష్మ పర్వాన్ని నన్నయ్య భారతంతో సరిపోల్చి నిజానిజాలు తెలుసుకొనగోర్తాను. ఈ విషయమై విజ్ఞులు మన్నిస్తారని ఆశిస్తాను. చేమకూర వేంకటకవి చాలావరకు మహాభారత కథనే అనుసరించినా, పాత్ర ప్రవేశ గోపనాల కోసం, కథా కథన సౌలభ్యం కోసం, నాటక పద్ధతి అనుసరించడానికి అక్కడక్కడా కొన్ని మార్పులు చేసుకొన్నట్లు మనకు విశద మవుతుంది.

భారత కథనంలో గంగా నదీతీరంలో హోమం చేయడానికి వచ్చిన అర్జునుని చూడగానే ఉలూచి కామ పరవశయై ముందు వెనుకలు చూడక అతడ్ని మాయావిధిని నాగలోకానికి తీసుకొని పోయినట్లు తెలియ నగుచున్నది. కాని, వేంకటకవిగారు చిత్రించిన ఉలూచి అటువంటి తెగువ తనం కనబర్చలేదు. అర్జునుని పరాక్రమం విని, వలచి, అతడికి భార్య ననిపించుకొని, ఇలావంతుని వంటి వీర కుమారుడికి మాత అయి గృహిణిగా ఉండదగిన కాంత మాత్రమే! కాబట్టి మహాబలవంతుడు, రూపవంతుడైన అర్జునుని చూచిన వెంటనే కామ పరవశయై అతనిని తీసుకొని పోవుటకు సమ్మతించలేదు.

**ఆ॥ "హిమకరసైక సైకతము నందు విహరించు**
**రైర వేషు వేషు ఘననిభాంగు**
**నెనరు దవుల దవులనే కాంచి క్రీడిగా**
**నెతిగి యౌరా! యౌరగేందు వదన"**

ఉలూచి, పైపద్యాన్ని బట్టి దూరాన చూచి నంత మాత్రాననే, తన హృదయాన్ని ఆకర్షించ గలిగిన ఈతడే, అర్జునుడని నిశ్చయించుకొంది. ఈవిధమైన నిర్ణయానికి వచ్చుటయే కవిగారి మెప్పుకు గురియై "ఔరా"! అనే

మెప్పుదల, పద ప్రయోగానికి దారితీసింది. అలా అర్జునుని గుర్తించ గలిగింది కనుకనే, మాయాన్వితయై దగ్గరకు పోయి అతని సౌందర్యాన్ని కన్నులారా గాంచింది! చూడగానే అర్జునుని నాగలోకానికి తీసుకొని పోలేదు! ఈవిషయంలో అత్యంత ఔచిత్యాన్ని పాటించాడు వేంకటకవి. ఈ విధంగా భారతములోని కథా విధానంలో చేమకూరకవి ప్రవేశ పెట్టిన మార్పులు, గ్రంథంలోని శిల్ప చాతుర్యాన్ని నిరూపిస్తాయి! మరికొన్ని పద్యాలు (వి.వి. 1-24, 1-197) ఈవిషయాన్ని రూఢి పరుస్తాయి.

**మార్గదర్శకులు :**

*విజయవిలాస* కావ్య రచనలో చేమకూర వేంకటకవికి ప్రధానంగా ముగ్గురు పూర్వ కవులను కొంతమేరకు మార్గదర్శకులుగా పరిగణింప వచ్చును. వారిలో మొదటి వారు వసుచరిత్ర రచించిన రామరాజ భూషణుడు, రెండవ వారు *పారిజాతాపహరణ* కర్త ముక్కు తిమ్మనార్యుడు, మూడవ వారు ప్రభావతీ ప్రద్యుమ్న కర్త పింగళి సూరన. చేమకూర వేంకటకవి పై రామరాజ భూషణుని ముద్ర హెచ్చుపరిమాణంలో ప్రస్ఫుటిస్తుందని విజ్ఞుల అభిప్రాయం. అందుకే కాబోలు *విజయవిలాస* కావ్యాన్ని *పిల్ల వసుచరిత్రము*గా పేర్కొంటారు! *విజయవిలాసము* లోని బహు శ్లేషలను బట్టి ఆపేరు వచ్చిందని చాలామంది అభిప్రాయం.

ఈ కథను రసవత్తర కావ్యంగా రూపొందించుటలో అత్యంత నైపుణ్యాన్ని కనబరచాడు చేమకూర వేంకటకవి. కావ్యములోని, విలక్షణ కల్పనలు, కవిసమయములు, శ్లేషలు, యమకములు, అన్నీ కలిసి *విజయవిలాసాన్ని వసుచరిత్ర* లాంటి ఒక మహా కావ్యంగా రూపొందించాయి. ఇందులోని ప్రతి పద్యము చదివి ఆనందించ వలసిందని విజ్ఞుల అభిప్రాయము. కావ్యంలోని విశేషాలు అన్నిటినీ ఆస్వాదించాలంటే సామాన్య పాఠకునికి వ్యాఖ్యాన సహాయం ఎంతో ఉపకరిస్తుంది.

**వాఖ్యానాలు :**

తెలుగులో ఒకటి కంటే ఎక్కువ వ్యాఖ్యానములు గల కావ్యములు చాలావున్నవి. శ్రీనాథుని నైషధము, వసు చరిత్ర ఉదాహరణలుగా భావింప వచ్చును. పెక్కు వ్యాఖ్యానములు వ్రాసి ఖ్యాతి గడించిన ప్రముఖులున్నారు. వారిలో ముఖ్యులు మహా మహోపాధ్యాయ వేదము వేంకటరాయ శాస్త్రి. వారిని మల్లినాథసూరితో పోలుస్తారు. వేదము వారు *మేఘసందేశా* నికి వ్రాసిన వ్యాఖ్య పండిత లోకాన్ని ఎక్కువగా ఆకర్షించడమే కాకుండా, బహు ప్రశంసలకు లోనైంది.

**హృదయోల్లాస వ్యాఖ్య :**

బహుముఖ ప్రజ్ఞాశాలి, కవి, పండితులు, విమర్శకులు, నాటక కర్త, అభ్యుదయ రచయితల ఉద్యమ స్థాపకులు, జీవితాంతం నిర్విరామ సాహిత్య కృషి సాగించిన, ఆంధ్ర విశారద తాపీ ధర్మారావు (తాతాజీ) కొన్ని సంవత్సరాల పరిశోధనా ఫలితంగా, చేమకూర వేంకటకవి రచించిన *విజయవిలాస* కావ్యానికి - హృదయోల్లాస వ్యాఖ్యను ప్రచురించారు. ఎన్నో సంవత్సరాలనుండి పండిత లోకం ఉత్సుకతతో ఎదురు చూస్తున్న ఈగ్రంథం వెలుగులోకి వచ్చుట ముదావహం. తెలుగు ప్రబంధాలను చదివి ఆనందించే రసికులు, దీనిని ప్రశంసలతో ఆహ్వానించారు. కేంద్ర సాహిత్య అకాడెమీ వారు ఈ రచనను ఉత్తమ రచనగా ఎంపిక చేసి 1970వ సంవత్సరపు జాతీయ పురస్కారాన్ని అందజేసారు. హృదయోల్లాస వ్యాఖ్యలోని విశేషాలు ఈ వ్యాస రూపంలో పాఠక లోకం ముందుంచడమైనది. విజయవిలాస కావ్యములోని చమత్కారాలు అర్థం చేసుకొని ఆనందించడంలో హృదయోల్లాసం ఇతోధికంగా ఉపకరిస్తుందనుటలో యెలాంటి సంశయమూ లేదు.

**మరో వ్యాఖ్యానం అవసరం :**

ఇదివరలో *విజయవిలాస* కావ్యాన్ని ఉద్దండులైన పండితులు పరిష్కరించి పాఠాంతరాలలోని లోపములను సంస్కరించారు. కొందరు టీకా సహితంగా ప్రకటించారు. బులుసు వేంకట రమణయ్య వంటి పండితులు వ్యాఖ్యానాలు వ్రాశారు. మహామహోపాధ్యాయ వేదము వేంకటరాయ శాస్త్రిగారు పూర్తి వ్యాఖ్యానాన్ని రచించారు. అయినప్పటికీ మరో వ్యాఖ్యను రచించుటలోని ఔచిత్యాన్ని గూర్చి తాపీ ధర్మారావుగారే స్వయంగా వ్యక్త పరచిన భావాలను వారి మాటలలోనే తెలిసి కొందాం.

"నాకు చిన్ననాట నుండి విజయవిలాసం మీద అభిమానం. నా పాండిత్య ప్రకర్ష కోసం గాని, ఇతర వ్యాఖ్యానాల్లో తప్పులు పట్టడానికి కాని నేను ఈ వ్యాఖ్యానానికి పూనుకోలేదు. విజయవిలాసములోని పద్యాలలో కొన్ని చోట్ల నిగూఢంగానున్న అనేక రకాల చేమకూర చమత్కారాలను సవ్యంగాను, సమంజసముగాను, ప్రకటన చేసి కవియందలి

గౌరవాన్ని ఇనుమడింప జేయడానికే నా ఈ ప్రయత్నం. మన కవి (చేమకూర వేంకటకవి) పోకడలను, అభ్యాసాలను సాధ్యమైనంత వరకు పరిశీలించు కొన్నాను. చేమకూరకవి తన వర్ణనలలో ఊహించిన విశేష భావాలను, హవణికలను (అలంకారాలను) నా వ్యాఖ్యానంలో వివరించి చూపడానికి ప్రయత్నించాను. కవి హృదయ పూరిత రచన ఉన్నవాడు కాబట్టే పాఠకుల శ్రద్ధకు పాత్రుడయ్యాడు. ఈ వ్యాఖ్యాన ఫలితంగా పాఠకులకు కవిమీద ఇతోధికమైన గౌరవం కలిగితే నేను ధన్యుణ్ణి".

ఈ వ్యాఖ్యలో ధర్మారావు *విజయవిలాస* కావ్యానికి సంబంధించిన అన్ని విషయాలు సంపూర్ణంగా చర్చించారు. కవి పరిచయంతో ప్రారంభించి సన్ని వేశాలు, పదాలు, చారిత్రక విషయాలు, పరిష్కరణము - పాఠ నిర్ణయము, దిద్దుబాట్లు, కథా వస్తువు, కావ్య గుణాలు, ప్రబంధ వర్ణనలు, కవి సాధన సంపత్తి, నాటకీయ రచన, వ్యాకరణ దోషాలు, సందేహాలు, అర్థంలేని అపవాదాలు, పండిత ప్రమాదములను శీర్షికల క్రింద అనేక విషయాలు విశ్లేషణా పూర్వకంగా వివరించారు. ఒక్కో విషయాన్ని గూర్చి సూచన ప్రాయంగా చర్చించినా ఈ వ్యాసం పుస్తకంగా మారుతుంది! అందుచేత, హృదయోల్లాసంలో నిక్షిప్తమైన కొన్ని అపురూప మణులను (విహంగ) వీక్షిద్దాం!

**తొలిపద్యం :**

**శ్రీ లెల్లప్పుడొసంగ, నీ సకల ధాత్రీ చక్రమున్ బాహు పీ**
**ఠీ లగ్నంబుగ జేయ, దిగ్వి జయమిన్ దీకొన్న చందాన, నే**
**వేళన్ సీతయు లక్షణుండు దను సేవింపగ విల్ పూని, చె**
**ల్వొలీలన్ దగు రామ మూర్తి రఘునాథా దీశ్వరుం బ్రోవుతన్.**

ఈ ప్రార్థనలో చేమకూర కవి దృష్టి నున్న రాముడు 'కోదండ రాముడు' సాధారణముగా ఈ స్వామి పటములోగాని, విగ్రహములో గాని, రాముడు మధ్యను, కుడి ఎడమల సీతా లక్ష్మణులు నిలిచి ఉంటారు. రాముడి ఎడమ చేతిలో నిలువుగా పట్టిన విల్లుంటుంది. వ్రేళ్ళు క్రిందికి చూపుతూ ఉన్న కుడి అరచేయి (వరద హస్తము) కనబడుతూ ఉంటుంది. సీత లక్ష్మీ అవతారము కాబట్టి, సంపదలనూ, లక్ష్మణుడు భూమిని మోసే ఆదిశేషువు అవతారము కాబట్టి భూచక్ర భరణమునూ, విల్లు విష్ణు పంచాయుధములలోని శార్ఙ్గమనే ధనస్సు కాబట్టి దిగ్విజయమునూ రాముడు ఇస్తాడని భావము. చమత్కృతి ఏమంటే ఈ మూడు వరాలను అనుగ్రహించడానికి ఆ రాముడి వరద హస్తమే సూచన. ఈ వరద హస్తమున్న విషయము మాటలతో చెప్పకుండానే ధ్వని మర్యాదను కవి సూచించాడు. అంటారు తాపీవారు!

ఇలాగే కృతిపతి వంశ ప్రసక్తి, రఘునాథ నాయకుని గుణగణాల వర్ణనలోను, కృతిసమర్పణము, షష్ఠ్యంతము లగు పద్యములలో ఒక్కొక్క దానిలో గల చమత్కృతిని విపులీ కరించారు రచయిత ధర్మారావు. సామాన్యముగా చారిత్రక విషయాలు చెప్పవలసి వచ్చినప్పుడు కవులు సాధారణంగా అతిశయోక్తులతో వర్ణిస్తుంటారు. "నేపాళరాజును రఘునాథుడు సింహాసనము మీద నెల కొల్పిన వాడని", ఎక్కడ నేపాళము? వేయిమైళ్ళ దక్షిణమున నున్న తంజావూరెక్కడ? ఆ రాజు రాజ్య భ్రష్టుడయితే అతనికి సహాయం చేసే వారెవ్వరూ దగ్గరలో లేక పోయారా? ఇది కేవలం అసత్యమని అనుకొని ఆ విషయమై పరిశోధనలు జరిపి - అది అసత్యము కాదని, ఆ పద్యములో (వి.వి.1-62) పేర్కొనిన నేపాళము జాఫ్నాదీవి, ఆ రాజు సంగ్లీకుమార్. పోర్చుగీసులు జాఫ్నా దీవిని ముట్టడి చేసినప్పుడు, సంగ్లీకుమార్ రాజు అభ్యర్థన మీద రఘునాథుడు పోర్చుగీసువారిపై విజయం సాధించి, సంగ్లీ కుమార్ రాజును సింహాసనము మీద ప్రతిష్ఠించాడు! ఆంధ్రులకు గర్వ కారణమైన ఈ విషయ వివరణ 1927 భారతి పత్రికలో 'నేపాళ చోలగ' అన్న శీర్షిక క్రింద ప్రకటితమైనది. ఈ విషయమై వేదం వేంకటరాయ శాస్త్రి వ్యాఖ్యలో పొరపాటు జరిగినదని వొప్పుకొని తర్వాత ఆ వ్యాఖ్యను సవరించు కొన్నట్లు పేర్కొన బడినది. అలాగే, కథా ప్రారంభములోని పురవర్ణన పద్యానికి వేదము వారు చెప్పిన అర్థం పేలవంగా వున్నదన్న భావాన్ని తాతాజీ వ్యక్త పరచారు. ఆపద్యంతో పాటు దానికి వేదము వేంకటరాయ శాస్త్రి ఇచ్చిన ప్రతి పదార్థమునకు, తాపీ వారి మెరుగులు పరిశీలించండి:

**శా॥ చంద్ర ప్రస్తర సౌధ ఖేలన పర శ్యామా కుచ ద్వంద్వ ని**
**స్తంద్ర ప్రత్య హలిప్త గంధ కలనా సంతోషిత ద్యోధునీ**
**సాంద్ర ప్రస్ఫుట హాట కాంబురుహ చంచ చ్చంచరీ కోత్కరం**
**బింద్ర ప్రస్థ పురంబు భాసిలు రమా హేలా కళావాస మై.**

దీనికి వేదం వారు "రమా=సిరి యొక్క హేలా= విలాసము యొక్క, కళా=విద్యకు, ఆవాసమై=ఉనికి పట్టై" అని అర్థము చెప్పారు. "ప్రతి పద్య చమత్కారము గల *విజయవిలాస* కావ్యములో మొదటి పద్యమున రమా హేల కళా వాసమై అనుదానిని రమా=సంపదకు, హేలా= విలాసమునకు, కళా=విద్యకు, ఆవాసమై=ఉనికిపట్టై

(ఇంకా–రమా=లక్ష్మికిని, హేలా=పార్వతికిని, కళా= సరస్వతికిని, ఆవాసమై=ఉనికి పట్టై, అనగా త్రిమూర్తుల భార్యలకు,"చల్లని పుట్టినిండ్లు గల చానలకు" ఉనికి పట్టై) భాసిలున్=ఒప్పును.

అని అర్థము చెప్పుకొని, తాత్పర్యము చదువు కొన్న యెడల చలువరాతి మేడల మీద ఆడుకొనే ఎలజవ్వనుల వక్షములందు పూనుకొనిన కస్తూరి లేపనముల పరిమళముల వల్ల సంతోషిస్తున్న ఆకాశగంగ యందుండే బంగారు తామర పువ్వులలో తిరుగుతున్న తుమ్మెదలు కలిగి ఇంద్రప్రస్థ పురము సంపదకు, విలాసానికి, విద్యకు (లక్ష్మీ పార్వతి సరస్వతులకు) ఉనికిపట్టయి ఉన్నది అని భావము తేట పడుతుంది. మరో చమత్కార మేమంటే, చలువరాతి మేడలు తెల్లనివి. ఆ మేడ మీద ఆడుకొనే శ్యామల కుచ ద్వంద్వములు బంగారు వన్నె కలవి. కస్తూరి లేపనములు నల్లనివి. అటు ఆకాశ గంగ తెల్లనిది. అందలి తామరలు బంగారు వన్నెవి. వాటిలో విహరించే తుమ్మెదలు నల్లనివి. ఇచ్చట బింబ ప్రతిబింబ భావము చేమకూర కవి చక్కగా సూచించాడు! దేవతలకు కస్తూరి లేదని ఒక నమ్మకం మన కవులకుంది. కాబట్టి అక్కడ, ఆకాశగంగలోని పద్మాలలో విహరిస్తుండే తుమ్మెదలకు ఈ "ప్రత్యహ లిప్త గంధ కలన" అపూర్వము, అపురూపంగా వుంటుంది. అందుకే అవి సంతోషించి తిరుగు తున్నాయి. ఇంతటి చమత్కారాన్ని నింపి అలంకార యుక్తముగా వివరించాడు చేమకూర వేంకటకవి. అందుకే కాబోలు రసికులెవ్వరో "చామకూర మంచి పాకాన పడినది" అన్నాడట!

ఉలూచి అర్జునుని పరాక్రమము గురించి విని తన హృదయాన్ని అతడికి అర్పిస్తుంది. ఇప్పుడు అతని అందచందాలు స్వయంగా చూచి వేగిర పడుతుంది. ఆసందర్భములో వ్రాసిన పద్యమునకు,

**ఉ॥ కమ్మని జాళువా నొరయ గల్గిన చెక్కుల టెక్కువాడు, చొ**
**క్కమ్మగు జాతి కెంపు వెలగాగొను మోవి మెరుంగు వాడు, స**
**త్యమ్మగు రూపసంపద ధనాధిప సూనుని ధిక్కరించు వా**
**డమ్మక చెల్ల! నా హృదయ మమ్మక చెల్లదు వీని కియ్యడన్.**

కూడా మన పూర్వ వ్యాఖ్యాతలు (వేదము వేంకటరాయ శాస్త్రి మొదలగు వారు) తగినంత చక్కగా వివరణ ఇవ్వలేదని అభిప్రాయ పడినారు ధర్మారావు. కమ్మని జాళువా నొరయ గల్గిన చెక్కుల టెక్కువాడు, అంటే వేదము వారు "చక్కని మేల్మి బంగారమును రాపాడ కల్గినట్టి చెక్కిళ్ళ అందము గల వాడు" అన్నారు. రాపాడ గల్గటములోని అర్థాన్ని బులుసు వారు "ఎదిరింప గలిగిన (సరి పోయినట్టి అనుట)" అని వివరించారు. అర్జునుడు నల్లని వాడని – ఘన నిభాంగుడని, మనము మరిచి పోకూడదు. జాళువాతో రాపాడ గలవాడంటే సరిపోదు కదా! ఇంకా హెచ్చు వివరణ కావాలి.

"ఒరయ" అన్నమాట స్వర్ణకారుల "ఒరగల్లు" ను జ్ఞప్తికి తెస్తుంది. ఈ ఒరగల్లు సన్నగా నిగనిగలాడుతూ ఉండే సన్నని రాతి పలక. బంగారాన్ని దీనిమీద గీటు పెట్టి స్వర్ణ పరీక్షకులు ఆ బంగారపు వన్నె నిర్ణయిస్తారు. దీనినే ధరా కట్టించడం అంటారు. ఉలూచి తన హృదయమనే అమూల్యమయిన రత్నాభరణమును అమ్మ తలచుకుంది. రత్నాభరణము మొదట బంగారు పరీక్షకుడు వన్నె కట్టాలి. తరువాత రత్న పరీక్షకుడా రత్నముల వెల నిర్ణయించాలి. తరువాత ఇంత ఎక్కువ ఖరీదు ఇవ్వగల ధనికుడు కావాలి. అప్పుడు గాని ఆరత్నాభరణమును అమ్మటానికి వీలుండదు. ఈ మూడు గుణములు అర్జునుని యందు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. కాబట్టి అక్కడే, అతనికే, అప్పుడే అమ్మక తప్పదు అని నిశ్చయించు కుంటుంది! ఇంతటి అర్థం ఇమిడ్చి నాడు కవి పై పద్యంలో. ఈ పూర్తి విశ్లేషణ వ్యాఖ్యాత వివరిస్తేనే కాని కవి యొక్క ప్రతిభ పాఠకులకు వెల్లడికాదు.

అలాగే ఉలూచికి అర్జునునికి మధ్య జరిగిన సంభాషణ వ్యక్త పరచే ప్రతి పద్యం రసవత్తరమైనదే. సంభాషణ చివరి భాగంలో అర్జునుడు ఉలూచిని ప్రశ్నించే ఈ పద్యం పరిశీలించండి :

**తే॥ అనిన ఫణి జాతివీ, నేను మనుజ జాతి,**
**నన్య జాతి బ్రవర్తించు టర్హ మగునె?**
**ఏల యీ కోర్కి? యనిన రాచూలి కనియె**
**జిలువ చెలువంపుల బల్కుల జిలువ చెలువ.**

ఉలూచి తన్ను వలచిన కాంత. ఆవేశము, తొందరపాటు ఆమెవంతు! అర్జునుడు తటస్థంగా ఉండగలడు! ఆమెను ఇటువంటి ప్రశ్నలతో ఆడించుట కూడా వినోదమే కదా! "చిలువ చెలువంపు బలుకుల జిలువ చలువ": ఇది చక్కని శబ్దాలంకారమున్న చరణము. ఇది వ్యాఖ్యాతలకు శ్రమకు కొంత కారణమైనది. చేమకూర వేంకటకవి అభిరుచులు పసికట్టిన వారికి దీనికి మరొక పాఠము ఉండి ఉండవచ్చుననే ఆలోచన కలిగి ఉండవలసింది. సరైన అర్థము విశ్లేషించు ప్రయత్నం చేయవలసింది. కాని అలా జరుగలేదు. తాపీ

వారు మాత్రం విశేష కృషితో వారికి సమంజసమైన అర్థమును ఈ విధంగా సూచించారు. చిలువ=నాగుపాము (చాలా అందమైన ప్రాణి!) దాని యొక్క పడగ, కదలిక, శరీరము యెంత చూచినప్పటికీ ఇంకా చూడాలని ఉంటుంది. కాని – భయం! దీనిని బట్టి ఆలోచిస్తే– చిలువ చెలువము అంటే, అందముగా వినడానికి ఇంపుగా ఉండి, భయము కలిగించే భావములు గల మాటలన్న మాట! అది ఎలాగో చూదము. దీని తర్వాత ఉలూచి చెప్పే రెండు పద్యాలలోను, ఆమె అభిలాష, సమర్థన, దీనత్వము అన్నీ అందంగానే ఉన్నాయని మనము అంగీకరించక తప్పదు.

ఆ పద్యాలను పరికించండి:

**ఉ॥ ఏమన బోయదం దగుల యెంచక నీ విటు లాడ? దొల్లి శ్రీ**
**శ్రీ రామ కుమారు డైన కుశ రాజు వరింపడె మా కుముద్వతిన్,**
**గోమల చారు మూర్తి పురుకుత్సుడు నర్మద బెండ్లి యాడడే?**
**నీ మనసొక్కటే కరగ నేరదు గాని నృపాల కాగ్రణీ.**

**ఉ॥ ఈ కల హంస యాన నను నెక్కడి కెక్కడ నుండి తెచ్చె! నా**
**హా! కడుదూర మిప్పుడని యక్కున జేర్పక జంపు మాటలన్**
**వ్యాకుల పెట్టు టేల? విరహాంబుధి ముంపక పోదునన్ జలం**
**బే కద నీకు మంచి దిక నీతకు మిక్కిలి లోతు గల్గునే?**

"ఈ మందయాన ఇంత దూరము నన్ను తీసుకొని వచ్చిందే, ఆ శ్రమ కయినా ఆమె కోరిక నెర వేర్చాలే" అని తలచ కుండా, ఊరక కాలయాపన చేసి, నన్ను వేధించడమెందుకు? ఈ పరిస్థితిలో వియోగ సాగరం నన్ను ముంచక తప్పదు. నీకు కావలసిందంతా నీ పట్టుదలే కదా. సరే అలాగే కానీ, ఈతకు మిక్కిలి లోతూ, చావును మించిన చింత ఉంటుందా?" అంటుంది.

**పద్యంలోని విశేషం :**

"విరహము వల్ల నాకు చావు తప్పదు. చావబోయే వ్యక్తికి ఎటువంటి దుఃఖం కల్గినా సరకు చేయదు" అని ఉలూచి తన తెగువను తెలియ జేస్తుంది! ఈ చమత్కార మంతా ఎవరు వ్యక్తం చేయాలి? వ్యాఖ్యాత కాదా? అని ప్రశ్నిస్తారు తాపీ వారు! అదే హృదయోల్లాస వ్యాఖ్య ప్రత్యేకత.

ఈ ఘట్టములోనే మరో విశేషము ఉలూచి సద్యో గర్భము. సద్యః గర్భము–అంటే అప్పటి కప్పుడే నిండు చూలాలగుట! అటువంటి గర్భము ఏర్పడటము ఆ ఇద్దరి సంయోగ మహిమో కాక జాతక యోగమో చెప్పలేనంటారు చేమకూరకవి! అది ఒక చమత్కార శ్లేషయే! ఆ విధంగా ఉలూచికి కొడుకు పుడతాడు. ప్రసవ సమయములోని గ్రహ స్థితి గతులను బట్టి ఆ బాలుడు మంచి మాటకారి అవుతాడని నిర్ణయించి, ఆ అర్థం స్ఫురించేలాగా ఇలావంతుడు అని పేరు పెడతాడు అర్జునుడు. అర్జునునికి జ్యోతిష్యము కూడా తెలుసునని కవి సూచన.

ఇంకా నాగలోకంలో ఆలస్యము చేస్తే, అక్కడ భూలోకంలో తనతో వచ్చిన ఆశ్రితులంతా ఏమను కుంటారో; "నేను త్వరలో వెళ్ళాలి, నీవూ కుమారుడు తర్వాత రావచ్చును" అని ఉలూచిని ఓదార్చి ప్రార్థనా పూర్వకంగా చెప్పడం ఆజ్ఞా పూర్వకంగా చెప్పడం కంటే ఎక్కువ సమంజసమని కవి అభిప్రాయము. ఆ విధమైన అర్జునుని విన్నపాన్ని ఉలూచి ఆదరముతో మన్నించి అర్జునుని గంగా నదీ తీరానికి తీసుకొని వచ్చి, కంట నీరు గారుస్తూ, గాఢంగా కౌగిలించుకొని దిగులుతో కూడిన మనసుతో వీడ్కోలిచ్చి వదల లేక వెళ్ళి పోతుంది. వారు విడి పోవుట *సంజను జోడు విడిచి ఎటోపోయే జక్కన పెట్టతో* సరి పోల్చడం చాలా మనోహరము. ఇది కూడా కవిలోని భావనా శబలతకు మంచి ఉదాహరణ!

తిరిగి వచ్చిన అర్జునుడు తన సఖుడైన విశారదునితో తను నాగ లోకంలో ఉలూచితో అనుభవించిన రస క్రీడలన్నీ వివరంగా వర్ణించి చెప్తాడు! ఆ సందర్భములో కవి రచించిన పద్యాలన్నీ కూడా రస గుళికలే! తప్పక చదవ వలసినవే!

అటు తర్వాత అర్జునుడు తనతో వచ్చిన యాత్రికులతో కలిసి హిమాలయము దగ్గరికి పోయి అందుగల వివిధ శిఖరాలు తిలకించి అనేక చిత్ర విచిత్రములైన విశేషాలను తెలుసుకొని సంతోషిస్తాడు. తర్వాత మలయ ధ్వజరాజు నగరమైన మణిపురమును సమీపిస్తాడు. మణిపురం ఇప్పటి పేరు మణలూరు. మణికర్ణిక కాశీలోని ఒక కోనేరు. దానిని విష్ణుమూర్తి చక్రముతో త్రవ్వాడని పేర్కొంటారు. దానిని చూడటానికి శివుడు వచ్చి చూస్తుండగా అతని చెవిని ఉన్న మణిఖచితమైన ఆభరణము ఆ కోనేరులో పడి పోయిందిట! అందుచేత ఆకోనేరుకు "మణికర్ణిక" అన్నపేరు కలిగింది. ఆకోనేరును గంగానదితో సమానమైన మహిమగలదిగా పేర్కొంటారు పెద్దలు. అందువలన అర్జునుడు అక్కడికి వెళ్తాడు. అక్కడ ఒక అపూర్వ దృశ్యాన్ని చూస్తాడు. ఆసమయంలో మణిపురాధీశ్వరుడి కూతురు చిత్రాంగద తన చెలికత్తెలతో కలిసి వనవిహారము చేసి వస్తూ ఉండడము అర్జునుడు చూచాడు. ఆ వన విహారములో వారు స్నానము

చేసి, కోకిల పాటలు ఆలకించి, దోసిళ్ళతో పువ్వులు ఒకరికొకరు ఇచ్చుకుంటూ,అందరూ కలిసి పూతేనెలు త్రాగి నగరికి తిరిగి వెళ్తున్నారు. ఈ కార్య క్రమమంతా ఆ రాజకుమారికకు త్వరలో కాబోయే వివాహాన్ని సూచిస్తున్నది. పెళ్ళిలో మంగళ స్నానము చేసి, ధవళాలు – పెండ్లి పాటలూ వింటూ తలంబ్రాలు దోసిళ్ళతో పోస్తూ, బువ్వ బంతి భోజనాలు చేస్తునట్టుందని కవి ఉత్ప్రేక్ష! విశేష మేమిటంటే పైన పేర్కొన్న వర్ణనతో చెప్పిన పద్యంలో "పాండ్య రాజ సుత... పాండు రాజ సుతుడు" అనే శబ్దముల తోనే బంధుత్వము తెల్పడము. కాబోయే పెళ్ళిని వర్ణనతో సూచించి కవి ఈనామ సంబంధాన్ని చెప్పడం ఉద్దేశ్య పూర్వక మేనని పాఠకులు గ్రహించాలి. పద్యంలో ఉత్ప్రేక్షాలంకారాన్ని ఉపయోగించాడు కవి చేమకూర వెంకన్న! వన విహారము చేసి తిరిగి పోతున్న రాజకుమారి చిత్రాంగద అందాన్ని మనసులోనే మెచ్చుకొంటాడు రసికరాజ శిఖామణి అర్జునుడు!

**క॥ కన్నె నగుమోము తోడం**
**బున్నమ చందురుని సాటి బోలువ వచ్చున్**
**నెన్నుదురు తోడ మార్కొని**
**మున్నందఱు జూడ రేక మోవక యున్నన్.**

"పైన పేర్కొనిన పద్యం చిన్నదైనా, పండితులనూ, పరిష్కర్తలనూ, వ్యాఖ్యాతలనూ మూడు వందల సంవత్సరాలకు పైగా చిక్కుల పాలు చేసింది! వ్యాఖ్యాతలందఱూ, వేదము వేంకట రాయశాస్త్రిగారితో సహా అసంతృప్తి కరమైన అర్థాలు చెప్పి సరిపెట్టుకున్నారు (తాపీ ధర్మారావు). ఈ పద్యంలో "రేక మోవక (మోయక) యున్నన్" అన్న మాటలే ఈ చిక్కంతటికీ కారణము అంటారు తాపీ వారు. ఆమాటలకు సరైన అర్థం తెలియనందున కవి హృదయంలో ఉన్న అమోఘమైన భావమంతా వ్యక్తపడలేదు. పద్యంలో ఒక పోరాటము, పోటి ఉందని తాపీవారి అభిప్రాయము. "కొన్నాళ్ళకు పూర్వం ఆపోటీలో చంద్రుడు చిత్రాంగద నుదురును బహిరంగంగా ఎదిరించి రేక మోవడం అనే అపజయాన్ని – అవమానాన్ని పొందాడు. అందుచేత ఆమె నవ్వు ముఖంతో పోల్చడానికి పున్నమ చంద్రునికి అర్హత లేకుండా పోయిందని తాత్పర్యము". వేదమువారు "అందరు జూడన్ఎల్లవారి ఎదుట (అనగా బట్ట బయలైన అవమానమునకు పాలై). రేక మోవక యున్నన్ జాబు మోయు పనిని (తపాలా నౌకరీని) చేయకున్న యెడల" అని వ్యాఖ్యానించారు. తాపీవారి దృష్టిలో ఫోటోలోగాని పోరులోగాని అపజయాన్ని-అవమానాన్ని-తపాలా నౌకరి సూచిస్తుందని నమ్ముట కష్టం. వారి పరిశీలన ప్రకారం "రేక మోవక" ఉండడములోని విశేషార్థాన్ని స్పష్టంగా తెలియజేస్తూ చేమకూరకవి విజయవిలాస కావ్యంలోనే వివరించాడు. దానికి నిదర్శనగా మూడవ అశ్వాసములో అర్జునుడు సుభద్రను తీసుకపోతు ఉండగా బలరాముడి సైన్యాలు అతడిని ఆపడానికి ప్రయత్నించాయి. యుద్ధం జరిగింది. ఆయుద్ధ సమయాన సుభద్ర అర్జునుడికి సారథ్యం చేసింది. సుభద్ర సారథ్యాన్ని మెచ్చుకుంటూ కౌగిలించు కొంటాడు. అప్పుడు చమట వలన సుభద్ర వక్షస్థలమున పూసుకొని ఉన్న కుంకుమ రేఖలు అర్జునుడి గుండె నంటుకొని కత్తి గంటులు – నరుకులు – వలె కనబడ్డాయి. అదిచూచి అర్జునుడు నవ్వుతూ –

**"ఒక్కించుక రేక మోవని నాయురః స్థలంబున**
**నీకుచ కుంకుమ రేఖ లంటించి మీవారికి సూడు దీర్చితివి . . ."**

అని నెయ్యమూ వియ్యమూ ప్రకటించాడు... సూడపగ దీనిని బట్టి రేక అంటే ఇక్కడ ఆయుధము వలన కలిగిన గంటు-గాయము-అని తేట పడుతుంది కదా! ఈ పరిశీలనాంతరము మనం విశ్లేషిస్తున్న పద్యానికి అర్థం ఈ క్రింది విధంగా చెప్పుకొనవచ్చును :

మున్ను విదియనాడు చంద్రుడు ఈ కన్య ముఖములో ఒక భాగము మాత్రమైన నుదురును ఎదిరించి "రేక మోశాడు''-రేక (చంద్రరేఖ) ఆకారాన్ని పొంది ఓడిపోయాడు; ఈ రెండో అర్థాన్ని బట్టి-కత్తి వ్రేటు-గాయము-గంటు తిన్నాడు. అదే అపజయమూ అవమానమూను. ఆ విదియ నాడు అందరూ చంద్ర రేఖను చూడడమూ, చంద్రునికొక నూలు పోగు విసరడమూ మనలో వుంది. కాబట్టి కత్తి గంటు తిన్న అవమానము బహిరంగంగా జరిగింది. ఇప్పుడు, పూర్ణిమ నాడు పోటీ కన్య నవ్వు మొగమంతటితోను, పైన చెప్పిన అవమాన కారణంగా ఈచంద్రుని పోటీకి రానీయరు. అంతేకాదు, ఆనాటి 'రేకమోసిన' గంటు-గాయం-మాని, మచ్చ గట్టి చంద్రుడిలో కళంకముగా కనిపిస్తుంది. కాబట్టి, నిష్కళంకమైన నవ్వు మొఖముతో సరిపోల్చడానికి వీలు లేదని ధ్వని. ఇంతటి అర్థం ఇమిడి ఉన్నది మన పరిశీలనలోని చిన్న పద్యం విశ్లేషణలో!

అలాగే చిత్రాంగద సౌందర్యముతో భావుకుడయిన అర్జునుడు విశారదునితో చెప్పిన పద్యాన్ని గమనించండి:

**మ॥ "తనకు గౌగిలి ఈ వొకప్పుడును, నాథా నీకర స్పర్శనం**
**బున గిల్గింతలే యంచు బద్మిని కరాం భోజంబునన్ మందమం**
**దనట ద్వాయు చల ద్దళాంగుళులు గ న్పట్టంగ నవ్వెల్గు రా**
**యని రారా! యని పిల్చినా దగె ద్విరే ఫా త్యంత దీర్ఘ ధ్వనుల్"**

అనేకమంది విజ్ఞులు, మహాకవులు (విశ్వనాథ సత్యనారాయణ) ఈ పద్యాన్ని మహాగొప్ప పద్యంగా (రచనగా) భావిస్తారు. అర్జునుడు దూరం నుంచే చిత్రాంగదను చూచాడు కాని ఆలింగనాది కార్యాలకు నోచ లేదు! ఆస్థితిలోనే సూర్యుడు గూడా ఉన్నాడు. నాయిక–పద్మినీ కాంత–ఈ దూరపు గిల్గింతలు చాలు, కౌగిలి సుఖము ఇవ్వడానికి రారమ్మని పిలుస్తునట్టు అర్జునునికి కనబడడము చాలా సహజమూను, తాను సూర్య స్థానం లోనూ, చిత్రాంగద పద్మిని స్థానం లోను ఉన్నట్లు ఊహించు కున్నాడు!

**పద్యంలోని విశేషము :**

తుమ్మెద ధ్వనులు 'రారా' అని పిలిచినట్టు ఉన్నవనడంలో గొప్ప విశేషముంది. తుమ్మెదలకు ద్విరేఫములన్న పేరు ఉంది. రేఫము అంటే 'ర్' అనే ఆకారము. ద్విరేఫములు అంటే రెండు 'రకారా' లన్నమాట. ఆ రకారము మీద అ రకారము ఉంచితే ర్+ఆ=ర అవుతుంది. దానికి అత్యంత దీర్ఘ మిస్తే రా... అవుతుంది. అలాంటివి ద్విరేఫములలో రెండు ఉన్నాయి. కాబట్టి "రారా" అన్న పిలుపు ఏర్పడుతుంది. అత్యంత దీర్ఘం అంటే పిలిచి నప్పుడు మనము ఉపయోగించే మూడు మాత్రల దీర్ఘ మన్నమాట. పైన పేర్కొనిన పద్యములో పద్మిని నాయిక, అంభోజము (తామర పువ్వు) చేయి, గాలిలో కొంచెముగా కదులు తున్న తామర రేకులు చేతి వేళ్లు, తుమ్మెదల ధ్వనులు పిలుపు అని గ్రహించాలి. ఈపద్యంలో కవి ఉత్ప్రేక్ష, శ్లేష, మొదలైన అలంకారాలను ప్రయోగించాడు.

అర్జునుడు చిత్రాంగదను చూచిన రోజు రాత్రి ఆమె తలపులతో గడిపాడు. ఆమె అందచందాలే అతని భావుకతను పెంపొందించి రాత్రంతా నిద్ర లేకుండా చేశాయి. మరుసటి రోజున విశారదుని పిలిచి మలయ ధ్వజ రాజుకు తానిక్కడకు వచ్చిన వార్తను తెలియ జేయమని ఆరాజు దగ్గరకు పంపించాడు. ఆ సందర్భములో చెప్పిన (కవి రచించిన) పద్యం భిన్న వ్యాఖ్యానాలకు గురి అయింది. ఆ వివరాలు తెలుసు కొందాం. మొదట పద్యాన్ని గమనించండి!

**తే ॥అపుడు నృపుడు ప్రఫుల్ల నవాంబుజ ప్ర**
**సన్న ముఖుడయి మలయ ధ్వజ క్షితీశ**
**కమల హితునకు మామ కాగమన వార్త**
**దెలుపు మనుచు విశారదు బిలిచి పనిచె.**

సర్వసాధారణముగా మన కవులు సూర్యోద యాదులను వర్ణించుటకు ఎక్కువ ఉబలాట పడతారు. కాని ఈ కవి (చేమకూర వేంకటకవి) కథా నాయకుని (అర్జునుని) తత్తరము (కాలయాపనకు ఓర్వలేక పోవడము) దృష్టిలో ఉంచుకొని చాలా క్లుప్త గతిని సూర్యోదయం సంగతి తెలియ జేస్తాడు. అంబుజములకు స్నేహితుడు – కమల హితుడు. కాబట్టి అంబుజ ప్రసన్న ముఖుడైన అర్జునుడు, క్షితీశ కమల హితుడైన మలయు ధ్వజుడికి, వార్త పంపడము సమంజసము. హిత భావము కార్యానికి అనుకూలము కదా?! విశారదుని అర్జునుడు "పిలిచి పనిచె" అనుటలో అర్జునుని తొందర స్ఫురిస్తున్నది. ఒక విధంగా ఆలోచిస్తే, విశారదుడితో చెప్పిన మాటలే చాలా చమత్కారముగా ఉన్నాయి: "మామ కాగమన వార్త" (నేను వచ్చానన్న సమాచారము) తెలుపుము అన్నాడు. కాని అతని అభిప్రాయము అంత మాత్రమే కాదని అందరికీ తెలుసును.

చిత్రాంగదా ఘట్టములో అర్జునుడు అవలంభించిన 'అవహిత్థ' (భావగోపనము) ఇంకా కొన సాగిస్తున్నాడని అనాలి. అంటే తన హృదయములో ఉన్న అసలు అభిప్రాయము (వివాహ విషయం) తెలియ పరచలేదా అంటే చేమకూరకవి చమత్కారము ద్వారా తెలియ పరచక పోలేదని గట్టిగా చెప్పవచ్చును. ఆ చమత్కారాన్ని చూపించడానికి మన వ్యాఖ్యాతలు ప్రయత్నించారు. జూలూరి వారు (అప్పయ్య పంతులు) "మామకు ఆగమన వార్త అని కూడా చమత్కారము విచారించ వలెనని వ్యాఖ్యానించారు. వేదము వారు "మామకున్ ఆగమన వార్త ... తన కూతురును నాకిచ్చి వివాహము చేయమని ఆయనను అడుగుమని చమత్కారము" అని వివరించారు.

మామకున్+ఆగమన వార్త అని పద విభాగము చూపినప్పుడు, ఆ పద భాగాలకున్న అర్థాలు చెప్పి, వాటి సమ్మేళనము వలన కలిగిన శక్తితో విశేషార్థాలు నిరూపించి, తాము చూపిన (తనకూతురునిచ్చి వివాహము చేయుమన్న) చమత్కారాన్ని సాధించి ఉండాలి. అలాంటిదేదీ వారు చేయలేదు. సహృదయులెంత ప్రయత్నించినా అది సాధ్యము కాక పోయింది. చమత్కారార్థము చూపించాలని అభిలాష ఉంటే "ఇదిగో ఈసన్నివేశంలో 'మామా' అన్నమాట

అర్జునుడి నోట విన వచ్చింది కాబట్టి సంతోషించండి" అని పాఠకులను కోరితే ఇంతకంటే మేలుకదా? ఈ వ్యాఖ్యానాలు సందర్భాన్ని బట్టి ఊహించి 'కిట్టించిన' వ్యాఖ్యానాలనక తప్పదు. పెండ్లి కాక మునుపే మలయ ధ్వజుడు మామ ఎలాగవుతాడు? మామకు ఆగమన వార్త తెలుపు మన్నంత మాత్రాన తన కూతురునివ్వమని అడుగు అన్న అర్థం ఎలావస్తుంది? ఇవి అన్నియూ ఆలోచిస్తే, అర్జునుడు సభ్యత తెలియని మోటు మనిషి కాడు.

ఉత్తమ రాజవంశములో పుట్టిన వాడు, మీదు మిక్కిలి ధర్మరాజు తమ్ముడు. అటువంటి వాడు-ఈ సన్నివేశములో చిత్రాంగద మీద తనకు మోహము కలిగినంత మాత్రాన, ఆమె తండ్రిని 'మామా' అని నిర్దేశిస్తాడా? ఇలా వెకిలిగా బయట పడతాడా? అత్యంత శ్రద్ధతో పాత్ర పోషణ చేస్తూ వచ్చిన చేమకూర వేంకటకవి ఈ ఒక్క మాటతో ఇంతటి పేల కవిగా తేలిపోతాడా? ఊహాతీతము! తేలిపోడు! అందుచేత అర్జునుడు విశారదునికి చెప్పిన మాటలను "మామ+కాగ+మన వార్త తెలుపుము" అని విడ దీస్తే ప్రశస్తంగా ఉంటుందని తాతాజీ అభిప్రాయ పడ్డారు. అలా చేసి నట్లయితే దాని కర్థము "మామ అయేటట్టు మన వార్త తెలుపుము" అని మామ అయేటట్టు అంటే కూతురి నిచ్చునట్లు; మన వార్త (నా సంగతీ మన వంశము సంగతీ) చెప్ప మన్నాడు. నీవు చెప్పినది విని మలయ ధ్వజుడు మా వివాహానికంగీకరించాలని కార్య భారమంతా నేర్పుతో విశారదుడి మీద పెట్టాడు! చేమకూర కవి శ్లేషలు "పూ మొగ్గల వలె తమంత తామే వీడును" అని వేదము వారు ప్రశంసించారు. "ఆమాట నాపద విభజన రూఢి పరుస్తుంది" అంటారు తాపీధర్మారావు.

ఆరాజు అతనిని సంతోషముతో ఆహ్వానించి, గౌరవించి మీ రాజుగారేమంటున్నారని? ప్రశ్నిస్తాడు. విశేషాలేమిటని విశారదుడు అడిగాడు. అంతటితో ఆగక "మహారాజా! మారాజుగారు చాలా సంతోషముగా ఉన్నారు. నేను ఇచ్చటికి వచ్చే వరకు వారు తమ ప్రశంసే చేశారు. పాల సముద్రముతో చుట్టరికము చేసిన లక్ష్మీనాథుడి లాగానే, మీరు గుణవంతులు కాబట్టి, మీతో సంబంధము పెట్టుకోవాలని మా ప్రభువు ఆలోచిస్తున్నారు" అన్నాడు. వెంటనే మలయ ధ్వజుడు గ్రహించి "అటువంటి మహారాజుకు బుద్ధిమంతురాలైన నాకూతురు నివ్వగలగడం నిజంగా నా భాగ్యమే" అన్నాడు! అతడు వెంటనే తన వంశ వృత్తాన్ని విశారదునికి వివరించి, నాకూతురికి పుట్టిన కొడుకును మావంశ ప్రభువుగా చేయవలసి ఉంటుందని అందుకు అర్జునుని ఒప్పించి ఈ కార్యము తప్పక నెరవేర్చ వలయునని విశారదుని కోర్తాడు.

**తే॥ అని యతని బంచె, నామాట కర్జునుండు**
**సమ్మతించె, ముహూర్త నిశ్చయము నయ్యె;**
**హితుడన విశారదుడె గాక యెందు గలరె**
**కోర్కి వెలయంగ దొర పెండ్లి కొడుకు జేసె.**

అటు అర్జునుడికీ, ఇటు మలయ ధ్వజునికీ ఉన్న తహ తహాకు అనుగుణంగా ఈ పద్యంలో కథా గమనం పరుగెత్తడం చమత్కారం! ఈ పద్యంలో చూపించిన అలంకారాన్ని కావ్య లింగమని పేర్కొన్నారు లాక్షణికులు!

రాజుగారి ఆజ్ఞలతో అర్జున చిత్రాంగద వివాహానికి కావలసిన యేర్పాట్లన్ని చక చకా జరిగి పోయాయి! వెను వెంటనే రాజలాంఛనాలతో అత్యంత వైభవోపేతంగా వివాహం జరిగింది! మొదటిసారిగా రాకుమార్తెను చూచిన ప్రజలు ఆమె అందానికి ఆశ్చర్యపడి, పోలికలు చెప్పుకొన్నారు. ఈ విధంగా పరు గెత్తుతున్న కథను ఆపి కవి ప్రజల ఊహను వర్ణించుట సమంజసమే! ఈ పద్యంలోని సారస్యమును పరికించండి:

**శా॥ పంకే జాతములన్ దిసంతు లడచున్ బాలామణి పాదముల్;**
**వంకల్ దీర్చు మనోజ సాయకములన్ వాల్చూపు; లేణాంకునిన్**
**శంకల్సేయు మొగంబు; జక్కవ కవన్ జక్కట్లు దిద్దున్ గుచా**
**హంకారంబు; మదాళి మాలికల నూటాడించు వేణీరుచుల్.**

విజ్ఞుల దృష్టిలో ఇది చాలాచక్కని పద్యం. పద సారస్యముతో పాటు ప్రసన్నార్థమూ, గంభీరార్థమూ, మేళవించి సాగించారీ పద్య రచన! ఈ పద్యములోని అందచందాలు మన పూర్వ వ్యాఖ్యాతలు గమనించ లేక పోయారన్న విచారాన్ని వ్యక్త పరుస్తారు తాపీవారు. ఈ ఘట్టం లోని ప్రతి పద్యమూ రస పూరితమైన గుళికయే! వివాహానంతరం తదుపరి కార్య క్రమాలన్నీ జరిగి పోతాయి! కొంత కాలానికి చిత్రాంగద గర్భం దాల్చింది. ప్రసవ మాసంలో శుభలగ్నమందు ముద్దుల బాలుని కన్నది. ప్రతాపములో వేయి సూర్యులతోను, కీర్తిలో వేయి చంద్రులతోను, సమానమై బాలుడు ప్రకాశింప మొదలెట్టాడు. ఆ శిశువు జాతక రీత్యా పచ్చని గుల్మముల పాలించే వాడౌతాడని తెలుసుకొని, అర్జున మలయ ధ్వజులు బాలునికి బభ్రువాహనుడని నామకరణం చేస్తారు.

ఇంకావుంది...

ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ
ఫోన్ : 9618524702

# చైనా ప్రయాణం

– ఎమ్. ఆదినారాయణ

తూర్పు చైనాలోని షాంటుంగ్ నగరంలో ఫొటో గ్రాఫర్‌గా జీవితాన్ని గడుపుతున్న నా ఫేస్‌బుక్ స్నేహితుడు జియావెన్ గత పది నెలలుగా నన్ను వాళ్ళ ఊరికి రమ్మని పిలుస్తూనే ఉన్నాడు. తీరా నేను బయలుదేరబోయే సమయానికి అతనికి అమెరికన్ ఎంబసీలో ఉద్యోగం రావటంతో "డియర్ ఆది, మిమ్మల్ని ఆహ్వానించటానికి నాకు కొంత సమయం కావాలి, గుడ్‌లక్" అంటూ ఉత్తరం వచ్చింది.

వాళ్ళ దేశం చూద్దామని చైనా గోడంత ఆశతో ఉన్న నాకు ఆ ఉత్తరం నిరాశ కలిగించినా, మరొక నెలరోజుల పాటు కష్టపడి ఫేస్‌బుక్‌లో ఉన్న ఒక చైనా ఇంగ్లీషు టీచర్ ద్వారా సియాన్ (XIAN) నగరానికి రెండు వందల కి.మీ. దూరంలో ఉన్న ఒక 'యాపిల్ కోపరేటివ్ సొసైటీ' అడ్రసు సంపాదించి "నాకు చైనా గ్రామసీమలు చూడాలని ఉంది, అందుకు మీ సహకారం కావాలి" అని రాసి నా పూర్తి బయోడేటా వారికి పంపాను. పదిరోజుల్లోనే నాకు తిరుగు సమాధానం వచ్చింది. "గ్రామీణ వాతావరణాన్ని ప్రేమించే మీ లాంటి కళాకారులకి మా పరిసరాలు తప్పనిసరిగా నచ్చుతాయి. నెల రోజుల పాటు మిమ్మల్ని అతిథిగా ఉంచుకోవటానికి మా సభ్యులంతా ఇష్టపడ్డారు" అంటూ ఆ సంస్థ డైరెక్టర్ ట్రెజోరో నాకు అభయహస్తం ఇచ్చాడు.



బొమ్మతో చైనా బొమ్మ

ట్రెజోరో ఉండేది పింగ్‌లియాంగ్ అనే చిన్న టౌనులో, గూగిల్ మ్యాప్‌లో చూశాను. చాలా అందంగా ఉంది. కొండల మీద యాపిల్ తోటలు, ఊరు చుట్టూతా బౌద్ధ మందిరాలు. ప్రయాణానికి ఏర్పాట్లు పెట్టుకొన్నాను. అయితే అతని వద్ద నుండి ఒక వారం తరువాత వచ్చిన ఉత్తరంలో "తొంభై సంవత్సరాలు జీవించిన మా అమ్మగారు స్వర్గస్థులైన కారణంగా ఆమె పెద్దకర్మ పూర్తయ్యే వరకూ నాకు పనిఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మాకు దగ్గరలో ఉన్న తియోఫోసి మోనాస్టరీలో ఉండండి. మిమ్మల్ని అక్కడ కలుసుకొంటాను" అంటూ రాసి దాని అడ్రస్, మిగతా వివరాలు అన్నీ స్పష్టంగా ఇచ్చాడు.

'సరే, అంతా మన మంచికే' అనుకొన్నాను. పింగ్‌లియాంగ్ నుండి తియోఫోసి 120 కి.మీ. దూరంలో ఉంటుంది. అంటే సియాన్ నుండి పింగ్‌లియాన్‌కి నేరుగా వెళ్ళే దారి మధ్యలోనే తియోఫోసి ఉందన్న మాట. ఆ బౌద్ధాలయంలో ఉండే మాంక్ పేరు మియావో. చాలా కాలంగా అతడు బౌద్ధమత ప్రచారకుడుగా సేవలు అందిస్తున్నాడు. ఇలాగా నేను అతని వద్దకి వస్తున్నట్లుగా ఉత్తరం రాసి స్థానికంగా ఉన్న చిత్రకారులకి నా ప్రయాణం గురించి తెలియజేయవలసిందని కోరాను.

ఈ సంవత్సరం మార్చి నెల, రెండవ తేదీ సాయంత్రం నేను చైనాలోని సియాన్ ఎయిర్ పోర్టులో దిగిన వెంటనే మియావో పంపిన ఇద్దరు మిత్రులు వచ్చి నన్ను కలుసుకొన్నారు. కబుర్లు చెప్పుకొంటూ నగరంలోనికి బయలుదేరాం.

దారి పొడవునా కన్పిస్తున్న ఆకాశ హర్మ్యాలు, చైనా అభివృద్ధిని కొలవటానికి నిలబెట్టిన స్కేలు మాదిరిగా ఉన్నాయి. నగరంలోకి చేరే సరికి రోడ్డుకి రెండు వైపులా ఉన్న చెట్లకి, స్తంభాలకి అమర్చిన వందల కొలదీ గుండ్రని చైనా దీపాలు ఎర్రమందార పూలగుత్తుల మాదిరిగా ఊగి పోతున్నాయి. "ఇవన్నీ మా కొత్త సంవత్సర పండుగ

సందర్భంగా చేసిన అలంకరణలో భాగాలు" అని చైనా మిత్రులు చెబుతున్నారు.

సియాన్ నగరంలో ఒక బహుళ అంతస్తుల భవనం ముందు ఆగిన మా కారు వద్దకి ఒక పెద్దాయన వచ్చి "నా పేరు కియాలిస్మో, మియావో స్నేహితుణ్ణి" అంటూ పరిచయం చేసుకొన్నాడు. నాకు వీసా లెటరు పంపింది ఈయనేననీ, ట్రెజోరో కూడా ఈయన మిత్రుడేననీ తెలుసుకొన్నాను. ప్రస్తుతానికి కియాలిస్మో ఒక Exports & Imports కంపెనీ నడిపిస్తున్నాడు.

ఆఫీసు లోపలి గదుల్లో నన్ను కలుసుకోవటానికి కొత్త మిత్రులు ఎదురు చూస్తున్నారు. వారిలో ఒకతను చిత్రకారుడు. బొమ్మలు ముద్రించి ఉన్న తన కేటలాగుని నాకు చూపిస్తూ "బుద్ధుడు జన్మించిన దేశం నుండి వస్తున్నందుకు మీకు సుస్వాగతం" అంటూ ఎంతో ప్రేమగా టీ కప్పు, సిగరెట్ పెట్టె అందించారు. అందరితోనూ పరిచయాలయ్యాయి. చలిముదిరి పోయేకొద్దీ టేబుల్ మీద టీ కప్పులు పేరుకు పోతున్నాయి.

"మీరు ఇండియా వచ్చినపుడు తప్పనిసరిగా మా ఇంటికి రావాలి" అని చెప్పి అందరికీ నా విజిటింగ్ కార్డులు ఇచ్చాను.

'అయ్యా! మాకు ఇండియా వెళ్ళటానికి వీసాలు దొరకటం చాలా కష్టంతో కూడుకున్న పని".

'ఎందుకని?'

"మీ డెమోక్రసీ భావాలు, స్వేచ్ఛా మమ్మల్ని ప్రభావితం చేస్తాయనీ, పనిచేయటం మానేసి, స్వాతంత్ర్యం కావాలి" అంటూ గొడవలు చేస్తామనీ మా ప్రభుత్వానికి భయం.

"మీ వాళ్ళ భయానికి సరైన కారణాలే ఉన్నాయి మరి. మాకు ఉన్న స్వాతంత్ర్యాన్ని వేము సద్వినియోగ పరచుకోలేదు అనేది మాత్రం నిజం. మీకు క్రమశిక్షణ ఉంది కాబట్టే అమెరికాతో సమానంగా నిలబడగలిగారు" అని చెప్పాను.

ఇంతలో కియాలిస్మో అందుకొని "రేపు ఉదయం మీతోపాటుగా తియోఫోసి మోనాస్టరీవరకూ రావటానికి ఒక బ్రెజిల్ కుర్రాడు సిద్ధంగా ఉన్నాడు" అని చెప్పగానే సంతోషించాను.

కనీసం రెండు రోజులైనా సియాన్ నగరంలో ఉందామనుకొన్నాను. ఇక్కడ నేను చూద్దామనుకొన్న



తియోఫోసి మోనాస్టరీ

ముఖ్యమైన ప్రదేశాలు రెండు. మొదటిది దాయంతా పగోడా. రెండోది రైతు చిత్రకారుల ఆర్ట్ గ్యాలరీ.

సియాన్ నగరానికి పాత పేరు చాంగ్ ఆన్. ఇది సరిగ్గా చైనాకి మధ్యలో ఉండటం వలన టాంగ్ వంశపురాజులు ఈ నగరాన్ని రాజధానిగా చేసుకొని క్రీ.శ. 618 సం॥ నుండి 907 సం॥ వరకూ పరిపాలించారు. ఇక్కడ ఉన్న మహాబోధి మోనాస్టరీ నుండి క్రీ.శ. 627 వ సం॥లో హుయాన్ త్సాంగ్ (క్రీ.శ.600–664) ఒక చలికాలపు చీకటి రాత్రిలో రహస్యంగా బయలుదేరి భారతదేశానికి ప్రయాణమయ్యాడు. అప్పుడు అతని వయసు 27 సం॥లు మాత్రమే. నలందా విశ్వవిద్యాలయంలో ఐదు సంవత్సరాలు నివసించి శీలభద్ర అనే సంస్కృత గురువు వద్ద విద్యనేర్చుకొని, భారత దేశమంతా14 సం॥ ప్రయాణం చేసి, 657 బౌద్ధ మతసూత్రాల్ని సంపాదించి, వాటిని తనతోపాటుగా ఈ సియాన్ నగరానికి తీసుకువచ్చాడు. అమూల్యమైన ఆ సూత్రాల్ని జాగ్రత్తగా కాపాడేందుకోసం టాంగ్ వంశపురాజు గావోజోంగ్, ఇక్కడ ఏడు అంతస్థుల పగోడా నిర్మించాడు. దాని పేరే 'దాయంతా' (The Great Wild Goose Pagoda). దాని ఎత్తు 210 అడుగులు. ఆకాశంలోకి చొచ్చుకు పోతున్నట్లుగా ఉండే ఈ మహా పగోడా ఒక అద్భుతమైన వాస్తు కళాఖండం. హుయాన్‌త్సాంగ్ సమాధి కూడా దగ్గరలోని సింగ్‌జియావో ఆలయ ప్రాంగణంలో ఉంది.

సియాన్‌లో నాకిష్టమైన రెండో ప్రదేశం అక్కడికి 22 కి.మీ. దూరంలో ఉన్న హూసియాన్ అనే చిన్న టౌను. అక్కడ సామాన్య రైతులు పెయింటింగ్స్ వేస్తూ జీవిస్తున్నారు. సాంఘిక సమానత్వం కోసం చైనాలో సాంస్కృతిక విప్లవం (1966–76) కొనసాగుతున్న రోజుల్లో 'గ్రామీణ కళల

వికాసమే దేశాభివృద్ధికి మూలం' అనే ఉద్దేశంతో "రైతులు, సిపాయిలు కూడా కళాసాధన చెయ్యాలి" అని పిలుపునిచ్చిన మావో జెడాంగ్ మాటల ప్రభావంతో చైనాలో, ఈ షాంజి ప్రావిన్స్‌లో వందల సంఖ్యలో రైతు చిత్రకారులు పుట్టుకొచ్చారు.

చిత్రకళని ప్రత్యేకంగా ఎక్కడా నేర్చుకోకుండానే బొమ్మలు వేయగలిగిన వీరి చిత్రాలకి మంచిధర కూడా పలకటంతో వారి చిత్రాలు ప్రపంచ వ్యాప్త కళాభిమానుల్ని ఆకర్షించాయి. 'ఆధునిక జానపద కళ' అనే పేరుతో కొనసాగుతున్న ఈ చిత్ర కళా ఉద్యమంలో 'జాంగ్ కింగ్ ఈ', 'ఫెంగ్ ఇ - దొంగ్' అనే Farmer Painters వేస్తున్న చిత్రాలకు చాలా గుర్తింపు వచ్చింది.

ఈ రెండు ప్రదేశాలనూ చూడాలంటే ప్రస్తుతానికి వీలుకాదని తెలిసింది కాబట్టి, ముందుగా తియోఫోసిలో అడుగుపెడితే ఆ తర్వాత నిదానంగా ఆలోచించుకోవచ్చు అనుకొన్నాను.

చైనావారి డిన్నర్ సాయంత్రం ఆరుగంటలకే మొదలవుతుంది. వానపాముల్లా జారిపోతున్న ఆ నూడిల్స్‌ని ఛాప్ స్టిక్స్‌తో పట్టుకోవటం కాస్త ఇబ్బంది అనిపించినా ఏదోలా ఆకలి తీర్చుకొన్నాను. మిత్రుల వద్ద శెలవు తీసుకొన్నాక, నేనూ కియాలిస్మో కబుర్లు చెప్పుకొంటూ బజారుకి చేరుకొన్నాం. అన్నీ ఆకాశన్నంటే భవనాలు, ఎంతో పరిశుభ్రంగా ఉన్న రోడ్లు, ఒక పద్ధతిలో సాగిపోతున్న ప్రజానీకం.

కియాలిస్మో నాకంటే నాలుగేళ్ళు పెద్దవాడు. ప్రతి ఎస్పరాంటోవాక్యాన్ని స్పష్టంగా చెక్కినట్లుగా పలుకుతున్నాడు.

"సార్! చైనా ఇంత అభివృద్ధిలోకి రావటానికి ముఖ్యమైన కారణం తెలుసుకోవాలని ఉంది" అని నేను అడిగాను.

"ఛైర్మన్ మావో (1893-1976) సిద్ధాంతాల్ని సక్రమంగా అర్థం చేసుకొనే ప్రజలు ఉండటమే ముఖ్యమైన విషయం" అని వివరిస్తూ, 1921 వ సం॥లో కమ్యూనిష్టు పార్టీని స్థాపించటం, రెడ్ ఆర్మీని తయారు చేసుకోవటం, నేషనలిస్టు పార్టీ దాడుల్ని తప్పించుకోవటానికి ఆయన సాగించిన 'లాంగ్ మార్చ్' (1934-35) విజయవంతం కావటం, ఆ తర్వాత తలపెట్టిన సాంస్కృతిక విప్లవం ద్వారా ప్రజల్లో సాంఘిక చైతన్యం కలిగించి, వ్యక్తిగత ఆస్తిని రద్దుచేయటం లాంటి పనుల ద్వారా ప్రజలు సాధించిన మార్పుని వివరిస్తూ ఎన్నో విషయాలు చెప్పుకు పోయాడు.

భారతదేశంలో 1925 వ సం॥లో కమ్యూనిష్టు పార్టీని స్థాపించారు కదా! మనమెందుకు అభివృద్ధిలోకి రాలేకపోయాం! అనే ఆలోచన వచ్చింది నాకు. చిన్నతనంలో మా ఊర్లోని కమ్యూనిష్టు పార్టీవారికి నేను బ్యానర్లు రాయటం, జెండాలు కుట్టిపెట్టటంలాంటి విషయాలన్నీ గుర్తుకు వచ్చాయి. జూలియస్ ఫ్యూజిక్ (1903-43) అనే ఛెకోస్లోవేకియా కమ్యూనిష్టు రాసిన *Notes From The Gallows* ని ఆ రోజుల్లో చదివాను. ఒక రోడ్డు మలుపులో ఇంపైన టర్కీ సంగీతం వినిపించింది. ఆ దారిలో కొంచెం ముందుకి వెళ్ళగానే దాదాపు 50 మంది స్త్రీ, పురుషులు నాట్యం చేస్తున్న దృశ్యం కనిపించింది. 'ఏదైనా ఉత్సవం జరుగుతుందేమో!' అనుకొన్నాను.

"ఇది మా దేశపు సాంప్రదాయ నృత్యం ఇలాగా ప్రతి ఉదయం, సాయంత్రం కూడా బహిరంగంగానే నృత్యాలు జరుగుతూ ఉంటాయి" అని కియాలిస్మో చెప్పాడు. ఇలాగా రోడ్డు మీద డాన్సు చేయడం నాకు ఆశ్చర్యంగా ఉంది. కొందరు చిన్న గొడుగుల్ని పట్టుకొని, మరికొందరేమో రంగుల విసనకర్రల్ని ఊపుతూ ఒక పద్ధతిలో సంగీతానికి అనుగుణంగా చేస్తున్న నాట్యం ఇది. వివిధ భంగిమల్లో శరీరాన్ని తిప్పుతున్న వారి ముఖంలో సంతోషం తప్ప వేరే భావం కనిపించటం లేదు. సంగీతం కూడా ఒకే తాళం మీద సాగిపోతూ ఉండటమే దానికి కారణం. ఈ నాట్యంలో ఒక క్రమశిక్షణ కనిపించింది నాకు.

"ఈ నాట్యానికి ఏదైనా పేరుందా?"

"ఎందుకు లేదు? దీన్ని 'యాంగ్‌గే' అంటారు. 1940వ సం॥లో కమ్యూనిష్టు ఉద్యమాన్ని గ్రామాల్లోకి తీసుకెళ్ళే పనిలో భాగంగా మావో కూడా ఈ సామూహిక యాంగ్‌గే నృత్యాన్ని ఉపయోగించాడు" అంటూ చైనా గ్రామీణ సంస్కృతిని గురించి వివరించాడు.

మరికొంచెం ముందుకి సాగిపోయాక తనే ఆకస్మాత్తుగా, "ఇండియాలో ఉంటున్న దలైలామా నిజానికి చైనా వాడే. టిబెట్ పౌరుడు కాదు, మీకు తెలుసా?" అని అడిగాడు.

"అతడు టిబెట్ పౌరుడే అనుకొంటున్నాను!"

"కాదు దలైలామా అయ్యాక, వారి భాష నేర్చుకొని

టిబెట్‌ని ప్రత్యేక దేశంగా మార్చి దానికి తనే ప్రెసిడెంట్ కావాలని ప్రయత్నం చేశాడు. 'చైనా కమ్యూనిస్టు పార్టీ' వారికి శత్రువుగా మారి, 1959వ సం॥లో మీ దేశానికి పారిపోయాడు".

"చైనాలో చాలామంది విదేశీయులు సెటిలై పోయారని వింటున్నాం. నిజమేనా?

"చాలాకాలం క్రితమే కొరియా, తైవాన్, మంచూరియా ప్రాంతాల వారే కాకుండా, ఇరాన్, టర్కీ, మంగోలియా వారు కూడా వచ్చి ఈ విశాలమైన చైనాలో స్థిరపడి పోయారు. ఇప్పటికీ ఎవరి సొంత భాష వారికి ఉంది. అందుకే చైనీస్ మండారిన్‌ని అధికార భాషగా గుర్తించారు".

"అలాగైతే చైనాలో ఉండే వారందరూ చైనా జాతివారు కాదన్నమాట?" నేను అడిగాను.

"చైనాని పరిపాలించిన హాన్ (క్రీ.పూ. 206- క్రీ.శ.- 220) జాతివారే నిజమైన చైనా వారు. అయితే సాంస్కృతిక విప్లవం జరుగుతున్న రోజుల్లో, తమ ప్రాణ రక్షణ కోసం ప్రతివారు 'మేము హాన్‌జాతి వాళ్ళం' అని చెప్పుకొనే వారు.

మాటల్లోనే ఒక పెద్ద అపార్టుమెంటుకి చేరుకొన్నాం.

"రేపు తియోఫోసికి వెళ్ళాక నీవు వచ్చినట్లుగా పోలీస్ స్టేషన్లో రిపోర్టు ఇవ్వటం మరవొద్దు" అని చెప్పి నన్ను తన మిత్రుడైన యాంద్రియా ఫ్లాట్‌లో వదలిపెట్టి వెళ్ళిపోయాడు కియాలిస్మో.

అది 42వ అంతస్తు. ఇంత ఎత్తైన భవనాల్లో ఉండటం నాకిదే మొదటి సారి. చుక్కల పక్కన నిలబడినట్లుగా ఉంది. కిచెన్‌లో ఉన్న యాంద్రియా 'నీహావ్' (How do you do) అంటూ పలుకరించాడు.

"చైనాలో తిరగటానికి ఇంగ్లీషు భాష సరిపోతుంది కదా" అని అడిగాను.

"నేను అర్జెంటైనా నుండి ఇక్కడికి వచ్చి నాలుగు సంవత్సరాలైంది. చైనీస్ నేర్చుకొనే అవసరమే నాకు రాలేదు. గత పది సంవత్సరాల నుండి చైనాలో ప్రతి స్కూల్‌లోనూ ఇంగ్లీషు నేర్పిస్తున్నారు. అయితే వారు చాల తక్కువగా ఇంగ్లీషు మాట్లాడుతారు. విదేశీ నాగరికతకి అలవాటుపడితే స్వంత సంస్కృతి నాశనమైపోతుందనే భయం వారికి ఎక్కువ" అని యాంద్రియా తన అనుభవాలు చెప్పుకొచ్చాడు.

"మరి వారికి ఇప్పుడు ఇంగ్లీషు అవసరం ఎందుకొచ్చింది?"

"అంతర్జాతీయ వ్యాపార రంగంలో అడుగు పెట్టే అవసరం ఉంది కాబట్టి. చైనా సోషలిస్టు దేశం అనేది పాత మాట. ఇప్పుడు చైనా కంటే పెద్ద కాపిటలిస్టు దేశం ఎక్కడా కానరాదు" అని చెబుతూ, నాకు ఒక *ఇంగ్లీషు - చైనీస్ ఫ్రేజ్ బుక్* ఇచ్చి 'గుడ్‌నైట్' చెప్పాడు యాంద్రియా.

తెల్లవారగానే తియోఫోసికి బయలు దేరాం. నన్ను ఎయిర్ పోర్టు నుండి తీసుకువచ్చిన లిలియా, జియాంగ్‌లతో పాటుగా బ్రెజిల్ కుర్రాడు వచ్చి కారులో కూర్చొన్నాడు.

"నా పేరు లియాంద్రో" అని పరిచయం చేసుకొని జియాంగ్‌తో చైనీస్‌లో అనర్గళంగా మాట్లాడుతున్నాడు.

"నువ్వు చైనాలో చాలా కాలం నుండి ఉంటున్నావా మిస్టర్ లియాంద్రో?"

"లేదు, నేను వచ్చి రెండు వారాలే అయింది!"

"మరి చైనీస్ ఎక్కడ నేర్చుకొన్నావు?"

"బ్రెజిల్ లోనే! అక్కడ చైనా వాళ్ళు చాల మంది ఉన్నారు. మా సొంత ఊరు ఫోర్తలేజాలోనే వారి జనాభా పదివేల వరకూ ఉంది.

"అయితే మరి ఇక్కడకి ఎందుకొచ్చావో తెలుసు కోవచ్చా?"

"చైనీస్ లాంగ్వేజ్ డిప్లొమా చేయటానికి సియాన్ యూనివర్శిటీకి వచ్చాను'' అని చెప్పాడు ఈ 32 సంవత్సరాల యువకుడు.

"ఈ మధ్యకాలంలో అమెరికన్లు కూడా ఎక్కువగా చైనీస్ భాష నేర్చుకొంటున్నారని విన్నాను! నిజమేనా లియాంద్రో?"

"నిజమే, అమెరికా భవిష్యత్ చైనీస్ భాషలో రాసి ఉందని ప్రపంచ వ్యాప్తంగా అనుకొంటున్నారుగా మరి!"

దారిలోకనిపించే ప్రతి భవనం పక్కనా ఒక ఎత్తైన క్రేన్, విజయధ్వజం మాదిరిగా తిరుగుతూనే ఉంది. గంటన్నర ప్రయాణం తర్వాత దూరంగా లియాంగ్‌షాన్ కొండ కనిపించింది. వాటి మీద పురాతన కట్టడాలు ఉన్నట్లు తెలుస్తూనే ఉంది. "ఆ కొండని పరిశీలించి చూడండి సార్! వెల్లకిలా పడుకొని ఉన్న స్త్రీ మాదిరిగా ఉంది కదూ!" అంటూ వర్ణిస్తున్నాడు, కారు నడుపుతున్న జియాంగ్, కొండ వాలుల్లో మెట్ల పద్ధతి వ్యవసాయం సాగిపోతూ ఉంది. కొన్ని పెద్ద మట్టి దిబ్బల్ని, దిగుడుగా ఉన్న పెద్ద రోడ్డుని దాటాక తియోఫోసి గ్రామం వచ్చింది. ఎర్రరంగు గోడలతోనూ, ఎత్తైన బురుజులతోనూ ఉన్న మోనాస్టరీ వద్దకి వెళ్ళగానే

'అమితాబో' అనుకొంటూ కాషాయ రంగుదుస్తుల్లో వచ్చిన మాంక్ మియావోని అందరం విష్ చేశాం. ఆయన నాకంటే చిన్నవాడే. పచ్చని ఛాయతో సన్నగా, ఎంతో ఆరోగ్యంగా ఉన్నాడు.

తియోఫోసి మందిరం చాలా విశాలంగా ఉంది. కాస్త ఎత్తైన ప్రదేశంలో వున్న సుందరమైన భవన సముదాయం. బురుజులకి వేలాడుతున్న చిన్న గంటలకి, గాలి గిలిగింతలు పెట్టగానే, అవి నాట్యాన్ని అందుకొన్నాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న పెద్దతోటలో ఎత్తైన వెదురు పొదలు కూడా ఉన్నాయి. సియాన్ నుండి ఇక్కడికి వెంటనే రావటం మంచిదే అనిపించింది.

మియావో అందర్నీ నేరుగా హాల్లోకి నడిపించాడు. నాకైతే నిజానికి చాలా ఆకలిగా ఉంది. నూడిల్స్‌తో పుట్టగొడుగుల పులుసు, కలువ పువ్వు కాండంతో చేసిన పచ్చడి కలుపుకొని తింటుంటే ఎంతో రుచిగా ఉంది.

నాతో వచ్చిన ముగ్గురు మిత్రులూ రాత్రికి మళ్ళీ సియాన్ వెళ్ళిపోవాలి కాబట్టి "గ్రామం అంతా తిరిగి చూద్దురు గాని రండి" అంటూ మమ్మల్ని ఊర్లోకి నడిపించాడు మియావో.

గ్రామంలో రెండువేల జనాభా ఉంటారు. ఊరి మధ్యగా సాగిపోయిన బాట చాలా విశాలంగా ఉంది. "ఆనాడు సియాన్‌లో మొదలై ఐరోపా వరకూ సాగిపోయిన 'సిల్కు రూట్' ఇదే. పైగా సియాన్ దాటాక ఈ దారిలో వచ్చే పెద్ద బౌద్ధాలయం తియోఫోసి" అని గర్వంగా చెబుతున్నాడు మియావో.

ఎత్తైన మట్టి దిబ్బల పక్కగా మలుపులు తిరిగింది మా బాట. కొండమీద ఉన్న కొత్త మోనాస్టరీని చూపించాడు. అదే దారిలో కిందికి వస్తుంటే ఆ సమతలమైన మట్టి కొండల లోపలివైపుకి తొలిచిన గుహలు కనిపించాయి. వాటిల్లో ప్రజలు నివాసం ఉంటున్నారు కూడా. అర్ధచంద్రాకారంలో తవ్విన ఆ గుహల్ని చూడగానే రాతిలో చెక్కిన కార్లే, కన్హేరీ లాంటి బౌద్ధ మందిరాలు గుర్తుకి వచ్చాయి. నాకూ, లియాండ్రోకి ఇవి ఎంతో ఆశ్చర్యాన్ని కలుగజేశాయి.

మట్టి కొండల ముఖాన్ని తొలుచుకుంటూ నిర్మించిన ఆ గుహా నివాసాలు ఆ ప్రాంతమంతా ఉన్నాయి. పైగా సమతలంగా ఉన్న ఆ గుహానివాసాలపై వ్యవసాయం కూడా జరుగుతూ ఉంది. ఆ గుహల్ని అర్ధచంద్రాకారంలో తొలుచుకుంటూ పోవటం వలన మీద బరువంతా పక్కలకి వెళ్ళిపోయి కూలిపోకుండా ఉంటాయి.

"ఇలాంటి మట్టి గుహల్ని 'యవతోంగ్' అని పిలుస్తున్నారు. వీటిల్లో నివసించేవారికి చలికాలం వెచ్చగానూ, ఎండాకాలం చల్లగానూ ఉంటుంది" అని వివరించారు మియావో.

"చైనా అంతటా ఇలాంటి యవతోంగ్‌లు ఉన్నాయా?"

ఉత్తర చైనా పీఠభూముల్లో ఉన్న ఇలాంటి మట్టి కొండల ప్రాంతంలోనే గుహల్ని తొలచుకోవటానికి అవకాశం ఉంటుంది. ఈ షాంజి ప్రాంతంలో నాలుగు కోట్లమంది ప్రజలు ఈనాటికీ గుహల్లోనే నివసిస్తున్నారు" అని జియాంగ్ వివరాలు ఇస్తున్నాడు.

రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్‌వాళ్ళు చైనా మీద బాంబులు వేసినప్పుడు ఈ పరిసరాల్లోని స్థానికులు ఇలాంటి యావ్‌తోంగ్‌ల్లోనే తలదాచుకొన్నారనీ, ఇంకా చెప్పాలంటే 'లాంగ్ మార్చ్' ప్రయాణ మార్గంలో రెడ్ ఆర్మీ దళాలు జియాన్‌జి నుండి యానాన్ చేరినప్పుడు ఇలాంటి యవతోంగ్ ఇళ్ళే వారికి సహాయపడ్డాయని తెలిసింది.

పన్నెండు అడుగుల ఎత్తు, పది అడుగుల వెడల్పు, ఇరవై అడుగుల పొడవు గల ఈ గుహలు ఎంతో అందంగా ఉంటాయి. నాలుగిళ్ళ చావిడి మాదిరిగా ఉన్న గుహలు కూడా ఉన్నాయి. ప్రతి ఇంటికి తలుపు, కిటికీ, వెంటిలేటర్ అమర్చారు. ప్రాచీనకాలంలో కొండల్లో చెక్కిన బౌద్ధుల ఆరామాలు, ఇలాంటి గుహల్ని తొలచడానికి మూలం అయి ఉంటాయి. వర్షం తక్కువగానూ, చలి ఎక్కువగానూ ఉండే ఈ ప్రాంతాల్లో ఇలాంటి గుహల్ని తొలచటం తప్పనిసరి అయింది. ఇంటిపైన వ్యవసాయం చేసుకొంటూ, కింది భాగంలో హాయిగా నివసించవచ్చు.

మేమంతా చిత్రంగా ఆగుహల్ని పరిశీలిస్తూ ఉండగా ఒక ముసలమ్మ మాకు బేరీ ఫలాలు యిచ్చింది. యవతోంగ్‌ల ముందు ఖాళీగా ఉన్న స్థలంలో కొత్తగా ఇటుకలతో ఇళ్ళు నిర్మించుకొంటున్న వాళ్ళూ ఉన్నారు. గవర్నమెంటు లోన్ ఇచ్చి భవనాలు కట్టుకొమ్మని స్థానికులకి చెబుతున్నా, "తాతలనాటి ఆ గుహల్ని వదలి రాలేము" అంటున్నారు ముసలివాళ్ళు.

"త్వరగా మోనాస్టరీకి వెళదాం పదండి" అని మియావో తొందర పెడుతున్నా సరే, అందరికీ ఆ గుహలవద్దే మరి కాసేపు తిరగాలనిపించింది. చాలా

ఫోటోలు తీసుకొన్నాం. రైతులు ఇళ్ళకి తిరిగి వచ్చే సమయానికి మేం బయలుదేరాం. నా మనసంతా ఆ గుహల మీదనే ఉంది. భోజనాలు చేశాక సియాన్ మిత్రులు శెలవు తీసుకున్నారు.

మర్నాటి వేకువ జామున నాలుగు గంటలకల్లా నిద్రలేపాడు మియావో. "త్వరగా భోజనానికి బయలు దేరండి. ప్రతిరోజూ ఇదే సమయానికి లేవాలి" అని చెప్పగానే పరుగులు తీశాను. మందిరంలో పది అడుగుల ఎత్తులో ఉన్న అవలోకితేశ్వర విగ్రహం ముందు బౌద్ధ సన్యాసులు అందరూ నిలబడి 'నమో అమితాబో' అంటూ మంద్రస్థాయిలో ప్రార్థనాగీతాలు ఆలాపిస్తున్నారు.

ఆకలి వేయకపోయినా వేడివేడి నూడిల్ సూపు కడుపు నిండా తాగాను. గదికి వెళ్ళి కాసేపు పడుకొందాం అనిపించింది. కానీ ప్రాంగణంలో ఉన్న తోటలోని పిట్టలు పాటలు అందుకొన్నాయి. ఎదురుగా ఆకాశంలో సగానికి చిక్కిపోయిన చందమామ, నక్షత్రాల నది మీద పడవలాగా మెల్లగా కదలిపోతున్నాడు. అలాంటి మనోహర దృశ్య కావ్యాన్ని ఆస్వాదించడానికి, వొంగిన ఒక వెదురు కొమ్మ కింద కాసేపు మౌనంగా నిలబడ్డాను, చలిగాలికి వొణికిపోతూనే.

నిన్న చూసిన యువతోంగ్ గుహల దగ్గరికి బయలుదేరాను తెల్లవారగానే. ఇంతలో మియావో ఎదురై "మనం ఇప్పుడు కిన్‌లింగ్ టౌనుకి వెళుతున్నాం రండి" అంటూ టాక్సీ ఎక్కించాడు.

ఈ దారిలో కూడా చాలా గుహల్ని చూశాను. సిల్కు దారిలో ప్రయాణించిన ఆనాటి యాత్రికులు కూడా ఇలాంటి గుహల్లోనే ఉండేవారట. రాత్రిపూట వాళ్ళసామానులు, జంతువులు ఈ గుహల్లో ఉండేవి. నీడనిచ్చే చెట్లు పెద్దగా పెరగని ఈ ప్రాంతాల్లో, ఇలాంటి గుహల అవసరం ఎంతో ఉందని తెలుసుకొన్నాను.

దారిలో ఒక చిన్న బౌద్ధాలయం వద్దకి వెళ్ళాం. అక్కడ ఉన్న మాంక్ మేం తినటానికి సన్‌ఫ్లవర్ విత్తనాలూ, పుచ్చ విత్తనాలూ ఇచ్చి మర్యాద చేశాడు.

కిన్‌లింగ్ టౌన్‌లోకి వెళ్ళగానే ఒకప్పుడు ఆ ఊరు చుట్టూరా నిర్మించిన పెద్ద మట్టిగోడ కనిపించింది. పెకింగ్ పక్కన The Great wall ఉన్నట్లుగా, ఆ రోజుల్లో ప్రతి పెద్ద పట్టణం చుట్టూతా రక్షణకోసం ఎత్తైన గోడలు నిర్మించు కొనేవారు. ఆ పాత గోడ చాలా విశాలంగా ఉండటంతో దాని మీదకి ఎక్కి కాసేపు నడిచాం. ఆనాటి బురుజులు ఇంకా దృఢంగానే ఉన్నాయి. ప్రజలు అలాంటి ఒక బురుజుని కొత్తగా నిర్మించి, దాని గోడల మీద గ్రామ చరిత్ర అంతా రాశారు.

కొరియర్ ఆఫీసులో మియావోకి వచ్చిన పుస్తకాలు తీసుకొన్నాక, నన్ను పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్ళి మోనాస్టరీలో ఉంటున్నట్లుగా తెలియజేశాడు.

తిరుగు మార్గంలో 'రాణిగారి సమాధి' ఉన్న కొండపక్కనే ప్రయాణించాం. పొలాలు అన్నీ యాపిల్ తోటలతోనే నిండిపోయాయి. అక్టోబరు నెలలో యాపిల్ పంట పూర్తయ్యాక, శిశిర ఋతువు దాడిచేసి చెట్ల ఆకుల్ని పూర్తిగా రాల్చి నగ్నంగా నిలబెట్టింది. చెట్లు అన్నీ నల్లగా మాడిపోయినట్లుగా కన్పిస్తున్నాయి. వీటిని చూస్తుంటే ఎముకలు బయటపడి, పొట్టలోతుకు పీక్కుపోయి, నరాలన్నీ కనిపిస్తున్నట్లుగా చెక్కిన 'తపస్సు చేస్తున్న గాంధార బుద్ధ' శిల్పం గుర్తుకి వచ్చింది. ఎండిన కొమ్మల్ని కత్తిరించటానికీ, పురుగులు చేసిన గాయాలకి మందులు వేయటానికి రైతులు శ్రమిస్తున్నారు.

గ్రామంలో ప్రతి ఇంటికప్పు మీద తెలుపు రంగులో ఉన్న పావురాయి పక్షుల బొమ్మల్ని పెడుతున్నారు.

"ఇది ఇక్కడి ఆచారమా?" అని అడిగాను.

"పావురాళ్ళు శాంతికి చిహ్నం చైనావారు శాంతి ప్రేమికులు" అని చెప్పి మరలా తానే "జపాన్ వాళ్ళు చైనా మీదికి దండయాత్ర చేసినప్పుడు మాత్రమే చైనా వారు ఆయుధాలు పట్టుకొన్నారు. అంతకు ముందు ఎప్పుడూ యుద్ధాలు చేయలేదు" అన్నాడు.

రెండవ ప్రపంచ యుద్ధంలో చైనా సైన్యాలకి వైద్య సేవలు అందించిన భారతీయుడు డాక్టర్ ద్వారకానాథ్ కోట్నీస్ (1910-1942) గురించి నేను చెప్పగానే "కోట్నీస్‌తో పాటుగా నార్మన్ బెతూన్ (1890-1939) అనే కెనడియన్ డాక్టరు కూడా మాకు చాలా ముఖ్యమే. బెతూన్ మాకు రెండవ చైనా జపాన్ యుద్ధంలో కమ్యూనిష్టు దళాలకి వైద్య సేవలు అందించారు. వీరి పేరు మీద చైనాలో స్మారక భవనాలు కూడా ఉన్నాయి. చైనాకి సహాయం చేసిన వారిని ఎప్పటికీ గుర్తుంచుకొంటారు మా ప్రజలు" అని చెప్పసాగాడు మియావో.

భోజనం అయాక "ఊరి చివర ఉన్న లోయ చాలా

అందంగా ఉంటుంది. రండి చూద్దాం" అంటూ ఒక పెద్ద కెమెరా తీసుకొని దారితీశాడు మియావో.

యాపిల్ పొలాల మధ్యగా ఉన్న దగ్గర దారిలో బయలు దేరాం. ఊపిరి బిగపట్టి భూగర్భంలోని అట్టడుగు తేమ పొరల్ని అందుకోవటానికి ఒంటి కాలి మీద నిలబడి యజ్ఞం చేస్తున్నట్లుగా ఉన్నాయి యాపిల్ చెట్లు. నిజానికి ఈ ప్రాంతాల్లో 'మంచువలనే పంటలు పండుతాయి. వర్షం వలన కాదు'' అని తెలిసింది. వసంతం క్రమంగా కమ్ముకొంటూ వస్తుందనటానికి సాక్ష్యంగా, చిన్న పొదల మీద బులుగు రంగు పువ్వులు మెరిసిపోతున్నాయి.

అది చాలా విశాలమైన లోయ. దానిలోతు రెండువందల అడుగులు ఉంటుంది. అలా క్రమేణా కిందికి వెళ్ళిన లోయ ఒక పెద్ద మైదానాన్ని చేరుకొంటుంది. లోయ అడుగు భాగానికి వెళ్ళి కొన్ని మొక్కలని ఫోటోలు తీస్తూ, "ఔషధాలకి పనికి వచ్చే వివిధ రకాల మొక్కలు ఇక్కడ బాగా దొరుకుతాయి. ఈ కాలిబాటలన్నీ నాటు వైద్యులు ఏర్పాటు చేసినవే" అని చెబుతున్నాడు మియావో. లీబాయ్ మహాకవి (క్రీ.శ. 701-762) సియాన్ ఆస్థానంలో ఉన్నప్పుడు తన గురువుని వెతుక్కొంటూ, ఇలాంటి నదీలోయల్లో తిరిగిన విషయం గుర్తుకొచ్చింది.

లోయ నుండి తిరిగి వస్తుంటే ఒక రైతు చిన్న కావడిలో కుడితిని మోసుకెళుతూ కనిపించాడు. గేదెల కోసమే అనుకొన్నాను.

"ఇది మా మేకల కోసం" అని చెప్పాడు ఆ రైతు.

"మీ ఇంటికి మేమూ వస్తాం, పదండి!" అంటూ అతని భుజం మీద కావడిని నేను అందుకొన్నాను.

"నేను మాంక్‌ని కాబట్టి సంసారుల ఇళ్ళలోనికి వెళ్ళకూడదు. నీవు విదేశీయుడివి కాబట్టి నీతో పాటుగా రావచ్చు" అని చెప్పి నా వెనకే నడిచాడు మియావో.

మోనాస్టరీకి ఉన్న వెనుక రోడ్డులోనే ఆయన ఇల్లు. అది కూడా గుహ ఇల్లే. నా సంతోషానికి అంతులేదు. ముందున్న ఖాళీ స్థలం చుట్టూరా ఎత్తైన గోడ కట్టడం వలన మరీ అందంగా తయారైంది ఆ ప్రాంగణమంతా.

గేటు తీసుకొని లోనికి వెళ్ళగానే కుక్కపిల్లలు మొరిగాయి. గెంతులేస్తున్న మేక పిల్లలు దూరంగా పరుగులు తీశాయి. ఆ రైతు భార్య, కోడలు మమ్మల్ని చూసి గుహ నుండి బయటికి వచ్చారు. రెండు బకెట్ల కుడితిని క్షణాల్లో ఖాళీ చేశాయి ఆ రెండు పెద్ద మేకలు.

"ఇవి రోజుకి రెండు లీటర్ల పాలు ఇస్తాయి తెలుసా?" అంటూ గర్వంగా చెప్పాడు రైతు.

వాటి పొదుగుల్ని చూశాను, నేలని తాకుతున్నాయి. పరుగెత్తే ఆ మేక పిల్లల్ని పట్టుకొని ముద్దాడకుండా ఉండలేక పోయాను.

"ఇక్కడ పశువులు కనిపించటం లేదు. ఎందుకని?"

"వ్యవసాయం పనులన్నీ యంత్రాలే చేస్తున్నాయి. పశువులని పెంచుకుందామంటే వాటికి పచ్చగడ్డి, మేత దొరకటం కష్టం. ఆ గడ్డి కోసం ఖర్చు పెట్టే డబ్బుతో యాపిల్ తోటలు పండించుకొంటే చాలా లాభం. అందు వలన పాలకోసం మాత్రమే ఈ మేకల్ని పెంచుకొంటున్నాం" అని వివరణ ఇచ్చాడు రైతు.

యవతోంగ్ లోపలికి వెళ్ళగానే మావో క్యాలండర్ కనిపించింది. ఆ మట్టి గోడలకు చిన్న గూడు లాంటివి చెక్కివాటినే అల్మరాలుగా వాడుకొంటున్నారు. ఇటుకలతో కట్టిన వారి మంచం మీద నేను పడుకొని అటూ, ఇటూ దొర్లుతూ ఉంటే ఆ ముసలమ్మ చూసి తెగ నవ్వుకొంది.

మొదటి రోజు సాయంత్రం మేము చూచిన గుహల వద్దకి అప్పుడప్పుడూ వెళుతుండేవాడిని. అక్కడ కొత్తగా సిమెంట్ స్లాబ్ ఇళ్ళు కడుతున్నారు. కాబట్టి ఎప్పుడు వెళ్ళినా పదిమంది ఉండేవారు. అందువలన వారితో ఏదో ఒకటి మాట్లాడవచ్చు. మోనాస్టరీలో ప్రతి రోజు మాకు రెండు మూడు యాపిల్ లేదా బత్తాయి పళ్ళు వగైరా ఇస్తుండేవారు. వాటిల్లో కొన్ని మిగుల్చుకొని ఈ యవతోంగ్ వద్ద ఉన్న చిన్న పిల్లలకి ఇస్తుండేవాడిని. వాళ్ళు నన్ను 'హిందూ యేయే' (ఇండియా తాత) అని పిలిచేవారు.

తియోఫోసి మోనాస్టరీ ఒక ప్రశాంతమైన ప్రదేశం. అక్కడ ప్రస్తుతానికి 15-20 మంది కంటే ఎక్కువ భిక్షువులు లేరు. ఈ ఆలయాన్ని మొదటగా సుయ్ వంశపు రాజుల కాలం (క్రీ.శ. 581-619)లో నిర్మించారు. తరువాత వచ్చిన మింగ్ రాజుల కాలం నాటికి ఇక్కడ వెయ్యిమంది భిక్షువులు నివసించేవారు. చెక్కతో నిర్మంచబడ్డ ఆలయం కాబట్టి ఒక అగ్ని ప్రమాదంలో ఆలయం అంతా కాలిపోతుంది. ఇనుముతో పోతపోసిన ఏడు అడుగుల బుద్ధ విగ్రహం తప్ప అంతా అగ్నికి ఆహుతి అవటంతో, ఆ విగ్రహాన్ని జాగ్రత్తగా దాచిపెట్టి, కాలిపోయిన ఆలయ

పునాదుల మీదే మరో చిన్న ఆలయాన్ని నిర్మించి దానిలో ఈ ఇనుప బుద్ధ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించి దానికి 'తియోఫోసి' (ఇనుప బుద్ధాలయం) అని నామకరణం చేశారు. సిల్కు రూట్‌కి ఆనుకొనే ఉంది కాబట్టి ఈ ఆలయానికి యాత్రికుల రద్దీ ఎక్కువకాగా, దీని ప్రాముఖ్యత క్రమేణా పెరిగిపోయి చుట్టూతా చిన్న గ్రామం ఏర్పడుతుంది. 1941వ సం॥లో జువాంగ్‌జి అనే పెకింగ్ భిక్షువు చేసిన కృషి వలన ఇక్కడ కొత్త భవనాలు, శిల్పాలు అలంకరణలూ అన్నీ ఏర్పడ్డాయి.

వెన్నెల రాత్రుళ్ళు నేను ఒక్కడినే ఆ ఎత్తైన రంగు రంగుల భవనాల మధ్యలో తిరుగుతూ ఉంటే, నేపాల్ బౌద్ధనాథ ఆలయంలో రాహుల్ సాంకృత్యాయన్ రహస్యంగా గడిపిన రోజులు గుర్తుకి వచ్చేవి.

మియావో బ్రహ్మచారి, చాలా మంచివాడు. ఆయనకి జపనీస్, ఇంగ్లీషు, ఎస్పరాంటో, భాషలు కూడా వచ్చు. ఈసారి నేను చైనా వెళితే ఇద్దరం కలిసి లాసా వెళదామని ప్రణాళిక వేసుకొన్నాం. ఈయన పక్కనుంటే నాకు ఏ సమస్యా ఉండదు అనిపించింది. మియావో ఇక్కడికి వచ్చి నాలుగు సంవత్సరాలే అయిందట.

గ్రామంలో వారానికి రెండు సార్లు సంత జరుగుతుంది. ఉదయాన్నే ఇద్దరం బయలు దేరాం. విశాలంగా ఉన్న ఆ సిల్కు మార్గంలోనే వ్యాపారస్థులు అందరూ ఒక పద్ధతిగా సామానులు అమర్చుకొంటారు. ఎక్కువగా స్త్రీలే వ్యాపారం చేస్తుంటారు. ఆటోరిక్షా లాంటి వాహనంమీదే వారి సరుకులన్నీ అందంగా అమర్చుకొన్నారు. కేకలు వేయటం, గొడవ అలాంటివి ఏవీ ఉండవు, అన్ని పనులూ మౌనంగానే జరుగుతుంటాయి.

యాపిల్ మొక్కలు అమ్ముతున్న రైతులు, భవనాల నీడలో గుంపులుగా చేరిపోయారు. డిజిటల్ తూకాలతో పాటుగా పాత కాలంనాటి ఒంటి తక్కెట, ఇనుపగుండు కూడా అమల్లో ఉన్నాయి. బంగారు పళ్ళ తొడుగులు ఇంకా వాడుతున్నారు. ఒక పంటి డాక్టరు రోడ్డు మీదే ఆపరేషన్లు మొదలు పెట్టాడు. ఆయుర్వేద మందులమ్మే దుకాణాల్లో రద్దీ బాగానే ఉంది. పందిమాంసం అమ్ముతున్న ఒక వ్యాపారి చెరుకుగడ నములుతూనే బేరగాళ్ళని పిలుస్తున్నాడు. వ్యవసాయ పరికరాలు, కూరగాయలు అమ్మే దుకాణాలే ఎక్కువ. సాంప్రదాయ దుస్తులు ధరించిన వారు ఒక్కరూ కనిపించరు. అందరూ జీన్స్, కోట్లు వేసుకొన్నవారే. చలిని తట్టుకొంటూ పనిచేసుకు పోవాలంటే ఇవే సరైన దుస్తులు.

పెద్ద ఎర్రటి యాపిల్ కాయలంత బుగ్గలతో చిన్నపిల్లలు ఎంతో ముద్దొస్తున్నారు. ఎవరికైనా ముద్దు చేద్దామని వారి దగ్గరగా జరిగే లోపుగానే నన్ను చూసి ఏడుపులంకించు కొంటున్నారు.

ఒక చిన్న అందమైన పాపని ఎత్తుకొని ఉన్న అమ్మాయి నా అవస్థ చూసి నవ్వింది. 'నీహావ్' అంటూ ముందుకెళ్ళి, 'ఈ పాప మీ చెల్లెలా?' అని అడిగాను.

"కాదు" అంది.

"అయితే మీకు పెళ్ళి అయిందన్న మాట!"

ఇంతలో మియావో అందుకొని 'సార్, ఈమెకి 12 సంవత్సరాల కొడుకు కూడా ఉన్నాడట' అని చెప్పి నన్ను ఆశ్చర్యపరిచాడు. సంతలో కూరగాయలు అమ్మటానికి వచ్చిన తన అమ్మగారికి తోడుగా వచ్చిందట ఈ 35 సంవత్సరాల పిల్ల.

"పొట్టిగా, పసుపు రంగు ముఖంతో కన్పిస్తున్న చైనా వారి వయసుని అంచనా వేయటం చాలా కష్టమే" అన్నాను.

"వయసునే కాదు, వారి శక్తిని అంచనా వేయటం కూడా కష్టమే" అని తేల్చివేశాడు మిత్రుడు.

గ్రేట్‌వాల్‌ని చూడటం కంటే, దాన్ని నిర్మించిన గ్రేట్ పీపుల్‌ని చూడటం, వారితో కలిసి పోవటం చాలా ముఖ్యం అని పించింది నాకు. తల చుట్టూ తెల్ల రిబ్బను కట్టుకొన్న కొందరిని చూశాను. దగ్గర బంధువులు మరణించినప్పుడు సానుభూతి కోసం అలా చేస్తారట.

పొగాకు చూరని అమ్ముతున్న దుకాణాలు కూడా ఉన్నాయి. చైనాలో పొగ తాగటం ఎక్కువ. దాంతో వారికి పంటి సమస్యలు కూడా ఎక్కువే.

"చైనా వారికి ఇది పెద్ద దురలవాటు, గతంలో ఈ అలవాటు వలన చైనా ప్రజలు చాలా నష్టపోయారు!"

"అది ఎలా జరిగింది?"

"17వ శతాబ్దంలో బ్రిటీషువారు చైనాతో వ్యాపారం మొదలు పెట్టాక, నల్లమందు Opium ని పొగాకుతో కలిపి ఉపయోగించటం ఎలాగో నేర్పారు. దాంతో చైనా మొత్తం నల్లమందుకి బానిసై పోయింది. ప్రభుత్వం నల్లమందు అమ్మకాల్ని, దిగుమతుల్ని నిషేధించేసరికి, బ్రిటీషువారు చైనాతో యుద్ధం చేశారు" అని చెప్పాడు మియావో.

నిజమే క్రీ.శ. 1839-42 సం॥లో జరిగిన మొదటి

నల్లమందు యుద్ధంలో బ్రిటీషువారు చైనాని ఓడించి తమ వ్యాపారాన్ని మరింత సుస్థిరం చేసుకొన్నారు. రెండోసారి జరిగిన నల్లమందు యుద్ధం (క్రీ.శ. 1856–60) కూడా ఆంగ్లేయులకే లాభం చేకూర్చింది.

చరిత్ర పాఠాలు గుర్తుకి వస్తున్నాయి. అసలు రహస్యం ఏమిటంటే బ్రిటీషువారు చైనా నుండి దిగుమతి చేసుకొంటున్న తేయాకుకి సమాన స్థాయిలో నల్లమందు చైనావారికి రహస్యంగా అమ్మేవారు. పైగా ఈ నల్లమందుని పండించేది బీహార్‌లో ఉన్న ఈస్ట్ ఇండియా కంపెనీ వారే.

సంతలో తిరుగుతూ అన్నీ చూశాను కానీ, మనం చెప్పుకొనే మాంసాహార దుకాణాలు అంటే పాములు, కప్పలు అమ్మటాన్ని ఎక్కడా చూడలేదు. కుతూహలాన్ని ఆపుకోలేక అడిగాను మియావోని.

“మీరు అనుకొన్నట్లుగా చైనాలో అన్ని చోట్లా వాటిని అమ్మరు. కేవలం దక్షిణ చైనాలోని కాంటన్ ప్రాంతాల్లోనే అలాంటి వ్యాపారం జరుగుతుంది” అని వివరించాడు.

ఒకసారి తాను కాంటన్‌లోని మార్కెట్‌కి వెళ్ళి ఒక పెద్ద పాముని కొని, దాన్ని తీసుకెళ్ళి అడవిలో వదలిపెట్టిన విషయం చెప్పాడు. చైనా, జపాన్ దేశాల్లోని బౌద్ధమతస్థులు పుణ్యంకోసం ఇలాగచేస్తుంటారు. అంటే మార్కెట్‌లో అమ్ముతున్న చేపల్ని, పాముల్ని, కప్పల్ని డబ్బుతో కొని వాటిని తీసుకెళ్ళి దూరంగా అడవుల్లో వదలి వేసి, వాటికి స్వేచ్ఛను ప్రసాదించటం ద్వారా పుణ్యాన్ని సంపాదించుకొంటారు. “చలికాలంలో కుక్క మాంసం తింటే ఆరోగ్యానికి మంచిది”



రచయిత - లియాంద్రో!

అనే నమ్మకం ఇంకా సామాన్య ప్రజల్లో ఉన్నందుకు మియావో బాధపడ్డాడు.

మోనాస్టరీలోని మొక్కలకి ప్రతి ఉదయం నీళ్ళు పోయటం ఒక పనిగా పెట్టుకొన్నాను. ఇది తెలుసుకున్న మియావో నన్ను పిలిచి “అమితాబో! ఇక్కడ బాత్‌రూముల్లోకి సరిగా నీళ్ళు అందటం లేదని తెలుసుకదా! దయ ఉంచి ఈ కార్యక్రమాన్ని మానుకొని, ఉదయం పూట మందిరంలో జరిగే ప్రార్థనకి రండి, అన్ని విషయాలూ అమితాబో చూసుకొంటాడు” అని చెప్పాడు.

నేను ప్రార్థనకి వెళ్ళలేదు కానీ, లైబ్రరీకి వెళ్ళేవాడిని. అక్కడ నేను చదివిన పుస్తకాల్లో XU-XIAKE రాసిన *Travel Notes* బాగా నచ్చింది. అలాగే XU GUANG QI రాసిన *The Complete Book of Agriculture* కూడా చాలా విషయాలని తెలియజేసింది. 16వ శతాబ్దంలో రాసిన ఈ రెండు పుస్తకాలు ‘నదులు–వ్యవసాయ పద్ధతుల’ గురించి చైనా రైతులకి ఎంతో విజ్ఞానాన్ని అందించాయని తెలుసుకొన్నాను. చైనా కమ్యూనిష్టు పార్టీ గురించి Edgar Snow రాసిన Red Star Over China అనే పుస్తకంలో మావో యువకుడిగా ఉన్నప్పటి ఫోటోలు చాలా బాగున్నాయి.

నేను ఇండియాలో బయల్దేరే ముందుగానే మియావో సలహా మేరకి మా విద్యార్థులచేత బుద్ధుని జీవితం గురించి పెయింటింగులు వేయించి నాతో పాటు తీసుకెళ్ళాను. అడుగున్నర పొడవూ, అడుగు వెడల్పుగా ఉన్న ఆ చిన్న బొమ్మలతో తియోఫోసి మోనాస్టరీలో ఒక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయటం మా ఉద్దేశం. ఒక సాయంకాలం ఆ చిత్రాల్ని చూడటానికి వచ్చిన ఇద్దరు లోకల్ ఆర్టిస్టులు వచ్చారు. ‘రేపు మనం షో ఏర్పాటు చేయాలి’ అని కోరేసరికి వారిద్దరూ ఆ రాత్రికి ఉండిపోయి, ఉదయాన్నే పని మొదలు పెట్టి పదిగంటలకల్లా ప్రదర్శన సిద్ధం చేశాం. చాలామంది స్థానికులకి ముందుగానే చెప్పటం వలన బొమ్మలు చూడటానికి ప్రజలు వరుసగా అలా వస్తూనే ఉన్నారు.

ఇంకావుంది...

ప్రొఫెసర్ ఎమ్. ఆదినారాయణ
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం.
ఫోన్ : 9849883570

# వంశధారా సంస్కృతి

- దామెర వేంకటసూర్యారావు

**మ**ట్టికి, మనిషికి ఆధారం జలమని ఉపనిషద్వాక్యం. "అపోవా ఇదగమ్ సర్వం ..." అనే వేద వచనాన్ని అనుసరించి సకల దేవతలు, సకలలోకాలు ఉదక స్వరూపాలై, ఉదకాధారాలై ఉంటారని తెలుస్తోంది. ఉదకం నదీరూపంలో ఈ దేశంలో ప్రవహిస్తోంది. 'పుణ్యనదులు' అనే భావన భారతీయులదే. పూర్వకాలంలో నదీస్నానంతోనే మానవుని దినచర్య ప్రారంభమయ్యేది. 'అప్పిచ్చు వాడు వైద్యుడు, ఎప్పుడు నెడతెగక పారు ఏరును. ఉన్న ఊళ్ళోనే ఉండమన్నాడు సుమతీ శతకకారుడు నదిలేని ఊరు వాసయోగ్యం కాదని భావం. ప్రపంచంలో ఎక్కడైనా నదీతీరాలు నాగరికతలకు పుట్టిళ్ళు. నాగరికత అంటే భాష, సంస్కృతి, సాహిత్యం, సాంఘిక పరిస్థితులు, సహజవనరులు భారతదేశంలో చాలాపుణ్యక్షేత్రాలు నదీతీరాల్లో వెలిశాయి. వివిధ నదీ ప్రాంతాల్లో విలక్షణ సాంస్కృతిక జీవనం గోచరిస్తుంది.

భారతదేశంలోని నదులను దాటి పుట్టుకనుబట్టి హిమాలయనదులు, ద్వీపకల్పనదులుగా విభజించారు. ద్వీపకల్ప నదుల్లో తూర్పుగా బంగాళాఖాతంలో కలిసేవి నదులు. పశ్చిమంగా ప్రవహించి అరేబియా సముద్రంలో కలిసేవి నదాలు. బంగాళఖాతంలో కలిసేనదుల్లో పెద్ద నదులన్నీ పశ్చిమ కనుమల్లో పుట్టాయి. తూర్పు కనుమల్లో పుట్టి ఉత్తరాంధ్ర ప్రాంతానికి జలవనరులుగా ఉన్న నదులున్నాయి. వీటిలో పెద్దది వంశధార.

**వంశధార పుట్టుక - ప్రవాహం :**

ఒడిశా రాష్ట్రంలో జయపురం కొండల్లో పుట్టింది వంశధార. వంశమంటే వెదురు. కొండల్లోంచి వెదురు అడవుల్లోంచి ప్రవహించడం వల్ల 'వంశధార' అయింది. ఒడిశాలో 96 కి.మీ. పొడవున ప్రవహించిన వంశధార పాతపట్నం వద్ద ఆంధ్ర భూభాగంలో ప్రవేశిస్తుంది. శ్రీకాకుళం జిల్లాలో దీని పొడవు 128 కి.మీ. మొత్తం 224 కి.మీ పొడవుగల ఈ నది కళింగపట్నం వద్ద సముద్రంలో కలుస్తుంది. ఈ నదీపరివాహక ప్రాంతం 11,400 చ॥ కి.మీ. 4,400 చ॥ కి.మీ. ప్రాంతంలో కురిసే వర్షపునీరు ఈ నదిలో చేరుతుందని నీటిపారుదల శాఖ చెబుతోంది. ఈ నదిపై ఆనకట్ట నిర్మించాలని ఈస్ట్ ఇండియా కంపెనీ తలపెట్టినా స్థానిక జమీందార్లు అడ్డు తగలడంతో అది కార్యరూపం దాల్చలేదు. స్వాతంత్ర్యానంతరం 1948లో జమీందారీలు రద్దయ్యాక శాశ్వత ప్రాతిపదికన కరువు నివారణ లక్ష్యంగా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పథకాలు రూపుదిద్దుకొని ఎట్టకేలకు 1970లో నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. మొదటి దశలో గొట్టం బ్యారేజి, రెండోదశలో నేరడా బ్యారేజి నిర్మాణమై వేల హెక్టార్ల భూమి జలసమృద్ధితో సాగులోనికి వచ్చింది.

**కళింగం :** వంశధారానదీ పరీవాహక ప్రాంతం చారిత్రకంగా 'కళింగ' రాజ్యం. రామాయణ, మహాభారతాల్లో 'కళింగ'గా పేర్కొనబడింది. బౌద్ధ వాఙ్మయంలో 'కలింగరట్ట' ప్రసక్తి ఉంది. కౌటిల్యుని అర్థశాస్త్రంలో 'కళింగాంగ గజాః శ్రేష్ఠా' - కళింగ అంగ దేశముల గజములు శ్రేష్ఠములని



వంశధార

చెప్పబడింది. తరువాతి కాలంలో ఇచ్చటి రాజులని గజపతులని వ్యవహరించడం జరిగింది. వంశధార నదీ ప్రాంతంలోని పర్లాకిమిడి జమీందార్లు గజపతులే. ప్రాచీన గాంగ రాజులలో మొదటి ఇంద్రవర్మ తాను త్రికళింగాధి పతినని చెప్పుకొన్నాడు. ఉత్తర కళింగం, మధ్య కళింగం, దక్షిణ కళింగం, అనే మూడు విభాగాలను కొందరు చరిత్రకారులు పేర్కొన్నారు. గంజాం శ్రీకాకుళాల మధ్య గల ప్రాంతం మధ్య కళింగంగా భావించారు. కళింగరాజ్యంలో పాలనా విభాగాలను 'విషయములు'గా వ్యవహరించేవారు. వరాహ వర్తని అనే విషయం వంశధారానదీ ప్రాంతంలో కళింగ మండలంలో చేరిన విభాగంగా శాసనం వల్ల అర్థమవుతుంది. ఇందులో సాగర ఖొన్న అనే ఉపవిభాగం నేటి కళింగం పట్నంతో కూడిన సముద్ర తీర గ్రామాలతో కూడి ఉండేదని తెలుస్తోంది. ఈ విషయం ప్రధానంగా వంశధారానదికి ఇరువైపుల ఉన్న శ్రీకాకుళం, నరసన్నపేట తాలూకాల్లో వ్యాపించి ఉండేదని చెప్పవచ్చు. క్రోష్టుకీ వర్తని అనే విషయం నరసన్నపేట, పాతపట్నం తాలూకాల్లో వ్యాపించిన విభాగంగా గుర్తిస్తున్నారు. గోరసత్త అనేవిషయం పాతపట్నం సమీపంలో వంశధారతీరంలోని 35 గ్రామాల పాలనా విభాగమని తెలుస్తోంది.

**జయపురం – విక్రమదేవ వర్మ :** వంశధారానది ప్రభవించిన జయపురం ఓఢ్ర జమీందారీ విశ్వంభరదేవ్, రఘునాథకృష్ణ దేవా మొదలైన వారు జమీందార్లుగా వ్యవహరించారు. అనంతరకాలంలో విక్రమ దేవవర్మకి సంస్థానం సంక్రమించింది. ఈయన మాతృ భాష ఓఢ్రమైనా తెలుగు భాషపై మక్కువతో అభ్యసించి మానవతీచరితము, కృష్ణార్జున చరితము వంటి గ్రంథాలు వ్రాసారు. ఈయన కవిపండిత పోషకుడు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి భూరి విరాళం ఇచ్చారు. విశాఖపట్నం ఆంధ్రవిశ్వకళా పరిషత్తులోని "సైన్సటెక్నాలజీ' కళాశాలకు ఆయన పేరు పెట్టారు. కళాశాల ప్రాంగణంలో ఆయన కాంస్య విగ్రహం ఉంది. విక్రమ దేవవర్మ 1890లో జన్మించి 1956లో మరణించారు.

**గిడుగు రామమూర్తి :** గిడుగు వెంకట రామమూర్తి గారికి వ్యావహారిక భాషాపదంతో ఎంత సంబంధం ఉందో వంశధారనదీ ప్రాంతంలోనూ అంతసాన్నిహిత్యం ఉంది. రామమూర్తి వంశధార నదీతీరంలోని పర్వతాల పేటలో



శ్రీముఖలింగం

జన్మించారు. ఈ గ్రామం శ్రీముఖలింగ క్షేత్రానికి సమీపంలో ఉంది. వంశధారా నదికి ఆవలివైపున గల నగిరికటకం గ్రామంలో ఉండే జయపుర సంస్థాన ప్రభువు కుమారుడు విక్రమదేవవర్మ, రామమూర్తి ప్రాణమిత్రులుగా వంశధారాతీరంలో తమ బాల్యాన్ని గడిపారు. వ్యావహారిక భాషా వాదానికి మూల పురుషుడుగా నిలిచారు. శిష్ట వ్యావహారిక భాషను గ్రంథ రచనా భాషగా విద్యార్థులు పరీక్షలు రాసే భాషగా చేయడానికి నిర్విరామకృషి చేశారు. *బాల కవిశరణ్యం, పండిత భిషక్కుల భాషా భేషజం* మొదలైన గ్రంథాలు వ్రాశారు.

పర్లాకిమిడి ప్రాంతంలోని సవరలనే గిరిజన తెగ వారితో పరిచయం పెంచుకొని వారి భాషనేర్చుకొని వారిపాటలు, కథలు గ్రంథస్థం చేశారు. సవర భాషావాచకం, నిఘంటువు రూపొందించారు. శాసన పరిశోధనలోనూ గిడుగు వారు అద్వితీయమైన కృషి చేశారు. శ్రీముఖలింగ క్షేత్రంలోని దేవాలయం గోడలపై గల శాసనాలు ఆయన దృష్టిని ఆకర్షించాయి. ఇంకా వంశధారా తీరంలోని తెలిగి పెంట శాసనం, దీర్ఘసి శాసనం మొదలయిన శాసనాలను అధ్యయనం చేసి *'ఎపిగ్రాఫికా ఇండికా*లో వ్యాసం వ్రాశారు. *'ఆంటిక్విటీస్ ఆఫ్ ముఖలింగ'* అనే ఒక చిన్న గ్రంథం కూడా ప్రకటించారు. పర్లాకిమిడి రాజా పర్లాకిమిడి తాలూకా నంతటినీ ఒరిస్సా రాష్ట్రంలో చేర్పించాలని ప్రయత్నించినపుడు రామమూర్తి ప్రతిఘటించి న్యాయపోరాటం చేసి 700 గ్రామాలు ఆంధ్ర ప్రాంతంలో ఉండేలా చేయగలిగారు. పర్లాకిమిడి పట్టణం 1936లో ఒరిస్సాలో కలపగానే నిరసనగా పర్లాకిమిడి రాజు కొలువులో ఉద్యోగం వదులుకొని ఊరు దాటి వచ్చేశారు.



వంశధార నది ఒడ్డున సైకత శివలింగం

**శ్రీముఖలింగం :** పాతపట్నం వద్ద ఆంధ్రదేశంలో ప్రవేశించిన వంశధార తూర్పుగా ప్రవహిస్తున్నపుడు నదీ తీరంలో వెలసిన ప్రముఖ క్షేత్రం శ్రీముఖలింగం. ఇది ప్రాచీనాలయం. ఒకప్పుడు గంగరాజుల రాజధానిగా ఉండే శ్రీముఖలింగం గ్రామంలో క్రీ॥శ 8వ శతాబ్దంలో బిక దిన కౌమార్ణవుడనే రాజు ఆలయం నిర్మించాడని, కాలక్రమాన అది శిథిలంకాగా 14వ శతాబ్దంలో పర్లాకిమిడి ప్రభువు శ్రీవిష్ణువర్ధన మధుకర్ణ గజపతి పునరుద్ధరించాడని చరిత్ర చెబుతోంది. కాని స్థలపురాణం మాత్రం ఇది అగస్త్యముని కాలంలో నిర్మించబడిందని పేర్కొంటుంది. ఈ గ్రామం మొదటి పేరు జయంతపురమని కొందరు పేర్కొన్నారు.

ఇక్కడ శివుడు మధుకేశ్వరుడు. లింగమునందు ముఖం ధరించి చిత్రకళ అనే భక్తురాలికి మధుకేశ్వరుడు ప్రత్యక్షం కావడం వల్ల ముఖలింగేశ్వరుడని వ్యవహరిస్తారు. ఈ ఆలయం తూర్పుముఖంగా ఉంది. ఆలయద్వారంపై గల శిల్పచాతుర్యం అద్భుతమైనది. ముఖద్వారం ఇరుప్రక్కల గంగాదేవి మొసలిమీద, యమునాదేవి తాబేలు మీద కలశాలు పట్టుకొని నిల్చున్నట్టు మలచిన శిల్పం, ఏకాదశరుద్రుల శిల్పాలు, పార్వతీ పరమేశ్వరుల జూదవినోదశిల్పం, ప్రధాన గోపురానికి నలువైపులాగల యోగీశ్వరుల ప్రతిమలు సందర్శకులను ఆశ్చర్యంలో ముంచెత్తుతాయి. అద్భుత శిల్పంతో కనిపించే ఈ ఆలయప్రాంతం ఒకప్పుడు బౌద్ధ ధర్మ ప్రభావం కలిగి ఉండేదని కొన్ని శిల్పాలు, చిత్రాలు మనకు తెలియ జేస్తున్నాయి. శైవం విజృంభించి బౌద్ధం వెనుకబడిన కాలంలో బౌద్ధారామాలు శివాలయాలుగా మార్చివేయ బడినవని కొందరు చరిత్రకారుల కథనం.

శ్రీముఖలింగంలో మరొక ఆలయం భీమేశ్వరాలయం. ఇది 11వ శతాబ్దం నాటి ఆలయంగా చెబుతున్నారు. ఇక్కడ లింగం పెద్దగా స్తూపాకారంగా ఉంది. ఇక్కడి శాసనాల్లోని పేర్లన్నీ 'అనీయంక' అనే బిరుద వాచకాన్ని కలిగి ఉన్నాయి. ఈ ఆలయంలో ఒకే పీఠం మీద రెండు నందులుండటం విశేషం. ఒక విగ్రహాన్ని ఆంధ్రశిల్పులు, మరొక దాన్ని ఓఢ్ర శిల్పులు మలిచారని తెలుస్తోంది.

శ్రీముఖలింగంలోని మరొక ఆలయం సోమేశ్వర ఆలయం. ఈ ఆలయాన్ని గాంగవంశపురాజు హస్తివర్మ క్రీ.శ. 573లో ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది.

గిడుగు రామమూర్తి గాంగుల రాజధానియైన కళింగనగరం శ్రీముఖలింగమేగాని రేవు పట్టణమైన కళింగపట్నం కాదని వివరించారు. దీనికి చారిత్రకాధారాలు చూపారు.

**నగిరి కటకం :** శ్రీముఖలింగానికి దక్షిణంగా 3 కి.మీ దూరంలో ఉన్న ఈ గ్రామం చారిత్రకంగా ప్రాముఖ్యం గలది. 'కటక్' అనే మాటకు ఒరియా భాషలో రాజ గృహమని అర్థం. రాజకుటుంబీకుల నివాస ప్రాంతంగా ఇది ఉండేదని తెలుస్తోంది.

ముఖలింగానికి తూర్పున గల పద్మనాభ పర్వతం అడుగుభాగం నుంచి నీరు పైకి వచ్చేదని, ఇక్కడ 'నంది' గుర్తుగల నాణాలు లభించాయని చరిత్రకారులు పేర్కొన్నారు. ముఖలింగానికి 13 కి.మీ దూరంలోని దంత వక్త్రుని కోట శిథిలాల్లో నాణాలు దొరికాయని, ఇవి సంగ్రహించిన పేదలు ఎందరో ధనవంతులయ్యారని ఈ ప్రాంతంలో చెప్పుకొనే వారు. వంశధార నదికి సమీపగ్రామమైన తెలిగపెంట గ్రామంలో తూర్పు చాళుక్య లక్షణాలు కలిగిన శాసనాలు బయటపడ్డాయి. త్రిలింగ వాటికకు వికృతరూపం తెలిగపెంట అని భావిస్తున్నారు.

**దీర్ఘాసి :** వంశధార తీరంలో కళింగ పట్నానికి 6 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ రాతిపలక శాసనం దొరికింది. ఇందులో 23 పంక్తులున్నాయి. ఇక్కడ దుర్గ, నంది విగ్రహాల అవశేషాలు లభించాయి. గుట్టలుండే ఈ ప్రాంతాన్ని దుర్గమెట్ట అంటారు.

**ఉర్లాం సంస్థానం :** వంశధార నదీపరీవాహక ప్రాంతంలో

ఉర్లాం, దొంత, హుందం సంస్థానాలున్నాయి. ఉర్లాం పూర్వ నామం ఉరామల్ల, గాంగ వంశానికి చెందిన హస్తివర్మ ఈ గ్రామాన్ని జయశర్మకు దానం చేసినట్లు ఉర్లాం తామ్ర శాసనం పేర్కొంటుంది. గాంగ వంశీకుల శాసనాల్లో ఇది మొదటి శాసనమని చరిత్ర కారుల అభిప్రాయం. ఇది బ్రాహ్మణ జమిందారీ. మొదట కన్నేపల్లి వారు, తర్వాత కందుకూరి వారు దీనికి అధిపతులు. తెలుగు సాహిత్యపోషణలో ఉర్లాం సంస్థానం గొప్ప పాత్ర పోషించింది. చెళ్ళపిళ్ల వేంకట కవి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి మొదలయిన కవిపండితుల స్వీయ చరిత్రల్లో ఈ సంస్థానం ప్రసక్తి కనిపిస్తుంది. ఆ రోజుల్లో ఉర్లాం వేదపరీక్షలకు కేంద్రం. తిరుపతి వేంకటకవుల లాంటి ఎందరో ప్రసిద్ధులు ఈ సంస్థానంలో సత్కారాలు పొందారు. ఉర్లాం జమీందారిణి కందుకూరు మహాలక్ష్మమ్మగారు పంచ కావ్యములు చదివిన విదుషీమణి. ఈ సంస్థానం నుండి విడివడిన దేవిడి (దేవాద) సంస్థానాధిపతులు బాలసూర్య ప్రసాదరావు. నిశ్శంకమహీపాల చరిత్ర, ధన్వంతరి క్షేత్రమాహాత్మ్యం మొదలైన కావ్యాలు రచించారు. ఉర్లాం, దేవిడి సంస్థానాల్లో పేరి కాశీనాథాచార్యులు బి. ఈశ్వరప్ప పంతులు వడ్లమాన లక్ష్మీనృసింహ శాస్త్రి మొదలైన ఆస్థాన కవులుండేవారు. ఉర్లాం కందుకూరి కుటుంబానికి చెందిన శివానందమూర్తి 'సద్గురు'వులుగా ప్రసిద్ధికెక్కి భీమునిపట్నం ఆనందవనం కేంద్రంగా ధార్మిక ప్రచారం సాగిస్తున్నారు.

దొంత హుండాం చిన్న ఎస్టేటు. దీని పాలకులు త్రిపురానవారు. వీరు కవిపండిత పోషకులు. త్రిపురాన తమ్మయ దొర, సూర్య ప్రసాద రాయకవి గ్రంథ రచన చేశారు. సూర్య ప్రసాదరాయ కవికి ఆంధ్రవిశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదం ప్రదానం చేసింది. వీరి ఆస్థానకవి ముక్కవిల్లి సాంబయ్య శాస్త్రి.

**పోలాక-నాటకం :** వంశధార ప్రవహించే మార్గంలో ఒక పెద్ద గ్రామం పోలాక. ఈ గ్రామం నుండి 1923లో 'నాటక కళ' అనే తొట్టతొలి తెలుగు నాటక విమర్శకు సంబంధించిన పత్రిక వెలువడిందని, కవిరాజు మల్లాది విశ్వనాథ శర్మగారు 'ఆంధ్ర నాటక కళాపరిషత్తు' స్థాపించారని, బుర్రా శేషగిరి రావు అధ్యక్షతన పోలాకలో ఆంధ్ర నాటక పరిషత్ ఉత్సవం జరిగిందని డా॥ యు.ఎ. నరసింహమూర్తి వ్యాసం వల్ల తెలుస్తోంది. పోలాక గ్రామానికి చెందిన మల్లాది విశ్వనాథ శర్మ, వారి కుమారుడు మల్లాది సూర్యనారాయణ అవధాని, వారి సోదరుడు మల్లాది వేంకట కృష్ణశర్మ తెలుగు నాటక రంగానికి ఎనలేని సేవచేశారు. విశ్వనాథ శర్మ విజయనగర కళాశాలలో ఉపన్యాస కులుగా పనిచేశారు. ఆయన చాలా నాటికలు రాశారు. *దొంగాటకం, దొంకలో షరాబు, కిర్రుగానుగ* మొదలైనవి ప్రదర్శన పరంగా ఉత్తమమైనవి. గూడవల్లి రామ బ్రహ్మం *'రైతుబిడ్డ'* చిత్రం సంభాషణా రచయిత ల్లో వీరు కూడ ఒకరు.



శ్రీకూర్మం దేవాలయం

**శ్రీకూర్మం :** వంశధారా నదీ ప్రస్తావన వినగానే గుర్తుకు వచ్చే మరొక పుణ్యస్థలం శ్రీకూర్మ క్షేత్రం. శ్రీకాకుళానికి ఆగ్నేయంగా 14 కి.మీల దూరంలో ఉంది. ఒకప్పుడు ఆ ప్రాంతాన్ని శ్వేత చక్రవర్తి పాలిస్తుండే వాడు. ఆయన భార్య విష్ణు ప్రియ గొప్ప భక్తురాలు. ఒక పర్యాయం ఆమె ఏకాదశీ వ్రతం తలపెట్టింది. ఆమె వ్రత నిష్ఠలో ఉండగా కామోద్రేకంలో రాజు అంతఃపురంలోనికి వచ్చాడు. ఇది గ్రహించిన రాణి తనను రక్షించమని కూర్మ రూపంలో భూమిని రక్షిస్తున్న శ్రీమహావిష్ణువును ప్రార్థించగా, విష్ణు మహిమవలన ఆ దంపతుల మధ్య ఒక నది ప్రవహించింది. రాజు భయంతో దూరంగా పారిపోయాడు. ఆ నదియే అనంతరకాలంలో వంశధారగా ప్రఖ్యాతమైందని ఇక్కడి స్థల పురాణం చెబుతోంది.

ఈ ఆలయం తూర్పు గాంగ దేవుని (క్రీ.శ 1078-1148) కాలంలో నిర్మాణమైనట్లు చారిత్రకాధారలున్నాయి. ఈ ఆలయంలో అనేక శాసనాలున్నాయి. క్రీ॥శ. 1178లో సింహళ దేశానికి చెందిన గాయని భాగలదేవి శ్రీకూర్మనాథునికి అఖండ దీపం నిలిపి అమూల్యాభరణాలు ఇచ్చినట్లు ఒక శాసనం వివరిస్తోంది. క్రీ॥శ. 1273 నాటి ఒక శాసనం మహాభారతాంధ్రీకరణాన్ని పేర్కొంటోంది. ఈ ఆలయంలో నరహరి తీర్థులనే వైష్ణవ గురువు ఉండేవారని, తెలుస్తోంది. క్రీ॥శ. 1512లో శ్రీచైతన్య ప్రభువు ఈ ఆలయాన్ని సందర్శిం చాడని చెబుతారు. ఇది వైష్ణవ క్షేత్రమైనా దీనికి సమీపం లో

సుందరేశ్వర, కర్పూరేశ్వర, కోటీశ్వర, హటం కేశ్వర, పాతాళ సిద్ధేశ్వర లింగాలుండటం వల్ల దీనిని పంచ లింగాత్మక క్షేత్రమని భావిస్తారు. శ్రీకూర్మనాథ స్వామి ఆలయం మతపరం గానే గాక, శిల్ప కళావైభవానికి కూడా కాణాచి.

**శాలిహుండం :** ఆంధ్రదేశంలో బౌద్ధ వైభవాన్ని ముచ్చటించే సందర్భంలో శాలిహుండం పేరు ప్రస్తావించకపోతే అది అసమగ్రమే. ఈ చారిత్రక స్థలంలో క్రీ॥శ 1919లో పురావస్తు శాస్త్రజ్ఞులు లాంగ్ హర్స్ట్, టి.ఎన్ రామచంద్రన్, రాయప్రోలు సుబ్రహ్మణ్యం పరిశోధనలు జరిపి క్రీ॥శ. 2-7 శతాబ్దాల మధ్య విరాజిల్లిన బౌద్ధ సంప్రదాయాలను, శిల్పకళను చారిత్రక అవశేషాలను వెలికితీసి అమూల్యమైన సమాచారం అందించారు. హుయాన్ త్సాంగ్ అనే చైనా బౌద్ధ యాత్రికుడు ఈ ప్రదేశాన్ని దర్శించాడని చెప్పడానికి చాలా ఆధారాలు చరిత్రకారులు పేర్కొన్నారు. 'శాలి' అనగా వరి అని 'హుండం' అంటే కొండ అని వరి పండించే కొండ ప్రాంతమని కొందరు భావించారు. క్రీ॥శ. 1260 నాటి ఒక శాసనంలో 'సలివేంద్ర' అని ఉంది. ఇచ్చట లభించిన శంఖాల పై గల రాతలో 'సలిపెడాక' అనే పదం కనిపిస్తోంది. 'సలి' అంటే ధాన్యం పెడాక, పదిక పదాలు 'వాటిక'కు రూపాంతరాలు ధాన్యవాటిక అని అర్థం గుంటూరు జిల్లాలోని మరో బౌద్ధ స్థలం పేరు కూడా ధాన్యకటకం అని ఉండటం గమనించదగ్గది. ఇక్కడకు సమీపంలో కళింగపట్నం రేవు గుండా ధాన్యం ఎగుమతియై ఉండవచ్చును.



శాలిహుండం

శాలిహుండం పై స్థూపాలు పెద్ద ఇటుకలతో నిర్మాణ మయ్యాయి. 25 అడుగుల వ్యాసార్థం గల స్థూపంలో అస్థి పేటిక దొరికింది. చైత్య గృహాలు, విహారాలు, లేఖనాలు కలిగిన శంఖాలు, నాణాలు, గృహోపకరణాలు లభించాయి.

ఇక్కడ తార, మారీచి, మంజుశ్రీ, అవలోకితేశ్వర మొదలగు బౌద్ధ విగ్రహాలు లభ్యంకావడాన్ని బట్టి వజ్రయాన శాఖ ఈ ప్రాంతంలో వ్యాపించి ఉండవచ్చును. ఇక్కడ రోమను సంస్కృతికి చెందిన 'రేలేటిడ్ వేర్' అనే ప్రత్యేక మట్టిపాత్రలు, కలశాలు దొరికాయి. వీటిపై బ్రాహ్మీలిపి ఉందని కనుగొన్నారు.

శాలిహుండానికి సమీపంలోని కళింగపట్నం వద్ద వంశధార సముద్రంలో కలుస్తుంది. ఇది కళింగ రాజ్యానికి రేవుపట్టణం. కొందరు చరిత్రకారులు రాజధానిని నగరంగా భావించారు. బౌద్ధ సంస్కృతి వ్యాప్తికి, ఇతర దేశాలతో సంబంధాలకు ఈ రేవు ఉపయుక్తమైంది. ఇది ఇప్పుడు గత వైభవం కోల్పోయిన చిన్న రేవు మాత్రమే.

వంశధార ఒక నదిగా శ్రీకాకుళం జిల్లాలలో కొన్ని ప్రాంతాలను సస్యశ్యామలం చేయడమే గాక ఈ నది ప్రవహించిన మట్టిలో అపూర్వమైన సంస్కృతి విరాజిల్లింది. ఎందరో ప్రముఖులకు జన్మనిచ్చిన ప్రాంతమిది. తాపీ ధర్మారావు, చిలుకూరి నారాయణరావు పర్లాకిమిడిలో గిడుగువారి శిష్యులు. ప్రముఖ కవి పార్నంది జగన్నాథస్వామి (పర్లాకిమిడి), ప్రసిద్ధ పండితులు, సంస్కర్త బంకుమల్లి మల్లయ్య శాస్త్రి (పర్లాకిమిడి) 'మా కొద్దీ తెల్ల దొరతన'మని జాతీయ గీతాలాపన చేసిన గరిమెళ్ల సత్యనారాయణ కవి (ప్రియాగ్రహారం), విశిష్ట జానపద పరిశోధకులు కృష్ణశ్రీ శ్రీపాద గోపాల కృష్ణ మూర్తి, (ప్రియాగ్రహారం), ప్రముఖ కథారచయిత బలివాడ కాంతారావు (మడపాం), ప్రముఖ పాత్రికేయులు గోరాశాస్త్రి (గుణుపురం), భాషా శాస్త్రవేత్త, రచయిత ఆచార్య వెలమల సిమ్మన్న (తిమడాల), వంశధార గర్భంలో ప్రభవించిన వారే. స్వాతంత్ర్య సమర యోధులు పొట్నూరు స్వామిబాబు (నరసన్నపేట).

బౌద్ధ, శైవ, వైష్ణవ సంప్రదాయాలకు, కళలకు, శాసనాలకు నెలవైన పుణ్యభూమి వంశధారా సీమ.

**డాక్టరు దామెర వేంకట సూర్యారావు**
**ఫోన్ : 98851 88431**



# పుడమి ఫలాలు

– ఫ్రెంచి మూలం : ఆండ్రీ గైడ్

①

అన్నింటికన్నా ముఖ్యం, జీవితం గురించి గాఢమైన ఆసక్తి పెంచుకోవడం. అది అనుకున్నంత సులభం కాదు. ఆసక్తి గురించి చాలామందికి తెలియదు. ఆసక్తి, స్వభావంగా మారాలనీ తెలియదు.

నీ ఎదురుగా ఉన్న వస్తువులో దైవాన్ని తెలుసుకో. ఎక్కడో దైవాన్ని వెదకవద్దు. ఒక చోట ఆగిపోవద్దు. పయనించు. ధ్యానించే వస్తువు కన్నా, ఆసక్తిగా మెరిసే నీ కళ్ళు ముఖ్యం. నిశ్చలమైన నీటికన్నా పయనించే తరంగం మిన్న. శాశ్వత విశ్రాంతి మరేదో కాదు, మృత్యుఒడి మాత్రమే.

ఫలించని కోరిక జీవితాన్ని వెంటాడుతుంది! కోరుకో! దొరికిన దానినే ఏరుకో! కృతజ్ఞతతో దానిని ఆనందంగా మార్చుకో. ఏది ఉందో దానినే తీసుకో!

ప్రతినిమిషం, సంపూర్ణంగా దైవంతో నిండి ఉందని తెలుసుకో! దైవం గురించి వేచి ఉండ వద్దు. వేచి ఉండటమంటే నీలో కొలువున్న దైవాన్ని గుర్తించకపోవడమే. దేవుడు వేరు, సంతోషం వేరుకాదు. సంతోషమే దైవం. ఆనందాన్ని వర్తమానంలో నింపు!

ప్రతీ సాయంకాలం మరణించిన ఉదయమే! ఉదయం అంటే పునర్జీవనం పొందిన సాయంకాలమే!

ప్రతి క్షణం కొత్తగా మారాలి.

మేధావి ప్రకృతిని ఆశ్చర్యంగా వీక్షిస్తూంటాడు!

నీ ఆందోళన పెరిగిపోతున్న దేవుళ్ళ గురించి. అందులో ఎవరు ఉన్నతులో తెలియదు. జీవితమే అన్నింటి కన్నా ఉత్తమమైనదని అర్థం చేసుకోవు! జీవించిన క్షణమే, క్షణికమే, మృత్యువు కన్నా గొప్పది. మృత్యువు క్రొత్త జీవితాన్ని తెరిచే కాంతి ద్వారం! మాట్లాడిన క్షణమే మెచ్చుకోదగ్గ క్షణం, కానీ మాట్లాడిన క్షణంలో వినవద్దు. మనం సిద్ధంగా ఉండాలి. మన మస్తకాలనుండి పుస్తకాలు పారవేయడానికి! సాగరతీరంలో ఇసుక మెత్తగా ఉందని చదివితే సరిపోదు! నీ నగ్న పాదాల క్రింద ఇసుక తడిని అనుభూతి చెందాలి. అనుభవం లేని జ్ఞానం వ్యర్థం.

ప్రేమతో పుడమిలో ఉన్న ప్రతీదాన్ని తాకాలి. అన్ని పెదవుల మీద విరిసే నవ్వుల్ని, అన్ని నయనాల నుండి కారే కన్నీటిని, అన్ని ఫలాల రసాల్ని, మధుశాలల్ని వదిలినా మళ్ళీ మొదలయ్యే దాహం. వసంత ఋతువు తెచ్చే క్రొత్తదాహం...

నా కోరిక – ఎక్కడ దారి మొదలవుతుందో,
ఎక్కడ నీడ సేద తీరుస్తుందో,
గాఢమైన లోతైన జలాలలో ఈదులాడాలని!
శయ్య అంచులలో నిద్రించాలని, అదే నా ప్రగాఢ వాంఛ!

ప్రకృతిలో ప్రతీదాన్ని స్పృశించి పరవశించాలని కోరుకుంటాను. నాచుట్టూ హరివిల్లులు విరియాలని కోరుకుంటాను. అందమైనదంతా వర్ణహితమై ప్రేమ కిరణాలుగా ప్రవహించాలని కోరుకుంటాను!

అవిచ్ఛిన్నంగా ప్రవహించే తరంగాలను చూస్తూంటాను. అవి అలలు. పడుతూ... లేస్తూ... ఒక దానినొకటి తోసుకుంటూ. నీరే అలలకు రూపమిచ్చింది. నీరే అలను అదృశ్యం చేస్తుంది.

నీరు సత్యమని, అల రూపమని జ్ఞానోదయమవుతుంది.

ఆనందాలు అన్నీ అకస్మాత్తుగా ఎదురయ్యే ఉద్వేగాలే! అనందంలేదని అనకు! వేరే రూపంలో వచ్చి నిన్ను పలకరించిందని గ్రహించు. ముందుగానే ఆనందం కొరకు సన్నద్ధం కావలిసిన అవసరంలేదు! క్రొత్తరూపంలో వచ్చిన ఆనందాన్ని అంగీకరించు.

అదే వసంతం! అదే చెట్టు! అదే ఆకాశం! ఆ పరిచయ మైన పక్షి మళ్ళీ గొంతు వినిపిస్తోంది!

గ్రీష్మం క్షీణిస్తోంది! ఆమె రాలేదు! శిశిరమే నాకు సేదతీరుస్తోంది! ఆ వర్ణ రహిత పత్రాలు, ఆ సాయంత్రం నేను వేచి ఉంటాను!

సాయంకాలాలు దీర్ఘంగా ఉన్నప్పుడు, చివరి రవి కిరణాల అంచుల్ని తాకడానికి, అడవికి వెళుతుంటాను.

ప్రకృతిలో ప్రతిదీ ముఖ్యమే. నువ్వు వాటినే చూడాలి!

సన్నద్ధం కావటానికి ప్రయత్నించకు. అందాన్ని ఆస్వాదించడానికి సిద్ధంగా ఉండు!

②

నీవు జీవితంలోకి నూతనంగా ప్రవేశించాలని ఆశిస్తాను. నీవు నా మాటలలోని ఆవశ్యకత, అంతరార్థం గ్రహించావా?

నీకు శ్రద్ధ గురించి తెలియజేయాలి.

ఏది నీలాగ ఉంటే, దాన్ని వదిలి వేయాలి! నీ వాళ్లు, నీ గది, నీ పరిసరాలు, నీ గతం- ఇంతకంటే ప్రమాదికారి మరొకటి ఉండబోదు.

ప్రకృతి ప్రసాదించే అందాల కోసం మనోద్వారాలు తెరవాలి. నీ చేరువలోకి వచ్చిన ప్రతి దానిని గమనించి వెళ్ళిపోనీ! ప్రకృతిలోని తీపి, చేదుల కలయికను శోధించు!

మృత్యువు అంచున నిలిచిన విషయాల విలువ ఎంతో గొప్పది!

వసంతంలో వికసించడానికి చెట్టు ఆతురత పడుతుంది! ఎందుకంటే వసంతం ఎక్కువ కాలం నిలవదు కదా! మనిషికి కూడా జీవితంలో ఒక వసంతం ఉంటుంది. ఆ వసంత జ్ఞాపకం క్రొత్త ఆనందాన్వేషణకి సమానం కాదు. క్రొత్త సంతోషం ఇస్తాను, ఇంతకు ముందు లేనిది. నీతో అంతరంగ సంభాషణ కొనసాగిస్తాను, ఇంతకు ముందు ఎవరూ చేయనిది!

పుస్తకాలు తెరిచి, మూసి... విషాదపుటంచున నిలిచి సహాయం కోసం చూస్తున్నపుడు, నీ కోసం నేను రచిస్తాను! నీ భావాల్ని, నీకే తెలియని నీ అంతరంగపు ముద్రల్ని తెలియజేస్తాను.

ప్రతి వ్యక్తీ సంపూర్ణంగా, నిజాయితీగా అనుభూతి చెందేవాడే! నీలోని అనుభూతుల్ని వెలువరించు. ఒక పవిత్రమైన మత గ్రంథంలా, ప్రతి అనుభూతికి అనంతత్త్వం ఉందని తెలుసుకో!

బాధంటే మరేమీకాదు, ఉత్సాహం తిరిగి రావటమే!

మనం నిర్వహించే కార్యాలు మనకి- భాస్వరానికి వెలుతురులాంటివి. అవే మన వైభవాన్ని నిలబెడతాయి, అవే హరిస్తాయి. మన మనసు ఏదైనా సాధించగలిగితే దేదీప్యమానంగా వెలిగిపోతుంది!

నన్ను చెప్పనివ్వు.

ఒక దృశ్యం నా ఇంద్రియాలకు విసుగు కలిగిస్తోంది! మన హృదయాల్ని, రంజింప చేయలేని విషయాలు విసగట కల్గిస్తాయి.

ఆలోచన రావటం తేలిక - కంటితో చూసిన దాన్ని చేత్తో ముట్టుకోవటం కంటే. పొందాలని ఆలోచన రానపుడు దేన్నినైనా ఆశించవచ్చు. ప్రకృతిలో ఉన్న వాటిని యథాస్థితిలో అంగీకరించినప్పుడు, ఏ కోరికా లేకుండా వీక్షించినప్పుడు.

పొద్దుపొడిచే వేళ పొగమంచు, ఆహ్లాద పరుస్తుంది. సూర్యుని వెచ్చదనం కూడ. తీరంలో తడి ఇసుక, అరికాళ్ళను సేద తీరుస్తుంది. వేసవిలో సెలయేటి ఈదులాట, చీకటి కుహరంలో అపరిచిత పెదవుల స్పర్శ!

ఫలాలు, ఏ ఫలాలు? ఎలాంటి పండ్లు?

పుడమి ఫలాలు... ప్రకృతి ఫలాలు

వాటి గురించే నీతో మాట్లాడాలి!

సౌధం మీద నుండి సూర్యుడిని చూస్తూ తేనె ఫలాలు, సంధ్యా సమయంలో ఆరగించే ఫలాలూ... దాచి ఉంచుకున్న తీయని ఫలాలు.

ఉద్యానవనాల్లో పెరిగి కోసుకోవడానికి సిద్ధంగా ఉన్న ఫలాలు,

మన శరీరాలపై తీపి మరకలు వదిలే ఫలాలు!

శీతల చర్మధారులైన ఫలాలు, ఫలాలు! ఒక్కసారి వాటి రుచి మది పొరల్లో దాగి మరలా నూతన దాహాన్ని కలుగ చేస్తాయి.

దానిమ్మ ఫలం... దాని గింజలు, లోపల అమరిక, వాటి నిధిని దాచే ప్రకృతి ఏర్పాటు-

దానిమ్మ ఫలరసం బిందువులుగా రాలుతూ, పురాతన కాంస్య పాత్రలోకి జారుతూ...

పక్వానికి వచ్చిన ఫలం రసంతో నిండి ఉంటుంది ! అలా ఉండటంలోనే ఏదో కవిత్వం దాగి ఉంది!

వసంతాలలోని వేడినీటి బుగ్గలు, మొదట విషం స్రవించినట్లు కనబడినా చివరికి శరీరానికి వెచ్చటి హాయినిస్తాయి. మరలామరలా స్నానమాడటానికి ప్రేరేపిస్తాయి.

మంచును స్రవించే వసంతాలు, మబ్బువోలే తేలే మంచుపూలు, భానుడి కిరణాలలో కరిగిపోతాయి!

వసంతాలలో అంతులేని అందం దాగుంది! భూగర్భ జలాల్ని చూస్తే ఎంత అందం! ఉబికి వచ్చినప్పుడు స్ఫటిక మంత స్వచ్ఛంగా ఉంటాయి. వాటి తాజాదనమే వాటి గుణం! అందుకే వాటిని దోసిళ్ళతో త్రాగాలనిపిస్తుంది!

నారింజ, నిమ్మ, తీపి, ఆమ్లాల మిశ్రమం. వాటి రుచి పెదవుల్ని వదిలి పోదు!

మధుపాత్రలలోని మధువు కోసం పాత్రను రెండు చేతులా ఒత్తిడి కలగ చేస్తే - ఒలికే మధువూ...

సంధ్యాసమయంలో తరువుల నుండి ఒలికే మధువు కూడా ఎంతో రుచి.

పదార్థం అనంతంగా వ్యాపించి ఉంటుంది. పార దర్శకంగా ఈథర్‌లో ప్రవహిస్తూంటుంది.

అనంతాన్ని అవగతం చేసుకోకపోతే అనంతరూపాలలో

ఉన్న ఆనందాన్ని తెలుసుకోలేం!

**ఆకర్షించే ప్రదేశాలుంటాయి! ఒకే చోట ఉండటమంటే జడమయిపోవడమే! ద్వారాలు మూసుకు పోతాయి! ఉచ్చుల్లో పడిపోతాం!**

నవ్యతలేని పంజరంలో ఆత్మ బందీ అయిపోతుంది!

నేనాగిపోతాను! క్రొత్త ప్రదేశాల చెంత, జలపాతాల దవ్వులో, మైదానాల వైశాల్యంలో...

కానీ అలవాటుపడిన పరిసరాలు ఆశ్చర్యం గొల్పడం కోల్పోతాయి. అప్పుడే వాటిని వదిలి పోతాను!

నగరాలూ... సౌధాల నిర్మాణం చూసి అచ్చెరు వొందుతాను! విశాలమైన కప్పులతో, మేడలు... గవాక్షాలలో మత్తెక్కిన కనులతో మదిరాక్షులు! ప్రేమ విందులు... రేయిలో వెలుగుతున్న పర్వతాలు...

నిద్ర గురించి చెప్పాలి...

వేకువ జామున, గడ్డివాము ప్రక్కన,

పుడమి పూలశయ్య పైన,

కదిలి పోతున్న రైలుబండి గదులలో...

నిద్రకు ముందు కూరుకు పోతున్నరెప్పలూ...

మేల్కొంటున్నప్పుడు మెరిసిపోయే క్షణాలూ...

అద్భుతమైన నిద్ర! స్వప్నాల్ని ప్రేమిస్తాను. సాకారం కావాలని కోరుకుంటాను! ఎంత గొప్ప నిద్రయినా వేకువ క్షణానికి తుల్యం కాదు కదా!

మధుపాత్ర నుండి మధువు జారుతుంటే, హృదయం స్వేచ్ఛా విహారం చేస్తుంది!

నవ్వడానికి సమయముంది!

నవ్వుని జ్ఞప్తిలో నిక్షిప్తం చెయ్యడానికి సమయముంది!

నీ మీద నువ్వు ఆసక్తి చూపాలి! ప్రపంచం గురించి తర్వాత ఆలోచిద్దాం!

ఒకే రూపాన్ని ధ్యానిస్తూ మోహంలో పడకు!

మనస్సు ఎండి పోతుంది, ఆ రూపం నుండి తొలగక పోతే !

నీ ప్రక్కన ఉన్న ముఖంలో, దైవం మిణుక్కు మంటోంది!

ఎన్నో వేల రూపాలు, వాటి వెనుక మార్మిక హాసం గమనించు!

ఒకే రూపాన్ని అంటిపెట్టుకుంటే అంధుడవవుతావు! ఆరాధనను విస్తరించు! మూసిన ప్రతీ ద్వారం వెనుక ఒక అనన్యత ఉంటుంది! ఒక్కో ద్వారం తెరువు!

వదిలి వేసిన గదులూ, చెప్పుకున్న వీడ్కోళ్ళూ... విచారించ దగ్గవి కావు.

వదిలి వేయవలిసిన క్షణం వచ్చి తీరుతుంది! మరొక్కసారి గవాక్షం నుండి వీక్షించు! ఆనందానికి అనంత అవకాశాలు. వాహనం సిద్ధంగా ఉంది, పోదాం!

గొప్ప అందమైన జ్ఞాపకం కూడా వర్ణరహిత పత్రంలా తోస్తుంది!

ఒక చిన్న బిందువు, అది అశ్రుకణమైనా సరే! నన్ను తాకిన క్షణం ఎంతో విలువైనది!

జీవితంలో గొప్పది దాహం! దాహమే క్రొత్త అన్వేషణకు ప్రేరణ కలిగిస్తుంది !

ప్రతి కోరికా నన్ను ధనవంతుణ్ణి చేస్తుంది! కోరిక ద్వారా మనం పొందాలనుకున్నది వస్తువు కాదు, ప్రేమే!

దాహం తీరడానికి ద్రవం, ఆకలికి ఆహారం లేకపోతే ఎలా? పక్వానికి వచ్చిన ఫలాలే నా దాహన్ని తీరుస్తాయి.

తృప్తి అంటే మరేదో కాదు క్రొత్త దాహానికి ఆహ్వానం!

ఇంద్రియాలకు తృప్తి, దాహానికి దొరికే మధువు!

సువాసన కోల్పోతానేమోనని నా భయం!

సముద్రంలో లవణం, దాని రుచి కోల్పోలేదు! కానీ నా పెదవులు వాటి రుచి తెలియనంతగా పురాతనమయి పోయాయి!

నా హృదయం కోరినా, అంబుధి నుండి వచ్చే గాలులను మదిలో నింపుకోలేను!

నీవు సంతోషంగా వున్నప్పుడే, నీ కోరికను తీర్చుకో! నీ అధరాలు ప్రేమకోసం మధువుల్ని ఒంపుతున్నపుడు, చుంబనాలను అందుకో! గాఢ పరిష్వంగాలని అనుభవించు!

ఫలాలు అక్కడే ఉన్నాయి! ఫల భారంతో వంగాయి! తృష్ణతో నోరు ఊరిపోతోంది! ఫలాల్ని అందుకోవడానికి చేతులేవి?

అవి ప్రార్థన చేస్తూ అతుక్కుపోయాయి!

మనసు నిరాశగా దాహంతో అల్లాడుతోంది!

మంచి తరుణం మించిపోతుంది!

పరిపూర్ణమైన కార్యం, ఆనందం సమాంతరంగా ప్రయాణిస్తాయి! నేను గొప్పగా పని చేశానని గర్వపడేవారిని పట్టించుకోకు. సరిగ్గా ఎంచుకొని, నిజాయితీతో చేసే పని ఆనందానికి దారిచూపుతుంది!

చాలాసార్లు నా తృష్ణే గొప్పదనిపిస్తుంది! తృష్ణ ముందు తృప్తి, కోరిక గొప్పవి కావు! తృప్తి నన్ను ఆపుతుంది. దాహం నాకు దారి చూపుతుంది! తృష్ణే విస్తరిస్తున్న ప్రేమ వైపు నడిపిస్తుంది! క్రమంగా అన్నింటిని కౌగిలిద్దాం! అదే ప్రేమ దాహాన్ని తీరుస్తుంది!

③

ఎప్పుడైనా ఆశ్చర్యపోవడానికి జీవించావా? ఎప్పుడైనా జీవితమే గొప్ప అద్భుతమని పొగిడావా? నీ చుట్టూ పరికించు! ప్రతీ వస్తువు నీ ఆనందం కొరకు అమర్చబడింది.

అదే గ్రహించు! **ప్రకృతి సూచిస్తోంది, మానవుడు జన్మించింది ఆనందించటానికేనని. అందుకే మొలకెత్తే విత్తనం, మధువును పోగు చేసే తేనెటీగ, మంచితనం నిండిన మనిషి హృదయం, ఉన్నాయి!**

నావైపు రా! కాంతిపుంజాన్ని చూడు! నీపైన నక్షత్రం ఉంది! నీలోని బరువు తొలగించుకో! గతకాలపు కారాగారం నుండి బయటికిరా! జీవితం చాలా అందమైనది, మనకు తెలిసిన దాని కన్నా! జ్ఞానాన్ని అవగాహనతో కాదు, ప్రేమతో పొందాలి!

అకస్మాత్తుగా నాకు తెలిసింది, నా ఆనందం కోసం బయట వస్తువు అవసరం లేదని! నా హృదయమే ఆనందంతో నిండిపోయిందని! నేను అహాన్ని వదిలించు కుంటే నాలో ఆనందం పెల్లుబికి తోటివారిని అలరిస్తుందని!

**బోధించడానికి సరైన పద్ధతి, మనం ఉదాహరణగా మారటమే!**

ఆకుపచ్చని పరిసరాలు నిన్ను వదిలి పోతాయని భయపడుతున్నావా? మారిపోయే పరిసరాల్ని మరింత లోతుగా పరికించు! క్షణం వృథాకానీయకు! అత్యంత సౌందర్యవంతమైన పుష్పం, క్షణంలోనే వాడిపోతుందని తెలుసుకో! వెంటనే సుగంధాన్ని ఆఘ్రాణించు! క్షణికంలోనే అనంతత్వాన్ని గ్రహించు.

తర్కం అంచున వైఫల్య భయం మనస్సును బలహీన పరుస్తోంది! తర్కానికి అందని మర్మముంది! మంచి వాళ్ళున్నారు. ఎవరి మార్గంలో వారిని సాగిపోవడానికి అనుమతించేవారున్నారు. నీవు జీవించు; ఇతరులను జీవించనీ.

స్థిరమైన అభిప్రాయాలుండవు! ఈ రోజు స్థిరమైనదే, రేపు అస్థిరమైనది! ఇవ్వడంలోనే నువ్వు పొందుతావు! నువ్వు ఇవ్వలేనిది నీపై అధికారం చెలాయిస్తుంది! త్యాగం లేనిదే, పునరుజ్జీవనం లేదు! ప్రకృతిలో ప్రతిదీ ఇవ్వడానికే సన్నద్ధమవుతాయి! చెట్లు, మేఘాలు, నదులూ...

**నీవు భద్ర పరిచింది ఒక నాటికి ఛిద్రమవక తప్పదు!**

నీవు నీలో ఆనందం నింపుకోకపోతే ఇతరులకు పంచలేవు!

పక్వానికి వచ్చిన ఫలం కొమ్మ నుండి రాలుతుంది! ప్రతీ విషయం పక్వాని కొస్తుంది! ఫలం తనను తాను త్యాగం చేసుకుంటుంది. విత్తురూపంలో మరలా పునర్జీవనం చెందుతుంది!

ఆనందం అరుదని తెలుసుకో! ఆనందం విచారం కన్నా చాలా కష్టం, చాలా అందమైనది కూడా. ఒకసారి దీనిని కనుగొంటే ఆనందం తప్పనిసరి అవసరమవుతుంది! మంచితనం, ఆనందం వెదజల్లే కిరణాల్లో ఒకటి!

ఆనందాన్ని నిరాకరించడమంటే, ఆత్మ దివాళా కోరుతనాన్ని, పిరికి తనాన్ని ఆహ్వానించడమే! సన్యసించే వాళ్లమాటలు వినదల్చుకోలేదు! ఆనందం ప్రకృతి సహజం! కాపట్యం లేని పనిని ఆహ్వానిస్తా! బీతోవెన్ కన్నా మొజార్ట్‌ని ఆస్వాదిస్తాను!

## ④

ఇప్పుడు నా పుస్తకాన్ని పారవేయి! నన్ను వదిలిపో. కానీ నన్ను విసిగిస్తున్నావు! నాలో ఉన్న ప్రేమ నిన్ను తరుముతుంది. ఎప్పుడైనా నన్ను అనుకరించమని చెప్పానా?

నేను ప్రేమించేది నీలోని విలక్షణతను. నిన్ను, నన్ను వేరు చేసే ఈ లక్షణమే నన్ను, నిన్ను ప్రేమించేలా చేస్తోంది. నాకు నేర్పు! నేను నిత్య విద్యార్థిని! నా పుస్తకాన్ని పారవెయ్యి! నీ మస్తకాన్ని నా పుస్తకంతో నింపి తృప్తి చెందవద్దు! నీ సత్యాన్ని నీవే కనుగొనాలి. వేరెవరూ నీ కోసం సత్యాన్ని కనుగొని సిద్ధం చేయరు. ఇంకా నువ్వు చెయ్యాల్సింది అటువంటి నమ్మకాన్ని వదిలి వేయడం! నీ కోసం నేను ఫలాలు తీసికొని వస్తే, నీవు దాహంతో సిద్ధంగా ఉండవు! నీ కోసం శయ్యని సిద్ధం చేస్తే అలసి శయనించడానికి నువ్వు సన్నద్ధంగా ఉండవు. నీలో ఉన్న దానిని నీవే కనుగొనాలి! వేరే మార్గం లేదు. నేను జీవితం ప్రదర్శించే అనేక రూపాల్లో ఒకటి! ఎవరో చేసింది నువ్వు చెయ్యవద్దు. ఎవరో వ్రాసింది నీవు వ్రాయవద్దు. ఎవరో చెప్పింది నువ్వు చెప్పవద్దు.

నీలోనే ఉండి, నీకు తప్ప వేరెవరికీ లభ్యం కాని జ్ఞానంతో బంధం పెంచుకో! ఆలస్యమైనా దాని నుండి నీ సృజన బయటికి రావాలి! నిన్ను వేధించే ప్రశ్నకి జవాబు కనుగొనాలి.

వర్తమానానికి అతీతంగా ఆలోచిస్తాను. ఈ రోజు అవసరమైనది వాళ్ళు ఆలోచించరు! క్రొత్త సమన్వయాలు, సున్నితంగా నీతో సంభాషణ సాగించాలి. నిలకడగా కనిపించే విషయంలో, నిలకడలేనితనం కనిపిస్తుంది. నిలకడలేని దానిలో కనబడని అవిచ్ఛిన్నత ఉంటుంది. మాటలు కుట్రదారులు! భాష పెద్దకుట్ర చేస్తుంది! అవసరానికి మించి తర్కాన్ని జీవితంలోకి తోస్తుంది! తర్కానికి అందని మర్మం మనలో ఉంది.

వయసు పెరిగినా జ్ఞానం పెరగదు. అందుకే ఒకో సారి చిన్న పిల్లవాడిలో వ్యక్తమయ్యే జ్ఞానం వృద్ధుడిలో కనిపించదు!

మనిషి మనిషిలా ఉండదు. అతను వృద్ధి చెందుతూ ఉంటాడు! అది బాహ్యం కాదు! అంతరంగంలో రావాలి.

ఇప్పుడు క్రొత్త మనిషి ఎక్కడ నుండి వస్తాడు? ఎలా వస్తుంది మార్పు? నీలో నుంచి రావాలి! నీ బలంలో నుంచి, నీ అసమానత నుండి రావాలి. నీలో నీవు ఘోషించు. **'అంతా నా మీదే ఆధారపడి ఉంది'** అని. సహనంగా ఉండు, సత్యాన్వేషణకు సహకరించే సహనం కావాలి! సహనమంటే ఒట్టి వేచి ఉండటం కాదు!

**⑤**

ఆరోజు వస్తుంది! మనం అన్నింటిని వదిలి వెళ్ళిపోవాలి!

'అన్నింటిని' అంటే...

కొంత మందికి సామానులు; కొంతమందికి గ్రంథాలయాలు; మరి కొంతమందికి సేదతీరిన శయ్యలు!...

కొంతమందికి వారి కష్టం, వారి కుటుంబాలు, పిల్లలూ, మొదలు పెట్టిన పని, చేయవలసిన పని...

సాకారాకృతి అంచున నిల్చిన స్వప్నాలు... చదవని పుస్తకాలు... ఆఘ్రాణించని సుగంధాలు, తృప్తి చెందని ఆసక్తులూ... అన్నింటినీ వదిలి పోవాలి!

అకస్మాత్తుగా మృత్యువు వస్తుంది! దృశ్యం మారి పోతుంది! మరణం కంఠానికి ఆభరణంగా మారక ముందే మనల్ని హెచ్చరిస్తుంది! మన పరిసరాలు మసకేసి పోతాయి. మనకింక ఈ వెలిసి పోయిన లోకాన్ని వదిలి పోవటం బాధగా ఉండదు. ఇంక విచారం దేనికి?

మరణాన్ని ఆహ్వానించడానికి ఎందుకు వెనకడుగు? ఇప్పటికే ఎన్నో సార్లు మృత్యుఒడిలో సేదతీరిన వాళ్ళమే! జీవితాన్ని అనుభవించని వాళ్ళని మృత్యుభయం వెంటాడుతుంది!

వారిని మతం ఊరడిస్తుంది– భయపడకు! తరువాత జన్మలో నీవు గొప్పగా బ్రతకవచ్చు అని!

కాదు! ఇప్పుడే, ఇక్కడే వ్యక్తి ఆనందంగా ఉండాలి! మానవత్వం మరింత అందంగా, మరింత ఆనందంగా, మరింత జీవంతో తొణికిసలాడాలి!

మన బాధల వ్రణాలకు మనమే కారణం!

నీ మార్గంలో నువ్వు సాగిపో! ఒకే రకం మొక్కలు పుడమిలో నాటడం వల్ల భూమి విషపూరితమవుతుంది! గతాన్ని దూరంగా వదిలివేయి. *అచిలిస్* కథ ప్రకారం అతని దేహం అతని తల్లి స్పర్శ జ్ఞాపకంతో మెత్తనయ్యింది! అదే అతని మరణానికి కారణం. లా (ట్) భార్య వెనుకకు తిరిగే వాంఛ వలనే ఉప్పు కొయ్యగా మారింది. గతం మీద ప్రేమ లేశమైనా వద్దు. స్వప్నాన్ని కవిత్వంతో నింపకు! స్వప్నాన్ని ఎలా సాకారం చెయ్యాలో తెలుసుకో!

**⑥**

నేను యౌవనంలో చెయ్యని పనులకు ఇప్పుడు వేదన చెందుతూంటాను.

ఎప్పుడైతే మనస్సు, శరీరం తెరుచుకున్న ప్రేమద్వారాల వైపు ప్రయాణం సాగించాయో, ఎప్పుడైతే పరిష్వంగం గాఢమైందో, ఎప్పుడైతే ఇంద్రియానుభవం గొప్పదైనదో, అప్పుడే ప్రేమ ఆశించే విషయాలకు ఆత్మ సన్నద్ధమవుతుంది! మనం అలవాటు చక్రంలో పడి సోమరిపోతుతనంతో 'ఇంకా చాలా సమయముంది' అనుకుంటాము. కానీ ఎదురుగా జారిపోతున్న క్షణాన్ని పట్టుకోలేము! నా వెనుక రా! ఈ రోజుని సద్వినియోగం చెయ్యి!

నేనొక ప్రత్యేక ప్రదేశంలో నిలిచి ఉంటాను. అది విలువైన క్షణంగా భావిస్తాను. నేనే కార్యం! నేనే కారణం! ఎగతాళికి గురవుతానని పిరికిగా మారవద్దు. సాధించలేననే భావన క్రింద ఎంత మంది నలిగి పోయారు! మన రేపటి భవిష్యత్ నిన్నటి, ఈనాటి అసాధ్యాల మీద ఆధారపడలేదు.

భయం మనల్ని ప్రేరేపిస్తుంది! ఇతరులంటే భయం! అందులో మృత్యుభయం, దైవభయం. దైవభీతి మనల్ని ఆజ్ఞాపించ కూడదు. ఎవరు చెప్పారు జ్ఞానం దైవభీతితో ప్రారంభమవుతుందని? ఈ నిజమైన జ్ఞానంలో భయానికి తావులేదు. భయం పోవటంతోనే అది ప్రారంభమవుతుంది!

**ముగింపు**

నన్ను ఆకర్షించేది అలాగే ఉంటుంది! వేరే విధంగా ఊహించినా ఆ వస్తువు అలా ఉండదు.

భవిష్యత్తుకి, సంభావ్యతకి తేడాలేదు. దేనినైతే ఊహించగలవో దానికి భవిష్యత్ కూడా ఉంటుంది!

ఆకాశంలో శూన్యం చూడకు! దిగ్మండలం వైపు చూడు. నీలో శోకాన్ని లేశమైనా ప్రవేశించనీయవద్దు. శోక నాశం చేసే నీ ఆనంద స్వరూపాన్ని గ్రహించు. ఇతరుల ఆనందంతో నీ ఆనందాన్ని రెట్టింపు చేసుకో!

మార్పు వస్తుందని ఆశపడటం కాదు, మార్పు కోసం ఆరాటపడి పోరాటం చెయ్యాలి.

ఒకే పదాన్ని మంత్రంలా ఉచ్ఛరించు.

**'అంతా నా మీదే ఆధారపడి ఉంది!'**

నమ్మకం కాదు, జ్ఞానమే దిక్సూచి. అందరిలాగే బ్రతకాలని అనుకోవద్దు. మరోజన్మలో సుఖపడదాం అనే భావన రానీయకు! మరో జన్మ అనేది మనం సేదతీరడానికి ఒక సాకు!

నా బాధలకు, ఆనందానికి నేనే బాధ్యుణ్ణి అనే అవగాహన వచ్చినపుడు నీకు ఆనంద రహస్యం తెలిసినట్లే. గ్రహాలకు, విగ్రహాలకు జీవితాన్ని తాకట్టు పెట్టకు. ⓜ

---

ఆండ్రీ గైడ్ రాసిన ఫ్రెంచి పుస్తకం - 'ఫ్రూట్స్ ఆఫ్ ది ఎర్త్' సంక్షిప్త ఆంగ్లానువాదానికి
తెలుగు అనుసరణ : ఎమ్. వీరేశ్వర రావు, చెన్నై - ఫోన్ : 07845778874



# మీరా కృష్ణులు

- కోడూరు పుల్లారెడ్డి

**ఉపోద్ఘాతం :** మార్వాడిశాఖ రాఠౌర్ల మూలపురుషుడు రావ్‌సీహాజ్. ఈయన కనౌజురాజు జయచంద్రుని (రాణి సంయుక్త తండ్రి) మనుమడు. క్రీ.శ.13వ శతాబ్ది ఉత్తరార్థంలో పాలి (మార్వాడు)లో తన రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. ఆయన తర్వాత ఆ వంశస్థులు 14 మంది పాలి కేంద్రంగానే ఆ రాజ్యాన్ని పరిపాలించారు. వారిలో 14వ వాడు రావ్ జోధాజీ. ఈయన మీరాబాయి తాత దూదాజీ కన్నతండ్రి. జోధ్‌పూర్ నగరాన్ని నిర్మించడమేకాక పుత్రుడు దూదాజీని మేడత సంస్థానాన్ని పాలించడానికి పంపించాడు. దూదాజీ మేడత పరిసర ప్రాంతాల్లోని 360 గ్రామాలపై కూడ తన అధికారాన్ని సుస్థిరం చేసుకున్నాడు. దూదాజీకి 5గురు కుమారులు. అందులో నాల్గవవాడైన రత్నసింహుడు మీరాబాయి కన్నతండ్రి. దూదాజీ రత్నసింహుని ఖర్చుకోసమై 12 గ్రామాలపై అధికారం యిచ్చాడు. 'కుడక్' అనే పట్టణం ఆయన కేంద్రస్థానం. ఇక్కడి కొండపైగల ఒక చిన్న దుర్గంలో క్రీ.శ.1503లో మీరాబాయి జన్మించింది.

మీరాబాయి శ్రీకృష్ణుని వరునిగా ఎంచుకొనడానికి ఎన్నో కథనాలు ప్రచారంలో నున్నాయి. అవి ఇక్కడ అప్రస్తుతము - కాని ఒక్కటి మాత్రం నిజం. చిన్నప్పటి నుండి ఆమె శ్రీకృష్ణుని భర్తగా ఎంచుకొని ఆరాధించి తరించింది.

క్రీ.శ. 1516లో మేవాడను పాలించిన ప్రసిద్ధ మహారాణాసంగా ద్వితీయ పుత్రుడు భోజరాజుతో మీరా వివాహం ఆమె 13వ యేట జరిగింది. మేవాడ అంతఃపురంలో కాలూనేటపుడు తన ప్రియ సఖి లలితను, శ్రీకృష్ణ విగ్రహాన్ని తెచ్చుకుంది. ఆ ఇంటి కులదేవతని ప్రార్థించమంటే శ్రీకృష్ణుని తప్ప వేరెవ్వరిని పూజించనని తెగేసి చెప్పింది. కృష్ణుని సర్వకాల సర్వావస్థలలో పూజించేది. ఇలా వుండగా భోజరాజు అకాలమృత్యువుకు గురైనాడు.

మీరా కృష్ణభక్తి రోజురోజుకు ఎక్కువవుతూ వుంది. ఆమె బయటి మందిరాలకు వెళ్ళి సాధుసంతుల మధ్య శ్రీకృష్ణుని మూర్తి ఎదుట నాట్యంచేస్తూ గానం చేసేది. పైగా వీధులవెంట తిరుగుతూ శ్రీకృష్ణ సంకీర్తనం చేసేది. అంతఃపుర స్త్రీలకు నిషిద్ధమైన ఈ చర్యలకు పాల్పడవద్దని శాసించినా ఆమె తన పద్ధతి మానలేదు.

క్రీ.శ.1527లో రాణాసంగా బయానాకోట ముట్టడిలో గాయపడ్డాడు. మీరా తండ్రి రత్నసింహుడు ఆ యుద్ధంలో చనిపోయాడు. మరికొన్ని రోజులకు రాణాసంగా కూడా చనిపోయాడు.

రాణాసంగాకు ఇరువురు భార్యలు. ఘనాబాయి, కర్మవతి. అంతఃపురంలో రెండు వర్గాలుండేవి. ఒకటి ఘనాబాయిది, రెండవది కర్మవతిది. సంగా మరణానంతరం ఘనాబాయి కుమారుడు రత్నసింహుడు రాణా అయ్యాడు. భోజరాజు ఆకస్మిక మరణంతో, రాణా ఆడబిడ్డ 'ఊదా' ఇద్దరూ మీరాను ఆనాటి ఆచారం ప్రకారం సహగమనం చేయమని బలవంతం చేశారు. మీరా నిరాకరించింది. అపుడు యీ రత్నసింహుడే ఆమె సహగమనం చేయనక్కరలేదని నివారించాడు. ఆనాటికి మీరా ఈనాడు ప్రసిద్ధిలో వున్న భజనలలో ఏ ఒక్కటి వ్రాసి/పాడి యుండలేదు. 'రణథంభోర్' ప్రాంతం ఒకప్పుడు రాణాసంగా అధీనంలో ఉండేది. ఇపుడది పరాధీనం. దాన్నిపుడు తిరిగి జయించే ప్రయత్నం చేయాల్సివుంది. ఆ మహా ప్రయత్నంలో రత్నసింహుడు అసువులు బాయడం, రాణి కర్మవతి కుమారుడు విక్రమాదిత్య రాణా కావడం జరిగింది. కర్మవతి

రాఠౌరు రాకుమార్తెకారు. ఘనాబాయి, మీరా యిద్దరూ రాఠౌరు వంశస్తులు. ఘనాబాయి, కర్మవతికి శత్రువు. ఆ వంశస్తురాలే అయిన మీరా అన్నా ఆమెకు సరిపోదు. తన శత్రువు మిత్రుడు తనకు కూడ శత్రువన్న చందంగా మీరా కర్మవతికి, రాణాకు కంటిలో నలుసైంది. పైగా మీరా అంతఃపుర మర్యాదలకు విరుద్ధంగ, నిమ్నజాతులవారితో కలిసి నగర సంకీర్తన చేయడము, సాధుసంతుల మధ్య నాట్యం చేయడం, పాడడం మరొక సమస్య. అందువల్ల ఆమెను పూర్తిగ నివారించాలని తల్లీ కుమారులు రహస్య మంతనం చేశారు. మీరా ఈ విషయం గురించి తన భజనలలో శ్రీకృష్ణ విగ్రహమని త్రాచుపామును పంపడం, శ్రీకృష్ణ చరణారవింద తీర్థమని విషం పంపడం ఎన్నోసార్లు తన గీతాలలో పేర్కొంది.

ఈ చర్యలతో విసుగెత్తిన మీరా, లలితతో తన పెదనాన్న వీరమ్‌దేవ్ ఆహ్వానం మేరకు క్రీ.శ.1534లో మేడత వెళ్ళిపోయింది. కృష్ణభక్తి భావనకక్కడ అనుకూలమే. సాధుసంతులు గుంపులుగుంపులుగా వస్తున్నారు. వాళ్ళందరికి భోజన సదుపాయాలు సమకూర్చటమేకాక వారితో కలసి ఏక్‌తారా మీటుతూ నగర సంకీర్తనం చేస్తూ వుంది.

క్రీ.శ.1538లో రావ్ మల్‌దేవ్ మేడతను జయించి తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. మీరా లలితతో మేడత వదలి శ్రీకృష్ణుడు రాధా, గోపికలతో రాసక్రీడలు జరిపిన బృందావనంకు తరలిపోయింది. బృందావనంలో ప్రకృతి సౌందర్యం మీరా భక్తి పారవశ్యానికి అనుకూలంగ వున్నా అక్కడ ఆమె చాలా యేండ్లు గడపలేదు. క్రీ.శ.1543లో ద్వారకవైపు ప్రయాణం సాగించింది.

ద్వారక వద్ద సముద్రతీరంలో నిర్మించబడ్డ ప్రసిద్ధ రణ్‌ఛోడ్‌జీ (శ్రీకృష్ణమూర్తి) మందిరంలో మీరా స్థిర నివాసమేర్పరచుకుంది. ద్వారకలో మీరా 30 సం॥లు ప్రశాంతంగ గడిపింది. శ్వేత వస్త్రధారిణియై ఏక్‌తారా మీటుతూ కృష్ణభక్తి పారవశ్యంలో మీరా పాడిన భజనలు లోక ప్రియత్వం సంపాదించుకున్నాయి. ఇక్కడ రాణా విక్రమాదిత్యకు మీరా లోక ప్రియత్వం కంటక ప్రాయమైంది. పైగా తనకు ఆమెవల్ల హాని జరుగుతుందేమోనని భయపడసాగాడు. ఎలాగైనా మీరాను మేవాడకు రప్పించాలని ఐదుగురు పురోహితులను రాయబారమంపాడు. తాను మీరా యెడల మునుపు వ్యవహరించిన తీరుకు సిగ్గుపడుతున్నానని ప్రాయశ్చిత్త జ్వాలలో కాలిపోతున్నానని అందువల్ల మీరా తన స్వంత యింటికి తిరిగి రమ్మని చెప్పి పంపాడు. పురోహితుల అభ్యర్థనను మీరా త్రోసిపుచ్చింది. అందువల్ల మూడురోజుల నుండి పురోహితులు నిరాహారదీక్ష వహించారు. లలిత ఆహ్వానించినా, మీరా స్వయంగా బ్రతిమాలినా వారు వచ్చిన మూడు రోజుల నుండి అభోజనులుగానే వుండిపోయారు. ఒకవేళ ఆ బ్రాహ్మణులు చనిపోతే తనకు బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంటుందని మీరా భయపడసాగింది. ఏంచేయాలో మీరాకు పాలుపోలేదు. ఏడుపదుల వయస్సుకు చేరుకున్న మీరా జీవితం చరమదశకు చేరుకున్నట్టనిపించింది.

ఆరోజు నిద్రలేచింది మొదలు మీరా ఎవరికి కనిపించలేదు. బహుశ ఆ అపార జలరాసి ఆమెను భవబంధాల నుండి విముక్తి చేసి రణ్‌ఛోడ్ మందిరమూర్తి అలౌకిక రసలోకంలో ఉపవిష్టురాలిని చేసివుండవచ్చు. మీరా అదృశ్యమైన సం॥ క్రీ.శ.1573 అని చరిత్ర కథనం.

మీరా శ్రీకృష్ణుని తన భర్తగా భావించి ఆయన కళాకాంతులు విస్తృతంగా వర్ణించి, తన ప్రేమను విరహంతో





కలిగిన హృదయవేదనను మధురాతి మధురంగా చిత్రించింది తన భజనల్లో. ఈ భజనలు భక్తజనుల హృదయాల్లోకి సూటిగా దూసుకుపోయి మీరాపై సానుభూతి జల్లులు చిలకరించాయి.

నేడు 590 పదాలతో మీరా 'బృహత్‌పద్ సంగ్రహ్' లభ్యమవుతున్నది. ఇందులో ప్రక్షిప్తాలెన్నో తెలియదు. మీరాకు ఎనలేని ఖ్యాతి తెచ్చినవి ఈ గీతాలే. వీటినే మీరా భజనలంటారు. ఈ పదావళి యీనాడు హిందీ సాహిత్యంలో దేదీప్యమానంగా విరాజమానం కావడానికి మీరా ప్రియసఖి లలిత దూరదృష్టితో ఆమెపైగల ఆచంచలప్రేమ, భక్తి విశ్వాసాలతో వాటిని భద్రపరచి భావితరాలకు అందజేయడమే.

మీరాను గురించిన లోతైన వివరణ 50 భజనలు గల నా రచన కృష్ణాభిసారికలో చూడవచ్చు.

ఇపుడు ఇందులో కృష్ణాభిసారికలో లేని 18 భజనలు ప్రసిద్ధగాయనీమణులు శ్రీమతులు లతామంగేష్కర్, కిషోర్ అమోంకర్, లక్ష్మీశంకర్ పాడి రికార్డు చేసినవి ప్రస్తుతించు కుందాం.

1. 'జన్మజన్మల నుండి నీకోసం అవివాహితగ వుంటున్నాను' తనను వుద్ధరించమని శ్రీకృష్ణుని ప్రార్థిస్తున్నదీ పదంలో మీరా.

**థాణే కాంఈ కాంఈ బోల్ సుణావా మ్హారా సాంవరాం గిరిధారీ ।**
**పూరబ్ జణమ్ రీ ప్రీత్ పురాణీ, జావా ణా గిరిధారీ ।**
**సుందర్ బదన్ జోవ్‌తాం సాజణ్ థారీ ఛవి బలిహారీ ।**
**మ్హారే ఆంగణ్ స్యామ్ పధారో, మంగళ్ గావాం నారీ ।**
**మోతే చౌక్ పురావాం ణేణాం, తణ్ మణ్ డారాం బారీ ।**
**చరణ్ సరణ్ రీ దాసీ మీరాం, జణమ్ జణమ్ రీ బావాంరీ ।**

'గిరిధారీ! నీవు నా ప్రియునివని ఏ విధంగా నమ్మించేది? మన ఇద్దరిది పూర్వజన్మ నుండి వస్తున్నదీప్రేమ. దాన్ని నిరాకరించి వెళ్ళవద్దు. ప్రియా! నీ సుందరరూపం చూస్తూనే నీరైపోతారు. నీ శోభ ముందు నన్ను నేను అర్పించు కుంటున్నాను. శ్యాం! మా ఇంటిని పావనం చెయ్యి. నిన్ను స్వాగతించడానికి స్త్రీలు మంగళ గీతాలు పాడుతున్నారు. వారి కన్నుల నుండి కన్నీటి ముత్యాలు లోగిలినిండా రాలుతున్నాయి. నీ మీద నా తనువు మనస్సు పూర్తిగా అర్పణ చేసికొనియున్నాను. ప్రియతమా! నేను నీ శరణుజొచ్చిన నీ చరణదాసిని. నిన్ను వదలి వేరెవ్వరినీ ప్రేమించలేక జన్మజన్మల నుండి అవివాహితగ వున్నాను.'

**విశేషం :** ఈ పదంలో శ్రీకృష్ణుని రూపవర్ణన వైష్ణవ భక్తి సిద్ధాంతాలకు అనుకూలంగ వుంది.

2. శ్రావణ మేఘాలు వర్షిస్తున్నాయంటే కమలాక్షుడు తన వద్దకు వస్తున్నాడని భావించి ఆనందంలో తేలిపోతూంది యీ పదంలో మీరా.

**బర్‌సా రీ బాదరియా సావణ్ రీ, సావణ్ రీ మణ్ భావన్ రీ ।**
**. . . . . . . . . . . . . . . . . . . . . . .**
**మీరా కే ప్రభు గిరిధర్‌నాగర్, బేలా మంగల్ గావణ్ రీ ।**

'సఖీ! చూడు శ్రావణ మేఘాలు వర్షిస్తున్నాయి. నాకు శ్రీహరి ఆగమన ధ్వని వినపడుతున్నందున, యీ శ్రావణంలో నా మనస్సు ఉల్లాసంతో నిండిపోయింది. వర్షించే మేఘాలు ఆకాశమంత దట్టంగ పరుచుకున్నాయి. మెఱుపులతో తీవ్రంగా గర్జిస్తున్నాయి మేఘాలు. వాన చినుకులు నిరంతరంగ రాలుతున్నాయి. చల్లని మనోహరమైన మలయమారుతం వీస్తూ వుంది. ప్రభూ! గిరిధర్‌నాగర్ యీ వేళ నీవు నాదగ్గరకు వచ్చెయ్యి. ఆహ్లాదంగ మంగళగీతం పాడుతాను.'

**విశేషం :** ఉత్తేజపరచే ప్రకృతి వర్ణన.

3. 'నా జీవితకాలమంతా నీ దర్శనం కోసం నిన్నే స్మరిస్తున్నాను'. తనను అనుగ్రహించమంటూ వుంది

పద్మనాభుని మీరా యీ పదంలో.

**హరి బిన్ కూణ్ గతి మేరీ ।. . . . . . . . . . . . . . . . . . .**

**దాసి మీరా రామ్ రటత్ హై, మైం సరణ్ హూం తేరీ ।**

'శ్రీహరీ! నీవు తప్ప నాకు వేరేగతి లేదు. నీవే నన్ను రక్షించగలవాడవు. నేను నీ పాదదాసిని. ప్రభూ! నేను నీ దర్శనం కోసం ప్రబలమైన కోరికతో ఆద్యంతమూ నీ నామస్మరణ చేస్తున్నాను. ఈ సంసార దుఃఖసాగరంలో నా జీవితనావ పగిలి మునిగిపోతూ వుంది. దీని తెరచాపను సరిచేసి దరిచేర్చు. విరహంతో నీకోసం ప్రతీక్షిస్తున్నాను. నీ రక్షణలోకి నన్ను తీసుకో, రామనామం స్మరిస్తూ నీ శరణుజొచ్చాను.'

**విశేషం :** రూపకాలంకారం.

4. మనస్సులో నిరంతరం ధ్యానించే ప్రియమైన వ్యక్తి కనిపిస్తాడన్న భ్రాంతి సహజం. శ్యామసుందరుడు తనకు కనిపించాడని భావిస్తూ వుంది మీరా యీ పదంలో.

**నైనా లోభీ రే బహురి సకే, నాహిం ఆయ్ ।**

**. . . . . . . . . . . . . . . . . . . . . . . . .**

**మీరా కే ప్రభు గిరిధర్ లాల్ బిను, పల్ భర్ రహ్యో న జాయ్ ।**

'సఖీ! శ్యాం రూపం నా మనస్సును మోహింపజేస్తూ వుంది. ఆయనను నిరంతరం నిశ్శబ్దంగ దర్శించాలనే కోరిక నా కళ్ళనుండి విడివడడంలేదు. నా కళ్ళూ, రోమ రోమం మన్‌మోహన్‌ను అభిలషిస్తూ నఖశిఖ పర్యంతం ధ్యాన పూర్వకంగా చూస్తూ వున్నాయి. నేనొక రోజు భవంతిలో నిలబడి వుండగా తటాలున అక్కడ మన్‌మోహన్ దర్శనమిచ్చాడు. సఖీ! ఆయన ముఖం చంద్రునివలె ప్రకాశవంతంగా వుంది. మందమందంగా చిరునవ్వు చిలికిస్తున్నాడు. నా కుటుంబ సభ్యులు, మరికొందరు ఇతరులు శ్యాం పైగల నా భక్తిని నిరసిస్తున్నారు. కాని నేను వివశురాలిని. వారెవ్వరి మాటలకు జవాబివ్వలేక భరిస్తున్నాను.'

5. నీలమోహనుడు తనను కలిశాడని పొంగిపోతూ వుంది యీ పదంలో మీరా.

**సహేలియా సాజన్ ఘర్ ఆయా హో ।**

**. . . . . . . . . . . . . . . . . . . . . . . . .**

**మీరా సఖీ కే ఆంగణౌ, దూధా! బూం తా సే హో ।**

'ప్రియసఖులారా! ఈ రోజు నా ప్రియుడు ఇంటి కొచ్చాడు. ఇన్నిరోజుల నా ప్రతీక్ష ఫలించింది. విరహంలో సతమతమయ్యే నన్ను నా ప్రియుడు కలిసి ఆనందం కల్గించాడు. నేను ఆయనకు రత్నాలు సమర్పించుకొని మంగళహారతులతో ఆయన విరక్తిని తొలగిస్తాను. ప్రియతముని ఆగమనవార్త తెలిపిన వారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నా పంచేంద్రియాలు ఒక్కటై మంగళగానం చేయడం మొదలిడినాయి. నా ప్రియునికి మంగళకర శుభాకాంక్షలు తెలియజేస్తాను. నా మనస్సు ఆనంద భరితమైంది. శ్యాం! నీవు ప్రేమకు సముద్రుడవు. నీ స్నేహం వల్ల నా కళ్ళు బంధింపబడ్డాయి. సఖులారా! ఈ రోజు నా ప్రాంగణంలో పాలవర్షం కురుస్తూ వుంది. అనగా నేను పరిపూర్ణ ఉత్సాహంతో వున్నాను.'

6. తన విరహాన్ని ఎవరూ అర్థం చేసుకోలేకున్నారు. శ్రీహరి మాత్రమే దాన్ని దూరం చేయగలడని అంటూ వుంది యీ పదంలో మీరా.

**కో విరహినీ కో దుఖ్ జాంణే హో ।**

**. . . . . . . . . . . . . . . . . . . . . . . . .**

**మీరా కే పతి ఆప్ రమైయా, దూజో నహిం కోఈ ఛానై హో ।**

'నా విరహ వేదనను ఎవరూ అర్థం చేసుకోలేకున్నారు. ఎవరి హృదయంలో యీ బాధ వుంటుందో లేక ఎవరైతే శ్రీహరికి అనన్యభక్తులో వారికి మాత్రమే యీ దుఃఖం అనుభవైకవేద్యం. ఏ విధంగా వైద్యుడు రోగికి చికిత్సచేసి రోగం నివారణ చేస్తాడో అదే విధంగా నా అంతరాంతరాలలో జీర్ణించుకుపోయిన విరహవేదనకు శ్రీహరి మాత్రమే ఉపశమనం చేయగలడు. శ్యాం లేని నా జీవితంలో ఎన్ని భోగభాగ్యాలున్నా వ్యర్థం. తల్లి ఆవు దూడకు పాలు త్రాపడానికి ఎల్లప్పుడు గుర్తు చేసుకుంటుంది. చాతకపక్షి స్వాతిచినుకు కోసం ఆతృతతో ప్రియా, ప్రియా అని అరుస్తూ వుంటుంది. అదేవిధంగా విరహవేదనతో వ్యథ చెందే నేను శ్యామసుందరుని కోసం నిరంతరం వ్యాకుల పడుతున్నాను. ఒకరి బాధ ఒకరు తెలుసుకొనని జీవులతో నిండిన ఈ మిథ్యాప్రపంచం చెత్తా చెదారంతో నిండివుంది. రమైయా! నా సర్వస్వమూ నీవే. నీవు తప్ప నాకింకెవరూ దిక్కులేరు.'

7. తన విరహబాధకు మదనమోహనుడు మాత్రమే చికిత్స చేయగలడంటున్నది మీరా యీ పదంలో.

**కైసే జిఊం రీ మాఈ, హరి బిన్ కైసే జిఊం రీ ।**

**. . . . . . . . . . . . . . . . . . . . . . . . .**

**దాసీ మీరా లాల్ గిరిధర్ మిల్యా హై సుఖదాఈ ।**

'అమ్మా! నేను శ్రీహరి జత లేకుండా ఎలా

జీవించగలను? కప్ప నీరు లేకుండా బ్రతుకగలదా? బ్రతుకలేదు. అది నీటిలోనే పుట్టి పెరిగింది కనుక. చేప కూడ నీటి నుండి బయటపడితే విలవిల తన్నుకొని ప్రాణం వీడుతుంది. ప్రియుని జతలేని నా పరిస్థితి కూడ అలాగే వుంది. చెదలు చెక్కను తినివేసిన విధంగా నేను కూడ విరహంలో నిస్సారమైపోయాను. ప్రియా! ఔషధం కూడ నా రోగాన్ని నిదానం చేయలేకుంది. వైద్యుడు వస్తాడు, వెళ్తాడు. ఏమీ లాభంలేదు. నీ వియోగంలో నాకు కొంచెం కూడ ప్రశాంతి లభించడం లేదు. చింతాక్రాంతనైన నేను దుర్దశ ననుభవిస్తూ తిరుగరాని పలుచోట్ల నీకోసం సంచరిస్తున్నాను. పారవశ్యం కల్గించే నీతో నాకు కలిగిన సాన్నిధ్యం నీవెందుకు గుర్తించుకోవూ?'

8. 'కేశవా! నీ ప్రేమ అబద్ధం. కాన నిన్ను ఏ స్త్రీ ప్రేమిస్తుంద'ని తూలనాడుతున్నదీ పదంలో మీరా.

**జో తుమ్ ఛోడో పియా, మై నాహిఁ ఛోడో రే ।**

**. . . . . . . . . . . . . . . . . . . . . . . . .**

**సున్ హే గోపాల్, సున్ హే గోపాల్ ।**

'ప్రియా! నీవు నన్ను వదలిపెట్టినా నేను మాత్రం నిన్ను వదలను. నీవు ప్రేమించకుంటే ఏ స్త్రీ నీతో చెలిమి చేస్తుంది చెప్పు! ఐనా మన ఇద్దరి అనుబంధం తప్పనిసరి. ఎందుకో చెప్పనా? నీవేమో శ్రేష్టమైన పెద్దచెట్టువు. దానికున్న ఆకులు నేను (చెట్టుకు ఆకులుండడం ప్రకృతి సిద్ధం) నీవేమో సరోవరంవు. అందులోని చేపను నేను (సరోవరంలోని నీటిలో చేపలు జీవించివుండడం సహజం). నీవేమో పెద్ద పర్వతానివి. అందులో మొలకెత్తిన పశుగ్రాసాన్ని నేను (పర్వత సానువుల్లో పచ్చిక బయళ్ళుండడం స్వతఃస్సిద్ధం. ఆ పచ్చికను పశువులు మేయడం అంతే సహజం. వ్రేపల్లెలో శ్రీకృష్ణుడు తన మిత్రులతో కలిసి పచ్చిక బయళ్ళలో ఆలమందలను మేపుకురావడం ఇక్కడ గమనార్హం). నీవేమో చంద్రుడివి. చకోరపక్షిని నేను. (చంద్రుని రాకకోసం చకోరపక్షి ఎడతెగక ఎదురుతెన్నులు చూడడం ఆ పక్షి స్వభావం). నీవేమో ముత్యంవు. దారాన్ని నేను. (ముత్యాలహారం చేయడానికి ముత్యాలెంత అవసరమో దారం ప్రాముఖ్యత కూడ అంతే). నీవేమో బంగారంవు. అవి ధరించి మనోహరంగ భాసిల్లడం నావంతు. (బంగారు నగలు ధరించిన స్త్రీల శోభ ఇనుమడించడం జగమెరిగిన సత్యం). ప్రభూ, వ్రజవాసీ! నీవు మీరాకు పూజనీయ వ్యక్తివి. నేను నీ దాసిని. కాన హే గోపాల్ నన్ను కరుణించు.'

**విశేషం :** మీరా గీతాలలో నాకు తెలిసినంత వరకు ఎక్కడా 'బాఈ మీరా' లేక 'మీరా బాఈ' అనే ప్రయోగం కనుపించదు. 'మీరా' అనే వుంది. కాబట్టి యీ పదం ప్రక్షిప్తమేమో?

9. 'జనార్ధనుడు తప్ప నాకెవరూ లేరు. ఆయనే నా భర్త' అంటూ వుంది మీరా యీ పదంలో.

**మ్హారాఁ రీ గిరిధర్ గోపాల్ దూస్రాఁ ణా కూయాఁ ।**

**. . . . . . . . . . . . . . . . . . . . . . . . .**

**మీరా రీ లగణ్ లగ్యాఁ హూణా హో జో హూయాఁ ।**

'గిరిధరగోపాలుడు తప్ప నాకెవరూ లేరు. నేను ప్రపంచమంతా గాలించాను. కాని మరెవరూ ఆయనలాంటి వారు నాకు లభించలేదు. సోదరులను, బంధువులను, సరిసంబంధీకులందరిని త్యజించేటంతగా ఆయన నన్ను వశపరచుకున్నాడు. సాధుసంతుల సాన్నిధ్యంతో వచ్చిన లోకనిందకు కూడ భయపడలేదు. హరిభక్తులను దర్శిస్తే మనస్సు ఆనందపడుతుంది. ఈ స్వార్థపూరిత ప్రపంచాన్ని చూస్తే మనస్సు వ్యాకులం చెందుతుంది. నేను ప్రీతి అనే పాలను చిలికి, భక్తి అనే నెయ్యి తీసి అవగుణమనే మజ్జిగ పారబోసాను. రాణా పంపిన నిండుగిన్నె విషం అమృత మనుకొని త్రాగి భక్తి పారవశ్యంలోకి జారుకున్నాను. ప్రభుగిరిధారీ! నేనేమో నిన్ను ప్రేమించాను. నాకిపుడు ఏమి జరిగినా ఫరవాలేదు!'

**పాఠాంతరం :** మేరే తో గిరిధర్ గోపాల్, దూసరో న కోఈ।

**జాకే సిర్ మోర్ ముకుట్, మేరో పతి సోఈ।**

**. . . . . . . . . . . . . . . . . . . . . . . . .**

**మేరో తో గిరిధర్ గోపాల్, దూసరో న కోఈ।**

ఈ పాఠాంతర తాత్పర్యము పై పదము కంటే భిన్నంగా ఉంది. ఈ పదాన్ని 'భారతరత్న' యం.ఎస్. సుబ్బులక్ష్మి, శ్రీమతులు లక్ష్మీశంకర్, వాణీ జయరాంలు గానం చేసి గ్రామఫోను రికార్డులుగా యిచ్చారు.

10. మురళీలోలుడు తనను ప్రేమించి వదలివెళ్ళాడని ఆక్రోశిస్తూ వుంది మీరా ఈ పదంలో.

**హోజీ హరి కిత్ గఏ నేహ్ లగాయ్ ।**

**. . . . . . . . . . . . . . . . . . . . . . . . .**

**మీరా కే ప్రభు కబరే మిలోగే, రహే మధుపురీ ఛాయ్ ।**

'మోహన్‌కృష్ణా! నన్ను ప్రేమించి ఎక్కడకు వెళ్ళిపోయావు? వలపులూరించే తీయ తేనియ మాటలు

చెప్పి నా మనస్సు హరించి మాయమయ్యావు. ఈ విరహవేదన భరించడం కంటే విషం మ్రింగి మరణించడమే మేలని నాకు అనిపిస్తూ వుంది. నన్ను నీ ప్రేమనౌకలో ఎక్కించి మధ్యలో వదలిపెట్టి పోయి ఎందుకు విశ్వాస ఘాతుకం చేశావు? ప్రభూ! నీవేమో మధురానగరిలో స్థిరపడ్డావు. మరి నన్నెపుడు కలుస్తావు?' అంటూ విరహబాధకు లోనవుతూ వుంది మీరా.

**విశేషం :** జహర్, విష్ – పునరుక్తి దోషం

1 నుండి 10 పదాలను 'భారతరత్న' శ్రీమతి లత గానం చేసి సీడీగా యిచ్చింది.

11. తన ప్రియ వేణుగోపాలుడు ఎక్కడున్నా వెదికి పట్టుకుంటానంటూ వుంది మీరా యీ పదంలో.

**చాలాఁ వాహీ దేస్ ప్రీతమ్ పావాఁ, చాలా వాహీ దేస్**
**. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .।**
**మీరా రే ప్రభు గిరిధర్‌నాగర్, సుణాజ్యో బిడద్ నరేస్।**

'నా ప్రియ శ్యాం ఏ దేశంలో లభిస్తాడో అక్కడికి వెళ్తాను. నీవు కోరితే ఎర్రరంగు చీర ధరించి వస్తాను. కాషాయరంగు చీర కట్టుకొని రావడమే నీ కోర్కెకైతే అలాగే వస్తాను. నీ ఆజ్ఞ అయితే నాకు నచ్చిన ముత్యాల సొమ్ములు పెట్టుకొని వస్తాను లేదా ఏమీవద్దు, కురులు విరబోసుకొని రమ్మంటే అట్లాగే వస్తాను. ప్రభూ గిరిధరనాగర్! నీ ఆజ్ఞే నాకు శిరోధార్యం. వ్రజరాజా! నా వేదన మన్నించాలి.'

విశేషం : ఈ పదంలో వైష్ణవ, నాథ్‌పంథ్‌ల సమన్వయ ప్రభావం కనిపిస్తున్నది. ఈ పదాన్ని శ్రీమతి లత సిడిగా, శ్రీమతి కిషోర్ అమోంకర్ గ్రామఫోను రికార్డుగా యిచ్చారు.

12. పంకజనాభుని అనంతమోహన రూపానికి తలవంచానని చెబుతూ వుంది మీరా యీ పదంలో.

**మ్హారో ప్రణామ్ బాంకే బిహారీ జీ।**
**మోర్ ముగట్ మాథ్యా తిలక్ విరాజ్యాఁ, కుండల్ అలకాఁరీ జీ।**
**అదర్ మధుర్ ధర్ వంశీ బజావాఁ, రీఝ్ రిఝావాఁ బజ్ నారీ జీ।**
**యా ఛబ్ దేఖ్యా మోహ్యాఁ మీరాఁ, మోహన్ గిరిధర్‌ధారీ జీ।**

'రసిక శ్రేష్ట శ్రీకృష్ణా! మా ప్రణామాలు స్వీకరించు. నీ తలపై నెమలిపింఛం, నుదుటిపై తిలకం నీకు శోభను కల్గిస్తున్నాయి. నీవు ధరించిన కర్ణకుండలాలు, నీ నల్లని వెంట్రుకలు నీకు అత్యంత సొగసు చేకూర్చుతున్నాయి. నీవు వేణువు మ్రోగిస్తూ ఆ మధురస్వరానికి ముగ్ధుడవై, వ్రజనారీ మణులందరిని మోహింపజేస్తున్నావు. మనస్సును ఆకర్షించే గిరిధారీ కృష్ణా! నీ అనంత సౌందర్యకాంతికి సమ్మోహితురాల నవుతున్నాను.'

**విశేషం :** (i) మీరా శ్రీకృష్ణుని విభిన్న సార్థక సంబోధనలతో – 'బాంకే బిహారీ' (రసికశ్రేష్ట కృష్ణా), 'మోహన్' (మోహింపచేసేవాడా), 'గిరిధారీ' (బలశాలి, రక్షకుదు) – చిత్రించింది.

(ii) ఈ పదంలో వైష్ణవ ప్రభావం స్పష్టంగ వుంది.

13. ఎన్నిసార్లు ప్రార్థించినా కరుణించని శ్యామలాభిరాముని ప్రేమ స్వార్థపూరితమని నిందిస్తూ వుంది యీ పదంలో మీరా.

**జావో హరి నిర్మోహియా, జాణీ థాఁరీ ప్రీత్।**
**లగన్ లగీ జబ్ ప్రీత్ ఔర్ హీ, సబ్ కుఛ్ అవలీ రీత్।**
**అమ్రిత్ ప్యాయ్ కై విష్ క్యాఁ దీజై, కూణ్ గాఁవ్ కీ రీత్।**
**మీరా కహై ప్రభు గిరిధర్‌నాగర్, ఆప్ గరజ్ కే మీత్।**

'నిర్మోహి హరీ! నీ ప్రేమ స్వార్థపూరితమని బాగా తెలుసుకున్నాను. ప్రేమించినపుడు నీ ప్రేమ సానుకూలత ప్రదర్శించేది. ఇపుడేమో అందుకు వ్యతిరేకంగా మారి పోయింది. మొదట అమృతం రుచిచూపించి, తర్వాత విషమివ్వడం ఏ దేశపద్ధతి? ముందు సుఖం రుచి చూపించి తర్వాత దుఃఖానికి గురి చేయడం ఎక్కడాలేని పద్ధతి. ప్రభూ గిరిధరనాగర్! నీవు స్వార్థపర మిత్రుడవు'.

విశేషం : **జాణారే మోహణా జాణా, థారే ప్రీత్।**
**ప్రేమ్ భగతి రో పైడా మ్హారో, అవరుణ్ జాణారీత్।**
**ఇమరత్ పాఇ విషాఁ క్యూఁ దీజ్యా, కూణ్ గాఁవ్ రీ రీత్।**
**మీరా రే ప్రభు హరి అవినాసీ, అపణో జనారో మీత్।**



ఈ పదం కూడ మీరా గీతమే. రెండిటి అర్థమూ ఒక్కటే. మీరా భక్తి పారవశ్యంలో చెప్పినవే పలుసార్లు ఉటంకించిన సందర్భాలు – రాణా త్రాచును, విషం పంపడం, నీరు-చేప, చంద్రుడు – చకోరపక్షి, పదేపదే శ్రీకృష్ణుని అందాన్ని ఒకే పదజాలంతో వర్ణించుట మొదలగునవి ఉన్నాయి. ఇది కూడ అలాంటిది కావచ్చు. ఈ రెండింటికి గల ప్రత్యేకత – అర్థం పూర్తిగా ఒక్కటే. అందువల్ల యిది గాని, పైది గాని ప్రక్షిప్తమనడానికి కూడ అవకాశం ఎక్కువ.

14. ప్రభువు! కరుణించకపోతే తాను దుఃఖభారంతోనే సంసారయాత్ర ముగించవలసి వస్తుందని వాపోతూ వుంది యీ పదంలో మీరా.

**జోగీ మ్హానే, దరస్ దియాఁ సుఖ్ హోఇ।**
**నాతిర్ దుఖ్ జగ్ మాహిఁ జీవడో, నిస్ దిన్ ఝూరై తోఇ।**
**దర్ద్ దివానీ భఈ బాబరీ డోలీ సబ్‌హీ దేస్।**
**మీరా దాస్ భఈ హై పండర్ పల్‌ట్యా కాలా కేష్।**

'ప్రియతమా! నీవు దర్శనమిస్తేనే నాకు సుఖశాంతులు ప్రాప్తిస్తాయి. లేదంటే ఈ సంసారం నుండి దుఃఖంతోనే నిష్క్రమించాల్సి వుంటుంది. లేదా నీకోసం రాత్రింబవళ్ళు విరహంలో వ్యాకులపడుతూ పిచ్చిదాన్నై పోతాను. నీ పొలకువ కోసం వెదకని ప్రదేశం లేదు. ప్రభూ! నేను నీ దానిని. నీ విరహంతో శరీరమంతా పాలిపోయి శల్యమయ్యాను. నా వెంట్రుకలు కూడ తెల్లనైనాయి.'

15. తన ప్రియుడు ఘనశ్యాం తన దగ్గరకు చేరుకున్నాడని మురిసిపోతూ వుంది ఈ పదంలో మీరా.

**జోసీడా ణే లాఖ్ బధాయా ఆస్యాఁ మ్హారో స్యామ్।**
. . . . . . . . . . . . . . . . . . . . . . .
**మీరా రే సుఖ్ సాగర్ స్వామీ, భవణ్ పధార్‌యా స్యామ్।**

'జ్యోతిష్కుల భవిష్యవాణి నిజమైంది. నా ప్రియుడు శ్యాం నా వద్దకు వచ్చాడు. జోతిష్కులకు లక్ష ధన్యవాదాలు. నా శ్యాం నాదరి చేరినందువల్ల నా సంతోషం ద్విగుణీ కృతమైంది. నాకు సుఖశాంతులు చేరువైనాయి. నలుప్రక్కల ఆనందమే ఆనందం చుట్టుముట్టింది. నా పంచేంద్రియాలతో నా ప్రియుని ప్రసన్నుని చేసుకుంటాను. ప్రియసఖీ! ప్రియుని చూస్తూనే దుఃఖమంతా మటుమాయమై పోయింది, మనోరథాలన్నీ లభించాయి. సుఖానికి నిలయమైన శ్యాం! నీవు నా ఇంటిని పావనం చేయడంవల్ల నా ఆనందం ఎంత వెల్లివిరిసిందంటే నేను వర్ణించలేను.'

16. పరదేశంలో వున్న తన ప్రియుడు శౌరిని తిరిగి రమ్మని వేడుకుంటూ వుంది యీ పదంలో మీరా.

**సావణ్ దే రహ్యా జోరా రే ఘర్ ఆవో జీ స్యామ్ మోరా, రే।**
**ఉమడ్ ఘుమడ్ చహుందిస్ సే ఆయా, గర్‌జత్ హై ఘన్ ఘోరా రే।**
**దాదుర్, మోర్, పపీహా బోలే, కోయల్, కర్ రహీ సోరా, రే।**
**మీరా కే ప్రభు గిరిధర్‌నాగర్, జ్యోఁ వారూఁ సోహీ థోరా రే।**

'శ్యాం! శ్రావణ మాసం నా కోరికలను ఉద్దీప్తం చేస్తూ వుంది. అందువల్ల పరదేశం నుండి ఇంటికిరా. ఆకాశంలో కారు మబ్బులు నాలుగు దిశలా గుంపులు గుంపులుగా వ్యాపించి భయంకరంగా గర్జిస్తున్నాయి. కప్పలు, చాతకపక్షులు అరవడం మొదలుపెట్టాయి. కోకిలలు కుహూ కుహూ అంటూ కోలాహలం చేస్తున్నాయి. నేను నీకేది సమర్పించినా అది చాలా స్వల్పమే.'

17. తన జీవిత నౌకను వైతరణి దాటించమంటూ వైకుంఠుని వేడుకుంటూంది యీ పదంలో మీరా.

**మేరో బేడో లగాజ్యా పార్ ప్రభు జీ మైఁ అర్‌జు కరూఁ ఛై।**
. . . . . . . . . . . . . . . . . . . . . . .
**మీరా కే ప్రభు గిరిధర్‌నాగర్, ఆవాగమన్ నివార్।**

'ప్రభూ! నా నావను దాటించు – అనగా నన్ను రక్షించమని ప్రార్థిస్తున్నాను. ఈ భవబంధాలలో బహుదుఃఖం అనుభవిస్తున్నాను. నా చిత్తం ఎల్లప్పుడు అనుమానాలు, దుఃఖాల పీడనకు గురైంది. వీటి నుండి నన్ను నీవు మాత్రమే విముక్తి ప్రసాదించగలవు. లాలసత్వం, మోసం, మాయలతో నిండిన యీ 84 లక్షల యోనుల నుండి ప్రవహించే సంసారసాగరం – జనన మరణకాల స్వరూపంలో అష్టకష్టాలు పడే నన్ను కాపాడు. ప్రభూ గిరిధరనాగర్! నన్ను ఈ జననమరణ బంధం నుండి పరిరక్షణ చేసి ముక్తిని ప్రసాదించు.'

12 నుండి 17 వరకు శ్రీమతి కిషోరి అమోంకర్ గానం చేసి గ్రామఫోను రికార్డుగ యిచ్చింది.

18. 'తాను ముస్తాబై తన భర్త దగ్గరకు వెళ్తుంటే నీ వాళ్ళెవరూ నన్నడ్డగించలేర'ని రాణాను నిలదీస్తూ వుంది యీ పదంలో మీరా.

**తోరో కోఈ నహిఁ రోకణ్‌హార్, మగన్ హోఇ మీరా చలీ।**
. . . . . . . . . . . . . . . . . . . . . . .
**తుమ్ జావో రాణా ఘర్ అపణే, మేరీ థాఁరీ నాఁహి సరీ।**

'రాణా! నీవారెవరూ నన్నడ్డగించలేరు. నేను గిరిధర గోపాలుని మనసారా ప్రేమిస్తున్నాను. ఆయన నా భర్త. సిగ్గు, కులమర్యాదలు నా మనస్సు నుండి వెళ్ళనడిపాను.

మానావమానాలను రెండింటిని నడుముకు రుమాలుగ కట్టివేశాను - అనగా వదలిపెట్టాను. జ్ఞానమార్గం తెలుసుకున్నాను. పంచరంగుల జడకుచ్చులు కట్టుకొని, వికసించిన పూలమొగ్గలు కురులలో తురుముకొని, అందమైన వంకీలు - మోచేతికి, భుజానికిగల మధ్యభాగంలో స్త్రీలు ధరించే బంగారు నగలు - సొగసైన తాటంకములు ధరించి, అందమైన కుంకుమబొట్టు పెట్టుకొని, మంగళహారతి పళ్ళెం చేతితో పట్టుకొని వెల్లివిరిసిన శోభతో, ఎత్తైన సౌధంలో ఎర్రని తలుపులుగల గదిలో పాన్పుపై పవళించిన నా భర్త మదనమోహనుని కోసం వెళ్తాను. రాణా! నీ యింటికి వెళ్ళిపో, నాతో పెట్టుకోకు.'

ఈ పదం శ్రీమతి లక్ష్మీశంకర్ పాడి గ్రామఫోను రికార్డుగ యిచ్చింది.

శ్రీకృష్ణుడు నిజంగా వున్నాడని నమ్మి మధురభక్తితో ఆయనను భర్తగ స్వీకరించి జీవితకాలమంత విరహబాధ అనుభవించి కనుమరుగైన పరమపవిత్రురాలు మీరా. ఆమె సరసన చేర్చదగినవారు అక్కమాంబ లాంటివారు తప్ప మరెవరు కనుపించరు. సకృత్తుగ వెంగమాంబ లాంటివారు వుండవచ్చు. వారు మీరాకు సాటిరాలేరు. అట్టి భక్తురాలికి ఒక చిన్న స్మృతిచిహ్నమైనా లేకపోవడం ఈ దేశం దురదృష్టం. మి

---


**కోడూరు పుల్లారెడ్డి**
**విశ్రాంత సూపరింటెండెంట్ ఇంజనీర్,**
**విద్యుత్ బోర్డు, కళ్యాణ్‌నగర్-3,**
**హైదరాబాద్-18.**
**ఫోన్ : 9550818495**


---





# మిసిమి

పాఠకులకు ప్రత్యేకం

333 ఆర్ట్‌పేపర్ పుటలతో,
హార్డ్‌కేస్ బౌండ్ 514 చిత్రాలతో
కళాత్మకంగా వెలువడిన అద్భుతమైన గ్రంథం

# సప్తపర్ణి

దీనిలో 70 మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ చిత్రకారులు, శిల్పులతోపాటు చలన చిత్ర ప్రముఖులపై రాసిన ప్రత్యేక విశ్లేషణావ్యాసాలతో నిండిన ఈ **సప్తపర్ణి** (₹ 777/-) **మిసిమి** పాఠకులకు కేవలం ₹ **500/-** లకే అందజేస్తున్నాము.

*మీ కాపి కోసం మిసిమి కార్యాలయాన్ని సంప్రదించండి.*

**మిసిమి** మాసపత్రిక
**Kala Jyothi Process Pvt.Ltd.,**
1-1-60/5, R.T.C 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020
Ph : 040-27645536, Cell: 99480 83387
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

# అనేకుల్లో ఒకడు



సుఖదేవ్

**గొ**ప్ప సాహసం, త్యాగం, దేశభక్తిగల అమరవీరుడుగా ప్రసిద్ధుడైన సుఖదేవ్ (1907-1931) పంజాబ్‌లోని లూధియానాలో పుట్టాడు. పంజాబ్‌లో విప్లవదళాన్ని సంఘటిత పరిచాడు. 1928లో జరిగిన సత్యాగ్రహంలో పోలీసులు లాఠీలతో కొట్టడంతో ఆ గాయాలకు 'పంజాబ్ కేసరి'గా ప్రసిద్ధుడైన లాలా లజపత్‌రాయ్ చనిపోయాడు. అందుకు ప్రతీకారంగా విప్లవకారులు ఒక బ్రిటిష్ పోలీసు ఆఫీసరును హత్యచేశారు. ఈ హత్యలో 'భగత్‌సింగ్, రాజగురు'లకు తోడ్పడిన వాడుగా ఈయన ప్రసిద్ధుడు. వీరు ముగ్గురిని 1931, మార్చి 23న ఉరితీయడం జరిగింది.

ఉరి తీసేముందు విప్లవకారులు తమ హింసాత్మక చర్యలు విరమించాలని గాంధీజీ ఇచ్చిన పిలుపును నిరసిస్తూ, ఈయన గాంధీజీకి ఉత్తరం రాశాడు. ఈ ఉత్తరం, దానికి గాంధీజీ ఇచ్చిన సమాధానం ద్వారా భారత స్వాతంత్ర్యోద్యమంలోని రెండు ప్రధాన ఆలోచనా ధోరణుల తేడా స్పష్టంగా తెలుస్తుంది.

**పరమ కృపాళువు గాంధీజీ,**

**ప్ర**భుత్వంతో మీ రాజీ చర్చలు సఫలమైన తర్వాత నుంచి మీరు విప్లవకారులను కనీసం కొంతకాలం వరకైనా తమ ఉద్యమం నిలిపివేయమని బహిరంగంగా కోరుతున్నట్లు తాజా వార్తల ద్వారా తెలుస్తోంది. నిజానికి ఏ ఉద్యమాన్నైనా నిలిపివేయడమనేది ఒక సిద్ధాంతం కారణంగాగానీ, భావుకత వల్లగానీ చేసే పనికాదు. మారిన పరిస్థితుల అవసరాల గురించిన ఆలోచనే ఉద్యమ నాయకులను తమ రణనీతిని మార్చుకొనేందుకు బాధ్యులను చేస్తుంది.

శాంతి నెలకొల్పడానికి చర్చలు జరిపిన సమయంలో ఈ ఒడంబడిక అంతిమమైన ఒడంబడికగా మాత్రం ఉండబోదనే విషయాన్ని మీరు క్షణమాత్రంకూడా మరిచి ఉండరనే విషయాన్ని దాచిపెట్టే ప్రయత్నం కూడా మీరు చేయలేదనే అనుకుందాం. కానీ మీరు సంపాదించబోయే సంస్కరణలన్నీ అమలులోకి వచ్చిన తర్వాత కూడా మనం మన అంతిమ గమ్యం చేరలేదని వివేకవంతులందరు భావిస్తారనే నేననుకుంటాను. సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చేదాకా నిర్విరామంగా పోరాటం సాగించేందుకు లాహోర్ తీర్మానం ద్వారా కాంగ్రెస్ కట్టుబడి ఉంది. ఈ తీర్మానం దృష్ట్యా శాంతి ప్రతిపాదనలు, రాజీలు పోరాటం మధ్యలోని తాత్కాలిక సంధిలాంటివి మాత్రమే. దీనికి అర్థం- ముమ్ముందు జరిగే పోరాటానికి మరింత పెద్ద ఎత్తున, మరింత వ్యూహాత్మకంగా సైన్యాలను సిద్ధం చేసుకోవడానికి కొంతకాలం విశ్రాంతి తీసుకోవడం అన్నమాట! ఈ ఆలోచనలను గుర్తుంచుకున్నప్పుడు మాత్రమే మనం రాజీ గురించిగానీ, సంధి గురించిగానీ, ఊహించగలం, దాని ఔచిత్యాన్ని రుజువు చేయగలం.

సంధి ఏదైనా, అది ఎప్పుడు, ఎలాంటి షరతులతో అమలుపరచాలి, అనే నిర్ణయం మాత్రం ఉద్యమ నాయకులే చేయవలసి ఉంటుంది. లాహోర్ తీర్మానం ఒకప్రక్క ఉన్నాకూడా ఇప్పుడు కొంతకాలందాకా క్రియాశీలమైన ఉద్యమాన్ని ఆపివేయడం ఉపయోగకరంగా ఉంటుందని మీరు భావించారు. అయినా ఆ తీర్మానం మాత్రం ఏమీ మారలేదు. అదేవిధంగా 'హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లిక్ పార్టీ' విప్లవకారులు ఈ పార్టీలోని వారి పేరే తెలుపుతున్నట్లుగా దేశంలో ఒక గణతంత్ర రాజ్యాన్ని స్థాపించాలనే ఉద్దేశ్యంతో ఉన్నారు. ఈ గణతంత్ర రాజ్యం ఎలాంటి రాజీలను, అర్థం-పర్థం లేని సమాధానాలను అంగీకరించేది కాదు. విప్లవకారులు తమ లక్ష్యం సిద్ధించేవరకు, తమ ఆదర్శం ఆచరణలోకి వచ్చేవరకు తమ పోరాటాన్ని కొనసాగించేందుకు కృతసంకల్పులై ఉన్నారు. అయినా మారుతున్న పరిస్థితులను, వాతావరణాన్నీ అనుసరించి తమ యుద్ధనీతిని మార్చుకొనే సమయస్ఫూర్తి వారికి తప్పకుండా ఉంది. విప్లవ పోరాటం వేర్వేరు దశల్లో

హిందీ మూలానికి తెలుగు అనువాదం : డాక్టరు జె. లక్ష్మిరెడ్డి, ఫోన్ : 9533581630

వేర్వేరు రూపాలు ధరిస్తూ ఉంటుంది. ఒక్కోసారి అది పూర్తిగా బహిరంగంగా, సార్వజనికంగా ఉంటుంది, మరోసారి ప్రచ్ఛన్నంగా, రహస్యంగా సాగుతుంది. ఒకప్పుడు కేవలం ఉద్యమ రూపంలో సాగితే మరొకప్పుడు చావు-బ్రతుకుల భయంకర సంగ్రామంగా మారుతుంది. అలాంటప్పుడు విప్లవకారులు తమ ఉద్యమాన్ని ఆపివేయడానికి కొన్ని ప్రత్యేక కారణాలు ఏర్పడి ఉండి తీరాలి. కానీ, మీరు అలాంటి ఖచ్చితమైన కారణాలేవీ బయటపెట్టలేదు. కేవలం భావుకత ఆధారంగా చేసిన అభ్యర్థనలకు విప్లవ పోరాటంలో పెద్ద విలువ ఏమీ ఉండదు. ఉండడానికి వీలుకూడా లేదు.

ఒడంబడిక చేసుకున్న తర్వాత మీరు మీ ఉద్యమాన్ని నిలిపేశారు. తత్ఫలితంగా మీ ఖైదీలందరు (సత్యాగ్రహులందరు) విడుదల అయ్యారు. మరి విప్లవ ఖైదీల మాటేమిటి? 1915 నుండి జైళ్లల్లో పడి ఎందరో గదర్ పార్టీ వాళ్ళు వారి శిక్ష గడువు పూర్తి అయినా కూడా ఇప్పటికీ జైళ్ళల్లోనే మగ్గిపోతున్నారు. మార్షల్‌లా క్రింద బందీలైన మరెందరో నేటికీ సజీవ సమాధి చేయబడినవాళ్ళలా పడి ఉన్నారు. బబ్బర్ అకాలీ ఖైదీల పరిస్థితి కూడా అలాగే ఉంది. దేవగఢ్, కాకోరీ, మఛువా బాజార్, లాహోర్ కుట్రకేసు, వీటన్నింటికి సంబంధించిన ఖైదీలుకూడా అనేక ఇతర ఖైదీలతోపాటు జైళ్ళల్లో పడిఉన్నారు. లాహోరు, ఢిల్లీ, చట్‌గాంవ్, బొంబాయి, కలకత్తా, తదితర చోట్లల్లో కుట్రకు సంబంధించిన కొన్ని డజన్ల కేసులు నడుస్తున్నాయి. డజన్లకొద్దీ విప్లవకారులు పరారైపోయారు. వారిలో ఎందరో మహిళలు కూడా ఉన్నారు. ఒక డజనుకుమించి ఖైదీలు నిజంగానే ఉరిత్రాడుకోసం ఎదురు చూస్తున్నారు. వీరందరి గురించి ఏం చేశారు? లాహోరు కుట్రకేసు విషయంలో ఉరిశిక్ష పొందిన ముగ్గురు ఖైదీలకు అదృష్టవశాత్తు చాలా ప్రాధాన్యమేకాక ప్రజల అపారమైన సహానుభూతికూడా లభించింది. కానీ 'విప్లవదళం' అంటే వారు ముగ్గురు మాత్రమే కాదుగదా! మరెందరో ఉన్నారు. ఆ ముగ్గురి భవిష్యత్తే ఆ దళం ఎదుర్కొంటున్న ఒకే ఒక సమస్య కాదు. నిజం చెప్పాలంటే వారి శిక్ష తగ్గడం ద్వారా కంటే వారు ఉరికంబమెక్కడం ద్వారానే దేశానికి ఎక్కువ మేలు జరిగే అవకాశం ఉంది.

ఇదంతా ఇలా ఉన్నా కూడా మీరు ఉద్యమం ఆపివేయమని బహిరంగంగా వారిని కోరుతున్నారు. వాళ్ళు ఉద్యమం ఎందుకు ఆపేయాలి? ఖచ్చితమైన మాట ఏదీ మీరు చెప్పలేదు. ఇలాంటి స్థితిలో విప్లవోద్యమం ఆపివేయమని మీరు చేసే అభ్యర్థనలకు ఒకే ఒక అర్థం ఉండగలుగుతుంది. అది మీరు ఈ ఉద్యమాన్ని అణిచివేయడంలో ప్రభుత్వానికి సహాయపడుతున్నారనీ, విప్లవదళానికి ద్రోహాన్నీ, పలాయనాన్నీ, విశ్వాసఘాతాన్నీ ఉపదేశించదలచారని. ఇలాంటి ఉద్దేశ్యం లేకపోతే మీరు కొందరు ప్రముఖ విప్లవకారులతో సంపర్కం ఏర్పరచుకొని వారితో వీటన్నిటి గురించి వివరంగా మాట్లాడి ఉండేవారు. వాళ్ళు తమ ఉద్యమాన్ని నిలిపి వేయడానికి పూర్తిగా సమ్మతించే దిశగా మీరు ప్రయత్నించవలసింది. విప్లవకారులు ఉచితానుచిత వివేకం లేనివారని, విధ్వంస-వినాశాల ద్వారా వారికి ఆనందం కలుగుతుందని కొందరు గుడ్డిగా నమ్ముతున్నట్లు మీరు కూడా నమ్ముతున్నారని నేననుకోను. వాస్తవం దీనికి పూర్తి వ్యతిరేకంగా ఉందని నేను మీకు చెప్పదలచుకున్నాను. విప్లవకారులు ఏ పని చేయదలచుకున్నా ముందుగా ఎల్లప్పుడు దాని ఔచిత్యాన్ని గురించి, దాని పర్యవసానాన్ని గురించి ఆలోచిస్తారు, తమ ప్రతి చర్యలోను బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారు. అంతేకాక, ప్రస్తుత పరిస్థితుల్లో తమ కార్యకలాపాల్లోని విధ్వంసక పార్శ్వంలోనే లీనమై ఉండడానికి మించి ఏమీ చేయలేకపోయినా, నిజానికి విప్లవ కార్యక్రమం యొక్క నిర్మాణాత్మక పార్శ్వానికే వారు మిగతా అన్ని పార్శ్వాలకంటే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తారు.

ప్రభుత్వం విప్లవకారుల పట్ల ప్రస్తుతం అవలంబిస్తున్న విధానం ఏమిటంటే, విప్లవకారులు తమ ఉద్యమం ద్వారా సంపాదించుకున్న ప్రజల సహానుభూతి, సమర్థన వారికి లేకుండా చేయడం. అలా చేసి ప్రభుత్వం వారిని అణచివేయాలని చూస్తోంది. ఒంటరివాళ్ళు అయిపోయినప్పుడు వాళ్ళను సులభంగా వేటాడవచ్చు. ఇలాంటి వాస్తవాలను గమనించినప్పుడు వారిలో భేదాభిప్రాయాలను, అభ్యర్థనలనైనా, పూర్తిగా వివేక రహితమైనవిగాను, విప్లవాన్ని నీరుకార్చేవిగానే అయిఉంటాయి. అలా చేయటం ఆలోచనా రహితమైనది. వారిని అణచివేయడంలో ప్రభుత్వానికి సహాయం అందించడం కూడా అవుతుంది.

అందువల్ల మేము మిమ్ములను అభ్యర్థించేదేమంటే, మీరు కొందరు విప్లవ నాయకులతో మాట్లాడి, అలాంటి వాళ్ళు జైళ్ళలో చాలామందే ఉన్నారు. వాళ్ళతో ఒక ఒడంబడికకైనా రండి, లేదా ఇలాంటి అభ్యర్థనలు చేయడమైనా

మానుకొండి. మీరు ఈ రెండింటిలో ఏదో ఒక మార్గం ఎన్నుకొని పూర్తి చిత్తశుద్ధితో దాన్ని అనుసరించండి. అదే మంచిది. మీరు వాళ్ళకు సహాయం చేయలేకపోతే మానెయ్యి, వాళ్ళపైన దయ ఐనా చూపండి. వాళ్ళమానాన వాళ్ళను ఉండనివ్వండి. వాళ్ళు తమ బాగోగులు తామే బాగా చూసుకోగలుగుతారు. ముందు జరగబోయే రాజకీయ పోరాటంలో విప్లవదళమే తప్పక నాయకత్వం వహించబోతూందని వారికి తెలుసు. వారి పిలుపు అందుకొని ప్రజలు వారిచుట్టూ వచ్చి చేరుతున్నారు. విప్లవకారులు తమ జెండా కిందికి ప్రజలను సమీకరించి, వారిని సమాజవాద ప్రజాస్వామ్యం యొక్క మహోన్నత లక్ష్యంవైపు నడిపించే దినం ఎంతో దూరంలేదు.

అలాకాక మీరు నిజంగానే వాళ్ళకు సహాయం అందించదలచుకుంటే వాళ్ళ దృక్పథాన్ని అర్థం చేసుకొనేందుకు వాళ్ళతో కూర్చొని మాట్లాడండి, సమస్యను అన్ని పార్శ్వాలనుంచి వివరంగా చర్చించండి.

పై అభ్యర్థనను గురించి మీరు ఆలోచిస్తారనీ, మీ అభిప్రాయాన్ని సార్వజనికంగా తెలియజేస్తారని ఆశిస్తున్నాను.

మీ
అనేకుల్లో ఒకడు
మార్చి, 1931

# గాంధీజీ జవాబు



'అనేకుల్లో ఒకడు' పేరుతో వచ్చిన బహిరంగ లేఖ కీర్తిశేషుడు సుఖదేవ్ రాసింది. శ్రీ సుఖదేవ్, భగత్‌సింగ్ సహచరుడు. నాకీ ఉత్తరం ఆయన మరణించిన తర్వాత ఇవ్వడం జరిగింది. వ్యవధి లేనందువల్ల దీన్ని ఇంతకంటే ముందు ప్రచురించలేకపోయాను. ఈ ఉత్తరం యధాతథంగా మరోచోట ఇవ్వబడింది.

లేఖ రచయిత 'అనేకుల్లో ఒకడు' కాదు. రాజకీయ స్వాతంత్ర్యంకోసం ఉరిత్రాడును మెడలో వేసుకునే వారు ఎక్కువమంది ఉండరు. రాజకీయ హత్యలు ఎంత నిందించదగినవైనా ఎలాంటి దేశప్రేమతో, సాహసంతో ఇలాంటి భయోత్పాదకమైన పనులు చేయడం జరుగుతుందో, వాటిని గుర్తించ నిరాకరించడం సాధ్యంకాదు. దీంతోపాటు రాజకీయ హత్యల ఆచారం మాత్రం పెరగడంలేదని ఆశిద్దాం. భారతదేశంలోని ప్రయోగం గనక సఫలమైతే, అది సఫలం కావడం తథ్యం, రాజకీయ హత్యలు చేసేవారి కార్యకలాపాలు శాశ్వతంగా ముగిసిపోతాయి. ఏది ఏమైనా నేను మాత్రం ఆ నమ్మకంతోనే పనిచేస్తున్నాను.

లేఖ రచయిత, విప్లవకారులకు వారి ఉద్యమం నిలిపివేయమని అభ్యర్థన చేయడానికి మించి నేను మరేమీ చేయలేదని అనడం నాపట్ల అన్యాయం చేయడమే అవుతుంది. ఎందుచేతనంటే నేను వారి ఎదుట ఈ విషయంలో (ఈ వాదనను నిరాకరించే) గట్టి సాక్ష్యాధారాలు ఉంచానని నొక్కి చెప్పగలనుకాబట్టి. అవన్నీ ఇంతకు మునుపు ఈ పత్రిక పుటల్లో ఇవ్వడం జరిగి ఉండినా మరోసారి వాటిని గుర్తుకు తెచ్చుకోవడం సమంజసమేనని నేను భావిస్తాను.

1. విప్లవ కార్యకలాపాలు మనలను మన లక్ష్యానికి దగ్గరగా తీసుకెళ్ళలేదు.
2. అవి దేశంలో సైనిక వ్యయాన్ని పెంచాయి.
3. వాటితో ఎలాంటి లాభము కలుగకపోగా అవి ప్రభుత్వం ప్రతీకారచర్యలు చేపట్టేట్లు చేశాయి.
4. ఎప్పుడెప్పుడైతే విప్లవకారులు హత్యలు చేశారో, అప్పుడంతా ఆయాచోట్ల ప్రజల్లోని స్థైర్యం కొంత కాలందాకా చెదిరిపోయింది.
5. ప్రజల్లో జాగృతిని పెంచడంలో అవి ఏ విధంగా కూడా తోడ్పడలేదు.
6. ప్రజలపైన రెండు విధాలుగా వాటి దుష్ప్రభావం పడింది. ఒకటి వాళ్ళపైన అదనపు ఖర్చు భారం పడింది, రెండోది వారు ప్రభుత్వ క్రోధానికి సంబంధించిన పరోక్ష ప్రభావానికి లోనుకావలసి వచ్చింది.
7. విప్లవ హత్య భారత భూమిలో పెంపొందే అవకాశం లేదు. ఎందుచేతనంటే భారతీయ సంప్రదాయం రాజకీయ హత్యకు అనుకూలం కాదు, అని భారతదేశ చరిత్ర ద్వారా మనకు తెలుస్తూంది గనక.

8. విప్లవకారులు ప్రజా సమూహాలను తమ పద్ధతిలోకి మార్చుకోదలచుకుంటే ఆ మార్పు జరగడానికి, దాని ద్వారా స్వాతంత్ర్యం సిద్ధించడానికి చెప్పలేనంత కాలందాకా వేచి ఉండవలసి ఉంటుంది.
9. హింసాత్మక చర్యలు ఒకవేళ ప్రజామోదం పొందినా కూడా, ఇతర దేశాల్లో జరిగినట్లుగానే అవి తిరిగి మనకే అపకారం చేయక మానవు.
10. విప్లవకారులు తమ పద్ధతికి వ్యతిరేకమైన పద్ధతి, అంటే అహింసా పద్ధతికి ఉన్న శక్తిని ప్రత్యక్షంగా చూశారు. వారు, అహింసోపాసకులమని చెప్పుకొనే మరికొందరు అప్పుడప్పుడు చేసే హింస జరుగుతూ ఉండినా కూడా ఈ అహింసా పద్ధతి కొనసాగుతూనే ఉంది.
11. వారి ఉద్యమంవల్ల అహింసా ఉద్యమానికి ఏ కొంతైనా లాభం కలగడం అటుంచి హాని మాత్రమే కలిగిందని నేను విప్లవకారులతో అన్నప్పుడు వారు నా మాటను అంగీకరించాలి. వేరే మాటల్లో చెప్పాలంటే, నాకు గనక సంపూర్ణమైన శాంతితో కూడిన వాతావరణం లభించి ఉంటే, మనమిప్పటికే మన లక్ష్యాన్ని సాధించి ఉండేవాళ్ళం.

ఇవన్నీ గట్టి సత్యాలని, ఉత్తుత్తి అభ్యర్థనలు కావని నేను నొక్కి చెప్పగలను. ఈ లేఖ రచయిత నా అభ్యర్థనలను చూసి, ఈ విధంగా నేను విప్లవోద్యమాన్ని అణచివేయడంలో ప్రభుత్వానికి సహాయం చేస్తున్నాననే మరో అభ్యంతరం కూడా వెలిబుచ్చుతున్నాడు. విప్లవోద్యమాన్ని అణచివేయడంలో ప్రభుత్వానికి నా సహాయం ఎంతమాత్రం అవసరం లేదు. తన అస్తిత్వాన్ని నిలుపుకోవడంకోసం అది విప్లవకారులతో పోరాడినట్లే నాతో కూడా పోరాడుతూంది. హింసాత్మక ఉద్యమంకంటే అహింసా మార్గమే ఎక్కువ ప్రమాదకరమని అది భావిస్తూంది కూడా. హింసాత్మక ఉద్యమం విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో దానికి తెలుసు. ఇప్పటికే దాని పునాదులు కదిలించిన అహింసోద్యమం విషయంలో అది దిగ్భ్రాంతి చెంది ఉంది. అంతేకాక రాజకీయ హత్య చేసేవారు భయావహమైన ఆ మార్గంలో పయనించే ముందే అందుకు చెల్లించవలసిన మూల్యాన్ని లెక్కవేసుకొని ఉంటారు. నా ఏ చర్యకూడా వారి భవిష్యత్తును మరింత ప్రమాదకరంగా మార్చలేదు.

ఇంకోవిషయం. విప్లవదళం రహస్యంగానే తన కార్యకలాపాలు కొనసాగించవలసి ఉంటుంది కాబట్టి అందులోని సభ్యులతో పరిచయం లేనందువల్ల వారిని బహిరంగంగా అభ్యర్థించడానికి మించి నాకు వేరే దారి లేదు. దీనితోపాటు నా బహిరంగ అభ్యర్థనలు వృథా కాలేదని కూడా చెప్పదలచుకున్నాను. మునుపు విప్లవకారులుగా ఉండిన అనేకులు ఇప్పుడు నా సహచరులుగా ఉన్నారు.

ఈ బహిరంగ లేఖలో సత్యాగ్రహులు కాని ఇతర ఖైదీలు విడుదల చేయబడలేదనే ఫిర్యాదుకూడా ఉంది. ఈ ఇతర ఖైదీలను విడుదల చేయాలని పట్టుపట్టడం ఏ కారణాలవల్ల సాధ్యంకాలేదో, దాన్ని గురించి నేను ఈ పుటల్లో వివరించి ఉన్నాను. వ్యక్తిగతంగానైతే వీరిలో ప్రతి ఒక్కరు విడుదల కావాలనేదే నా కోరిక. వీరి విడుదల కోసం అన్ని విధాలా నేను ప్రయత్నిస్తాను. వీరిలో కొందరు ఇప్పటికి చాలా ముందే విడుదల అయి ఉండవలసిందని నాకు తెలుసు. ఈ విషయానికి సంబంధించి కాంగ్రెసు తీర్మానం కూడా ఒకటి ఉంది. ఇలాంటి ఖైదీలందరి జాబితా తయారుచేసే పని శ్రీయుతులు నారిమన్‌కు కార్యసమితి అప్పగించింది. అందరు ఖైదీల పట్టిక తయారుకాగానే వారిని విడుదల చేయించే చర్యలు మొదలవుతాయి. కానీ జైలు బయట ఉన్న విప్లవకారులు విప్లవవాద హత్యలు జరగకుండా చేసి ఆ చర్యలకు సహకరించాలి. అవ్వా కావాలి, బువ్వా కావాలి, అంటే కుదరదు. ఎట్టి పరిస్థితుల్లో కూడా విడుదల కావలసిన రాజకీయ ఖైదీలు కొందరు ఉన్నారనేది కూడా వాస్తవమే. దీనికి సంబంధించిన వారికందరికి నేను నమ్మకంగా చెప్పగలిగిందేమిటంటే ఇందులో జరిగిన జాప్యానికి కారణం కోరిక లేకపోవడం కాదు, శక్తి చాలకపోవడమేనని. చివరి ఒడంబడిక వచ్చినప్పుడు. అది ఒకవేళ వస్తే. కొన్ని నెలల్లో రాజకీయ ఖైదీలందరు తప్పక విడుదల కావలసిందే. అలా జరగనప్పుడు ఇప్పుడు రాజకీయ ఖైదీలనందరినీ విడుదల చేయించడానికి ఎవరైతే ప్రయత్నిస్తున్నారో, వారంతా స్వయంగా కూడా జైల్లో ఉంటారు.

**Young India**
**23.4.1931**

# మనో వికాస ప్రక్రియ – మధ్య ఆసియా కవిత్వం

– ముకుంద రామారావు

**1922**లో మొదలయిన సోవియట్ సమాఖ్య (U.S.S.R) 1991 నాటికి విచ్ఛిన్నమయింది. అందులోని 15 దేశాలు – ఉజ్బెకిస్తాన్, కజఖిస్తాన్, కిర్గిజిస్తాన్, తుర్క్మెనిస్తాన్, తజికిస్తాన్, అజెర్బాయిజాన్, ఆర్మేనియ, బెలారస్, ఎస్టోనియ, జ్యోర్జియ, లత్వియ, లిథుయానియ, మోల్డోవ, ఉక్రైన్, రష్యా స్వతంత్ర దేశాలుగా మారాయి.. వీటిల్లో రష్యా గురించి ఇంతకుముందు వ్యాసంలో తెలుసుకున్నాం. మొదటి అయిదు దేశాలు ఉజ్బెకిస్తాన్, కజఖిస్తాన్, కిర్గిజిస్తాన్, తుర్క్మెనిస్తాన్, తజికిస్తాన్ తో బాటు మరో మధ్య ఆసియా దేశం మంగోలియా కవిత్వ చరిత్ర కూడా ఈ వ్యాసంలో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. మిగిలిన మరో 9 దేశాల (అజెర్బాయిజాన్, ఆర్మేనియ, బెలారస్, ఎస్టోనియ, జ్యోర్జియ, లత్వియ, లిథుయానియ, మోల్డోవ, ఉక్రైన్) కవిత్వ చరిత్ర తరువాత వ్యాసంలో తెలుసుకుందాం.

మధ్య ఆసియా కవిత్వం మొదటినుండీ ఒక మనోవికాస ప్రక్రియ. జానపద కవులు ఇప్పటికీ చాయ్ ఖానాల్లో (టీకొట్లలో) కవిత్వ గానం చేయడాన్ని వింటూ, చాయ్ తాగుతూ అందరూ అమితానందాన్ని పొందుతుంటారు. కవిత్వ గానం, కవిత్వ పోటీలు, వివాహాలు లాంటి అనేక సందర్భాలలో నిర్వహిస్తుంటారు. ప్రజల్లో కవిత్వం పట్ల ఉన్న ఆదరణని దృష్టిలో పెట్టుకుని అప్పటి పాలకులు సైతం కవిత్వ రచన చేసి, వాటిని వారి ప్రజలు గానం చేస్తుండగా విని తరించేవారు. 16వ శతాబ్దం ప్రథమంలో ఉజ్బెక్ పాలకుడు షిబానీ ఖాన్ రాసిన హిక్మెత్ కావ్యం అందులో ఒకటి. ఇస్లాం ప్రవేశానికి పూర్వం అక్కడ టెంగ్రి, జొరాష్ట్రియన్, బౌద్ధం, క్రైస్తవం లాంటి అనేక మతాలు సహజీవనం చేసాయి. ఆయా మతాల సాహిత్యాలు కూడా తమతమ భాషల్లో అనువాదం కాబడ్డాయి. ఇస్లాం మతంతో బాటు తుర్కీ, అరబ్బీ, ఫారసీ, ఉర్దూ లాంటి భాషలూ అక్కడ వ్యాప్తి చెందడం మొదలైంది.

**ఉజ్బెకిస్తాన్ :** మధ్య ఆసియాకి గుండె లాంటిది. చారిత్రకంగా తుర్కిస్తాన్. ప్రముఖ ప్రాచీన నాగరికతతో, ఎగుడుదిగుడ్లు, అల్లకల్లోలాల మధ్య కొనసాగిన దేశం. ఈ దేశం ముఖ్య పట్టణాల గుండా అత్యంత ప్రముఖమైన సిల్కు రోడ్డు పోతుంది. ఈ సిల్క్ రోడ్డు, తూర్పు (చైనా) – పశ్చిమం (రోం) కి మధ్య సిల్కు ఎగుమతులు, దిగుమతులకు వీలుగా తయారై దాదాపు రెండువేల సంవత్సరాల వరకూ అత్యంత ప్రాముఖ్యంతో అలరారిన దారి. అలెగ్జాండర్ దండయాత్రలకు కూడా ఈ దారే ఎంతగానో ఉపయోగపడింది.

సరిహద్దు దేశాలుగా కజఖిస్తాన్, కిర్గిజిస్తాన్, తుర్క్మెనిస్తాన్, తజికిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లు ఉన్నాయి. ఇండో ఆర్యన్లు మొట్టమొదట అక్కడ నివాసం ఏర్పర్చుకున్నారని చరిత్రకారుల నమ్మకం. 8వ శతాబ్దంలో అరబ్ ఖలీఫా ఆక్రమించిన మవరన్నహర్ (నదికి ఆవల) ప్రాంతం. ఆ నదులు అముదర్య నది, సిరిదర్య నది, అముదర్య నదికి దక్షిణ భాగంలో ఉన్న ఖోరసన్ ప్రాంతాల మధ్య భూభాగమే ఇప్పటి ఉజ్బెక్, దాని పరిసర ప్రాంతాలూనూ. ఈ ఆక్రమణ ఆ ప్రాంతానికి సౌదీ అరేబియా నుండి ఇస్లాం మతాన్ని ప్రవేశ పెట్టింది. ఆ తరువాత అది అక్కడ సంస్కృతిలో ముఖ్యమైన భాగమై పోయింది. ఆ సమయంలో అక్కడ అగ్నిపూజ, బౌద్ధం, క్రైస్తవం, యూదుమతాలు కూడా ఉన్నాయి. 10వ శతాబ్దానికి ముస్లిం ప్రపంచానికి అది ఒక ముఖ్య కేంద్రంగా తయారైంది. ఫార్సీ కవిత్వానికి ఆద్యుడుగా భావించే 10వ శతాబ్దపు ఆబు అబ్దుల్లా రుడాకీ ఇప్పటి ఉజ్బెక్లోని బుఖారో పట్టణంలోనే తన జీవితంలోని ఎక్కువకాలం గడిపారు.

13వ శతాబ్దంలో, చెంఘీజ్ ఖాన్ నేతృత్వంలో మంగోలియన్లు దాడి చేసి అక్కడ విధ్వంసం సృష్టించారు.ఆ సమయంలోనే ఉత్తరం వైపునుండి సంచార తుర్కుల సంఖ్య పెరగడం మొదలైంది. 14 వ శతాబ్దం చివర్లో గిరిజన్ల యువరాజు తైమూర్, సమర ఖండ్ రాజధానిగా ఒక విశాల

సామ్రాజ్యాన్ని నెలకొల్పుకో గలిగాడు. కానీ అతని మరణానంతరం రాజకీయ అస్థిరత ఎక్కువైంది. 1500 ప్రథమార్ధంలో ఉత్తరంనుండి ఉజ్బెక్ గిరిజన తెగలకి చెందిన షాయిబానీ ఖాన్ తిరుగుబాటుతో, ఆ ప్రాంతం అప్పటి నుండి ఉజ్బెక్ల ఆధిపత్యం కొనసాగింది. 16-19 శతాబ్దాల మధ్య బుఖారా, ఖీవా, కోకండ్ కేంద్రాలుగా ఖాన్ల సామ్రాజ్యాలు సాగాయి. ఉలోగ్ బెగ్, హుస్సైన్ బయ్కరా, తరువాత జహీరుద్దీన్ మొహమ్మద్ బాబర్ (14 ఫిబ్రవరి 1483-26 డిసెంబర్ 1530) (భారత దేశంలో మొగల్ సామ్రాజ్యాన్ని నెలకొల్పిన వారు), ఉమర్ ఖాన్లు ఆ తరువాత రాజ్యమేలారు. 19వ శతాబ్దం రెండవ భాగంలో రష్యన్ల అధీనంలోకి పోకతప్పలేదు.

1850లో రష్యా, చైనా చేతులు కలిపి, తుర్కిస్తాన్ని ఆక్రమించి, వారి ఒడంబడిక ప్రకారం, పశ్చిమ తుర్కిస్తాన్ని రష్యా, తూర్పు తుర్కిస్తాన్ని చైనా పంచుకున్నారు. తాస్కెంట్ తుర్కిస్తాన్కి అధికారిక కేంద్రమయింది. కానీ రష్యన్లతో అసంతృప్తి మూలంగా వారితో అనేక సంఘర్షణల అనంతరం 1924లో పశ్చిమ తుర్కిస్తాన్ స్థానంలో ఉజ్బెకిస్తాన్, కజఖిస్తాన్, కిర్గిజిస్తాన్, తుర్క్మెనిస్తాన్, తజికిస్తాన్ రాష్ట్రాలై, వాటిని ఉజ్బెక్ సోవియట్ ప్రజాతంత్ర రాజ్యంగా మార్చబడింది. 1991లో సోవియట్ సామ్రాజ్యం పతన మయినపుడు ఉజ్బెకిస్తాన్ ఒక స్వతంత్ర రాజ్యమయింది. 88 శాతం అక్కడ ముస్లింలే ఉన్నారు. సరిహద్దులుగా ఆఫ్ఘనిస్తాన్, కజఖిస్తాన్, కిర్గిజిస్తాన్, తజికిస్తాన్, తుర్క్మెనిస్తాన్ దేశాలున్నాయి. ఉజ్బెక్ అంటే సత్యం లేదా మంచి లేదా సంరక్షక అని అర్థాలు వాడుకలో ఉన్నాయి. దాదాపు 120 వివిధ తెగలతో ఉన్న స్వతంత్ర దేశం ఉజ్బెకిస్తాన్.

ఉజ్బెక్ భాషా లిపి అనేక మార్పులకు లోనయింది. 10-12 శతాబ్దాల మధ్య టర్కీ లిపినుండి అరబ్బీ లిపికి మారిన భాషా లిపి, 13-14 శతాబ్దాల మధ్య అరబ్బీ ఫారసీ పదాలతో నిండిన ఛాగతై లిపిలోకి మారింది. చెంఘీజ్ ఖాన్ రెండవ కుమారుడైన ఛాగతై ఖాన్ పేరు మీద ఈ ఛాగతై లిపి మొదలయింది. 1920 లో అక్కడి బోల్షివిక్లు ఇస్లాంకి విరుద్ధంగా జరిపిన పోరాటంలో భాగంగా అప్పటివరకూ అరబ్బీ లిపిలో ఉన్న ఉజ్బెక్ భాషని లాటిన్ లిపిలోకి మార్చారు. స్త్రీ స్వాతంత్ర్యాన్ని, అక్షరాస్యతని పెంచారు. కానీ 1930 మధ్య భాగానికి రష్యన్ల ఒత్తిడి మూలాన, అక్కడి ఆచార వ్యవహారాల్ని, కట్టుబాట్లని అన్నింటినీ మార్చారు. భాష కూడా మార్పులు చేసారు.

ఉజ్బెక్ భాషలోని అరబ్బీ, పర్షియన్, తుర్కీ పదాలన్నింటినీ తొలగించి రష్యన్ పదాలతో నింపారు. 1940 నాటికి ఉజ్బెక్ భాష లాటిన్ లిపి నుండి క్రిల్లిక్ లిపిలోకి మార్చబడింది.

**ఉజ్బెక్ సాహిత్యం :** ఉన్నతమైన జానపదం, మౌఖిక సంప్రదాయాల మీద నెలకొల్పబడ్డ సాహిత్యం. ప్రాచీన కథల్లోని వీరులు అక్కడి ప్రజల నాలుకలమీద ఉంటారు. అవి వీరోచిత గాథలుగా, గీతాలుగా ఎవర్ని కదిలించినా బయటకొస్తుంటాయి. కొన్నాళ్లకు అవే ఉజ్బెక్ జానపద మహాకావ్యాలుగా రూపుద్దిద్దుకున్నాయి. వాటిల్లో చెప్పు కోదగ్గవి - *కయోర్ ఒగ్లీ , అల్పమిష్* మొదలైనవి. ప్రాచీన సాహిత్యం అక్కడ 9వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం వరకూ కొనసాగింది. ఎక్కువభాగం సాహిత్యం అప్పటి టర్కీ సామ్రాజ్యాల కాలంలోనే వచ్చింది. 10-12 శతాబ్దాల మధ్య టర్కీ లిపినుండి అరబ్బీ లిపికి మార్పుతో, అరబ్బీ సాహిత్య ప్రభావం ఆరంభమయింది. ఫలితంగా 11వ శతాబ్దంలో ధార్మిక ఆదర్శాలమీద ఆధారపడ్డ ఇస్లాం నైతికతతో కూడిన అద్భుత కావ్యాలు వెలువడ్డాయి. వాటిల్లో ముఖ్యంగా యూసఫ్ ఖస్స్ హాజీబ్ రాసిన *ఆనందాన్నిచ్చే జ్ఞానం,* హిబత్ అల్ హకైక్ రాసిన నీతికావ్యం *సత్యానికి కానుక* మొదలైనవి.

12వ శతాబ్దం సూఫి గురువు యూసఫ్ హందానీ అనుయాయిగా, ధార్మిక కవి అహ్మెద్ యెస్వీ *వేదాంత పుస్తకం* వచ్చింది. అది జానపద భక్తి కవిత్వానికి నాంది అయింది. అరబ్బీ గాని, ఫారసీ గానీ తక్కువగా వాడి టర్కీ కవిత్వ సాంప్రదయాల్లోనే ఆ కావ్యం రాసారు. ఇప్పటివరకూ ప్రజాదరణ పొందుతున్న *ఖ్వారిజిమి మొహబ్బత్ నామా* (ప్రేమ లేఖలు), కుత్బ్ ఖోర్జామీ, దుర్బెక్ మొదలైన కవులు, 13-14 శతాబ్దాల మధ్యకాలంలోని వారే.

తైమూర్ల కాలం వచనానికి స్వర్ణయుగంగా భావిస్తారు. అదేకాలంలో గొప్ప దేశీయ కవి, రాజకీయవేత్త, చింతకుడు నిజమిద్దిన్ మిర్ ఆలిషెర్ నవోయ్ (1441-1501), ఉజ్బెక్ సాహిత్యంలో *చోర్దెవాన్, ఖంస, ఫర్హద్, షిరిన్, లైలా మజ్నూ* లాంటి ప్రసిద్ధి పొందిన రచనలు చేసారు. అవి ప్రపంచ సాహిత్య సంపదగా భావించి వందలకొద్దీ భాషల్లో అనువాదమయ్యాయి. తురుష్కదేశపు చివరి సేనాధిపతి,


అల్పోమిష్

భారతదేశంలో మొఘల్ సామ్రాజాధిపతి జహీరుద్దిన్ బాబర్ కూడా గొప్ప కవి. వీరి బాబర్నమా కావ్యం ఉజ్బెక్ సాహిత్యంలో ఉత్కృష్టమైనది. నా *ఆండిజాన్ అవశేషాలు* బాబర్ రాసిన కవితగా భావిస్తారు. డాదక్షాన్ హసనోవ్ (1940–) ప్రముఖ కవి, గాయకుడు కూడా *ఆండిజాన్‌లో అప్పటి నరమేధం* కవిత రాసారు. అప్పటినుంచీ న్యాయ విచారణని ఎదుర్కొంటున్నారు.

18-19 శతాబ్దంలో ఎక్కువగా ప్రేమ కవిత్వం, గేయకవిత్వం వచ్చింది. నదిరా, ఊవయిసి, షెర్మహమ్మద్ మునిస్, ముహమ్మద్ ఆగహ్, మొదలైన కవులు ప్రజాదరణ పొందారు. 20వ శతాబ్దం మొదలు సోవియట్ కాలపు ఉజ్బెక్ సాహిత్యం వచ్చింది. ముకిమి, ఫుర్కత్, ఖంజ ఖకిం జాదె నియాజి, సద్రిద్దిన్ ఐని, అబ్దుల్లా కదిరి, ఫిత్రత్, ఓయిబెక్, గఫుర్ గుల్యం, అబ్దుల్లా కఖర్, ఖమిద్ అలిండ్జన్, ఉయిగున్ మొదలైనవారు ఆ కాలంలో ప్రముఖ కవులు.

అబ్దుల్లా ఆవ్లని (1878-1934), అబ్దురౌఫ్ ఫిత్రత్ (1886-1938), అబ్దుల్ల కాదిరి (1894-1938), అబ్దుళమిద్ సులయ్మన్ చొల్పన్ (1897-1938), సద్రిద్దిన్ ఆయ్ని (1878-1954), హంజ (1889-1929) మొదలైన కవులు, రచయితలు అప్పటి సోవియట్ సామ్రాజ్యంలో ఉన్నప్పుడు రాసిన ఉజ్బెక్ జాతీయ కవిత్వాల మూలంగా వీరిలో కొందరు చంపబడ్డారు.

**నిజమిద్దిన్ మిర్ ఆలిషెర్ నవోయ్ (1441-1501) :** ఉజ్బెక్ ప్రజలు గర్వపడే జాతీయ కవి, ఉజ్బెక్ సాహిత్య స్థాపకుడు. అసలు పేరు నిజం అల్ దిన్ ఆలి షిర్ హెరవి. వీరి కలం పేరు నవాయ్ తోనే ప్రపంచానికి తెలుసు. ఇప్పటి ఆఫ్ఘనిస్తాన్‌లోని హెరాత్‌లోనే జీవితకాలమంతా ఉన్నారు. ఉజ్బెక్ భాష ఛగతాయ్ (మధ్య తుర్కీ) లో రచనలన్నీ చేసారు. మధ్య ఆసియా రాజకీయవేత్త, గూఢ మతవాది, భాషా శాస్త్రవేత్త, చిత్రకారుడు కూడా. అనేక తూర్పు దేశాలు పర్యటించి అక్కడి కవిత్వ సంప్రదాయాల్ని పరిశీలించారు. నవాయ్ అయిదు సంకలనాల కవిత్వ గ్రంథాన్ని రాసిన మొదటివాడు. అది హంస పేరుతో ప్రసిద్ధి. తాత్విక, చారిత్రక, భావగర్భితంగా ఉండే సంకల నాల్లో ఒకటి. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన *లైలా మజ్నూ*. నిజానికిది ప్రసిద్ధ ఫార్సీ కవి ఎల్యాస్ ఎబ్న్ యూసఫ్ నెజామీ (1141-1209) రాసింది.


నోవాయ్

నెజామీ కథనాత్మక కవిత్వాన్ని, వాటిలోని ఎత్తుగడ, నిర్మాణ క్రమం, పాత్రల తీరు, భావనాత్మక శైలి, మానవీయ అభిప్రాయాలు, తూర్పు దేశాల కవులనెందరినో ఏడు దశాబ్దాలకు పైగా ఉత్తేజ పరిచి, వారి వారి పద్ధతిలో తమ భాషలో వాటిని తిరిగి రాసుకునేట్టు చేసింది. అవి తాము రాసిన సొంత రచనలన్నంతగా వారు రాయగలిగారు. అలా రాసిన వారిలో భారతదేశ కవి అమీర్ ఖుస్రూ, ఆఫ్ఘనిస్తాన్ కవి జామీ కూడా ఉన్నారు. ఇప్పటికీ వారి రచనలు, పాటలు, కవిత్వాలు ఉజ్బెక్ ప్రజల్ని ఆహ్లాద పరుస్తూనే ఉన్నాయి.

నవాయ్ రచనలు ఉజ్బెక్, రష్యన్ భాషల్లో పది సంకలనాలుగా మొదలై, 1990 నాటికి ఉజ్బెక్ జానపద సాహిత్యాన్ని కలుపుకొని నలభై సంకలనాలయింది. అదే ఇప్పుడు 100 సంకలనాలయింది. అందులో 20 వరకూ సంకలనాలు నవాయ్ రచనలే. అక్కడి సాహిత్య సంపదకిది ఒక తార్కాణం.

**భూమి –**

**ఆనందం, ఆరామం, వినోదం, సంగీతాల స్థావరమవనీ / శాంతి –**
**ప్రపంచ సింహాసనాన్ని అధిరోహించనీ**
**జనమంతా ఆ విందుకోసం ఏకత్రితమవనీ**

* * *

**విడిగా నిల్చున్న వాడో లేదా మొహం తిప్పేసుకున్న వాడో**
**మానవజాతిలో ఉండేందుకు అర్హుడు కాదు**

**మానవకోటి నిర్మాణం**
**మానవ మేధస్సు ఫలం**

**మంచి మాట మనోహరం, విలక్షణం**
**సత్యసంగ్రహం ఉత్తమం**

* * *

**ధర్మం దారిలో నడిచే మనిషికి**
**పొగడ్త , వేతనం ఏదీ అవసరం లేదు**
**ఆటంకాలకు ఆలస్యాలకు తొందర దారితీస్తుంది**
**సహనం అనేక సంకటదారులను సరిచేస్తుంది**

**యోచించే పథకంతో సహనంతో ఉన్నవాడు**

పూలను తేనెగాను, ద్రాక్షను మద్యంగాను మార్చగలడు
* * *
న్యాయం అధికారానికి మూలస్తంభం అయినపుడు
శిథిలమైన ప్రాంతం తొందరలోనే పుష్పిస్తుంది

ఇతరులకోసం వలగా గోతులు తవ్వేవాడు
అందులోనే పూడ్చబడతాడు

ప్రమాదకర వివాదాల్ని మాటలు నివారించగలవు
మాటలు నిర్జీవికి జీవితాన్ని ప్రసాదించగలవు

**అబ్దుల్‌హమిద్ సులయ్మన్ చొల్పన్ (1897–1938) :** చొల్పన్ 20వ శతాబ్దపు గొప్ప ఉజ్బెక్ కవిగా కీర్తించబడ్డారు. సోవియట్ పక్షాన రాయనందుకు అనేక మార్లు నిర్బంధించబడ్డారు. వారి రచనలు నిషేధించ బడ్డాయి. అందుకే ఇలా బాధపడ్డాడు. చివరికి చంపబడ్డాడు.


చొల్పన్

విజ్ఞానం సామర్థ్యాల యుగమిది
మానవత్వం పెరుగుతున్న యుగమిది
కానీ నిరూపిస్తున్న సంఘటనలు
నిజానికీ యుగం అరిష్టం దుర్మార్గాలదంటున్నాయి

**ముసుగుల్లో ఉజ్బెక్ స్త్రీలు**

నేను చూస్తుంటాను
ప్రతీ దేశపు ఆకాశం మీద
వాళ్ల నక్షత్రాలు తళతళమని మెరుస్తుంటాయి
భూమిమీద ప్రతి వ్యక్తీ పూర్తిగా నిండిపోయిన
చల్లిన నక్షత్రాల ప్రకాశాన్ని తాగుతుంటాడు

స్త్రీ పుష్పం లేని తోట లేదు
స్త్రీ చకోరం లేని పెరడు లేదు
ఏదైనా స్త్రీ వాసనున్న స్థలం లేదు
స్త్రీ వశం కాని గుండె లేదు
ప్రతీ దేశం తోటలో, ఆ గులాబులు
ఆ ప్రజల స్త్రీలు, పడుచులు;
ఆయా ప్రజలకు వారివైన నిజ మార్గాలున్నాయి
అవి వారి స్త్రీల అడుగుజాడలమీద ఆధారపడ్డవి

ఏదేశంలోనూ స్త్రీల అందమైన మోహాల్ని
ముసుగుల్లో బంధించరు
ఏదేశంలోనూ ... దుర్మార్గపు చేయి స్త్రీని కోపంలో చెంపదెబ్బ కొట్టదు

నేనెక్కడికి వెళ్లినా / తెరిచి విప్పారిన మొహాలతో స్త్రీలను చూస్తాను
అయ్యో, మా స్త్రీలు మా దేశంలో ముసుగుల్లో బంధీలు

ఓ ఉజ్బెక్ వనితా, నేను బాధతో దుఃఖిస్తున్నాను
నాకు ఊపిరాడడం లేదు / నేను చస్తాను!

**కజఖిస్తాన్ :** 131 భాషీయులు సహజీవనం చేస్తున ప్రపంచంలో తొమ్మిదవ విశాల దేశం. ఉత్తరాన రష్యా, దక్షిణాన కిర్గిజిస్తాన్, తుర్కెమెనియా, తూర్పున చైనా, పశ్చిమాన కేస్పియన్ సముద్రం సరిహద్దులు. మంగోలియన్ల దాడుల తరువాతే 15వ శతాబ్దంలో ఈ దేశానికి బీజాలు పడ్డాయి. అందులోని మూడు మూతాల మధ్య అంతర్యుద్ధాల మూలంగా ఆ ప్రాంతం రష్యా చేతుల్లోకి 1731 లో పోయింది. రష్యానుండి బయటపడి స్వతంత్ర దేశం కావడానికి 1991 వరకూ ఆగాల్సొచ్చింది. అన్నేళ్లు పరాయి దేశంలో ఉన్న ఏ దేశమయినా పడ్డ ఇబ్బందులు ఎవరైనా ఊహించుకోవచ్చు.

కజఖిస్తాన్ సాహిత్య చరిత్ర స్మృతికందనిది. అయితే అవేవీ రాత రూపంలో లేవు. మౌఖికంగా కూడా చాలా కోల్పోయింది. పురాతన కజఖ్ సాహిత్యం తుర్కీ, అరబ్బీలో ఉంది. అది ఎక్కువగా మసీదుల్లోను ధార్మిక పాఠశాలల్లోను కనిపిస్తుంది. 19వ శతాబ్దం రెండవభాగం వరకూ కజఖ్ భాషకు రాతలిపి లేదు.

**అబయ్ ఇబ్రహిం కునంబ యులి (10 ఆగస్ట్ 1845 – 6 జూలై 1904) :** కజఖ్ భాషలో ప్రథమ ప్రముఖ కవి. తూర్పు దేశకవుల మానవీయ కోణం వీరిని ఎక్కువగా ఆకట్టుకుంది. ఫిరదౌసీ, ఆలిషెర్ నవోయ్, ఇబ్న్ సినా లాంటి కవుల్ని అనువాదం అందుకే చేసారు. అలాగే రష్యా పూర్వ కవులు పుష్కిన్, లెర్మొంటోవ్‌ల కావ్యాల్నీ అనువాదం చేశారు. గోథే, బైరన్‌లనూ అనువాదం చేసారు. ప్రాక్పశ్చిమ దేశాల సాహిత్యాల్ని కజఖ్ భాషలో తీసుకురావడానికి విశేష కృషిచేశారు. 170 వరకూ స్వీయ కవితల్ని, 56 అనువాదాల్ని చేసారు. స్వరకర్తగా రూపొందించిన 20 గీత మాధుర్యాలు ఇప్పటికీ ప్రజాదరణ పొందుతున్నాయి.


అబయ్

**గాలి లేని రాత్రి గుండా ..**

గాలిలేని రాత్రి గుండా చంద్రకాంతి ప్రసరిస్తోంది
ప్రవహిస్తున్న అలల్ని ప్రకాశవంతం చేస్తూ
తరంగ శిఖరాలు విస్తారంగా పారుతుంటే
లోయలో గ్రామం వెచ్చగా పడుకొనుంది



**ఆరొన్ ఆటబెక్**

**బోడికొమ్మల చెట్టు దళసరి మొండెం**
**దానికదే గొణుక్కుంటుంది -**
**భూమి సందడి నువు చూడడం లేదా**
**దాని మొహం మళ్లీ ఆకుపచ్చగా మారుతోంది**

ఇతర ముఖ్యమైన కవుల్లో సకెన్ సైఫుల్లిన్ (15 అక్టోబర్ 1894-28 ఫిబ్రవరి 1939), జంబిల్ జబయెవ్ (1846-1945), ఓల్జాస్ సులైమెనొవ్ (1936-), ముకగలి మకతైవ్ (1931-1976), ఆరొన్ ఆటబెక్, జెఫ్ఫ్ ఫెర్నసిడె మొదలైనవారున్నారు.

**ఆరొన్ ఆటబెక్ (31 జనవరి 1953 -) :** ప్రముఖ కవి, రచయిత. 2007లో షన్యరక్ షంటిటౌన్ కూల్చడ్రోలినపుడు జరిగిన అల్లర్లలో ఒక పోలిసు అధికారి మరణానికి కారకుడుగా 18 సంవత్సరాలు, కష్టాల శిబిరాల శిక్ష విధించారు. నిరపరాధినని ఎంత మొత్తుకున్నా ఎవరూ వినలేదు. నేరాన్ని అంగీకరిస్తే విడిచిపెడతామన్న షరతుకు ఆరొన్ లొంగలేదు. ఫలితంగా కష్టాలు అనుభవిస్తూ ఒంటరిచెరలో ఇప్పటికీ మగ్గుతున్నారు. అంతర్జాతీయ రచయితలు, కవుల ఒత్తిడి అభ్యర్థనలు అక్కడి ప్రభుత్వం మీద ఏమాత్రం పనిచేయడం లేదు.

**జైలులోపల జైలు**

**కోలిమ బంగారు గనుల్లో**
**సోవియట్ ప్రభుత్వానికి / మా నాన్న బానిసగా ఉండేవాడు**
**కోలిమ క్రూరత్వంతో బాటు**
**నా ప్రారబ్ధం కూడా అదే మాదిరిగా నడుస్తోంది**
**ప్రజల శత్రువుగా మా నాన్నని న్యాయస్థానంలో నిలబెట్టారు**
**అంచాత అదే వరసలో శత్రువు కొడుకుగా నేను**
**గడ్డపారతో రాళ్లు పగలగొడుతూ అతని పక్క నేను**
**అతనికీ నాకూ వ్యత్యాసం ఏమీ లేదు**
**రష్యా నా తల్లి, కజఖిస్తాన్ నా తండ్రి**
**వోల్గా దగ్గర బాల్యం, ఆలమటీ దగ్గర పెరిగాను**
**అధికారంలో ఉన్న వారి సింహాసనాల గదిని కాలితో తన్ని తెరవడానికి**
**న్యాయం ధర్మం మీద గట్టి నమ్మకంతోనే ఉన్నాను**

**కిర్గిజిస్తాన్ :** అపురూపమైన ప్రాకృతిక సౌందర్యంతో అలరారుతూ 80శాతం కొండలు కోనలతో, మధ్య ఆసియాకి స్విట్జెర్లాండ్‌గా పేరుపడ్డ దేశం. అక్కడి ప్రజలు ఒకప్పుడు గుర్రాలమీద తిరిగే సంచార సిపాయిలు, శూరుల తెగనుండి వచ్చినవారు. కిర్గిజిస్తానీయులు సైబీరియా నుండి వలస వచ్చిన వారుగా చరిత్రకారుల నమ్మకం. చెంఘీజ్ ఖాన్ సమయం నుండి అనేక విదేశపాలనల్లో మగ్గినవారు. 1864 లో రష్యా అధీనంలోకి పోయి 1991లో విముక్తి చెంది, స్వతంత్ర దేశమయింది. తూర్పు, దక్షిణాన చైనా, ఉత్తరాన కజఖిస్తాన్, పశ్చిమాన, దక్షిణాన ఉజ్బేకిస్తాన్ సరిహద్దులున్న దేశం. అక్కడి ప్రజల్లో 75 శాతం ముస్లిం‌లు, 20 శాతం సదాచార క్రైస్తవులు, మిగిలినది బౌద్ధులు, ఇతరులు.

అధికారిక భాషగా కిర్గిజ్, రష్యా రెండింటికీ గుర్తింపు ఉంది. రష్యా ఆధిపత్యం నుండి బయటపడిన ఇతర దేశాలు తమ తమ భాషలకు వారిదైన లిపి తయారు చేసుకున్నా, కిర్గిజ్ మాత్రం ఇంకా సిరిల్లిక్ లిపిలోనే ఉండిపోయింది.

**కిర్గిజిస్తాన్ సాహిత్య చరిత్ర -** ఆధునిక సాహిత్యమూలాలు 19వ శతాబ్దం నుండే మొదలయాయి.. 19వ శతాబ్దంలో చుగ్తాయ్ రాతప్రతిలో దొరికిన మోల్డో నియాజ్ కవితలే వారి మొదటి సాహిత్య గ్రంథం. రష్యా ఆక్రమణలో చుగ్తాయ్ లిపి సిరిల్లిక్‌గా మారిపోయింది. నిజానికి అనేక శతాబ్దాలుగా మౌఖికంగా ఉండిపోయిన *మానస్* వారి మొట్టమొదటి ప్రసిద్ధ కావ్యం. దాని మూల కవి కిర్గిజ్ అని, ఆ కవి పేరనే ఆ దేశం ఏర్పడిందని ప్రజలు భావిస్తారు. ఇప్పటి కిర్గిజ్ భాషలో రాసిన మొదటి కావ్యం 1911 లో మోల్డో కిలిచ్ రాసిన *భూకంప వృత్తాంతం*. ఆ తరువాత *దుఃఖించే సమయం* వచ్చింది. ఆ తరువాత కవుల్లో, ఆలికుల్ ఓస్మానోవ్ లాంటివారు రష్యన్ కవుల ప్రభావంతో రాసారు. జే. బొకొంబైవ్, కవయిత్రి టెంటి అడిషెవ, ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

***మహాకావ్యం మానస్ :*** ఈ కావ్యాన్ని ఇప్పటికీ మూడురోజుల పాటు 'మానస్చి' లనబడే మార్మికవాదులు సంగీతభరితంగా గానం చేస్తారు. అందులోని నాయకుడు మానస్, తన కొడుకులు, సమకాలీన కథలతో కూడిన కిర్గిజిస్తాన్ చరిత్ర వివరిస్తూ పోతారు. ఈ మహాకావ్యాన్ని, దాని నిడివిలోగానీ (5 లక్షల చరణాల కంటే ఎక్కువ) వస్తువులోగానీ, ఏ పశ్చిమ దేశ కవిత్వాలతోనూ సరిపోల్చలేము. శతాబ్దాలుగా వివిధ భాషాంతరాలతో చెప్పబడుతూ, తరాలనుండి తరాలకు మాట రూపంలో పూర్వీకులనుండి వస్తూ నిలిచిన బృహత్ కావ్యం. 1885 నుండీ రాతరూపంలోకి వచ్చినా, క్రీ.శ. 840 నుండీ

ప్రదర్శన రూపంలో ఉన్నట్టు అంచనా.

ఈ కావ్యం మూడు భాగాలుగా విభజించబడింది. మొదటి భాగంలో పౌరాణిక యోధుడు జకిప్ కుమారుడు మానస్ వీరోచిత గాథలు, కిర్గిజ్ సైన్యాన్ని సమర్థవంతంగా నడిపిస్తూ దండెత్తేవారిని అణగదొక్కి, దేశ సమగ్రతని స్వాతంత్ర్యాన్ని ఎలా కాపాడాడో వివరిస్తే, తతిమ్మా రెండు భాగాల్లో బుఖారా రాజ కుమార్తె సాన్రబిగాతో మానస్ వివాహ వృత్తాంతం, తన కొడుకు సెమెటే, మనుమడు సేయ్టెక్ గాథలతో నిండి ఉంటుంది. మానస్ సమాధి శత్రువులు సైతం నాశనం చేయకుండా, దానిమీద ఎవరో స్త్రీ పేరు మానస్ రాయమన్నారని చెబుతారు.

హోమర్ ఒడిస్సే, ఇలియడ్ ఈ రెండు కావ్యాలూ కలిపినదానికంటే ఈ కావ్యం 20 రెట్లు పెద్దది. కిర్గిజ్ వాసికి ఇది ఒక పవిత్రమైన పురాతన చరిత్ర, వారి జాతీయ సాంస్కృతిక చిహ్నం.

**ఆలైకుల్ ఓస్మోనోవ్ (21 మార్చ్ 1915 – 12 డిసెంబర్ 1950) :** 35 ఏళ్ల అతి చిన్న వయస్సులో న్యుమోనియా వ్యాధితో మరణించిన ప్రముఖ కవి, అనువాదకుడు, నాటకకర్త. కిర్గిజ్, రష్యన్ రెండు భాషల్లోనూ కవిత్వం రాసారు. 20 ఏళ్లకే కవిత్వ రచన ఆరంభించి, మరో రెండేళ్లకు మొదటి కవితా సంకలనం తీసుకురాగలిగారు. 1945 లో వచ్చిన ప్రేమ కవిత్వ సంకలనం వారిని కవిగా ఉన్నత శిఖరాలమీద నిలబెట్టింది. సోవియట్ ప్రభుత్వ కాలంలో రష్యన్లు వీరిని తమ కవిగానే భావిచారు. పుష్కిన్, షేక్స్‌పియర్ లాంటి ప్రసిద్ధ కవుల్ని కిర్గిజ్‌లోకి, కిర్గిజ్ లోని రచనల్ని రష్యన్ లోకి అనువాదం చేసారు. చాల్పోన్‌లో ఉన్న సరస్సు ఇస్సిక్ కుల్, వీరికి అత్యంత ఇష్టమైనది కావడంతో, వీరి అనేక కవితల్లో వివిధ ఋతువుల్లో ఆ సరస్సు తొంగి చూస్తుంటుంది. ఓస్మోనోవ్ కవితలు స్వచ్ఛమైన ఊటనీటితో నిండి, వేకువన సూర్యుని, దినాంతాన తోటలోని మగ్గిన పండ్ల వాసనతోను ఉంటాయని విమర్శకుల అభిప్రాయం. అనేక సాహిత్య సంస్థలు, పాఠశాలలు, నగరం గ్రామ వీధులు వీరి పేరుమీద ఉన్నాయి. కిర్గిజ్ లోని 4060 అడుగుల పర్వతశిఖరం ఒక దానికి వీరి పేరు పెట్టారు. ప్రతీ ఏటా ఇచ్చే కిర్గిజ్ సాహిత్య బహుమతినొకటి వీరి పేరు మీద నెలకొలిపారు. 'నేను శాశ్వతాన్ని, వేలమార్లు నేను తిరిగి వస్తుంటాను...' అని చెప్పుకున్న ఓస్మోనోవ్ చరణాల్ని కిర్గిజ్ వాసులు అనేక సందర్భాలలో గుర్తుచేసుకుంటుంటారు.



ఓస్మోనోవ్

**మా అతిథులవండి**

**తెరిచిన తలుపులతో మా ఇల్లు అతిథి కోసం ఎదురు చూస్తోంది**<br>
**అతిథుల కోసం రుచికరమైన వంటలు – అది అర్థం చేసుకోవచ్చు**<br>
**మీరు అత్యాశతో నా తల కావాలంటే అడగండి – అది మీదే**<br>
**మీరు ప్రతీకారంతో ఉంటే నన్ను చంపండి –**<br>
**కానీ మా ఆతిథ్యాన్ని స్వీకరించండి**<br>
**అతిథులకోసం అతి రమ్యమైన మా వంటకాలున్నాయి**<br>
**ఓ యాత్రికుడా! / దయచేసి విచ్చేసి, మా అతిథులవండి**

**టెంటి ఆడిషెవ (1920–1984) :** కిర్గిజ్ సాహిత్యంలో మొట్టమొదటి సాహసవంతమైన కవయిత్రి.

**ఒక నవ్వుతో నన్ను అనుగ్రహించండి**

**ఓ నా ఇష్టమైన స్నేహితులారా, ప్రియమైన బంధువులారా**<br>
**నాకు బంగారమో వెండినో కానుకగా ఇవ్వకండి**<br>
**బదులుగా మీ హృదయం నుండి ఒక నవ్వునివ్వండి**<br>
**తన కాంతితో సూర్యుడు అన్నింటినీ వెచ్చబరుస్తున్నట్టు**<br>
**అతిగిపోయిన నా ఆత్మని –**<br>
**దానితో బాగుచేసి నా అవసరాలకు వాడుకుంటాను**

**మీ ఇంపైన నవ్వుని నాకు కానుకగా ఇవ్వండి**<br>
**నా దృష్టినుండి నా దుఃఖం దాక్కోనివ్వండి**<br>
**దయతో ఉండటం, హృదయాలు అనుభవించనివ్వండి**<br>
**మీ చిరునవ్వు సంగీతాన్ని వింటూ, మీ కానుకతో**<br>
**నా గాయపడ్డ హృదయాన్ని నయం చేసే**<br>
**ఔషధాన్ని తయారుచేసుకుంటాను**

**స్నేహితుని నవ్వే నాకు గొప్ప బహుమతి**<br>
**నేను కోరుకునే ఒకే ఒక్క సంపద**<br>
**ఎగిరే పక్షిలా జీవితం సాగిపోవాలంటే**<br>
**ఒకరినొకరు అయిష్టంగా చూసుకునేబదులు**<br>
**నవ్వుతూ ఒకరినొకరం కలుసుకుందాం**

**తుర్క్మెనిస్తాన్ :** క్రీ.శ. 7–8 శతాబ్దాల మధ్య మంగోలియాలో ఉన్న తుర్కీ తెగలైన ఒఘుజ్ లో, తుర్క్మెనిస్తాన్ మూలాలు ఉన్నాయని అంటారు. 12వ శతాబ్దానికి ఈ తుర్కీ తెగలు అనేక ప్రాంతాలకు విస్తరించి, అక్కడ వారి సామ్రాజ్యాలు నెలకొల్పుకున్నారు. అయితే తుర్క్మెనిస్తాన్లో మాత్రం ఒక బలీయమైన శక్తిగా ఏకత్రితం కాలేకపోయారు. శతాబ్దాలుగా తూర్పు తుర్క్మెనిస్తాన్ పర్షియా ప్రాంతమైన ఖురాసన్ భాగంగా ఉండింది. మధ్యయుగ కాలంలో మెర్వ్ (ఇప్పటి మేరీ) పట్టణం, సిల్క్ రోడ్డులో ఆగడానికి వీలుగా

ఉండటంతో, ఇస్లాం ప్రభావిత ప్రపంచానికి ముఖ్యమైన పట్టణమైంది. 1880లో జరిగిన భీకర పోరులో రష్యా ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకుంది. ఆ తరువాత అది సోవియట్ సంఘటనలో ఒక భాగమయింది. ఆ సంఘటన 1990లో విచ్ఛిన్నమయినాక, తుర్క్మెనిస్తాన్ 1991లో స్వతంత్ర రాజ్యమైంది. మధ్య ఆసియాలో అతి పెద్దవైన మరుభూముల్లాంటి ఎడారులు గరగం, గిజిల్గం రెండూ 90 శాతం ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. దక్షిణాన బల్కన్, కోపెట్ డాగ్ కొండలు, పశ్చిమాన కేస్పియన్ సముద్రం, తూర్పున ఆమూ దర్యా నది సరిహద్దులుగా ఉన్న దేశం. ముస్లింల జనాభా అక్కడ 85 శాతం.

తుర్క్మెనిస్తాన్ భాష తుర్కీ తెగల ఓఘుజ్‌కి సంబంధించింది. అజెరి, తుర్కిష్, ఉజ్బెక్ భాషలకు దగ్గరలో ఉన్న భాష. తుర్కిష్, ఫారసీ, అరబ్బీ, రష్యన్ పదాల మిశ్రమం. 18వ శతాబ్దపు ప్రముఖ కవి మగ్దింగులి పైరగి (1733–1797) వారి జాతీయ కవి. ఇతర ముఖ్య కవుల్లో మమ్మెట్వెలి కెమినె (1770–1840), మొల్లనెపెస్ (1810–1862), సైట్నజర్ సెయిది (1775–1836), కుర్బందుర్ది జెలిలి (1780–1836) మొదలైన వారున్నారు. వారిని మగ్దింగులి పైరగి కి వారసులుగా భావిస్తారు. వీరికి ముందు కవిత్వం ఫారసీ పద్ధతిలో ఉండేది.

**మగ్దింగులి పైరగి (1733–1797) :** సత్యం, పరిపూర్ణ మానవుడు కోసం ఆరాట పడ్డ కవి. తన ప్రజల సుఖ సంతోషాలు వీరికి ముఖ్యం. రాజకీయ ఇతివృత్తాలు, సామాజిక పరిశీలన, సరికొత్త రూపాల్ని కవిత్వంలో వాడిన తుర్క్మెనిస్తాన్ మొదటికవి. అనేక విషయాలు వారి కవితా వస్తువులు, కావడంతో వీరిని ఆధ్యాత్మిక నాయకుడు, గురువుగా కొందరు, దేశప్రజల క్షేమాన్ని, సంతోషాన్ని కాంక్షించే దేశభక్తుడుగా మరి కొందరు భావిస్తారు. యాత్రల్లో తనతో తీసుకుపోయిన కవిత్వ రాత ప్రతులు అనేకం పోగొట్టుకోగా, వారి పాటలు పాడి వినిపించే బక్షిష్‌గా పిలవబడే గాయకుల నుండి, మిగిలిన రాతప్రతుల నుండి సేకరించినవి పదివేల చరణాలకు పైగా వీరి కవిత్వం ఉంటుందని అంచనా. ఆధునిక కవిత్వానికి ఆద్యుడుగా వీరి కవిత్వాన్ని షేక్స్‌పియర్‌తో పోలుస్తారు.



మగ్దింగులి

**యుద్ధాన్ని ఎప్పుడూ ఎరగని తుర్కులుండరు**
**దాని పూర్వ క్లేషం దేశం మరుగున పడేస్తుంది**

**గులాబులు ఎప్పుడూ వాడిపోవు ఇక్కడ – వాటిల్లో ఏవైనా సరే**
**తుర్క్మెనిస్తాన్లోని సంతోషమయుల ఎడబాటుకి ఎవరైనా ఏడుస్తారు**
**సోదరత్వం ఇక్కడ – సంప్రదాయం; స్నేహం – ఒక చట్టం**
**సుప్రసిద్ధ వంశాల శక్తిగల తెగల్ని**
**యుద్ధానికి ఆయుధాలు పట్టుకోమంటే**
**శత్రువులు తుర్క్మెనిస్తాన్ పుత్రుల ముందు వణుకుతారు**

**తజికిస్తాన్ :** జనావాసం ఈ ప్రాంతంలో 8–9,00,000 సంవత్సరాలకంటే ముందునుండే ఉందని చరిత్రకారులు నిర్ధారించారు. పురావస్తు సంబంధిత అనేక ఆధారాలు దానికి దొరికాయి. తజిక్లు ఇరానియన్ వంశానికి చెందినవారు. 7వ శతాబ్దం మధ్యకి వచ్చేసరికి మధ్య ఆసియా మీద అరబ్బుల దండయాత్ర మొదలై ఇస్లాం మతం ఆ ప్రాంతంలో ప్రవేశించింది. కానీ గిరిజనుల అంతఃకలహాల మూలంగా సమానిడ్లు (819–999) ప్రాబల్యం పెరిగి, తజిక్లు ఇరానియన్ల రాజ్యంలోకి పోయారు. 999లో తుర్కులు ఆ ప్రాంతాన్ని ఆక్రమించడంతో ఇరానియన్ల సామ్రాజ్యం పోయి తుర్కిస్తాన్ కింద మారింది. నిజానికి తజిక్ అన్న పేరు అరబ్బులను ఉద్దేశించి అప్పటి స్థానికులు వాడినది.

18వ శతాబ్దం మధ్య వరకూ తజక్లు, బుఖారా తురుష్క అమీర్ల భాగంగా ఉన్నారు. 1868 నుండి రష్యా, 1929 నుండి సోవియట్ సమాఖ్యలో భాగమయి 1991 నుండి స్వతంత్ర దేశమయింది. ప్రాచీన నాగరికత ప్రజాదరణ గల సంప్రదాయాలు ఆచారాలు, వస్త్రధారణల్ని సైతం, ఇప్పటికీ నిలబెట్టుకున్న దేశం. ఉత్తరాన క్రిజిగిజిస్తాన్, దక్షిణాన ఆఫ్ఘనిస్తాన్, తూర్పున చైనా, పశ్చిమాన ఉజ్బెకిస్తాన్ సరిహద్దులుగా ఉన్న దేశం. పూర్తి కొండ ప్రాంతం, ఎడారులు పోను నేల భాగం అతి తక్కువ. తజిక్ ప్రధాన అధికార భాష తొజికి, ఆఫ్ఘనిస్తాన్లో ప్రచలితంగా ఉన్న దరి భాషకు దగ్గర. ఇది ఇండో యూరోపియన్ కుటుంబానికి చెందిన ఇరానియన్ భాషల సముదాయానికి చెందినది.

అబ్దుల్ఖసిం లొహుటి (1887–1957) నిజానికి ఇరానియన్ కవి అయినా, సోవియట్ కాలంలో వచ్చి తజికిస్తాన్లో స్థిరపడ్డారు. మిర్జో తుర్సుంజొద (1911–77) తజిక్ మౌఖిక కవిత్వాన్ని సేకరించడమే కాకుండా, సామాజిక స్పృహతో కవిత్వాన్ని రాసారు. గుల్రుఖ్సోర్ సఫైవ (1947) జాతీయ కవి ప్రముఖ కవయిత్రి. ఫర్జనే ఖొజంది (1964) మరో ప్రసిద్ధ కవయిత్రి.

**గుల్రుఖ్సొర్ సఫైవ (1947–) :** ప్రముఖ జాతీయ కవయిత్రి. ఫారసీలోనే కవిత్వం రాసారు. తజికిస్తాన్ వార్తా పత్రికకు సంపాదకురాలుగా కూడా ఉన్నారు.

**వెళ్లడానికి తిరిగి రావడం**

శాశ్వతంలా వసంతం వస్తోంది
రేపటికే పాతబడడానికి
చలికాలం పోతోంది
ముసలి వయస్సులా నిశ్శబ్దంగా
పోవడానికే ..

* * *

ఓ ఎన్నెన్ని మార్లు
నేను చావుని హత్తుకోలేదు
అయినా రెండు సార్లే
జీవితం మనోహరమనిపించింది

నన్ను
ప్రసవ వేదనలో కన్నప్పుడు
నేను
ప్రసవ వేదనలో కన్నప్పుడు ...

* * *

నా అచేతనావస్థని
తిరగలిలో నూరడం నేర్చుకున్నాను
అంతా నిరర్థకం
కానీ నాకెంత బాధాకరం
ఆ ఆలోచనే గాయపరుస్తుంది
చావుగురించి కాదు
అల్పమైన ఆత్మల శాశ్వతత్వం గురించి ..


గుల్రుఖ్సొర్ సఫైవ

**ధార్మిక కవిత్వం :** 11వ శతాబ్దపు కవి తత్వవేత్త నాసిరీ ఖుస్రో అనుయాయులు, ఇస్మాయిలీ ఇమాములు, మధ్ (కీర్తన) పేరుతో ఉన్న కవిత్వ గానం చేస్తారు. సూఫీ కవిత్వంలో కనిపించే మార్మికత అందులో ఎక్కువగా ఉంటుంది. అయితే ఆ కవితల మూల కవి ఎవరో తెలియదు.

ఈ ప్రపంచంలో సురక్షితంగా ఉన్నామనుకోవద్దు
ఎందుకంటే ఏ గులాబీ, ఏ పూల పానుపూ మిగలదు

దేవుడిని తలుచుకోవడంలో అశ్రద్ధవద్దు
కారణం శరీరంలో ఏ ఆత్మా ఉండిపోదు

ఏరోజుకారోజు భయపడి ప్రపంచానికి విరుద్ధంగా
నాకెందుకులే అనుకోకు
ఎందుకంటే నువ్వు ఒక ఆభరణంగా
కనీసం తలపాగా గుడ్డలుగా ఐనా మిగలవు

శరీరం ఇంటిలో తప్పకుండా అద్దెకు, ఒక ఆత్మ కిరణం ఉంది
కారణం జీవితం, సూర్యకిరణం చిన్న కిటికీలో సైతం ఉండిపోదు
ప్రపంచ రాజులు వారి సౌధం సింహాసన గర్వంతో మురిసిపోతారు
అవేవీ తమకే మిగలవని వారెప్పుడూ తెలుసుకోలేరు

ఆశ చావని జనం, అత్యాశతో ప్రాపంచిక ఆస్తుల్ని పోగేస్తూపోతారు
చూడు చివరికి ధరించిన దుస్తుల అంచులకైనా మట్టి మిగలదు

అయ్యో నా జీవిత గృహంలో అశ్రద్ధతో గడిపాను
ధాన్యం కుప్పనుండి ఏ ధాన్యమూ
మిగలదని తెలిసినా అన్నీ గాలికి విసిరేసాను

బాగా ఆలోచించు, మన పూర్వ జీవితం తిరిగిరాదు
దివారాత్రుల వాటా అలాంటిది, వెళ్లాక ఏదీ మిగలదు

**మంగోలియా :** మధ్య ఆసియాకి ఉత్తరాన, సముద్రానికి దూరంగా ఉత్తరాన రష్యాకి దక్షిణాన చైనాకి మధ్యనున్న దేశం. మూడొంతుల భూభాగం పశుగ్రాసంతో నిండి ఉండటాన్ని పశుగణాభివృద్ధి ఎక్కువ. తతిమా భూభాగం అడవులు, ఎడారులతో ఉంటుంది. ఆ కారణంగా ప్రపంచంలో జనసాంద్రత చాలా తక్కువగా ఉన్న దేశాల్లో మంగోలియా కూడా ఒకటయింది మంగోలియాకి బోలెడంత పూర్వచరిత్ర ఉత్కృష్టమైన చరిత్ర ఉంది. వీరు క్రీ.పూ. 3 నుండి 1వ శతాబ్దం వరకూ మధ్య ఆసియాలో నివసించిన హన్స్ వంశీయులు కావచ్చు అని చరిత్ర కారులంటారు.

చెంఘీజ్ఖాన్ మూలంగా 13వ శతాబ్దంలో, కొండ తెగలంతా కలిసి ఏకత్రితమైన మంగోలియాగా ఏర్పడింది. చెంఘీజ్ ఖాన్, ఆ తర్వాత వచ్చినవారి సమయంలో విశాలమైన మంగోలియన్ సామ్రాజ్యం ఏర్పడింది. అందులో మధ్య ప్రాచ్యం, మధ్య ఆసియాతో బాటు, కొంత భూభాగం చైనా, రష్యాలది కూడా ఉంది. కానీ 1691 నాటికి ఆ సామ్రాజ్యం విచ్ఛిన్నమై, ఉత్తర మంగోలియా చైనా క్వింగ్ సామ్రాజ్యం అధీనంలోకి పోయింది. 1912 ప్రాంతంలో క్వింగ్ సామ్రాజ్యం కూడా పతనమవడంతో, చైనా అదుపాజ్ఞలలో మంగోలియా ఆధ్యాత్మిక గురువు జబ్జనదంబ పరిపాలన సాగింది. 1919 లో అక్కడ జాతీయ విప్లవకారులు సోవియట్ సహాయంతో చైనాని వెళ్లగొడితే, 1921 లో ఆక్రమిస్తున్న రష్యన్లను తిప్పికొట్టి 1924 లో స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు.

జనాభాలో ఎక్కువ భాగం మంగోలియన్ భాష మాట్లాడతారు. మిగతావారు మంగోలియన్ భాషను అర్థం చేసుకోగలరు. మంగోలియన్ భాష తుర్కీ భాషకు అతి దగ్గర. 1940లో సంప్రదాయక మంగోలియన్ లిపిని రష్యన్ అక్షరమాలమీద ఆధారపడ్డ సిరిల్లిక్ లిపికి మార్చుకున్నారు. 1990 నుండి సంప్రదాయక మంగోలియన్ లిపితో బాటు సిరిల్లిక్ లిపి కూడా అన్నింటా వాడుకలో తీసుకొచ్చారు.

మంగోలియాలో టిబెట్‌కి చెందిన బౌద్ధ ధర్మాన్ని ఎక్కువగా స్వీకరించారు. 1930 నుండి 1990 వరకూ అప్పటి విప్లవకారుల మూలాన ఈ మతావలంబులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారి బౌద్ధ ఆరామాలు విధ్వంసం చేయబడ్డాయి. ఆ ధర్మాన్ని విడిచిపెట్టాలన్న ఒత్తిడికి తలొగ్గని వారిని చంపడం కూడా ఆ సమయంలో ఎక్కువగా జరిగింది. కానీ 1990 నుండి ఆ పరిస్థితులు మారి మళ్లీ మంగోలియాలో టిబెట్ బౌద్ధం పుంజుకోవడం మొదలయింది.

పూర్వకాలంనుండీ పిల్లల చదువు అభివృద్ధికోసం సాహిత్యం ఉపయోగపడింది. ఆ కారణంగానే మంగోలియన్లు అందరికీ ఆ జానపద సాహిత్యం గురించి తెలుసు. అవి-కథలు, ఇతిహాసం, సామెతలు, సూక్తులు, బోధనలు, రహస్యాలు, పద్యాలు, వీరోచిత గాథలు, భావ గీతలుగా వారినుండి బయటపడుతూనే ఉంటాయి. 13వ శతాబ్దంలో చెంఘీజ్ ఖాన్ వీరోచిత గాథల చుట్టూ అల్లుకున్న కవిత్వం ఎక్కువగా వచ్చింది. 19వ శతాబ్దం రెండవ భాగంలో ఆధునిక మంగోలియన్ కవిత్వం మొదలయింది. దానికి ఆద్యులు డి.రవ్జా (1803-1856), వి.ఇంజినాష్ (1837-1892), బి.గుర్లన్స్ (1820-1861), గెలెగ్బల్సన్ (1846-1923), ఆర్.ఖిషిక్బత్ (1899-1916). 1920లో మొదలైన సమకాలీన కవిత్వం రాస్తున్న వారిలో ప్రముఖులు డి.నత్సగ్దొర్జ్ (1906-1937), టి.దందిన్సురెన్, బి.యవూఖులన్ (1929-1982), ఎల్.టుదెవ్ మొదలైన వారు.

**ప్రాచీన వైభవం**

**నిజంగా ఇది / మంగోలియా దేశపు / ప్రాచీన వైభవం**
**చెంఘీజ్ ఖాన్ వంశం / మమ్మల్నందర్నీ కన్నది**

**రూఢిగా / ఆకాశంలాంటి మా అదృష్టంతో**
**అయిదు పరిమాణాల్లో మా మనస్సుతో**
**మా శాంతియుత విశాలహృదయ నిర్ణయాలతో**
**అవును, స్వర్గ పుత్రులు పోయే దారిది.**

**అవును, ఇది చుక్కల్లో చంద్రకాంతి లాంటిది**
**చాలామందిలో అలంకరించబడ్డ పథప్రదర్శకం లాంటిది**

**అవును, సుమేరూ పర్వత శిఖరం నుండి**
**విస్తార ప్రసరణములా**
**దాని ప్రకాశం విస్తరిస్తోంది**

**రక్షక స్ఫూర్తి దృఢంగా ఉండనీ**
**అవును మా రక్షకుడు చెంఘీజ్ ఖాన్ ద్వారా**

**మేము మంగోలియా పాలకులయ్యాం**
**ఖాన్ పతాకం ముందు**
**ఆనందంతో మనందరం తలలొంచుదాం**

**(చారిత్రకుల ప్రకారం ఈ కవిత ఒకప్పటి విశాల మంగోలియన్ సామ్రాజ్యంలో జానపద జాతీయగీతం. ఇప్పటికీ మంగోలియన్లు దీనిని పాడుకుంటారు.)**

**డి.నత్సగ్దొర్జ్ (1906-1937) :**


**డి. నత్సగ్దొర్జ్**

పూర్తిపేరు బోర్జిన్ డష్దోర్జిన్ నత్సగ్దొర్జ్. మంగోలియాలో వీరి కవిత్వం గురించి తెలియని వారుండరు. 31 ఏళ్లే బతికిన వామపక్ష భావాల కవి. 1932లో జైలుపాలై అదే ఏడాది విడుదల అయ్యారు.

1981లో మంగోలియన్ రచయితల సమాఖ్య అతని జ్ఞాపకార్థం అతను పుట్టిన ప్రాంతంలో అతని విగ్రహాన్ని నెలకొలిపారు. వైవిధ్యమైన విషయాలమీద కవిత్వం రాశారు. అందులో ఎక్కువగా స్వదేశాభిమానం, విప్లవం, బోధనలు, ప్రేమ మొదలైనవి కనిపిస్తాయి. మంగోలియాని, దాని సరిహద్దుల్ని కీర్తిస్తూ రాసిన దీర్ఘ కవిత, *నేను పుట్టిన ప్రాంతం* అతనికి మంచి పేరు తీసుకొచ్చి పెట్టింది.

**నా బుజ్జి గొర్రె**

**మచ్చలున్న నుదురుతో**
**నా కోసం బే బే అని అరుస్తూ**
**వేలగొర్రెల్లో / నా వైపే వస్తున్న**
**దాన్ని గుర్తుపట్టగలను / ముత్యంలా మెరుస్తున్న తెల్లపొర**
**చురుకైన నల్ల కన్ను / లక్షల గొర్రెల్లో / అది అందగత్తె**
**ఇంటి చుట్టూ ఆడుకునేదల్లా / అదీ నేనే**
**దాని తల్లి రొమ్ముల దగ్గర మోకరిల్లి**
**చనుబాలు గునుస్తూ / నా ఒడిలోకి గెంతుతూ**
**నాలోలోపలికి ముడుచుకుపోతూ**
**నలుదిక్కులా ఆడుతూ గెంతుతూ**
**పశువులకాపర్లందర్నీ ఆనందింపజేస్తుంది.**

అనాదిగా మధ్య ఆసియా అనేక యుద్ధాలు, భాషలు, మతాలు, ప్రాంతాల కలయిక. వాటి ప్రభావమే అక్కడి కవిత్వం.

ముకుంద రామారావు
హైదరాబాదు,
ఫోన్ : 99083 47273



# నూరేళ్ళు నిండిన వెండితెర

వందేళ్ళు నిండినా, ఇప్పటికీ ప్రచార సాధనంగా కన్నా వినోద ప్రధానమై, తాత్కాలిక భ్రమలలో ముంచెత్తే మత్తుగానే సినిమా చరిత్ర మిగిలిపోయింది.

ఇక్కడ వినోదం అంటే హాస్యం కావచ్చు – విషాదం కావచ్చు, హింస కావచ్చు, భావోద్వేగాలు కావచ్చు. ఆ రసాలన్నీ 'ఆనందింప' చేసి మళ్లీ రోజువారీ ప్రపంచంలో పడవేసేవే.

**సినిమా ఒక కళా?**

సినిమాని ఒక 'కళ'గా ఇప్పటికీ విజ్ఞులు అంగీకరించరు. అది జనరంజకమే కావచ్చుకాని, జానపదం కాదు – శాస్త్రీయ పోకడలలోనే సంగీతం, నృత్యాలు వున్నా – అంతా అశాస్త్రీయమే కదా! ఈ సినిమా, కవిత్వానికి, నాటకానికి, నాట్యానికీ ఇంకా ఇతర దృశ్య కళలకూ సాంకేతిక రూపాంతరమూ, సంకలనమూ అనే వాదనలో నిజం లేకపోలేదు. అంతేకాక, ఈ మాధ్యమం ఎక్కువగా వినోద ప్రచార సాధనంగానే చెలామణీ అవుతోంది, కాని ఒక సీరియస్ ఆర్ట్‌గా ఏనాడు పరిగణింపబడలేదు.

అంటే సినిమా ఒక కళకాదు– కాని ఎన్నో జనరంజకమైన కళారూపాల, సాంకేతిక సంకలనమే అని గమనించాలి!

సరే ఇది ఒక ఇండస్ట్రీయా? ఇండస్ట్రీకి ఉండవలసిన లక్షణాలు (ఒక స్థలం, ఒక షెడ్డు, యంత్రాలు, ముడిసరుకు ఉద్యోగస్తులు– మేనేజ్‌మెంటు వగైరా) ఏమీ లేకపోయినా ఒక ఎండ్‌ప్రొడక్ట్‌ని మాత్రం అందిస్తుంది. సాంకేతిక, గణాంక వివరాలకు పోకుండా, సినిమా చరిత్రను తిరగ తోడితే – 1937లో మొదలయిన టాకీలు 1945 వరకూ తెలుగుభాష రానివారు తెలుగు సినిమాలు నిర్మించారు (దర్శకులు తెలుగువారే) బొంబాయి సేఠులు– అంటే అప్పుడే ఇది పెద్ద వ్యాపారావకాశంగా కాళ్లూనింది.

అప్పటి 'భారతి' అయితే సినిమాని, అరకొరగా వున్న సాంకేతిక విధానాన్ని – వినీవినపడని శబ్దగ్రహణాన్ని ఇలా ఇన్ని శాఖలను – నటీనటుల నాటక కదలికలను పసిగట్టి హెచ్చరించింది కూడా. కాని ఎప్పుడేది జరగాలో అది జరిగిపోతుంటుంది!

**ఏ కళ అయినా మనిషిలోని మంచితనాన్ని సాధుస్వభావాన్ని పెంపొందించాలి. సామాన్య మానవునిలో అణగారి ఉన్న కోరికల రూపాంతరమైన కామక్రోధ హింసాదులను రెచ్చగొట్టేది క్షుద్రకళ అవుతుంది – సమాజాన్ని మురికి కూపంలోకి తోస్తుంది.**

ఏ శక్తివంతమైన సాధనాన్నయినా మంచికీ, చెడుకీ వాడుకోవచ్చు. సామాన్యంగా చెప్పుకోవాలంటే అగ్గిపుల్లతో పొయ్యి వెలిగించవచ్చు–ఇల్లు తగలబెట్టవచ్చు–అణుశక్తితో విద్యుత్తు పుట్టిస్తున్నారు. అణుబాంబు తయారు చేస్తున్నారు. కాని అణుబాంబు తయారు చేయటంలోనే తయారీదార్ల ఆంతర్యం దాగి వుంది.

తెలుగు నిర్మాతలుగా చెలామణి అయినవారు మొదటి దశకంలో ఎక్కువగా జమీందారులు–ఒక వ్యాపారంగా కంటే, వ్యాపకంగానే తీశారు. రచయితలు ఎప్పుడూ ప్రగతిగాములుగానే వుంటారు. అప్పటి దర్శకుల తీరేవేరు.



**త**మిళంలో ప్రాచీన గాథల నేపథ్యంలో మొదట కొన్ని సినిమాలు వచ్చాయి. అవి సంగీత పరమైన జానపద గాథలు. హాలీవుడ్ చిత్రాలతో ప్రభావితమై జెమినీ వారు చంద్ర లేఖ- భారీ సెట్టింగులు, నృత్యాలతో తీసి - హిందీలోకి కూడా డబ్ చేసి - విజయవంతం చేశారు. ఆ తరువాత అన్నాదురై, కరుణానిధి సాంఘిక అసమానతల ఇతివృత్తంగా సినిమాలు తీసి ప్రజలను చైతన్యపరిచారు- అందులో ఏమ్.జి.ఆర్ నాయకుడు. వీరు ప్రజల మనుషులు - అధికారంలోకి సినిమాద్వారా రాగలిగారు. అయితే శివాజీ గణేషన్ తన సంభాషణ ఉద్ఘాటనలతో ప్రేక్షకులను నాటకరంగం నుంచి వెండి తెరకు మార్చారు. ఇవన్నీ ఎక్కువ కుటుంబ కథాచిత్రాలు అక్కడక్కడ చారిత్రక చిత్రాలు కూడా వచ్చాయి. ఈ నాటి తమిళ సినిమా అన్ని రకాల క్రొత్త ఆలోచనలతో వెలుగుతోంది.

జమీందారుల సొమ్ముతోనే, ఆ జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రచన చేసి దర్శకత్వం నెరపిన దాఖలాలు వున్నాయి: 'రైతుబిడ్డ' దానికి ఉదాహరణగా పేర్కొనవచ్చు.

**రెడీమేడ్ కథలు :**

అయితే అంతకుముందుగా-ఎక్కువగా పౌరాణికాలు, జానపదాలు మాత్రమే నిర్మించేవారు-అందుకు కారణం కథలు-పాత్రలు తయారుగా వుండటమే. సినిమాకు సరిపడినట్లు మలచుకునే వారు, రచయిత, దర్శకులు.

పౌరాణికాలతో మొదలయి-అంటే నాటకాలనే ఎక్కువగా సినిమాగా తీసినా-సాంకేతిక పరంగా ఆరంభ దశలో వున్న ఈ జంతర్ మంతర్ మాధ్యమంతో ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్న సినీ పితామహులు గూడవల్లి రామబ్రహ్మం, సి.పుల్లయ్యగారు మొదలయిన మహానుభావులు.



గూడవల్లి

సినిమాలు నిర్మించటమే కాదు, ఒక వ్యాపారంగా-దీనికి ఒక ఒరవడి, ప్రొడక్షన్-డిస్ట్రిబ్యూషన్-ఎగ్జిబిషన్ ఈ త్రీటయర్ విధానాన్ని దారిలో పెట్టింది కూడా ఈ సమయంలోనే - ఒక క్రొత్త మాధ్యమాన్ని ప్రేమించి అందులో మునిగి తేలిన ద్రష్టలు, ముందు తరంవారు!

1945 నుంచి 55 వరకూ జాతీయోద్యమ స్ఫూర్తితో, సాంఘిక దురాచారాల్ని ఎండకట్టేందుకు నడుం కట్టి, ఈ మాధ్యమాన్ని ప్రచార సాధనంగా గుర్తించి జనసామాన్యం లోనికి వారి సందేశాన్ని తీసుకుపోవటానికే ఎక్కువ శ్రమ పడ్డారు-*మాలపిల్ల, పెద్ద మనుష్యులు, కన్యాశుల్కం* మొదలయిన చిత్రాలు ఈ కోవలోనివి.

ఒకప్పటి దర్శకులు-దార్శనికులు! హృదయం కలవారు. మానవ కళ్యాణం కోసం కలలు కన్న స్వాప్నికులు కూడా. తమకు అందుబాటులో ఉన్న వనరులతో కళాత్మకంగా చిత్రాలు నిర్మించారు. సమాజిక స్పృహతో, ఒక బాధ్యతతో మనిషి బాధలను కళ్ళముందుంచి ఆలోచింపచేశారు. సమాజ రుగ్మతలకు నివృత్తి చూప ప్రయత్నించారు. రసానందం ద్వారా మనసుని ఆహ్లాదపరిచారు. వీరంతా వివిధ కళారంగాల నుండి చలనచిత్ర పరిశ్రమకు వచ్చి దానికి కళా, కాంతీ, తెచ్చారు. సినిమా చరిత్ర సృష్టించారు!

**మధ్యతరగతి :** ఆ సమయంలోనే కుటుంబ పరమైన కథలతో, సజీవ పాత్రలతో ఏదో ఒక సందేశంతో, వినోదం అంతర్లీనంగా రెండు మూడు గంటలు కూర్చొని, ఇన్ని నవ్వులు-కొన్ని కన్నీళ్ళు పెట్టుకొని ఇంటికి చేరేవారు ప్రేక్షకులు! *సంసారం, సంతానం, మిస్సమ్మ, పెళ్లిచేసిచూడు*-ఇలా ఎన్నో... ఎక్కువగా ఎవరు చూసేవారు? మధ్యతరగతి కుటుంబాల వారు, కాలేజి విద్యార్థులు-అందుకనే ఎప్పుడూ మధ్యతరగతి విలువలు నిలబెట్టే కథలు-పాత్రలు వుండేవి. జమీందారు పాత్ర-పేదవాళ్ళ పాత్రలున్నా-అవి తారతమ్యాలు తెలిపేందుకే! "కూటికి పేదయినా, గుణానికి కాదు" "అడుక్కుతినే వాళ్లమైనా, ఆత్మగౌరవం లేని వాళ్లం కాదు" ఇవి పడికట్టు డైలాగులు ఎప్పుడూ వున్నాయి. ఆ తర్వాత *అన్నా చెల్లెలు, అన్నా తమ్ముడు, మారుటి అమ్మ, పెద్దకొడుకు, మారుటి తమ్ముళ్లు* ఇలా ఎన్నో కాంబినేషన్లు వచ్చినా-మధ్య తరగతి చుట్టూ తిరిగేవి! (1955-65) ప్రేమ కథలు-లైలా మజ్ను, అనార్కలి, సలీం-దేవదాసు ఇలాంటి కథలు ఒకరకంగా పరాయి సంస్కృతే అయినా జనరంజకంగా తీయగలిగారు.

**1960-75: సాంఘిక బాధ్యత :**

టెక్నిక్ పెరిగిన తర్వాత *మాయాబజార్*, 'డబుల్ ఫోజులు' త్రిపాత్రలు ఎన్నో వచ్చాయి.

కాని, ఒక ముఖ్య విషయం: సాంఘిక బాధ్యతలు, సామాన్య విలువలను వదిలి సినిమాలు-కథలూ రాలేదు.



మజ్నుగా అక్కినేని

సినిమా రచయితలు, దర్శకులూ తమ సాంఘిక బాధ్యతలు విస్మరించి, సినిమాలు తీసిన సందర్భాలు తక్కువే! అంతే కాకుండా అప్పటి సినీ కథా రచయితలు, దర్శకులు – ఎక్కువగా కవులు – పండితులు – బాగా చదువుకున్న సంస్కారులు వుండేవారు. సముద్రాల రాఘవాచార్య, తాపీ ధర్మారావు, ఆరుద్ర, శ్రీశ్రీ, కొసరాజు, పింగళి, ఆత్రేయ ఎందరో మహానుభావులు! నటీనటులకు ఈ అర్హతలు లేకపోయినా, హావభావ ప్రకటనలు ముఖ కవళికలకూ ఎక్కువ ప్రాధాన్యం ఉండేది.

రోజు రోజుకీ ప్రాచుర్యం పెరిగి పోతున్న సినిమాకు అందులో పనిచేసే కళాకారులకు, కార్మికులకూ సంఘపరంగా అంత గౌరవం వుండేది కాదు. ఎంతగా వీళ్లు కళాకారులమని తమనితాము పిలుచుకున్నా వీరితో సంబంధ బాంధవ్యాలకు గౌరవనీయమైన కుటుంబాలు ముందుకు వచ్చేవి కావు –

అంటే వీరి వేషాలు, తైతక్కలు చూసి ఆనందించే వారే కాని వాటికోసం ఎగబడేవారు – సామాన్య మధ్యతరగతి ప్రేక్షకులు! అంటే సంఘపరంగా సినిమా ఒక మెట్టు క్రిందగానే వుండేది! ప్రేక్షకులు ఎప్పుడూ తమ విలువలను కాపాడని, తమ భావాలకు విలువ ఇవ్వని సినిమాలను త్రిప్పికొడుతూనే వున్నారు. *మనసు–మాంగల్యం, చిలకమ్మ చెప్పింది, సుమంగళి* ఇలా అనాదరణకు గురైన చిత్రాలు.

**1975–95 : పతనం**

సరిగ్గా ఈ సమయంలోనే ముందు తరాలు వెనక్కు తగ్గిన తరువాత తెలుగు సినిమా పతనం మొదలయింది!

సినిమా అంటే అవగాహన లేనివాళ్ళు, ఆ మీడియా అంటే కమిట్‌మెంటు లేనివాళ్లు, కేవలం అందులో వున్న 'క్విక్‌మనీ'కి అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని డబ్బు కొల్లగొట్టడానికి ఇదొక సాధనంగా సమస్తమైన అసాంఘిక శక్తులూ సినిమాని చెరబట్టినాయి. వీరు నిర్మాతలుగాని, దర్శకులుగాని, రచయితలు కానీండి, ఇలా అన్ని శాఖలు పుచ్చుబట్టి పోయినాయి.

ఈ చెర బట్టిన దుశ్శాసనులు, ఇతిహాస పురాణ పాత్రలను వక్రించి భాష్యం చెప్తారు. తరతరాల సంస్కృతిని అపహాస్యం చేస్తారు.

వీరి నీతికి అర్థం వేరు. తెరమీద వీరు చెయ్యని అకృత్యం లేదు. స్త్రీని, స్త్రీ పాత్రలను అసభ్యంగా, గుడ్డపీలికలు, గోచీల స్థితికి దిగజార్చారు. నడిబజార్లో పట్టపగలు మానభంగం చేయిస్తారు. ఈ అకృత్యాలు చూస్తున్న సామాన్య ప్రేక్షకులకు కలిగేది – వారిలో అణగారివున్న వాంఛల విజృంభణ తప్ప – రసస్ఫూర్తి కాదు – మెదడు మొద్దుబారుతుందిగాని – ఆలోచనలు మేల్కోవు! ఇది తెలిసేది ఎందరికి? తెలుసుకొనే లోపుగా తెర దిగిపోతుంది! జరగవలసిన 'చెడు' జరిగిపోతుంది.

ఇప్పటి దర్శకుల – నిర్మాతలు ముందు చెప్పినట్లు మనిషి ప్రాథమిక కోరికలను తట్టి – రెచ్చగొట్టి– తాత్కాలికంగా ప్రలోభపెట్టి–అదొక వ్యసనంగా – అలవాటుచేసి పాతాళానికి తోస్తారు. ఒడ్డు చూపి, బొడ్డు ఊపి మీ ఆలోచనలను స్తంభింపచేసి ఆకట్టుకుంటారు! నిశితంగా పరిశీలించితే తప్ప ఆనందానికి – సుఖానికి తేడా తెలీనట్లే – కళా రసాస్వాదానికి – ఇప్పటి "సినీ సుఖాని"కి వ్యత్యాసం అవగాహన కాదు.

కళ ద్వారా మీకు ఆత్మానందం కలిగితే – ఇప్పటి సినిమా ద్వారా – సెన్సెస్‌కి మసాజ్ దొరుకుతుంది! కళ పేరుతో కోట్లు పోగు చేసుకొని పన్నులు ఎగవేసి – ప్రజల్ని – ప్రభుత్వాన్ని కళ్లుగప్పి గొప్పవారిగా వెలిగిపోతున్న ఈ నిర్మాత, దర్శకులు సమాజంలోని ప్రజలంతా తమ సుఖసంతోషాలకు – అవసరాలకు తలవొగ్గే "మాస్" గా అలగా జనంగా తలపోస్తారు.

ఒక దర్శకునికి వంద సినిమాలు తీసినా – సినిమా మీడియం అంటే అవగాహన లేదు!

వందల సినిమాలలో నటించినా నటన అంటే కాళ్లూ చేతులూ ఆడని హీరోగార్లు వుంటారు – ఇవి కప్పిపుచ్చుకోవటానికి ముందు వెనక పెద్ద పెద్ద పేరు తగిలిస్తారు.

> **బొంబాయిలో సినిమా ఎప్పుడూ క్రైం - మాఫియా కథలపైనే ఎక్కువగా వ్యాపారం చేశాయి. అయితే అక్కడ కూడా, శాంతారాం, గురుదత్, రాజ్‌కపూర్, హృషీకేశ్ ముఖర్జీ లాంటి బాధ్యతగల దర్శక నిర్మాతలు సినిమాని సాంఘిక సంస్కరణలకి వాడుకున్నారు. మనోజ్‌కుమార్ రెండోతరం సమస్యలను (ఎన్.ఆర్.ఐ) ఇతివృత్తంగా సినిమాలు తీసి విజయం సాధించారు. గుల్జార్ - మౌసమ్, ఆంధీ, కోషిష్ లాంటి వ్యక్తి, సామాజిక సంబంధాలను చక్కగా చిత్రించారు. ఇదంతా 1980 తోనే పూర్తయి పోయింది!**

సక్సెస్ రేటు 1 నుండి 5 – నూటికి! మరి ఎలా నిలదొక్కుకుంటారు? నష్టపోయేది వీళ్లు కారు కదా! చూపేది బూతులయినా, నీతులు చాలా చెప్తుంటారు. విషవృక్షాల్లాగా, వీళ్లకి శిష్య బృందాలకు కరువు లేదు.

ఒకప్పటి నిర్మాతలు జమిందారులు కదా! తర్వాత మోతుబరి రైతులు – నెల్లూరు షావుకారులు, ఆ తర్వాత గోదావరి జిల్లాల మైనర్ బాబులు – ఈ విధంగా నిర్మాత రూపాంతరం చెందాడు – వీరికి సినిమా నిర్మాణం కంటే చుట్టూ వుండే సరదాలే ముఖ్యం.

కాని ఇప్పుడు – నిర్మాత ఎవరు ? చేపల చెరువు యజమానులు, సారారాజులు, ఆ తర్వాత డబ్బు కూడబెట్టిన లారీ (భారీ) ఫైనాన్సర్లు, బిల్డర్లు, రియాల్టర్లు – వీరంతా సినిమా వ్యాపారంలో పెట్టుబడులతో దిగారు – వీరికి సాంఘిక బాధ్యత కాని, సంస్కరణలపై గౌరవం కాని, ఏ మాత్రం లేదు – వీళ్లకి అనుకూలంగానే రచనలు సాగుతున్నాయి.

**పాత్రలు** : కథానాయకుడు – ఒకప్పుడు ధీరోదాత్తుడు, దయార్ద్ర హృదయుడు, త్యాగమూర్తి. ఇప్పుడు – పగ–పగ అని సెగలు కక్కే 'రాక్షసుడు'! అందర్నీ బాదుకుంటూ చంపుకుంటూ పోయే 'హంతకుడు', తొడల మీద మచ్చలు వెతుక్కునే లాటరీగాడు! స్త్రీ పాత్రలు – పక్కింటి మొగుడితో పిల్లల్ని కనే భార్యామణి, ఇద్దరు పెళ్లాలు – ఒక మొగుడు– ('ఇద్దరు మొగుళ్ళు – ఒక పెళ్లాం' కథ రాసే దమ్ము లేదు) 'ఖల్‌నాయక్'లు హీరోలు! ఎంతవరకు దిగజారాము! ఇవన్నీ వ్యాపారం కోసం – కమర్షియల్ అంటారా? అయితే ఎందుకు పేలిపోతున్నాయి? వీరు కథల కోసం – దూరని చోటులేదు. అసెంబ్లీ, కోర్టులు–పోలీసుల ఠాణాలు, జైళ్లు – గుళ్లు, గోపురాలు ఇవన్నీ నేరపూరితమైన కథాగమనం కోసమే – ఈ పాత్రలు – రౌడీలు – బీభత్సం సృష్టిస్తారు!

ఈ చలనచిత్రం చరిత్ర గాడి తప్పుతున్నా – సంస్కృతి పతనావస్థకు చేరుతున్నా – మన ప్రభుత్వాలు పట్టించుకోవు కదా – పైగా – సబ్సిడీలు లక్షల్లో ముట్టచెప్తుతారు. ఎంత దారుణం!

ఈ నిర్మాత, దర్శకులు చేసే ఈ అకృత్యాలకు ప్రతి ముఖ్యమంత్రి అండదండలు – పూలదండలు కోకొల్లలు. డబ్బు సంపాదన, అవినీతి, అధికారం ఒక ప్రక్క – గూండాయిజం, సినీ గ్లామరు, రాజకీయం మరోప్రక్క – పడుగు పేకలయి సమాజాన్ని చీకట్లో కప్పి వేస్తున్నాయి.

అమాయక ప్రజలు ఇదే గొప్ప కాబోలునని ఈ మోజుకు లొంగిపోతున్నారు. ఇప్పుడు మధ్యతరగతి వారికి సినిమా నటన ఒక సంపాదనావకాశంగా కనపడుతుంది.

ఇక తెలుగు సినిమా గతి!

స్వార్థపరులైన నిర్మాతల ఆశల ఖరీదయిన కార్ల టైర్ల క్రింద పడి మంచి తెలుగు సినిమా చచ్చిపోయింది! వారసత్వపు పారంపర్యంలో నిర్వీర్యమై సినీ వృక్షం కుక్క మూతి పిందెలు కాస్తున్నది!

**భా**రతదేశ చలనచిత్ర వినీలాకాశంలో వచ్చిన మొట్టమొదటి నియోరియలిస్టిక్ చిత్రం సత్యజిత్‌రాయ్ దర్శకత్వం వహించిన *'పథేర్‌పాంచాలి'.* అదే శైలిలో సత్యజిత్‌రాయ్ మరో ముప్పై సినిమాలు తీసి ప్రపంచంలోని పదిమంది గొప్ప దర్శకులలో ఒకనిగా నిలిచారు. రే ధోరణిలో మృణాళ్‌సేన్, (భువాన్ షోమ్) గౌతమ్ ఘోష్ (అంతర్‌జలే యాత్ర, పార్) లాంటి వారెందరో చిత్రాలు నిర్మించి దర్శకత్వం వహించారు.

తెలుగులో ఆ ప్రయత్నం బి. నరసింగరావు *'మాభూమి'* చిత్రంతో మొదలై *రంగుల కల, దాసి, మట్టి మనుషులు* లాంటి చిత్రాలతో కొనసాగింది. నరసింగరావు మినహా మరెవ్వరూ ఆ శైలిలో చిత్రాలు తీయలేకపోయారు. ఆ తరువాత తెలుగులో ఈ ధోరణిలో తీసిన ఏకైక చిత్రం *బహుశ హరిజన్ ఒక్కటే.* దీనికి దర్శకుడు రవిచంద్రన్ (మళయాళ పత్రిక *మాతృభూమి* కి ఆయన రోమింగ్ ఎడిటర్.) ఈ చిత్ర నిర్మాతలు : సి. నరసింహారావు, వి. అశ్వినీకుమార్. సిమాటోగ్రాఫర్, మధు అంబట్ అద్భుతమైన వెలుగునీడల కావ్యాన్ని దర్శింపజేశాడు.

కన్నడ చిత్రసీమలో ఈ శైలికి అంకురార్పణ చేసిన వారు పఠాభి, గిరీష్ కర్నాడ్. (సంస్కార) కారంత్ (చోమనదుడి), జి.వి. అయ్యర్, (శంకరాచార్య) గిరీష్ కాసర్ వెల్లి (ద్వీప) ఈ శైలిని కొనసాగించారు. మళయాళీ చిత్ర పరిశ్రమలో అరవిందన్ ఈ శైలిలో చిత్రాలు తీసి రే తరువాత అంతటి ప్రతిభావంతునిగా పేరుగాంచాడు. అతని చిత్రాలలోని మార్మికత ఒక ప్రత్యేకత సంతరించుకుంటుంది (చిదంబరం), అలానే జాన్ అబ్రహామ్ *'అగ్రహారత్తల్ కలుదై'* లాంటి చిత్రాలు నిర్మించి అందరినీ ఆలోచింపజేశాడు. సమాంతర చిత్రాలుగా పేరు గాంచిన ఈ ఒరవడి ఈ కొత్త శతాబ్దంలో కొంచెం మందగించినా, సహజత్వానికి కొంత వ్యాపారాత్మకత జోడిస్తూ వచ్చిన *వెడ్‌నస్‌డే* లాంటి చిత్రాలు నటుడు అమీర్‌ఖాన్ తీసిన చిత్రాలు కొంతలో కొంత ప్రేక్షకులకు ఈ వ్యాపారాత్మక చిత్రాల ఎడారిలో ఒయాసిస్‌లా రిలీఫ్‌నిచ్చాయి.

# సినిమా చరిత్రను మలుపు తిప్పిన కొన్ని చిత్రాలు

**భక్తప్రహ్లాద :** 15.09.1931 లో హెచ్.ఎమ్. రెడ్డి నిర్మాణ సారథ్యంలో వచ్చిన ఈ చిత్రంతో తెలుగునాట టాకీ యుగం ప్రారంభమయింది. భాషా చిత్రాల ఆరంభానికి ఇది నాంది పలికింది.

**లవకుశ :** 23.12.1934లో చిత్తజల్లు పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం, రామాయణం లాంటి పౌరాణిక గాథలకు తెలుగునాట తిరుగులేని మార్కెట్



వున్నదన్న నిజాన్ని రుజువు చేశాయి. ఆ ధైర్యంతోనే ఆ తరువాతి కాలంలో, 1963లో శంకరరెడ్డి లాంటి నిర్మాతలు ఎంతో భారీవ్యయం చేసి రంగులలో తీసినా, చిత్రానికి కలెక్షన్ల విషయంలో ఢోకాలేదని నమ్మారు. సినిమాలోని పాటలను పుస్తక రూపంలో రావటం అన్నది ఈ చిత్రంతోనే మొదలయింది.

**మాలపిల్ల :** సినిమా వినోదాత్మకమే కాదు, ఈ మాధ్యమాన్ని సామాజిక ప్రగతికి ప్రజల ఆలోచనలలో మార్పును తీసుకురావడానికి కూడ ఉపయోగించవచ్చు అన్న ప్రయోగం ఈ చిత్రంతో విజయవంతమైయింది. ఇదే దారిలో *మళ్ళీ పెళ్లి, సుమంగళి* లాంటి అభ్యుదయ చిత్ర నిర్మాణాలు వచ్చాయి. సారథి వారి నిర్మాణంలో గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వం వహించిన ఈ చిత్రం 25-09-1938 లో విడుదలైంది. ఒక సం॥ తరువాత దీనికి కొనసాగింపుగా *రైతుబిడ్డ* చిత్రం వచ్చింది. (27.08.1939)

**భక్తపోతన :** నాగయ్య పోతనగా నటించిన, పోషించిన ఈ చిత్రం భక్తి రసం కాసులు కురిపిస్తుందని సహేతుకంగా నిరూపించింది. ఎన్.టి.ఆర్. తన బేనర్‌లో తీసిన బాక్సాఫీసు చిత్రం *పాండురంగ మహాత్మ్యం* ఈ ఒరవడిలో వచ్చినదే.



**స్వర్గసీమ :** 1946లో వచ్చిన ఈ చిత్రం - ఇంగ్లీషు చిత్రాన్ని మన నేటివిటికి దగ్గరగా మార్చుకోవచ్చుని నిరూపించింది.

**బాలరాజు :** 1948లో విడుదలయిన ఈ చిత్రం అఖండ విజయం సాధించింది - అంతకు ముందున్న రికార్డులనన్నిటినీ బద్దలు కొట్టింది. ఈ చిత్ర విజయం - ఆంధ్రదేశంలో అనేక మందిని సినిమా హాలు నిర్మాణం పై దృష్టిసారించేలా చేసింది. ఎన్నో టూరింగ్‌టాకీసులు పర్మినెంట్ టాకీసుల్లా మార్పు చెందాయి. ఇది సాంఘికంగా మార్చబడి చంటి అనే పేరుతో సినిమాగా వచ్చి మళ్ళీ ఆదరణపొందింది.

**గుణసుందరి కథ :** అత్యంత ఉన్నతమైన సాంకేతిక విలువలు, స్త్రీలనాకర్షించే కథాంశం రెండూ ముఖ్యమైన బాక్సాఫీసు సూత్రాలని చెప్పకనే చెప్పిన సినిమా. దీని తర్వాత న భూతో న భవిష్యతి అనేలా వచ్చిన పాతాళభైరవి చిత్రానికిదొక కర్టెన్ రైజర్ / ప్రిలూడ్ అనవచ్చు.



**కీలుగుఱ్ఱం – 1949 :** మీర్జాపురం రాజా తీసిన ఈ చిత్రంతోనే తెలుగులో అసలు సిసలు జానపద హీరో ఆవిర్భవించాడు. అంతకు ముందు వచ్చిన *ధర్మాంగద, బాలరాజు, అగ్నిపరీక్ష* లాంటి చిత్రాలలో కథానాయకుని పాత్ర నామ మాత్రం. *బాలరాజు* చిత్రంలో హీరో రెండుసార్లు చచ్చి హీరోయిన్ చలువతో బ్రతికి బట్టకడతాడు. *ధర్మాంగద* లో హీరో చిత్రమంతా పాములానే ఉంటాడు. *రత్నమాల* పూర్తిగా హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రం. హీరోవైపు హీరోయిజమ్ వైపు నిర్మాతల దృష్టిని మార్చిన ట్రెండ్ సెట్టర్ ఈ చిత్రం.



**పాతాళ భైరవి – 1951 :** ఈ చిత్రం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎన్.టి.ఆర్ ని తిరుగు లేని హీరో చేసిన చిత్రం. ఎస్.వి.ఆర్, రేలంగిలకు ఈ చిత్రం తరవాత ప్రాధాన్యత పెరిగింది. It is a timeless Classic.

**మల్లీశ్వరి – 1951 :** ఒక గొప్ప కళాఖండం కాసులు కురిపించక పోయినా, "సినిమా తీస్తే ఇలానే తీయాలి, డబ్బులు ముఖ్యంకాదు" అని కొందరి నిర్మాతల దృష్టిని మరల్చిన చిత్రం. క్లాసిక్ అన్నమాట మల్లీశ్వరి తరువాతనే పాపులర్ అయింది.

**పెళ్ళిచేసిచూడు – 1952 :** సాంఘిక చిత్రాలలో సామాజిక చైతన్యాన్ని రగల్చడం. పెద్దలు చేసిన పొరపాట్లకు వారిని నొప్పించకుండా ఒక అంతర్నాటకం ద్వారా, వినోదాత్మకంగా




మార్చి చిత్రం తీయవచ్చని చేసి చూపించారు చక్రపాణి. ఈ ధోరణిలో *గుండమ్మకథ. మిస్సమ్మ, చక్రపాణి* లాంటి ఎన్నో చిత్రాలు వచ్చాయి. భవిష్యత్‌లో మరెన్నో రాబోతున్నాయి.

**దేవదాసు – 1953 :** అత్యుత్తమ నటనా ప్రతిభను నటులు ప్రదర్శించగలిగితే, ట్రాజెడీనయినా విజయవంతం చేయవచ్చని నిరూపించిన చిత్రం.




**రోజులు మారాయి – 1955 :** పల్లెటూరు నేపథ్యంలో ప్రయోజనాత్మక చిత్రాలు తీయవచ్చని నిరూపించిన చిత్రం. తరువాతి కాలంలో వచ్చిన *పెత్తందార్లు, నమ్మిన బంటు* ఈ కోవలోనివే.




**దొంగరాముడు – 1955 :** స్క్రీన్‌ప్లే కు బైబిల్‌గా చెప్పబడుతున్న చిత్రం. కొత్తగా వచ్చిన ప్రతి దర్శకుడు పాఠ్య పుస్తకంగా పఠించే చిత్రం. సినిమా గ్రామరును అందరికీ అందించిన చిత్రం. ఈ చిత్రంతో కథ కంటే స్క్రీన్‌ప్లే ముఖ్యమయింది. వి.మధుసూధనరావు, తిలక్, ఆదుర్తి లాంటి వారు తమ చిత్రాలలో ఈ పంథానే అనుసరించారు. యాంటీ హీరోకు హీరోయిజమ్ ఇచ్చిన చిత్రం.

**తెనాలి రామకృష్ణ – 1956 :** చరిత్రను కొంచెం కాల్పనికతతో కలిపి చిత్రంగా తీసి విజయవంతం చేయవచ్చని నిరూపించిన చిత్రం. ఆ తరువాతి కాలంలో వచ్చిన తిమ్మరుసు, కవయిత్రి మొల్ల లాంటి చిత్రాలకిదే ప్రేరణ.



**మాయాబజార్ – 1957 :** దీని గురించి ఎంతచెప్పినా తక్కువే. తెలుగు వారు తప్ప మరెవ్వరూ పౌరాణిక పాత్రలకు నప్పరు. మరెవ్వరూ పౌరాణికాలు తీయలేరు అని భారతదేశం అంతా చాటి చెప్పిన చిత్రం. తెలుగులో దీని తరువాత వచ్చిన అన్ని పౌరాణికాలలో కె.వి. రెడ్డి నిర్వహించిన మేకప్, సెట్టింగులు, సంభాషణా ధోరణినే అనుసరించారు.







**సీతారామకళ్యాణం :** పౌరాణికాలలో కూడా ప్రతినాయకునికి కొన్ని ముఖ్యలక్షణాలుంటాయని ఆ వైపు కూడా దృష్టిసారించాలని చెప్పిన చిత్రం. ఒక గొప్ప ట్రెండ్‌కు ఎన్.టి.ఆర్. కారణ భూతులైనారు. నర్తనశాలలోని కీచకుని పాత్ర ఆ దృష్టితోనే రూపు దిద్దుకుంది.

**కనకదుర్గ పూజా మహిమ – 1960 :** తక్కువ ఖర్చుతో మాయామంత్రాలతో, ఫైట్లతో, నృత్యాలతో చిత్రాలు తీసి విజయం సాధించవచ్చని తనదైన ఒక ప్రత్యేక ధోరణిని ప్రవేశపెట్టారు బి. విఠలాచార్య. ఆయన పాతిక చిత్రాలు అదే ధోరణిలో తీసినా ప్రేక్షకులు విసుగు చెందకుండా, ఆయన చిత్రాలను ఆదరించారు.




**ఇద్దరు మిత్రులు – 1961 :** తెలుగులో అందరి దృష్టినీ ఆకర్షించిన మొదటి ద్విపాత్రాభినయ చిత్రం. (హీరో పరంగా) ఆ తరువాత ఈ ధోరణిలో పదుల సంఖ్యలో చిత్రాలు వచ్చాయి. ఇదొక బాక్సాఫీసు సూత్రంగా ఇప్పటికీ రాణిస్తుంది.

**గూఢచారి 116 :** క్రైమ్ అండ్ సెక్స్ బాక్సాఫీసు సూత్రమని చెప్పిన చిత్రం. ఈ ధోరణిలో అనేక క్రైమ్ చిత్రాలు రావడానికి ఈ చిత్రం దోహదం చేసింది.

**మోసగాళ్ళకు మోసగాడు – 1971 :** మన నేటివిటీ లేకపోయినా గుఱ్ఱాలు, హీరోయిజం, నిధికొరకు వేట లాంటి అంశాలు ఉంటే సినిమా విజయం సాధిస్తుందని చాటిన చిత్రం.




**తాత మనవడు :** తీయటం చేతనైతే మెలోడ్రామా బ్రహ్మాండంగా విజయం సాధిస్తుందని చెప్పిన చిత్రం.

**అల్లూరి సీతారామరాజు :** ప్రజల గుండెల్లో నాటుకు పోయిన వీరుని గాథను ప్రజలు ఆదరిస్తారని నిరూపించిన చిత్రం.

**దేవాంతకుడు :** సోషియా ఫాంటసీలు, తారాబలంతో, వినోదాత్మకంగా మలచి విజయం సాధించవచ్చని నిరూపించిన సినిమా. తర్వాత ఎన్నో సినిమాలకు మార్గదర్శి.

ఇంకా శంకరాభరణం, ప్రతిఘటన, మయూరి లాంటి చిత్రాలు తరువాత వచ్చిన అనేక చిత్రాలకు మార్గదర్శక మైనాయి.

# పద్మ విభూషణ్, ప్రజాకవి-కాళోజి

– కుర్రా జితేంద్ర బాబు

కాళోజి శతాబ్దకాలం క్రితం జ్వలించి, దశాబ్ద కాలం క్రితం ఆరిన అగ్నికణం.తెలుగు తల్లి తీర్చుకోలేని రుణం. కాళోజి బహుభాషా కోవిదుడు. ఒక జ్ఞాన భానుకిరణం. ఒక కడలి తరంగం. అతని కవన ఝరి ఒక జీవనది. సంప్రదాయ కుటుంబంలో పుట్టినా ఛాందస పండితుల బుర్రపై మొలిచిన పిలకగా కాక, ఛాందసంపై పిడుగుగా నిలిచిన వాడు. జీవిత సారాన్ని త్యాగపరిమళంగా, కార్యోన్ముఖత్వం, కావ్యోత్సాహం, ఉచ్ఛ్వాసనిశ్వాసలుగా జీవించిన విప్లవ ఋషి కాళోజి. జనశక్తిలో జ్వలిస్తున్న విత్తనాలను తనకవిత్వంలో బీజాక్షరాలుగా పలికించి జన రణనినాదాన్ని వినిపించిన గాంధేయ విప్లవ కారుడు. ఆగ్రహం, అనుకంప కాళోజిలో సరిసమానంగా తులతూగాయి.

హైదరాబాదు సంస్థానంలోని ప్రజలకు ఒక సాంస్కృతిక స్థైర్యము, ఒక సాంఘిక ప్రతిపత్తి అందించిన ప్రజాకవి. తెలంగాణాలో వచన కవులకు దేశికుడు, పథనిర్దేశకుడు కాళోజి. ఔన్నత్యంలో హిమాలయం. ఔద్ధత్యంలో మేరు పర్వతం. వ్యవస్థాగత స్వేచ్ఛ కాళోజి ప్రాణం. జనావళి ప్రగతిని కాంక్షించి జీవితాన్ని అంకితం చేసిన ప్రజాకవి కాళోజి అనే తన ఇంటిపేరే తనపేరుగా చేసుకొని ప్రసిద్ధుడైనాడు. కాళోజి అసలు పేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరావు రామ్‌రాజా కాళోజి. కానీ కాళోజి నారాయణరావుగా మాత్రమే అతన్ని అందరూ పిలుస్తూ వచ్చారు. కాళోజి 9 సెప్టెంబరు, 1914న బీజాపూర్ జిల్లాలోని రట్టెహళి గ్రామంలో కాళోజి రంగారావు, రమాబాయి దంపతులకు జన్మించాడు. కాళోజి తల్లి మాతృభాష కన్నడమైనప్పటికి ఆమె ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు మహారాష్ట్రలో నివసించుటవల్ల ఆమెకు కన్నడ భాష మాతృభాషగాను, మరాఠి వ్యవహార భాషగాను ఉండేది. కాళోజి పూర్వీకులు మహారాష్ట్రను పాలించిన పేష్వాల వద్ద ఆర్థిక గణాంక శాఖలో ఉద్యోగించినప్పటికి కాళోజి తండ్రికి మరాఠి అంతబాగా వచ్చేది కాదు. అందువల్ల కాళోజి తల్లి ఇంట్లో కన్నడ, మరాఠి భాషలు మాట్లాడగా తండ్రి ఉర్దూలో సమాధాన మిచ్చేవాడు. అందువల్ల కాళోజికి చిన్నతనం నుండే ఉర్దూ, కన్నడ, మరాఠి భాషలతో పాటు బాల్యమంతా వరంగల్ పరిసరాలలో ఉండటం వల్ల తెలుగు భాష కూడ చిన్నతనం నుంచే వచ్చింది. కాళోజి అన్నగారు రామేశ్వరరావు ఉర్దూలో ప్రఖ్యాత కవి మరియు షాద్‌గా ప్రసిద్ధులు. కాళోజికి రెండేళ్ళ వయసులో వారి తండ్రిగారు కాజిపేట దగ్గర మడికొండకు వచ్చారు. అక్కడే వారి తండ్రిగారు పిల్లలకు పాఠాలు బోధించేవారు. వానమామలై వరదాచార్యులు పెద తండ్రి వెంకటాచార్యులు కూడ అక్కడ పాఠాలు చెప్తుండేవారు. వారిదగ్గరే కాళోజి ప్రాథమిక విద్యాభ్యాసం జరిగింది.



కాళోజి

మడికొండలో ప్రతాపరుద్రాంధ్ర భాషా నిలయం పేర ఒక గ్రంథాలయాన్ని పెద్ది శివరాజు అను అతను నడిపేవాడు. ఆ గ్రంథాలయంలో సాయంత్రం పెద్ది శివరాజు, వానమామలై వెంకటాచార్యులు తెలుగు పురాణాలు కాళోజి తండ్రికి హిందీ రావటం వల్ల తులసీదాసు రామాయణం, సాయంత్రం పూట చెప్పేవారు. ఆ పురాణాల ప్రభావం కాళోజి బాల్యం నుండే పడింది. కాళోజి అన్నగారైన రామేశ్వరరావు మిడిల్ స్కూల్ మడికొండలో ప్యాసై వకాలత్ చదువుకి హైదరాబాదు వెళుతుంటే అన్నతోపాటు హైదరాబాదు వచ్చి పాతబస్తీలోని చౌమహల్ స్కూల్‌లో రెండవ తరగతి వరకు చదివాడు. ఆ తరువాత రెసిడెన్సిస్కూలు సిటీ కాలేజిలలో చదివినాడు. 1938లో అన్న వకాలత్ ప్యాసై న్యాయవాదిగా వరంగల్‌లో ప్రాక్టీసు ప్రారంభించగానే కాళోజి తిరిగి అన్నగారితో వరంగల్ వచ్చి కాళోజి హైస్కూల్‌లో చేరాడు. ఆనాటి నుండి వరంగల్‌లో జరిగిన ప్రతి ఉద్యమంలోను పాల్గొంటూ వచ్చాడు. కాళోజి తత్వంలోనే బాల్యం నుండి తిరుగుబాటు ధోరణి ఉండింది.

ఆ ధోరణే అతని జీవితకాలమంతా కొనసాగటం వల్ల బాల్యంలో గణపతి ఉత్సవాల్లోను, యౌవనకాలంలో వచ్చిన గ్రంథాలయ ఉద్యమం, ఆర్య సమాజ ఉద్యమాల్లోను, యువకుడిగా స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహ ఉద్యామాల్లోను, ఆంధ్రమహాసభలోను, హైదరాబాదు సంస్థానం భారత యూనియన్‌లో విలీనానంతరం 1953 తరువాత విశాలాంధ్ర ఉద్యమంలోను, 1969లో వచ్చిన తొలి తెలంగాణ ఉద్యమంలోను అత్యసవర పరిస్థితికి వ్యతిరేకంగా వచ్చిన పౌరహక్కుల ఉద్యమంలోను, లెజిస్లేటివ్ కౌన్సిల్‌లోను, బయట పాలకవర్గ హింసకు వ్యతిరేకంగా గాంధేయవాదులతోను, విప్లవ కారులతోను కలిసి ఉద్యమించాడు. తన జీవితకాలమంతా సమకాలీన ఉద్యమాలలో పాల్గొంటూ ప్రజలకి, ప్రభుత్వానికి మధ్య జరిగిన సంఘర్షణలలో, ధర్మాధర్మాల మధ్య జరిగిన సంఘర్షణలో కాళోజి జీవితమంతా ఎవరి పక్షం వహించాడనేది గమనిస్తే ఆయన జీవశక్తినంతా కవితా రూపాన ప్రజల పక్షం వహిస్తూ ధారపోసిన సంగతి గమనించవచ్చు.

కాళోజి ఎంచుకొన్న వస్తువు, ప్రతిభా శిఖరాల ఔన్నత్యం ఈ నాటికి పఠితలను ఆశ్చర్య పరుస్తుంది, ఉత్తేజాన్ని ఇస్తుంది. కాళోజి కవిత్వానికి సత్యాన్వేషణ, సామాజిక స్పృహ, రాజకీయ, విప్లవ చైతన్యం సమన్వయ రూప స్వరూపాలైనాయి. కాళోజి కవిత్వ అభివ్యక్తి, దేశీయ ప్రాతిపదికలను, భూమికలను, సమన్వయ దృష్టితో పరిశీలిస్తే సమకాలీన చరిత్ర అవగాహమౌతుంది. కాళోజి అనుభవాలు, సామాజిక సమస్యలు అంతస్సూత్రంగా అనుసంధింపబడి ఆ యుగ చైతన్యం కవితా చరణాలుగా వెలువడి పఠితల మోదాన్ని, అనుమోదాన్ని పొందాయి. కాళోజి జీవితం, కవిత్వం ఎవరినీ అనుసరించలేదు, అనుకరించలేదు. కాళోజి సృజనాత్మకతతో నవ్యంగా, సవ్యంగా కవిత్వాన్ని పలికించి, జీవితాన్ని నడిపించిన దిట్ట. తెలుగు ప్రజల గోడే కాళోజి *'నా గొడవ'*. నిజాం కాలంలో దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ...

**"నవయుగంబున నాజీవృత్తుల**
**నగ్న నృత్య మింకెన్నాళ్లు?**
**పోలీసు అండను దౌర్జన్యాలు**
**పోషణబొందే దెన్నాళ్లు?**
**దమననీతిలో దౌర్జన్యాలకు**
**దాగిలిమూతలు ఎన్నాళ్లు?**
**కంచెయే చేనును మేయుచుండగా**
**కాంచకుండుటింకెన్నాళ్లు?**
**దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకొని**
**దొరలై వెలిగే దెన్నాళ్లు?"**

అంటూ 1944 ప్రాంతంలో నల్గొండ జిల్లాలోని, జనగామ ప్రాంతలో భూస్వాములు నిజాం అండతో రైతు కూలీలపై చేస్తున్న దౌర్జన్యాలను, అణిచివేతలను దృష్టిలో ఉంచుకొని రాసినటువంటిది.

కాళోజి ఎనిమిదవ ఆంధ్రమహాసభనాటికే ప్రజాకవిగా ప్రసిద్ధుడవటంవల్ల 1942 మే, 3,4,5 తేదిలలో రావి నారాయణ రెడ్డి అధ్యక్షతన నల్గొండ జిల్లా, చిలుకూరులో జరిగిన ఎనిమిదవ ఆంధ్రమహాసభలో అశేష ప్రజానీకం రైతుల సమక్షంలో ప్రజాకవి బిరుదును కాళోజికి రావి నారాయణ రెడ్డి ఇవ్వటం జరిగింది. ఇది తెలంగాణ ప్రజలు ఇచ్చిన బిరుదు. ఇది భారత ప్రభుత్వం ఇచ్చిన 'పద్మ విభూషణ్' కంటే గొప్పది.

1945లో ప్రొఫెసర్ లిన్-యూ-టాంగ్ వ్రాసిన పుస్తకం ON THE IMPORTANCE OF LIVING లోని "The president will refuse to rule, the senators will refuse to debate. The Primadonna will refuse to dance, the philosophers will refuse to think, and the soldiers will refuse to fight........ when they are hungry" అనే వాక్యాలు చదివి ఆ ప్రేరణతో *'కర్షకా!'* అను శీర్షికన...

**"నర్తకుని నాట్యాలు గాయకుని గానాలు**
**వాద్యకుని వాద్యాలు శిల్పకుని శిల్పాలు**
**చిత్రకుని చిత్రాలు అంగనల అందాలు**
**కందర్పు కయ్యాలు కవిరాజు కావ్యాలు**
**కర్షకా! నీ కళ్లు కదలినన్నాళ్లే.**
**దాంభికుని ధ్యానాలు ఛాందసుని జాప్యాలు**
**తాత్వికుని తత్త్వాలు మాంత్రికుని మంత్రాలు**
**గురువుల గోప్యాలు గుడుగుడు గుంచాలు**
**దేవుళ్ల తిరునాళ్లు దివ్యనది తీర్థాలు**
**కర్షకా! నీ కళ్లు కదలినన్నాళ్లే.**
**ధార్మికుని దానాలు పండితుని భాష్యాలు**
**వర్తకుని వ్యాజ్యాలు వకీళ్ల వాదాలు**
**సైనికుని శౌర్యాలు యాంత్రికుని యంత్రాలు**
**యోధుల యుద్ధాలు రాజుల రాజ్యాలు**
**కర్షకా! నీ కళ్లు కదలినన్నాళ్లే.**

ఈ గ్రంథాన్ని ఈ వ్యాస రచయితకు 1991లో ఆప్యాయతతో ఇచ్చి చదివిన తరువాత ఈ గ్రంథంలోని

విషయాలను వివిధ కోణాల్లో కాళోజి వివరించటం ఒక మర్చిపోలేని జ్ఞాపకం.

కాళోజి కవిత్వ సంపుటి 'నాగొడవ' ను 1953లో మహబూబ్ నగర్ జిల్లాలో అలంపురంలో జరిగిన సాహిత్య సభలలో మహాకవి శ్రీశ్రీ ఆవిష్కరించాడు. ఆ సంపుటికి ముందుమాటలో ఆనందమో, ఆవేదనో కలిగినపుడు వచ్చిన భావాన్ని వెలిబుచ్చడం జరిగింది. అది ఇతరులకు కాకున్నా వెలిబుచ్చిన వానికి బాగా నచ్చింది. ఇతరులకు కూడా నచ్చితే విశేషం. ఈ విశేషధర్మం కైతకేమాత్రం ఆధారం కాదు. దానికి మూలం ప్రాణం కవికి అప్పుడప్పుడు కలిగిన ఆవేదన, ఆనందం మాత్రమే" అని తన కవిత్వాన్ని గురించి చెప్పుకున్నాడు.

ఇచ్చకాలకు, పొగడ్తలకు లొంగని బోళా శంకరుడు కాళోజి. కాళోజి పురాణాలను సందర్భానుసారంగా, సమకాలీన సంఘటనలతో అన్వయించి సభలలో చెప్పడంలో దిట్ట. ఉదాహరణకు యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలలో కాళోజిని ఒక సంవత్సరం సన్మానించారు. ఆ సందర్భంగా కాళోజి హిరణ్యకశిపుని వధించిన తరువాత ఉగ్రనరసింహుడు చల్లబడిపోయిన సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని సుదీర్ఘమైన కవిత కాళోజి చదివారు. ఆ సంఘటనతో ప్రధాన పూజారి సాష్టాంగ నమస్కారం చేస్తూ నాస్తికుడైన ఉగ్రనరసింహుడు ఈ రోజు నాకు దర్శన మిచ్చారని పలికాడు.

ఆనాడు సమకాలికంగా పౌరహక్కుల ఉద్యమం పై జరుగుతున్న హింసను దృష్టిలో ఉంచుకొని హిరణ్యకశిపుడు మొదటి ఫాసిస్టు. ప్రహ్లాదుడు మొదటి సత్యాగ్రాహి. లక్ష్మీనరసింహస్వామి మొదటి నక్సలైటు. హింస తప్పుగాని, ప్రతిహింస తప్పుకాదు. ప్రభుత్వం అండదండలతో పోలీసు, రెవెన్యూ సంస్థలలో ఉద్యోగిస్తున్న వారు ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజలను హింసిస్తుంటే అధికృతహింస. నేను ఏ అధికారంలో లేని సామాన్యుడను. నేను ఎవరినైనా చెంప దెబ్బ కొట్టినా, తలపగలగొట్టినా నాపై కేసు నడుస్తుంది. కాని పోలీసు కొడితే ఏ కేసు పెట్టడానికి వీలులేదు. తాహసీల్దారు, కలెక్టర్లు ప్రజలపై చేస్తున్న దౌర్జన్యాలకు ఎదురు తిరిగే ధైర్యం ప్రజలకు లేదు అంటూ ఒక కథ చెప్పాడు.

మహాభక్తుడు ప్రతిరోజు శివలింగానికి పూజాభిషేకాలు చేస్తుండేవాడు. ఒకరోజు ఒక నల్లతేలు శివలింగంమీద కూర్చున్నది. మహాభక్తుడు అభిషేకం చేయ సంకల్పించాడు. వాడు తెలుని చేత్తో జరిపితే కాటేస్తుంది. చెప్పుతో తీద్దామంటే శివలింగానికి అపచారం చేసినట్లువుతుంది. "చేత్తో జరపలేం. చెప్పుతో కొట్టలేం" అట్లనే అధికారంలో ఉండి అన్యాయాలు చేస్తున్న వారు శివలింగం పై తేలులాంటి వారు. వారిని చెప్పుతో కొడదామంటే ప్రభుత్వానికి, పోలీసు శాఖకు వ్యతిరేకం. సర్కారు ఉద్యోగిపై చేయి చేసుకున్నాడని పెద్ద కేసు. వీరు బద్మాష్‌లు చేస్తున్నరా లేదా? వీరు బద్మాష్‌లు చేస్తే ప్రజలేం చెయ్యాలి? మంత్రులు మందికొంపలారిస్తే ఏం చెయ్యాలి? వాళ్ళ మీద చర్య తీసుకుంటే చట్టాన్ని చేతిలోకి తీసుకున్నాడని ఆరోపిస్తారు. వాళ్లని నక్సలైట్లంటరు. టెర్రరిస్టులంటరు. ప్రభుత్వాధికారంలో ఉండి ప్రభుత్వ అండతో వీరు చేసే అవకతవక పనులకు, హింసాత్మక చర్యలకు వ్యతిరేకంగా ఏమీ చేయలేని అసహాయ స్థితిలో వాళ్ళట్లా ప్రవర్తిస్తున్నారు.

ప్రహ్లాదుని సత్యాగ్రహం వల్ల హిరణ్యకశిపునికి మానసిక పరివర్తన జరగక పోవటం వల్ల, ప్రహ్లాదుడు అన్ని సత్యాగ్రహాలు చేసి, దౌర్జన్యాలను ఓర్చుకొన్నాక నరసింహస్వామి నక్సలైట్‌లాగా స్తంభం నుంచి వచ్చి ఉగ్రనరసింహావతారం ఎత్తి రక్తం తాగాడు. మెడలో పేగులు వేసుకున్నాడు. అధీకృత హింస చేసినవాడు హిరణ్యకశిపుడు. సత్యాగ్రహం చేసినవాడు ప్రహ్లాదుడు. నిరాహారదీక్ష చేస్తే ఆత్మహత్య చేసుకుంటున్నాడని జైల్లో వేస్తారు. ఊరేగింపు చేస్తే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని కేసులు పెడతారు. నిరాహారదీక్షకు పందిరి వేస్తే మున్సిపల్ కార్పోరేషన్ అనుమతి లేదని పీకేస్తారు. ఇట్లా నిరసన ప్రదర్శనలు జరుగనీయకుండా అడ్డు పడుతుంటే వాళ్ళు ఉగ్రనరసింహులు కాక, నక్సలైటు కాక ఏమౌతారు అని ప్రశ్నించాడు.

కాళోజి జీవితమంతా సంచరిస్తూ, యువతని ఉత్తేజ పరుస్తూ, ఉద్యమాల్లో మమేకం అవుతూ ప్రజల్లో ఉన్నప్పటికి ఏ పదవులకు, ప్రలోభాలకు, ఆస్తులకు, అంతస్తులకు, స్వార్థానికి అతీతంగా జీవించాడు.

**"అన్యాయాన్నెదిరిస్తే / నాగొడవకు సంతృప్తి**
**అన్యాయం అంతరిస్తే / నా గొడవకు ముక్తిప్రాప్తి**
**అన్యాయాన్నెదిరించినోడు / నాకు ఆరాధ్యుడు...."**

అన్న కాళోజి నాకు బాల్యంలో ఆరాధ్యుడైనాడు. యౌవనంలో నాకు ఆచార్యత్వం వహించాడు. కౌమారంలో అతని సహచర్యం నాకు లభించింది. ఆయనలోని ఆదర్శం ఆయనలోని చైతన్యమే. అది అందరిదీ. జనావళి ప్రగతిని ఆకాంక్షించి జీవితాన్ని అంకితం చేసిన ప్రజాకవి కాళోజి. ఇంకా అతనికి నూరేళ్లే.

మి

కుర్రా జితేంద్ర బాబు, చరిత్ర పరిశోధకులు, హైదరాబాదు. ఫోన్ : 9848882600

నార్ల వారి

# సీత జోస్యం

సెప్టెంబరు సంచిక తరువాయి....

- రావినూతల సత్యనారాయణ

**"సీతజోస్యం" నాటకం :**

రామాయణ ఇతివృత్తాన్ని నూతన దృక్పథంతో పరిశీలించి, సాంప్రదాయబద్ధం కాని పద్ధతిలో పాత్ర చిత్రణ చేసి, హేతువాద రీతిలో సంభాషణలు సృజించి, సరళ భాషలో, సులభ శైలిలో వ్రాసిన నాటకం సీతజోస్యం. ఈ నాటకాన్ని, 1981వ సంవత్సరంలో తెలుగు భాషలో ప్రచురించ బడిన ఉత్తమ రచనగా ఎంపికజేసి, తమ ప్రతిష్ఠాత్మకమైన జాతీయ పురస్కారాన్ని ప్రకటించారు కేంద్ర సాహిత్య అకాడెమీ, న్యూఢిల్లీ వారు. సాహిత్య అకాడెమీ చరిత్రలో తొలిసారిగా ఈ పురస్కారం ఒక నాటకానికి ఇవ్వబడినది. ఇది విశేషించి పేర్కొన దగిన విషయం. ఆ ఘనత నార్ల వెంకటేశ్వరరావు గార్కి లభించుట అత్యంత ముదావహం!

సీతజోస్యం నాటకం రెండు ముఖ్య విషయాలను స్పష్టం చేస్తుంది. మొదటిది రామాయణ గాథకు చారిత్రక ఆధార మంటూ వుంటే, అది ఒక ప్రక్కన ఆహారాన్ని సేకరించుకొని కాలం గడిపే సామాజిక ఆర్థిక వర్గానికీ, మరో ప్రక్కన ఆహారాన్ని ఉత్పత్తి చేసే, సామాజిక ఆర్థిక వర్గానికీ మధ్య సంఘర్షణకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇక రెండవ విషయం:- ఈ ఘర్షణలన్నీ వింధ్య పర్వత శ్రేణికి ఉత్తరంగా ఉన్న ఏదో ప్రదేశంలో జరిగినవేగాని, ఆ పర్వత శ్రేణి దక్షిణంగా మాత్రం కాదు. పైన పేర్కొనిన విషయాలు యం.వెంకటశేష అయ్యంగారు కన్నడంలో రచించిన "ఆదికవి వాల్మీకి" ఇత్యాది రచనలు చదివిన వారికి క్రొత్తగా తోచక పోవచ్చు. అటువంటి ప్రయత్నాలు దైవత్వమని విశ్వసించే విషయాలలో మానవ వ్యవహారాలను అందరికీ ఎత్తిచూపే ఉద్దేశ్యముతో వ్రాసిన వ్రాతలే! పైన భూమికలో విశద పరచిన వివరాలను దృష్టిలో ఉంచుకొని సీతజోస్యం నాటకాన్ని పరికిద్దాం!

సీతజోస్యం రెండంకముల నాటకం. ఈ నాటకంలో ప్రవేశ పెట్టిన పాత్రలు ఐదు. అందులో ప్రధాన పాత్రలు సీతా రామ లక్ష్మణులు. సహ పాత్రల రూపంలో ఇద్దరు ఋషులను ప్రవేశ పెట్టారు రచయిత. నాటకం దండకారణ్య ప్రాంతంలోని జనస్థానం లో సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమ ప్రాంగణంలో జరిగినట్లు వర్ణితమైనది. రంగ వర్ణన నాటకీయతకు తగు విధంగా (అనుగుణ్యంగా) వివరింప బడినది. కథ జరుగు నాటికి సీత వయసు పదిహేడు సంవత్సరాలుగా పేర్కొనబడినది. లక్ష్మణుని వయసు కూడా దరిదాపు ఒకటిగానే చెప్పబడినది. లక్ష్మణుడు మంచి పొడగరిగాను, కనుముక్కు లమరిక చక్కగా కుదిరి, అందగానిగా కనిపించుటయే గాక, కండలు తిరిగిన మంచి దేహదారుఢ్యం కలిగి, రాజ ఠీవితో కూడిన అందగానిగా చిత్రింప బడినాడు.

సీత సహజ రూపవతి. నగలూ, ఇతర అలంకరణలు లేకపోయి నప్పటికీ, అందచందాలు కలిగి, ఆహ్లాద కరమైన కంఠ స్వరముతో చూపరుల గౌరవాదరాలను చూరగొనే విధంగా దర్శన మౌతుంది. చూడగానే ఆమె దృఢ చిత్త, అవసరమైనప్పుడు నిష్కర్షగా మాట్లాడగలిగిన వ్యక్తిత్వం గల వనిత అని విదిత మౌతుంది. ఆత్మాభిమానంలో గాని, బుద్ధికుశలతలో గాని, ఆమెతో సరితూగ గల్గిన వారు బహు కొద్దిమంది! అంతేకాదు, ఆమెది హాస్య ప్రవృత్తి. అందరి వదినెల లాగానే, మఱిదితో చతురతా పూర్వకంగా సంభాషించు లక్షణం కలదిగా చిత్రించారు నార్ల వారు. సహ పాత్రలైన ఋషులలో మొదటి ఋషి వయసు అరవై పైగా, రెండవ ఋషి వయసు అంతకంటె పదేళ్ళు చిన్నగా చిత్రిత మైనది. మొదటి ఋషి పొట్టివాని గాను, రెండవ ఋషి పొడవు వాని గాను వర్ణించారు రచయిత.

ఋషి పుంగవులు రామునితో ఏదో విన్నవించి, ఆయన సహాయం అర్థించే యోచనతో సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమ స్థానానికి వస్తారు. కథా సందర్భం: వనవాసానికి సీతా లక్ష్మణ సమేతుడై వచ్చిన దశరథ రాముని మునులందరూ కలిసి

దండకారణ్యములోని రాక్షసులంతా తమతమ యజ్ఞ, యాగాదులకు విఘ్నాలు కల్పించి అనేక విధములైన కష్టములు కల్పిస్తున్నారని, వారిని సంహరించి తమతమ క్రతువులు నిరాటంకంగా జరుగునట్లు చేయమని రాముని కోరుట, దానికి రాముడు ఒప్పుకొని రాక్షస సంహారానికి మాట ఇచ్చుట జరుగుతుంది. రాముడు ఆ వ్యవహారముల లోనే నిమగ్నుడై ఉంటాడు. అలాంటి నేపథ్యంలో నాటకం మొదలౌతుంది.

సీతజోస్యంలోని మొదటి అంకం సీతా లక్ష్మణుల సంభాషణతో మొదలవుతుంది. ఒంటరిగా ఆశ్రమానికి తిరిగి వచ్చిన మఱదిని చూచి, చిలిపి తనంతో కూడిన స్వరంలో చిరునవ్వుతో "ఒంటరిగా దయ చేస్తున్నారు, తమ ఇనవంశోద్భవ ప్రభువు లెక్కడా?" అని ప్రశ్నిస్తుంది సీత! ఆప్రశ్నతో ప్రారంభమైన సంభాషణ ఇనవంశీయులు అఖిల జగత్తునూ పదే పదే జయించుట, అశ్వమేధాలను జరుపుట, సాగర త్రవ్వకం, గంగను స్వర్గం నుండి భూతలానికి తెచ్చిన విషయం వెటకారంగా ఉల్లేఖిస్తుంది సీత! అది వినిన లక్ష్మణుడు "అది నిజం కాదా వదినా" అని అడుగుతాడు. దానికి జవాబుగా ఇక్ష్వాకులు పొగడ్తలకు సులభంగా లోనౌతారని, తాము సాధించిన విజయాలను హెచ్చు స్థాయిలో అంచనా వేసుకొని గర్విస్తారని, ముఖస్తుతికి లోనై, అనాలోచితంగా తమ ప్రతాప ప్రదర్శనకు దిగుతారని మఱదిని కవ్విస్తుంది! దానికి లక్ష్మణుడు "మీమాటలు చాలా విచిత్రంగా వుంటాయి వదినా" అంటాడు. "మీభ్రమల కంటేనా" అని యెదురు ప్రశ్నిస్తూ – "లేని పోని గొప్పలకు పోయి మీ అన్నగారు ఏమి ముప్పులు తెస్తారో అని నేనెంత తల్లడిల్లుతూ వుంటానో నీ కేమి తెలుసు అంటూ, ఇంతకూ ఆయన ఎచ్చటికి వేంచేశారు?" అని అడుగు తుంది లక్ష్మణుని. "తమ పుణ్యాశ్రమానికి వచ్చి దాన్ని పావనం చేయవలసిందని మహర్షులెవ్వరో కోరగా...". "ఈ కొత్త మహర్షులెవరు? మన ప్రాణానికి వీరెక్కడ దాపురించారు?" అంటుంది సీత! "ఇక్కడికి ఒక యోజనం దూరం లోనే వారుంటున్నారట, తప్పక ఒకసారి రమ్మని మోమాట పెట్టగా కాదన లేక వెళ్ళారు వదినా". "కాదన లేక వెళ్ళలేదు. కావాలనే వెళ్ళారు! మీ అన్నగారి సంగతి నాకు తెలియదా? రఘుకులతిలకా! రణరంగ ధీరా! రాక్షస సంహారకా అంటూ ఉబ్బివేస్తే చాలు, తమంత వారు ఈ లోకంలో లేరని తబ్బిబ్బు లైపోతారు... త్వరగా వేరెక్కడకైనా వెళ్ళి, మన పర్ణశాల మనం వేసుకొని, మన బ్రతుకు మనం బ్రతకడం అన్ని విధాల మనకు శ్రేయస్కరం" అంటూ చెబుతుంది సీత. "ఒక రాజర్షి కుమార్తె ఇలా అన వచ్చునా వదినా" అని ఆశ్చర్య పోతాడు లక్ష్మణుడు. దానికి బదులుగా "మా నాన్న గారు జటా జూటాలు ధరించిన ప్రతి కపటిని, ఒక మహర్షిగా నెత్తిన పెట్టుకోరు. జ్ఞానులైన వారినే చేరదీసి సన్మానిస్తారు" అనేసరికి, లక్ష్మణుడు "ఈ జనస్థానం లోని ఋషులందరూ కపట వేషధారులని మీఅభిప్రాయమా?" అని అడుగుతాడు వదినెగార్ని! ఈ లోపల నగలమూట నొకదానిని లక్ష్మణునికి అందించి భద్ర పరచమని చెబుతుంది. దానిని అందుకొనిన లక్ష్మణుడు "ఈ పూట వీటిని బయటికి తీశారెందుకు వదినా" అని అడుగుతాడు. ఇంతలోనే, సీత విచార గ్రస్తురాలై తన కష్టాలను తలచు కొని చింతిస్తుంది. ఆ ఆభరణములలో ఏది ఎప్పుడు ఎవరిచ్చినది జ్ఞప్తికి తెచ్చుకొని పరి పరి విధాల కలత చెందుతుంది. ఈ ప్రవాస కాలాన్ని ఎలాగో ముగించుకొని, అయోధ్య చేరుదామనుకొంటే ఇచ్చటి ముని ముచ్చులు ఈ కారడవులనుండి మనలను బయటపడ నిచ్చేటట్టు లేరని మఱదితో అంటుంది. ఇంతలోనే లక్ష్మణుడు "ఈ మహర్షు లందరు ధూర్తులని మీరు అకారణంగా భయపడుతున్నారు వదినా" అంటాడు. "కార్యార్థులై వచ్చిన వారు తమరు ఇంద్రులని, చంద్రులని భట్రాజుల కంటే హీనంగా ముఖ స్తుతులకు దిగితే, వారిని ధూర్తులనుకొనక మహర్షులను కొంటానా? ఏమయ్యా! అమాయక మఱదీ!" అంటుంది.

ఇంతలో రాముని స్తుతిస్తూ, స్తోత్ర పాఠాలు వినిపిస్తాయి. "లక్ష్మణా అరుగో! వస్తున్నారు మళ్ళీ మీవంధి మాగధు లెవరో!" అంటుంది సీత. లక్ష్మణుడు పర్ణశాల ద్వారం వైపు రెండడుగులు వేయక మునుపే, ఒక ఋషి లోనికి వస్తాడు! లక్ష్మణుడు చేతులు జోడించి నమస్కారం తెలియ జేస్తాడు ఆ ఋషికి. ఆయన కూడా "శతమానం భవతు" అని ఆశీస్సు లందిస్తాడు. ఇంతలో చికాకుతో ఉన్న సీతకూడా ఆ ఋషికి నమస్కరిస్తుంది. "దీర్ఘసుమంగళీభవ" అని ఆమెను దీవిస్తాడు ఋషి. ఇంతలోనే మరో ఋషి పండ్ల బుట్టతో ప్రవేశిస్తాడు. "తమ పాద పద్మాలతో మా పర్ణ కుటీరాన్ని"... అంతలో సీత అందుకొని "పావనం చేయగలిగిన వారు వీరు కాదు, వీరి అన్నగారు" అంటుంది, మొదటి ఋషి వర్యునితో!

అంతలోనే మొదటి ఋషి "ఓహో తమరు రామచంద్ర ప్రభువుల సోదరులా? లక్ష్మణ స్వాములా?" అంటాడు మొదటి ఋషి. తర్వాత కొంతసేపు ఋషి మధ్యా సీతాలక్ష్మణుల మధ్యా కొంత సంవాదము జరుగుతుంది. ఋషి పొగడ్తలు సీతకు నచ్చవు. ఋషుల మధ్య, సీత మధ్య జరుగుతున్న వాద వివాదాలు లక్ష్మణునికి అట్టే నచ్చవు. వదినెగారు ఋషులతో కొంత వ్యంగ్య ధోరణిలో ప్రసంగిస్తున్నారని గ్రహించి సంభాషణా ధోరణిని మార్చాలని ప్రయత్నిస్తాడు. కాని అందులో సఫలం కాడు. సీతకు ఋషులు తనను తల్లీ, అమ్మా అని సంబోధించుట నచ్చదు. అది గ్రహించిన లక్ష్మణుడు ఋషులను త్వరలో పంపించే ఉద్దేశ్యంతో "మా అన్నగారు ఇచ్చటికి సమీపంలో నివసించు ఋషు లెవరో ఆహ్వానించగా వారి ఆతిథ్యాన్ని స్వీకరించడానికి వెళ్ళారు. వారు తిరిగి వచ్చేసరికి చాలా పొద్దెక్కి పోవచ్చు, తాము వెంటనే తిరుగు ప్రయాణం చేయుట మంచిదేమో?" అని ఋషులకు సూచిస్తాడు. కాని మొదటి ఋషి జవాబుగా "శ్రీవారి దర్శన భాగ్యం పొంది, వారికి మా నివేదనను చేసుకోకుండా తిరిగి వెళ్ళము" అంటాడు. ఇంతలో సీత కలుగ జేసుకొని "ఏ నివేదనతో తమరు వచ్చారో అది నాకు తెలుసు చెప్పమంటారా? రాక్షసుల పీడ మాకు విశేషంగా ఉంటున్నది, మా యజ్ఞ యాగాదులకు వారు విఘాతాలు కల్పిస్తున్నారు. వారిని సంహరించి, వారి దురాగతాల నుంచి ప్రభువులు మాకు విముక్తి కలిగించాలి, ఇదే కదా మీ నివేదన?" అని ప్రశ్నిస్తుంది. ఈమాటలతో రెండవ ఋషి ఆశ్చర్య చకితుడై "మా నివేదన మా మనసులో ఉండగానే సరిగ్గా గ్రహించారు, సీతమ్మ తల్లిగారు" అంటాడు. దానికి సీతమ్మ "తమ బోటుల సాంగత్యము వలన నాకు కూడా కాస్త కాస్త దివ్య దృష్టి అబ్బుతున్నది లెండి" అని వ్యంగ్య యుక్తంగానే జవాబు లిస్తుంది ఋషి వర్యులకు. తర్వాత మొదటి ఋషికీ సీతకు దీర్ఘమైన వివాదస్పద సంవాదం జరుగు తుంది. ఇది ఏమాత్రం నచ్చదు లక్ష్మణునికి! కాని వదినెగారిని నివారించ జాలక మౌనంగా తిలకించుట కంటే మరేమి చేయజాలడు. మొదటి ఋషికి వదినెగారికీ వచ్చిన వివాదంలో ఋషి వర్యుల లక్ష్యం, న్యాయ సంగతం కాదని వారు రాక్షసులుగా చిత్రించే ఆటవికులు రాక్షసులు కాదని, అడవులలో ఆహారం సమకూర్చుకొని తమ జీవితాలు తమ పద్ధతిలో జీవించు అమాయకులని, యజ్ఞ, యాగాల రూపంలో అడవులన్నిటినీ ధ్వంసం చేసి ఋషులే వారికి నష్టం కలిగిస్తున్నారన్న వాదన స్పష్ట పరుస్తుంది! మచ్చుకు వారి సంభాషణను పాఠకులు తిలకించండి!

**మొదటి ఋషి :** వారు రాక్షసులు తల్లీ! క్రూర రాక్షసులు!

**సీత :** వారి కంటికి మీరే క్రూర రాక్షసులుగా కనబడవచ్చు గదా! వారు మా కోసల రాజ్యం లోనికి రాలేదు, మీ కాశీ రాజ్యం లోకైనా రాలేదు. అన్యాయంగా వారి సీమలోకి చొచ్చుకు వచ్చింది మీరే! వారి నివాస స్థానాలకు చిచ్చు పెడుతున్నది మీరే! వారి బ్రతుకులను బుగ్గి చేస్తున్నది మీరే!

**మొదటి ఋషి :** అదేమిటి తల్లీ! అదేమిటి? మా హోమగుండాలలో నీళ్ళుపోసి, వాటిని చల్లార్చి వేస్తూ, వారు మమ్ము వేధించుకు తింటూ ఉంటే, మేమే వారికి ఏదో కీడు తలపెట్టినట్టు మమ్ము నిందిస్తున్నారు?

**సీత :** హోమగుండాలను మీరెందుకు వెలిగిస్తున్నారు? ఈ అడవులను కాల్చడానికి కాదా? అందువల్ల మీకు పంటలు పండవచ్చు, మీ గరిశెలు నిండవచ్చు, మీ సంసారాలు ఉండ వచ్చు. కాని, ఇక్కడి వారి మాటేమిటి? వీరు కాయలేరుకొని, కందమూలాలు తవ్వుకొని బ్రతక వలసిన వారు కారా? పిట్టలను పట్టుకొని, జంతువులను కొట్టు కొని పొట్ట పోసుకో వలసిన వారు కదా? ఈ అడవులను మీరు ధ్వంసం చేస్తే వారి బ్రతుకులు నాశనం కావా?

పై విధంగా సాగుతుంది వారి సంవాదం. ఈ వాద ప్రతి వాదనల తర్వాత ఋషులిద్దరూ తిరిగి వెళ్ళిపోతారు. ద్వితీయాంకం.

**సమయం :** మరునాటి ఉదయం పదకొండు గంటల ప్రాంతం. సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమములో అతిథి గృహం. రంగం లోకి కొత్తగా ప్రవేశించు పాత్ర, రాముడు. వయస్సులో లక్ష్మణుని కంటే ఎక్కువ పెద్ద వాడు కాడు. లక్ష్మణుని వలె నార బట్టలు ధరిస్తాడు. ఎలాంటి రాజాలంకరణలు లేకపోయినా, మోము తీరులో, మాట తీరులో, నడక వైఖరిలో రాజఠీవి ఉట్టిపడుతూ ఉంటుంది! వంశ గౌరవాన్ని కాపాడవలసిన భారం, దానిని పెంపొదించ వలసిన భాధ్యత, ఇవి తనకు విధి విహితాలన్న ప్రగాఢ విశ్వాసం, ప్రస్ఫుటమయ్యే వ్యక్తిత్వం ఆయనది. రచయిత రాముని పాత్రను వాల్మీకంలో వర్ణించబడిన విధంగా చిత్రిస్తాడు. ధీరోదాత్తుడు, శరణాగత రక్షకుడు, ఆడిన మాట తప్పని వాడు!

సీత పాత్రను సద్విమర్శకురాలిగా, వాస్తవికతను అంచనా వేయగల ఉదాత్త మహిళగా రూపొందిస్తాడు నార్ల. లక్ష్మణునితో తనకు గల చనువును ఉపయోగించుకొని ఋషి వర్యుల మీద తీవ్ర విమర్శలు గుప్పిస్తుంది! ఋషులు హోమ గుండాలను వెలిగించి, అడవులను కాల్చి, స్థానికులను నిరాశ్రయులుగా చేయడం, వారి దురాక్రమణకు చిహ్నమని ఆమె అభిప్రాయం. ఆ దురాక్రమణలు ఎక్కువగా సాగించి దక్షిణాపథాన్ని వశపరచుకోవడం వారి లక్ష్యమని ఆమె నమ్మకం. దానికి స్థానికులైన అనార్యులు ఎదురు తిరగగా, వారిని నిర్మూలించుట కొరకై రాముని సహాయం అవసర మైనది. ఈ విషయం గ్రహించిన సీత ఋషుల ప్రవర్తన బాహాటంగా విమర్శిస్తుంది. ఇది కేవలం నార్ల వారి ఊహాజనితం కాదు. దీనికి వాల్మీకి రామాయణంలో మాతృక ఉన్నట్లు తెలియుచున్నది. ఈ విషయం సరస్వతుల సుబ్బరామ శాస్త్రులవారు చేసిన వాల్మీకి రామాయణ అనువాదం (వావిళ్ళ వారి ప్రతి) లో పేర్కొనబడినది. అందుచేత నార్ల వారి సీత పాత్ర చిత్రణకు ఇతర ఆధారాలు ఉన్నట్లు తెలియుచున్నది. నార్ల వారు సీతను భక్తి ప్రపత్తులతో పతివ్రతా ధర్మాన్ని నిర్వహించు యాంత్రిక మనస్తత్వం గల మహిళగా కాక, స్వయంగా ఆలోచించి, మంచి చెడ్డలను నిర్ణయించుకోగల్గిన హేతువాదిగా చిత్రించారు. అదే, నార్ల వారి నూతన దృక్పథం, రామాయణాన్ని సరైన పద్ధతిలో అధ్యయనం చేసి, దైవత్వమని విశ్వసించే విషయాలలో మానవ వ్యవహారాలను ఎత్తి చూపుట వారి ఉద్దేశ్యంగా మనకు స్పష్టమవుతుంది. ఈ విషయాలను దృష్టిలో నుంచుకొని "సీతజోస్యం" ద్వితీయాంకం పరిశీలించవలసి ఉంటుంది. అప్పుడే ద్వితీయాంకములోని సంభాషణా విశేషాలను పాఠక మహాశయులు ఆనందించ గలుగుతారు.

కథా సందర్భం:

అన్న రాకకై, ఆతురతతో గుమ్మం బయట లక్ష్మణుడు ఎదురు చూస్తూ నిలబడి ఉంటాడు. అశాంతిని, ఆగ్రహాన్ని సూచిస్తున్న ముఖంతో సీత పర్ణశాలలో పచార్లు చేస్తూవుంటుంది. "వాకిలి ముందట పడిగాపులు కాచినంత మాత్రాన రాముడు రాడని, లోపలికి వచ్చి నీడలో ఉండమనీ మఱదికి చెబుతుంది. ఒకవిధమైన చిరుకోపంతో భర్త తిరిగి రాలేదన్న మానసిక వత్తిడిని కప్పి పుచ్చుకొని "ఆటవిక సంహార కార్యక్రమంలో పూర్తిగా నిమగ్నులైన వారికి భార్య జ్ఞాపకం ఉంటుందా? తమ్ముడు గుర్తుంటాడా? తమ శౌర్య ప్రతాపాలను, పూర్తిగా చూపించి, రఘువంశ ప్రతిష్టను కాపాడి, ఋషుల స్తోత్ర పాఠాలను విని, నెమ్మదిగా వస్తారులే! మీ అన్నగారు. రాక ఎక్కడికి పోతారు?" అని దెప్పి పొడుపు ధోరణిలో అంటుంది సీత మఱదితో. ఈ మాటలతో ప్రారంభమౌతుంది రెండవ అంకం. సీత ఆలోచనా ధోరణి, మానసిక వ్యథ, ఈ జనస్థానంలోని ఋషులు తన భర్త రాముని అనైతికమైన తమ లక్ష్య సాధనకు వాడు కుంటున్నారనే చింత, రాముడు నిరపరాధులను దండిస్తున్నారన్న ఆందోళన సీతను కలవర పెడుతుంది. ఆయనకు (రామునికి) తోచక పోతే, "నీవైనా ఆటవికులను వేటాడ్డం కోసమే మనం అరణ్యవాసానికి రాలేదని మీ అన్నగార్కి చెప్పరాదా?" అంటుంది. "ఆయనకు నేను హితోపదేశం చేయగలపాటివాడనా? వదినా" అంటాడు లక్ష్మణుడు జవాబుగా! మాటల మధ్యలో ఉండగా రెండవ ఋషి పర్ణశాలలో ప్రవేశిస్తాడు. రాముడు తిరిగి వచ్చాడా లేదా అన్న సంగతి తెలుసుకొనే నిమిత్తం, రెండవ ఋషి ప్రశ్నలు సీతకు చికాకు కలిగిస్తాయి. అది పసిగట్టిన లక్ష్మణుడు రెండవ ఋషిని పంపి వేసే ప్రయత్నం చేస్తాడు. అంతలోనే మొదటి ఋషితో – రాముడు పర్ణశాల ప్రవేశిస్తాడు. మొదటి ఋషి ద్వారా విశేషాలన్ని తెలుసుకొంటాడు. ఆ స్థితిలో తిరిగి మొదటి ఋషి మధ్య, సీత మధ్య కొంత సంవాదం జరుగుతుంది. రాముడు మొదటి ఋషిని కూర్చో పెడతాడు తానూ ఆశీనుడౌతాడు. అప్పుడు మొదటి ఋషి సీతను కూడా కూర్చో వలసినదిగా అభ్యర్థిస్తాడు. అప్పుడు సీత భర్త నుద్దేశించి, "నిన్న పొద్దుననగా వెళ్ళిన వారు, మీరు చూస్తూనే ఉన్నారుగా, ఇప్పుడే తిరిగి వచ్చారు. స్నాన పానాదులు పూర్తి చేసుకొని, వారిని కాస్త విశ్రాంతి తీసుకోనివ్వండి. వారితో మీరు మాట్లాడదలచినది సాయంత్రం మాట్లాడవచ్చు...". అంతలోనే రాముడు మొదటి ఋషితో..."తమ ఆదేశమేమో సెలవివ్వండి" అంటాడు. మొదటి ఋషి మొదలెట్టక ముందే, సీత ఆయన వచ్చిన పనీ, చెయ్యదలచిన విన్నపాన్ని గురించి విపులంగా వివరిస్తుంది. రామునికి సీత జోక్యం నచ్చదు. మందలింపు స్వరంతో ఆమెను నివారిస్తాడు. కాని ఋషి రామునితో సీతను సహితం తమ సంభాషణలో పాల్గొన నివ్వవలసినదిగా కోర్తాడు. అంతేగాక లక్ష్మణుడు సహితం అచ్చటనే ఉండుటకు రాముని అనుజ్ఞ తీసుకొంటాడు. అందరి సమక్షంలోనే సంవాదం జరుగుతుంది. ఆ సందర్భములో

చర్చకు వచ్చిన విషయాలు: అయోధ్యా పౌరులు కాని వారు అయోధ్య ప్రభువుల రక్షణ కోరుట భావ్యమా? దానికి రాముని అభిప్రాయం కోర వచ్చునని. లక్ష్మణుడు సహితం అన్నతో ఏకీభవిస్తాడు. సీత జవాబు మాత్రం కోరుట భావ్యం కాదని. మొదటి ఋషి దృష్టి లో అయోధ్య ప్రభువులకు రాజ్యాధికారం కన్నా, వారి నైతికాధికారం విస్తృతమైనదనీ, ఆ సద్గుణమే వారికి ఆర్యావర్తం పై సర్వనాయకత్వం కట్ట బెడుతున్నదని. దానికి రామ లక్ష్మణులిద్దరూ కూడా అంగీకరిస్తారు. సీత మాత్రం ఆ విషయానికి సమ్మతించదు. అయోధ్యా రాజులకు పొగడ్తలకు పొంగిపోవుట సహజమనీ, ఆ కారణాన ఆర్యావర్తం పై నైతికాధికారం స్వీకరించడానికి వెనుదీయరని చెబుతుంది. ఆ బాధ్యతకు వారికి ఏవిధమైన రాజస్వమూ లభ్యమగుట లేదని వివరిస్తుంది. కాని, మొదటి ఋషి తమ యజ్ఞ ఫలంలో నాల్గవ వంతు పంచి పెడుతున్నామని చెప్తాడు. దానికి జవాబుగా సీత "ముని వర్యులు తమ యజ్ఞ సంపదను తమతోనే ఉంచుకొని దానితో తమ ఆత్మ రక్షణ చేసుకొన వచ్చును గదా! ఆయుధాల ద్వారా రాముని రక్షణ కోరుట అవసరమా?" అని అడుగు తుంది.

దానికి మొదటి ఋషి యజ్ఞ శక్తి మహత్తర మైనదని, దానితో ముల్లోకాలను మాడ్చి వేయవచ్చునని, కాని ఆ శక్తిని లౌకిక ప్రయోజనాలకు వినియోగించరాదని తమకు దైవాను శాసనమని వివరిస్తాడు. సీత వైఖరి రామునికి నచ్చదు. కోపంతో ఆమెను వారిస్తాడు. అయినా, సీత జంకక రామునితో "ఈ ఋషివర్యులు ముఖస్తుతి చేసి, మీచేత అమాయకులైన ఆటవికులను అన్యాయంగా చంపిస్తున్నారు. వీరి మోసాన్ని కాదనలేక మీరు"... ఇంతలో రాముడు కోపంతో సీతను మందలించి, మొదటి ఋషితో "తమ వెంట నేను తప్పక వస్తాను. తమ హోమగుండాలను చల్లారుస్తున్న రాక్షసులను వధిస్తాను. మీరు విడిదికి వెళ్ళి మీ ప్రయాణ సన్నాహాలు పూర్తి చేసుకొండి. నేను నా కోదండముతో తమ సేవలో నిలుస్తా" నని చెప్పి మొదటి ఋషిని పంపించేస్తాడు.

కొన్ని క్షణాలు గడచిన తర్వాత రాముడు శాంతం వహించి, సీతను బుజ్జగించి అనునయ స్వరంతో "నేను నా కర్తవ్యాన్ని పరిపాలిస్తాను. నాకు రాగల ప్రమాద మేమీ లేదు. నీకు లేనిపోని భయం, బాధ దేనికి? అనవసరంగా కంటతడి పెట్టుకోకు." అంటూ భుజంపై చేయి వేసి, ఆప్యాయంగా ఆమె ముఖం తన వైపుకు తిప్పుకొని చెక్కిళ్ళను మృదువుగా తుడుస్తాడు! భర్త అనురాగానికి కరిగిన సీతమ్మ "నేనేమి పడితే మీకు దేనికి లెండి! నేను మీకు కావలసి వస్తే కదా?" అని నిష్ఠుర వచనాలతో పతిని ప్రశ్నిస్తుంది. క్షణ కాలంలో ఆదర్శ దంపతులు ఒకరిలో నొకరు చొచ్చుకుని పోతారు! "అదేమి పిచ్చిమాట" అంటాడు రాముడు అనునయ పూర్వకంగా. వెంటనే సీత భర్త వైపు చూచి "పిచ్చి మాట కాదు, నిజం మాటే! నేను మీక్కావలసి దాన్నైతే, ఇదిగో సంధ్య వార్చి వస్తానంటూ నిన్న పొద్దుననగా వెళ్ళిన వారు ఇప్పటికి తిరిగి వస్తారా? వచ్చీ రాక ముందే, మరో ఋష్యాశ్రమానికి ప్రయాణం కడతారా?" అని అను నయపూర్వక కోపాన్ని వ్యక్తపరుస్తుంది. ఇద్దరి మధ్యా మరికొంత సంవాదం జరుగుతుంది. మరలా సంభాషణ మునులూ, హోమగుండాలు, ఆత్మరక్షణ, ఆటవికుల సంహరణ విషయాల మీదనే కేంద్రీకృతమౌతుంది! ఆ విషయంలో తన అభిప్రాయాలు నిర్మొహమాటంగా భర్తతో చెబుతుంది సీతమ్మ. "ఇదివరలో నీవు మహర్షులంటె ఎంతో భక్తి చూపేదానివి. ఇక్కడికి వచ్చిన తర్వాత ఎందువల్లనో వారిని విపరీతముగా విద్వేషిస్తున్నావు" అంటాడు రాముడు. "ఇక్కడికి వచ్చిన తర్వాత గాని, వారి నిజరూపం నాకు తెలిసి రాలేదు" అని సీత జవాబు! అలా అంటూనే "మీరు మీ తల్లి తండ్రుల ముందు చేసిన వాగ్దానం పాటిస్తున్నారా?" "ఎందుకు పాటించటంలేదు?" అని అడుగుతాడు రాముడు.

మునీంద్రులు అస్త్ర శస్త్రాలను ధరించరని, వారు నిరాయుధులను చంపి వేయరని వాదిస్తుంది సీత. దానికి జవాబుగా తాను నిరాయుధులను చంపుటలేదని, వారు రాక్షసులని, రకరకాల ఈటెలూ, గొడ్డళ్ళూ, బరిసెలు, వారికున్నాయని, వారు వాటిని వాడుతున్నారని, వారు నిరపరాధులెంత మాత్రం కాదని చెప్తాడు. వారు రాక్షసులు అంటాడు. "ఆ పేరు వారికి మీ మహర్షులు పెట్టిన పేరు! వారిని అలా చిత్రించకపోతే వారిని మీచేత చంపించలేరు" అని సీత ఎంత నిక్కచ్చిగా చెప్పినా, రాముడు తన అభిప్రాయాన్ని మార్చుకొనడు. తాను ప్రస్తుతం రాజు కానప్పటికీ, క్షత్రీయుడనేనని, అందుచేత క్షత్రియ ధర్మం తప్పక నెరవేరుస్తానని అంటాడు. ఇంతలో వారి సంభాషణ చిత్రకూట పర్వత ప్రాంతంలోని వారి పర్ణశాల, అచ్చటి జీవిత సరళి వైపు వెళ్ళుతుంది. ఆ పర్వతంపై విహరిస్తూ, అచ్చటి నదిలో జలక్రీడ లాడుతూ తాము ప్రవాస క్లేశాలను మరచి,

సంతోషముతో గడపిన రోజులు రామునికి జ్ఞప్తికి తెస్తుంది సీత! ఆ సౌందర్య గరిమ రాముని ప్రభావితుని చేసి, కవిగా మార్చిన ఉదంతం స్మరణకు తెస్తుంది. అక్కడ జరిగిన కొన్ని సంఘటనలను గుర్తుకు తెచ్చుకొని, ఒక చెట్టు కొమ్మ మందాకినిపై వాలి వుండగా, రాముడు ఆ చక్కని దృశ్యాన్ని వర్ణిస్తూ వాడిన ఉపమానం "ప్రేమ కలాపాలాడ్డానికి ప్రేయసి వక్షః స్థలం పైకి వాలబోతున్న ప్రియుని వలె నున్న" దని అన్న సందర్భాన్ని జ్ఞప్తికి తెచ్చుకొంటాడు! కొంతసేపు భార్యా భర్తల మధ్య మృదు సంభాషణలు జరుగుతవి. అప్పుడు రాముడు "ఇవ్వన్నీ నువ్వు జ్ఞాపకం చేస్తుంటే, నా మనసు మళ్ళీ ఆ ఆనందం వైపుకు పరుగు లెడుతున్నది" అంటాడు సీతతో. అంత సుఖ జీవితాన్ని విడచి ఇక్కడికి రావలసిన అగత్యం మునివర్యుల కుట్రగా చెబుతుంది సీత. కాని రాముడు సీత అభిప్రాయాలతో ఏకీభవించడు. అప్పుడు సీత రాముని ఈ విధంగా అభ్యర్థిస్తుంది. "నా మాట విని ఆయుధాలను వీడండి. ఆయుధానికి రక్తదాహం వుంటుంది; అది నర బలిని కోరుతుంది. ఆయుధ ధారణ చేయగానే కారుణ్యమూర్తులు క్రూరులౌతారు... నా ప్రార్థన మన్నించి కనీసం ప్రస్థుతానికైనా, ఆయుధ విసర్జన చేయండి" అంటుంది. "నీ వేమైనా చెప్పు, నేను ఆయుధ విసర్జన చేయను" అని జవాబిస్తాడు రాముడు. దానికి మారుగా ... "పగలేకుండా, పరులను చంపడం మహాపాపం. మీరు ఇప్పుడు ఆ మహా పాపానికి వొడిగడుతున్నారు" అంటుంది సీత. ఆ మాటలకు కోపగించుకొన్న రాముడు "నేను వధిస్తున్న వారు నిరపరాధులని నీవు నిజంగా నమ్ముతున్నావా?" అని అడుగుతాడు. దానికి సీత "ఆటవికులకూ మనకూ ఏవిధమైన వైరం లేదు. మనతో వారు ఏవిధమైన జోక్యం పెట్టుకోవడం లేదు. మనకు కించిత్తు అపకారమైనా తలబెట్టడం లేదు. ... వీరు అన్యం పున్నెము తెలియని ఆటవికులు ... ఋషుల స్వార్థానికి వీరిని బలి పెట్టకండి" అంటూ రాముని పాదాలు పట్టుకొని "నేను ఒక మహారాజు కుమార్తెను, మరో మహారాజుకు కోడలిని; భిక్షమడుగుట నా ప్రవృత్తికి విరుద్ధం. అయినా, ఈ పూట భిక్షమడుగుతున్నాను. ఈ ఆటవికులకు ప్రాణభిక్ష పెట్టండి" అని సీత భర్తను వేడుకొంటుంది. అప్పుడు రాముడు ఆమె పట్టు విడిపించుకొని, ధనుర్బాణాలను అందుకొని బయటికి వెళ్ళిపోతూ "అవసరమైతే నిన్ను విడుస్తాను, లక్ష్మణుని విడుస్తాను, నా ప్రాణాలనైనా విడుస్తాను, కాని ఋషుల కిచ్చిన మాట మాత్రం తప్పను. ఆడిన మాట తప్పితే మా వంశ గౌరవం మంటగలుస్తుంది" అని జవాబిస్తాడు. బయటకు వెళ్ళిపోతున్న భర్తతో "ఔను, మీ వంశ గౌరవమే మీకు కావలసింది, నేను కాదు. వెళ్ళండి, వెళ్ళి నిరపరాధులను చంపి, మీ వంశ గౌరవాన్ని కాపాడుకొండి. కాని, ఆగి ఒక్క మాట వింటారా?" అని అడుగుతుంది. రాముడు ఆగిపోతాడు. "అవసరమైతే నన్ను విడుస్తామన్నారు. మీరు అంతటి వారే! మీ వంశ గౌరవానికి బలిగా ఎప్పుడో ఒకప్పుడు ఏ నట్టడవి లోనో నన్ను దిక్కు లేని దాన్నిగా దిగ విడుస్తారు!!" అంటుంది. ఆ మాటలతో ముగుస్తుంది నాటకం. ఆ మాటలు నిజమైనట్లు రామాయణ కథ దృఢ పరుస్తుంది! అందుకే నాటకం సీతజోస్యం అయింది!

**విమర్శలు-వివాదాలు :**

1981-1982 సంవత్సరాలలో తెలుగులో ప్రచురితమైన పుస్తకాలలో 'సీత జోస్యం' అత్యుత్తమ గ్రంథమని సాహిత్య అకాడెమీ, న్యూఢిల్లీ వారు ఎంపిక జేసి, దానికి పురస్కారాన్ని ప్రకటించారు. ఆ పురస్కారం సాహిత్య రంగంలో ప్రతిష్టాత్మకమైనదని విజ్ఞులైన పాఠకులకు విదితమే.

ఆ పురస్కారాన్ని ప్రకటించిన తర్వాత ఆ పుస్తకాన్ని గూర్చిన విమర్శలు రా మొదలెట్టాయి. అయితే Indian Literature అనే ద్వైమాస పత్రిక (మే-జూన్ 1982) ప్రచురించిన సమీక్ష వివాదానికి దారితీసింది. విమర్శకుడు 'సీత జోస్యం' పై వ్రాసిన సమీక్ష లోని కొన్ని ముఖ్యాంశాలు!

1) రచయిత నార్ల వెంకటేశ్వరరావు గారు తాము వ్యక్త పరచిన అభిప్రాయాలకు మౌలికతను సంతరింపజేయటం లేదు; (Narla claims no originality for these views) రామాయణ సాహిత్యాన్నంతా అవలోకనం (పరామర్శనం) గావించి, గొప్ప హేతు బద్ధమైన సారాంశాలను ఎంపిక చేసుకొని తన పద్ధతిలో విస్తృతమైన వాదనలు వినిపించారు.

2) నార్ల నిశితం కాని, స్పష్టంగా, ఒప్పించ నేర్పు కొరవడిన వాదనలు ఒక్కో పర్యాయం తన ప్రతి వాదల్నే దెబ్బతీశాయి. ఉదాహరణకు నార్లగారు 97వ పేజీలో, 131వ పేజీలో పేర్కొనిన విషయాలు గమనించ వలసినదిగా పాఠకులకు సూచన.

3) ... ఆర్యేతర నాగరికతా ప్రాభవాన్ని చాటి చెప్పేందుకు నార్ల చక్కటి నచ్చ జెప్పే ధోరణిని చేపట్టారు. కాని, ఇతిహాస

నాయకులు ధరించిన మహిమ గల ఆయుధాల్ని హేళన చేస్తూ భారతీయులు పరాయి దురాక్రమణ దారులైన దారస్, అలెగ్జాండర్‌లతో తలపడినప్పుడు భారతీయుల వద్ద అటువంటి ఆయుధాలు వుంటే మరి దురాక్రమణ దారులు లెలా వారిని ఓడించగలిగారంటూ చేసిన వాదన కళాశాల చర్చలలో కుర్రకారు చేసే వాదనలా ఉంది... మౌలిక ఇతిహాసాల విషయంలో ఒక పండితుడు ముందుగానే కొన్ని నిర్ణయాలు తీసుకొని వాటి ఋజువుల కోసం ఇరవయ్యవ శతాబ్దపు టార్చి లైటు సహాయంతో ఆ చీకటి మలుపుల్లోకి ప్రయాణించటంలో ఎదురయ్యే కనుపించని గోతుల్ని ఎత్తి చూపేందుకే".

4) ... దశరథ జాతక కథలలో రమా పండితుడు తన సోదరి సీతను వివాహమాడటంలో అభ్యంతరం చెప్పనప్పుడు నార్ల ఆనాడు అమలులో ఉన్న నైతిక సామాజిక కట్టుబాట్లను అనువర్తింప జేయటంలో నిష్పాక్షిక ధోరణి అవలంబించి నట్లే కాని ఋషుల జన్మల విషయానికి వచ్చేటప్పటికి పురాతన సమాజానికి ఇరవయ్యవ శతాబ్దపునాటి భారతీయపు వివేచనతో కూడిన దారుణమైన లైంగిక విశృంఖలత్వాన్ని అనువర్తింపజేసి అసహ్యించు కోవడం జరిగింది. (పుట 87)

5) "... నార్ల సీతను వాల్మీకి చిత్రించిన విధంగానే చిత్రిస్తున్నారని ఎంత చెప్పుకొన్నా ... నార్ల పనితనం సీతను క్రిందికి దొర్లించింది".

6) ... తన పుస్తకం భక్తి పరుల కోసం కాదని, అవగాహనా పరులైన పాఠకుల కోసమని – దాన్ని ఎంతగా పదేపదే చెప్పటం జరిగిందంటే హేమ్లెట్లోని రాణి మాటల్ని వేరొకరు ఇలా వల్లె వేసేంతగా – "ఈమె మరీ ఎక్కువగా నిరసించినట్లు అనిపిస్తుంది".

పై సమీక్షకు నార్ల వారి ఒక ప్రత్యాక్షేపం:

ముఖ్యాంశాలు: 1) నేను ప్రతికూలంగా ఉన్న సమీక్షను, అది విషపూరితమైనాసరే స్వాగతించగలను – కానీ ఆకతాయి పద్ధతిని మాత్రం కాదు. మీ సమీక్షకుణ్ణి అంశాల వారిగా ఖండించే ఉద్దేశ్యం నాకు లేదు, ఆయనలోని చారిత్రక భౌగోళిక అవగాహనా లేమిని, ఆమాట కొస్తే అసలు వాల్మీకి రామాయణ అవగాహనా రాహిత్యాన్ని పట్టి చూపేందుకే నేను పరిమితమౌతాను.

2) మొదటగా చారిత్రక అంశాన్ని స్పృశిస్తాను ... డి.యస్.గారు నేను ఆర్యేతర (హరప్పాకు చెందిన) నాగరికతను పూర్వ వైభవ ప్రాపకానికి తగిన వాదం చేసినట్లుగా అంగీకరించారు. ... గతంలోని వారి ప్రతిభ లన్నీ, అది యుద్ధకౌశలం గాని, శాంతియుత జీవనం గానీ బహు కొద్దితరాలలోనే కోల్పోయారు; కాల క్రమేణ విజేతలైన ఆర్యులు వాటిని అమితంగా అలవర్చుకొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో హరప్పన్లను, ఆర్యనులను ఒకేగాటన కట్టనందుకు అసంగత్యాన్నో, కాలేజి చర్చల్లో పాల్గొనే యవ్వనారంభ కుర్రకారు మనస్తత్వాన్ని నాకు అంటగట్టి, నిష్పాక్షికంగా ఆలోచించ గలవారెవరైనా నన్ను నిందించగలరా? ఏం చేద్దాం? ... పతనమైన నాగరికతను పరిఢవిల్లుతున్న దానితో సమతూకంతో చూచే పరిపక్వత డి.యస్.ఆర్. గారి వలె బహుశా నాకు లేదేమో!

3) "ఇక భౌగోళిక స్థితిని గూర్చి ఒక మాట. జరవులు ... ఇటువంటి స్థితిలో జరవులు, నికోబారియన్లకు భిన్నంగా ఉండటంలో డి.యస్.ఆర్. ఆలోచించినట్లు వింత ఏముంది?" మన ప్రధాన భూభాగంలో కూడ కొద్ది వందల మైళ్ళ దూరంలో నివసించే ఆదిమ జాతి తెగల్లో కూడ ఒక తెగకు మరో తెగకూ మధ్య అలవాట్లల్లో, ఆచారాలలో, వ్యక్తిగత స్వభావాలలో మనం భేదం గమనించటం లేదూ?

4) డి.యస్.ఆర్. చెప్పినట్లు నేను సీతను "మొరటుగా, వాగ్వివాదిగా" చిత్రించాననే దానిని అంగీకరించవలసి వస్తే ఆయన వాల్మీకి కృతి అసలు చదివి ఉండదనీ, ఒకవేళ చదివినా ఏదో పైపైన తిరగ వేయటం జరిగి ఉంటుందనే తన తప్పును తాను అంగీకరించవలసి ఉంటుంది ... డి.యస్.ఆర్. కావాలనుకుంటే అరణ్య కాండ 45వ సర్గను చూచి ఋజువు పరచుకోవచ్చు.

5) ... అయినాసరే డి.యస్.ఆర్. గారు సీతకు సంబంధించి సిగ్గుమాలిన ఆ యాచిత గౌరవాన్ని ప్రదర్శించాననే అభియోగం నాపై మోపారు. మున్ముందు డి.యస్.ఆర్.గారు రామాయణం ఇతివృత్తంపై వచ్చిన ఆధునిక కృతుల్ని (ఆధునికం స్ఫూర్తిలో అనుకోండి) వ్యంగ్య ధోరణిలో ఖండించాలనుకొంటే ఆయన ముందుగా కనీసం ఒక్కసారైనా వాల్మీకి రామాయణం చదవ వలసి వుంది, అదీ నిశితంగా అధ్యయనం చేయవలసి ఉంది.

తన సమీక్ష ముగిస్తూ డి.యస్.ఆర్. నన్ను గేలి చేసేందుకు షేక్స్పియర్‌ను ... ఈడ్చుకొచ్చారు. వాయనం తిరిగి ఇస్తున్నట్లు నేను షేక్స్పియర్ మాటలనే ఉటంకించాలా;

"ఓరి అజ్ఞాన భూతమా, నీ వెంతటి కురూపివి"!

తర్వాత ఈ విషయమై సాహిత్య అకాడెమీ అధికారుల మధ్య నార్ల వారి మధ్య ఉత్తర ప్రత్యుత్తరములు జరిగినవి. ఎట్టకేలకు నార్ల వారు "... ఎన్నడూ ఏ పురస్కార గ్రహీతనూ అకాడెమీ తన పత్రిక ద్వారా అపనిందలకు గురి చేయ లేదు. అకాడెమీ నా పట్ల ప్రవర్తించిన తీరుకు పురస్కారాన్ని తిరస్కరించటం మినహా మరో మార్గం లేదంటున్న నాతో స్వాభిమానం గల రచయితలందరూ తప్పక ఏకీభవిస్తారు" అని పురస్కారాన్ని తిరస్కరించారు.

పై విషయాన్ని పురస్కరించుకొని, మాజీ వైస్ ఛాన్సలర్ డా.హోమా. నాయక్, గుల్బర్గా విశ్వ విద్యాలయం నార్ల వారిని సమర్థిస్తూ ఈ క్రింది విధంగా వ్రాశారు:

"... నార్ల అభిప్రాయాలు స్పష్టంగానే ఉన్నాయి. ఆయన నిర్ణయం పరిశుద్ధమైనదే. ఆయనను బాగా ఎరిగి వున్న వారూ, ఈ ఉదంతం తెలిసిన వారూ ఆయనను నిశ్చయంగా తప్పు పట్టలేరు. ... "ఇండియన్ లిటరేచర్" సంపాదకుడు ఆంగ్ల కవితా సృజనకర్త. ఆయన కొంచెం ఔచిత్యాన్ని ప్రదర్శించి ఉంటే అకాడెమీ ఇటువంటి ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొనాల్సి వచ్చేది కాదు".

**ముగింపు :**

"మంచి ప్రపంచంలో ఉత్కృష్ట మానవుల కోసం" నార్ల వారి జీవన పోరాటం. ఆ అన్వేషణలో ఒక భాగమే ఈ 'సీత జోస్యం'. దీనిలో వ్యక్తపరచిన అంశాలు కేవలం నార్ల వారి పరిశోధనల ఫలితం మాత్రమే కాదు, ఆయన పూర్వ పరిశోధకుల ఫలితాలను విస్తృత పరచి, రామాయణం నుండి రుజువులు చూపించారు. నార్ల రచనలు లోతైన ఆలోచనలతో, భావ పరిపుష్టి కలిగి, వివరాలతో నిండివుంటాయి. 'సీత జోస్యం' పీఠిక వారి పాండిత్యాన్ని వెల్లడిస్తుంది. దానికై వారు జరిపిన అధ్యయనం విశేషించి హర్షించదగినది. అనితర సాధ్యమంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. 'సీత జోస్యం' ఇతర భాషలలోనికి అనువదింప బడుట తెలుగు వారు గర్వించ తగిన విషయం. ఆవేశ రహితంగా ఆలోచించ గలవాడే మేధావి. తర్కానికి భిన్నమైన దానిని, తిరస్కరించుట మేధావుల లక్షణాలలో పేర్కొన దగినది. నిజమైన మేధావులు మనకు చాలా తక్కువ మంది. వారిలో నార్ల వెంకటేశ్వరరావు గారొకరు. ముట్నూరి వారిని ఆదర్శంగా పెట్టుకొని, వ్యక్తిగతమైన రాగ ద్వేషాలకు తావివ్వ కుండా, సంపాదకీయ బాధ్యతలను నిర్వహించిన ప్రముఖ సంపాదకులు నార్ల. వారి మేధకు ప్రణ మిల్లుతూ ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

**కృతజ్ఞతలు :** ఈ వ్యాస రచనలో నార్ల వారి స్వీయ రచనలే కాక వారు ఉల్లేఖించిన రచనలలో కొన్నిటిని నేను స్వయంగా పరిశీలించే అవకాశం లభించింది. నార్లతో సహా, ఆయా రచయితలకు ఇందు మూలంగా నా కృతజ్ఞతలు తెలియ జేయడమైనది. మి

ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ, ఫోన్ : 9618524702

## గ్రంథాలయంలో...



To those who may borrow
This readable tome
Remember its sorrow
At leaving its home
Don't bend it, Don't burn it
Don't tear it in two
And for God's sake return it
Whatever you do!



# చదవండి...

- ఎన్నార్కె




✦ **శీలసంపన్నుడు అంబేడ్కర్ :** రచయిత జల్లి శ్రీరఘుపతిరావు. ఐదు ఘట్టాలుగా అందరికీ అర్థమయ్యే శైలిలో వ్రాయబడ్డ అంబేడ్కర్ జీవిత చరిత్ర. ఐదవ ఘట్టంలో రచయిత ఏ మతం అక్కర్లేదనే వారు బౌద్ధాన్ని ఆచరణలో పెట్టుకోవచ్చు. ఇది దళితులు చేయాలి అని సూత్రీకరించరు. అంబేద్కర్ యొక్క పదునైన ఉపన్యాసాల సారం వివరించారు రచయిత. ఈ ప్రతి అట్టమీద అంబేద్కర్‌తో బాటు ఆయన జీవన సహచరిణి అయిన రమాబాయ్ బొమ్మను కూడా చిత్రించారు.

*పేజీలు 110, వెల : ₹ 60/-, ప్రతులకు – ఫోన్ : 9441634533*



✦ **కథాచిత్రాలు బ్రతుకు పాఠాలు :** పిల్లలలో విజ్ఞాన దీపికలను వెలిగించి విచక్షణాశక్తిని పెంచే కథల కదంబం. ఇంగ్లీషులో వచ్చిన కొన్ని కథలకు తెలుగుసేత చేసిన వారు చిలకపాణి రవీంద్రకుమార్. ఈ కథలను పుస్తకాలను వీలైనంత వరకు బడిపిల్లలకు చేరువ చేసే ఉద్దేశ్యంతో దేవినేని మధుసూధనరావు దీనిని ప్రచురించారు. కొన్ని కథలు పిల్లలనే కాదు పెద్దలను కూడా అలరిస్తాయి.

*పేజీలు :32, వెల: పేర్కొనబడలేదు. ప్రతులకు – ఫోన్ : 9989051200*




✦ **ఉషస్సు :** జీవితం సంఘటనలమయం. కొన్ని సంఘటనలు అసాధారణ పరిస్థితులకు దారితీస్తాయి. ఇటువంటి భూమికతో చక్కటి శీర్షికలు పెట్టి కథలు వ్రాశారు కూర చిదంబరం. ఇవి సామాజిక వాస్తకవితకు కథనరూపం–

*పేజీలు :160, వెల : ₹ 70/-, ప్రతులకు – పాలపిట్ట ప్రచురణ. ఫోన్ : 9848787284*



✦ **జీవన చిత్రాలు :** కూర చిదంబరం. ఇది తన అనుభవాల ప్రతిస్పందనలు, ఆలోచనలు కలబోసిన భావచిత్రాలని రచయిత పేర్కొన్నారు.

*పేజీలు : 50, వెల : ₹ 30/-, ప్రతులకు – పాలపిట్ట ప్రచురణ. ఫోన్ : 9848787284*




✦ **దీప నిర్వాణ గంధం... An anthology about Death:** రచయిత డాక్టర్ లంకా శివరామ ప్రసాద్. మానవులందరిని భయభ్రాంతులను చేసే మృత్యువుపై ఇదొక అన్వేషణాగ్రంథం. ఇందులో అనేక ఆధునిక శాస్త్రీయ విషయాలతో పాటుగా, మృత్యువుపై అనేక మంది రాసిన కవితలు, అనువాదాలు ఉన్నాయి. వాటితో బాటుగా భారతీయ తత్త్వశాస్త్రాలు, ఉపనిషత్తులు నుంచి తీసుకొన్న భావ సముచ్ఛయాలు ఉన్నాయి. రచయిత కృషి ప్రశంసనీయం.

*పేజీలు :240, వెల : ₹ 250/-, ప్రతులకు – విశాలాంధ్ర బుక్ హౌస్.*



✦ **అక్షరార్చన :** రచయిత డాక్టర్ లంకా శిరామప్రసాద్. ఆంధ్రజ్యోతి దినపత్రిక శుక్రవారం నివేదనలో ధారావాహికంగా ప్రచురించబడిన వ్యాస సంపుటికో పుస్తక రూపం. సృష్టిక్రమం–కాలరహస్యం, అక్షరం, వాక్కులాంటి వాటిపై వేదాల నుండి ఉపనిషత్తుల నుండి, ఆధునిక శాస్త్రాల నుండి విషయాలను గ్రహించి వాటిని ఒక పద్ధతిలో క్రోడీకరించిడంలో రచయిత ప్రతిభ అణువణువునా కనిపిస్తుంది. జిజ్ఞాసాపరులంతా చదవవలసిన పుస్తకం. ఇందులోనున్న విషయాలు దీని వెలకంటే ఎన్నో రెట్లు గొప్పవి.

*పేజీలు :270, వెల : ₹ 250/-, ప్రతులకు – విశాలాంధ్ర బుక్ హౌస్.*




✦ **రా రా సమగ్రసాహిత్యం :** శాస్త్రీయ విశ్లేషణగా తార్కికుడు. మార్క్సిస్ట్ మేధావిగా పేరుగాంచిన రాచమల్లు రామచంద్రారెడ్డి వ్రాసిన కాల్పనిక సాహిత్యం– కథలు, నాటికలు, బాలసాహిత్యాన్ని ఇందులో చేర్చి ప్రచురించారు. పిల్లల్లోనూ, విద్యార్థులలోను ఆలోచనలు రేకెత్తించి, జిజ్ఞాసను పెంచే రచనలివి. చంద్రమండల యాత్రలాంటి రచనలు విద్యార్థులకు నాన్‌డిటేయల్డ్‌గా పెట్టదగినవి. ఆయన వ్రాసిన సంవేదన ఎడిటోరియల్స్ ఆర్టికల్స్, రా.రా లేఖలు, సారస్వత వివేచన కలిగించిందీ మొదటి సంపుటి.

*పేజీలు :410, వెల : ₹ 250/-, ప్రతులకు – ఫోన్ : 08564-252810*




✦ **తెలుగులో పాళీ పదాలు :** చీమకుర్తి శేషగిరిరావు సంగ్రాహకునిగా చేసిన రచనిది. 1990లో మొదటిసారిగా ప్రచురించబడింది. ఇది మూడవ ముద్రణ. ప్రచురణ కర్తలు ఆర్ట్స్ & లెటర్స్. తెలుగు భాష మూలాలు. పాళీ, ప్రాకృత భాషల్లోనే ఉన్నాయనే చారిత్రక వాస్తవానికి ఈ రచనలో సోదాహరణ వివరణలున్నాయి.

*పేజీలు 60, వెల : ₹ 50/-, ప్రతులకు – ఫోన్ : 040-27635654*



✦ **ఇద్దరి మధ్య :** పలమనేరు బాలాజి. ఇందులో నున్న 95 వచన కవితల నిండా మనిషి తనంకోసం అన్వేషణ కనబడుతుంది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ దూరమవుతు్న మానవ సంబంధాల గురించి రచయిత కున్న అవేదన మనల్ని కలవర పరుస్తుంది. మంచి భాష, మంచి భావప్రకటన వెరసి మంచి రచన.

*పేజీలు : 140, వెల : ₹ 70/-, ప్రతులకు – ఫోన్ : 9440995010*



✦ **దళిత :** దళితుల పట్ల భౌతిక దాడులను, హింసను అరికట్టితే చాలదు. సామాజిక నిర్మాణం సంస్కృతి, భావజాలం తదితర రంగాలన్నిటిలోనూ కులనిర్మాణం కోసం కృషి జరగక పోతే ఆ హింసకు పునాదయిన వ్యవస్థనాశనం కాదని తన ఈ వ్యాస సంపుటిలో రచయిత బాలగోపాల్ పేర్కొన్నారు. పరెస్పెక్టివ్స్ ప్రచురణ.

*పేజీలు : 120, వెల : ₹ 120/-, ప్రతులకు – విశాలాంధ్ర పబ్లిషంగ్ హౌస్.*



✦ **మా హసన్ తెలుగు వాచకము :** రచన, రూపకల్పన చేసిన షేక్ బడే సాహెబ్ కెంతో గుర్తింపునీ గౌరవాన్ని తెచ్చిన పుస్తకం. ప్రవాసాంధ్రులకే కాదు, స్వదేశీ ఆంధ్రులకు సహితం ఉపయోగపడే పుస్తకం. తెలుగు భాషను ప్రేమించి, ఆ భాషను పదికాలాల పాటు పదిల పరచాలన్న ఆయన ఆరాటం అభినందనీయం. 1/4 క్రౌన్‌లో వెలువడిన ఈ పుస్తకం ఒక రంగుల హరివిల్లు.

*పేజీలు : 80, వెల : ₹ 100/-, ప్రతులకు – ఫోన్ : 9849921322*



✦ **బాలబంధు బి.వి. నరసింహారావు :** నాలుగు దశాబ్దాలు పిల్లల ముందు గేయాలు పాడుతూ, కథలు చెప్తూ వారిని పరవశింప చేసిన బాలబంధు బి.వి. నరసింహారావు ఇంట్లో తల్లిదండ్రులు స్కూలులో ఉపాధ్యాయులు పిల్లలకు ఆటా–పాటా ఎలా నేర్పాలో రచించి, అలవోకగా వాటిని చెప్పి చూపిన ఆసాధారణ బాలసాహిత్య సృష్టికర్త. వాశిలోనూ, రాశిలోనూ ఆయన రచనలు విశిష్టమైనవి. మనం పిల్లలకు తెలుగు భాషని ఎంత సులువుగా అందించవచ్చునో విప్పి చెప్పిన బోధకుడు. చిన్న చిన్న విషయాలు మనసుకు పట్టే కథనాలు, కల్పనలు ఆరోగ్యకరమైన ఆలోచనలు–వీటిని పిల్లల చుట్టూ ఎలా పెంచవచ్చునో చాటిన సంచార తోటమాలి బి.వి. సంప్రదాయం, సమకాలీనత, కాల్పనికత, సంగీత గుణం కలబోసి అందించిన బి.వి.నరసింహారావు సమగ్ర సాహిత్య సర్వస్వం బాలబంధు. ఇది మూడు సంపుటాలలో...

*పేజీలు : 220, వెల : ₹ 200/-, ప్రతులకు – సాహితీమిత్రులు, ఫోన్ : 0866 2433359 / 9490634849*

# అట్టమీద బొమ్మలు



దుర్గాపూజ

**ముఖచిత్రం : *చిత్రకారుడు :*** గౌతమ్ ఘోష్

**బెం**గాలీలకు దసరా పండుగ అంటే దుర్గాష్టమే. ప్రాచీన శక్తి దేవతలలో భయంకరంగా నాలుక చాపుతూ, భీభత్సంగా ఉండే కాళీమాతకు దుర్గ అనేది మరొక పేరు. ఒకప్పుడు మానవ, జంతు బలులకు ప్రసిద్ధి చెందిన తూర్పు తీరంలో జగద్గురు శంకరాచార్యులు చేసిన కొన్ని మార్పుల ద్వారా, జంతు బలులు తగ్గి దాని స్థానంలో రక్తపు వర్ణంతో ఉండే కుంకుమ పూజలు వచ్చాయి. కలకత్తాలో ఈ దుర్గాపూజ తొమ్మిది రోజులు జరుగుతుంది. చివరి రోజున పెండ్లయిన ఆడవారు దేవిని కుంకుమతో అభిషేకం చేస్తారు. ఆ తరువాత ఆ కుంకుమ శోభిని ఊరేగించి గంగానదిలో లేదా చెలమలలో నిమజ్జనం చేస్తారు. సుమంగళి చిహ్నమైన కుంకుమ బొట్టును తల్లి తన కూతుళ్ళకు, కూతుళ్ళు తమ తల్లులకు నుదుట దిద్దుతారు. దీనితో ఈ పండుగ వాతావరణం ముగుస్తుంది. ఈ చిత్రం కలకత్తాలో సాగుతున్న దుర్గపూజ యొక్క ముచ్చటను మన ముందుంచుతుంది. తరతరాలుగా వస్తున్న ఈ సాంప్రదాయ రీతిని అద్దంపట్టి మనకు చూపారు, గౌతమ్ ఘోష్. (ఇతను ప్రసిద్ధ బెంగాలీ సినీ దర్శకుడు కాదు.) ఒక వర్ధమాన చిత్రకారుడు.



ఏడనున్నాడో?

## ఆగాచార్య

**ప్ర**కృతితో సహజీవనం, నిరాడంబరత, తద్వారా ఏర్పడిన ప్రశాంతతకు ఆలవాలం భారతీయ గ్రామీణ జీవనం. పొద్దు పొడవక ముందే పల్లెకార్లు పొలానికి వెడతారు. అప్పుడే మనకు కనిపిస్తుంది పల్లెలను ఆక్రమించుకున్న మహిళల సందడి. చిక్కనైన రంగు చీరలు ధరించిన చక్కనమ్మలు, నిండుగా వుండే వస్త్రధారణ. తల దువ్వుకొని నిగారించిన కొప్పులు. 'తలనిండ పూదండ దాల్చిన రాణి, మొలక నవ్వుల తోటి మురిపించ బోకే' అనే పాటను తల పోసేలా ప్రశాంత వదనాలతో పల్లె స్త్రీలు, గాజుల మల్లారం, ఫల–పుష్పాలతో కోవెలకు ప్రయాణం, గోరింటాకు పెట్టుకున్న చేతులు, చిలకలతో పలుకులు వీటన్నిటినీ దృశ్యమానం చేశాడు ఆగాచారి.





ఎప్పటికయ్యేనో?

కరీంనగర్ జిల్లాకు చెందిన ఆగాచారికి చిన్నతనం నుంచి బొమ్మలు గీసే అలవాటుంది. దానికి గురువెవరూ లేరు. అది కేవలం సహజ స్పందన నుంచే వచ్చింది. రెండవ తరగతి చదువుతున్నపుడు రేఖలు నిర్దిష్ట రూపం పొందాయి. ఆనాడే ఆగాచారి ప్రతిభను గుర్తించారు గురువులు. చిత్రకారునివి కమ్మని ఆశీర్వదించారు.

"ప్రతి పల్లెకు తనదైన ఒక కథ ఉంటుంది. దానిని మనం ఆస్వాదించి, గుర్తించాలి. దానిని చిత్రకళ ద్వారా అందరికీ పంచాలి. నా చిత్రాలన్నీ ఎప్పటికీ చెరగని నా పల్లె జ్ఞాపకాలే! తోటవైకుంఠం, స్టాన్లీ, సురేష్‌లు నాకు మంచి మిత్రులే కాదు, మంచి గురువులు కూడా. ఇప్పటికీ ఏమైనా సందేహం వస్తే వారినడిగే తెలుసుకుంటాను.



ఏమాయెనే?

చివరి శ్వాస వరకూ, చిత్రాలు గీయాలి, గీస్తాను, అదే నా కోరిక. గ్రామీణ దంపతులపై (జంటలపై) చిత్రాలు వేశాను. వాటిని విస్తృతంగా ప్రదర్శించాలి. చిత్రాలు వేయటంలో కంప్యూటర్ సహాయం తీసుకుంటే అవి మరింత వివరణాత్మకంగా ఉంటాయి."

ఇవి అతని మనోభావాలు.

రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో ఆగాచారి అనేక చిత్రకళా సదస్సులను నిర్వహించారు. ప్రజాభిమానం పొందారు. కొన్ని చోట్ల గుర్తింపుతో పాటుగా బహుమతులనందుకున్నారు. ⓜ



ఎప్పటికయ్యేనో...!

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



ఏమాయెనే...!